# క్రాంతి

**లోపలి పేజీల్లో......**

6వ పేజీలో –ఫాసిస్టు నిర్బంధాన్ని ఓడిద్దాం
9వ పేజీలో – ఇరాక్ ప్రజల వీరోచిత ప్రతిఘటన
12లో – హిందూ ఫాసిజానికి సవాల్
17లో–చైనాలో పురివిప్పిన పెట్టుబడిదారీ విధానం
25లో – అలిపిరి సంఘటనకు మా జవాబు
32లో – అమరవీరుల జీవిత చరిత్రలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు)(పీపుల్స్‌వార్) ఏ.పి. రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 28 సంచిక : 1 జనవరి–ఫిబ్రవరి 2004 వెల : ఐదురూపాయలు

# తీవ్రమవుతున్న పాలకవర్గ ప్రభుత్వాల ఆర్థిక రాజకీయ అస్థిరత, అభద్రతా స్థితుల పర్యవసానమే ముందస్తు ఎన్నికలు

గడచిన **2003** సంవత్సరం చివరి వరకు, అంటే గడచిన డిసెంబర్ చివరి దాకా లోక్‌సభకు సైతం ముందస్తు ఎన్నికలు జరగ గలవనే వాతావరణం పెద్దగా లేదు. అలిపిరి ఘటనని ఆసరా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర శాసనసభని హడావుడిగా రద్దుచేసేసి ముందస్తు ఎన్నికల జ్వర తీవ్రతతో అప్పటికీ వున్నాడు. లోక్‌సభకి సైతం ముందస్తు ఎన్నికలకి సిద్ధపడితే ఉభయతార కంగా వుంటుందని, నవంబరులో రెండవసారి తనను పరామర్శించ వచ్చిన ఉపప్రధాని అద్వానీతో మంతనాలాడాడు కూడా. అయితే నాలుగు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అప్పటికింకా తెలియనందున చంద్రబాబు ప్రతిపాదనను అద్వాని స్పష్టంగా అంగీకరించలేదు. ఇది జరిగిన కొద్ది రోజులకే కాంగ్రెస్ పాలిత ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్‌ల ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఒక్క ఢిల్లీ మినహా మిగతా మూడు రాష్ట్రాలలో అధికార కాంగ్రెస్ చిత్తుగానే ఓడిపోయింది. బిజెపి సంపూర్ణ మెజారిటీలతోనే విజయం సాధించింది. దీంతో ఈ గెలుపు వాతావరణంలోనే లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు సిద్ధపడిపోతే మంచి ఫలితాలు సాధించవచ్చు అనే ఆశలు, అంచనాలు, ఉత్సాహం బిజెపి శ్రేణుల్లో తలెత్తాయి. అయినా ప్రధాని వాజ్‌పాయి, ఉపప్రధాని అద్వానీలతో పాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు కూడా లోక్‌సభ పూర్తికాలం పని చేస్తుందని, ముందస్తు ప్రసక్తే లేదని భరోసా ఇస్తూ ఒకటికి రెండుసార్లు నిర్ద్వంద్వంగానే ప్రకటించారు. కాని **2004** జనవరి **11, 12** తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ లో బిజెపి తలపెట్టిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం దగ్గరపడే కొద్దీ లోక్‌సభకు కూడా ముందస్తు ఎన్నికలు ముంచుకొచ్చే వాతావరణం ముసురుకుంది. అధికార పార్టీ అధినాయకుల హామీ ప్రకటనలు గాలికెగిరి పోయాయి. రెండు రోజుల జాతీయ కార్యవర్గ సమావేశం పూర్తిగా ముందస్తు ఎన్నికల ముస్తాబుతోనే ముగిసింది. చంద్రబాబు తరహాలోనే అధికారిక ప్రకటనని ఆఖరి నిముషం దాకా వాయిదా వేస్తూ వచ్చిన వాజ్‌పాయి జనవరి **12**వ తేదీ మధ్యాహ్నం జరిగిన బహిరంగ సభలో లోక్‌సభ ముందస్తు ఎన్నికలను అధికారికంగా ప్రకటించేసి ఢిల్లీ విమానం ఎక్కేసాడు.

ఆ రకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభలు తగిన కారణాలు లేకుండానే అర్థంతరంగా రద్దు చేయబడ్డాయి. అనుకూల వాతావరణాన్ని వుపయోగించుకుని తిరిగి అధికారం చేజిక్కించు కోవాలనే దురాశతోనే రాష్ట్రంలోని అధికార టిడిపి, కేంద్రంలోని అధికార బిజెపి కూడబలుక్కుని కుమ్మక్కయిమరీ రాష్ట్ర శాసనసభ, లోక్‌సభలకు పోటు పొడిచేసాయి. అధికారం కోసం ఎంతటి ఘాతుకానికైనా బరితెగించేయగల టిడిపి, బిజెపిల ఘన చరిత్ర అందరికీ తెలిసిందే కనుక ముందస్తు ఎన్నికల ఆలోచన లేదు, కాదు అని బిజెపి అగ్రనేతలు ప్రకటిస్తున్నా కూడా ఆ బూటకపు ప్రకటనల్ని ఎవరూ నమ్మలేదు. కనుకనే – డిసెంబరు ప్రారంభం నుంచే దేశంలోని వివిధ జాతీయ ప్రాంతీయ పార్టీల మధ్య ఎన్నికల పొత్తులు కూటములకి సంబంధించిన మల్లగుల్లాలు ప్రారంభమైపోయాయి.

కేవలం తన స్వంత బలంతోనే కేంద్రాధికారం అందుకోవడం సాధ్యం కాదని బిజెపి **90**ల నాటికే గుర్తించింది. కనుకనే అది సంకీర్ణాలని స్వాగతించింది. కూటమిల ఏర్పాటుకు సిద్ధపడింది. సంకీర్ణ ప్రభుత్వాలను నడపడంలో అనుభవాన్ని పొందింది. **1999** లోక్‌సభ ఎన్నికల నాటికి కూడా సంకీర్ణం అవసరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ భంగపడింది, నష్టపోయింది. సంకీర్ణ భాగస్వామ్యాల్ని నిత్యం బుజ్జగించుకునే తలనొప్పి లేకుండా స్వతంత్రంగా, నిరంకుశంగా చెలాయించుకు పోవాలనే దురాశను అది కొంత కళ్లెం వేసుకోక తప్పలేదు. కొంత పాఠం తీసుకుని మహారాష్ట్రలోని సంకీర్ణానికి ఒప్పుకుంది. బొప్పికట్టిన అనుభవంతో ఈసారి కాంగ్రెస్ సైతం కూటమి వైపే మొగ్గింది. బిజెపి పరిస్థితి ఇందుకు భిన్నం. కూటమిలో కూటనీతిని అది ఒక కళగానే అభివృద్ధి చేసింది.

భాగస్వామ్య పక్షాల అలకలను బెదిరింపులను తనదైన శైలిలో ఎదుర్కొన్న, అధిగమించిన అనుభవం దాని కుంది. అలిగినవాళ్లు తన సంకీర్ణం కొంప నుండి బయటికి పోయినా తిరిగి వారిని సన్నిహితంగానే వుంచుకోగల చాణక్యం దానికుంది. బయటికి పోలేక తన సంకీర్ణం చూరు పట్టుకు వేళ్లాడే వాళ్ల ఆత్మగౌరవాలకి పరీక్ష పెట్టి మరీ వారిని తన చుట్టూతా తిప్పుకునే ఘరానాతనం దానికుంది. లేదు, కాదంటూనే తన హిందుత్వ ఎజెండాతో దురుసుగా విన్యాసాలు చేస్తూ భాగస్వామ్య పక్షాలను ఇరుకున పెట్టే తెంపరితనం దానికుంది. భాగస్వామ్య పక్షాలపై దాడుల పరంపరకి తలపడే బయటి మిత్రపక్షాలను అక్కున చేర్చుకుంటూ భాగస్వామ్య పక్షాలను అవమానించగల దుర్నీతి దాని సొంతం. అంతేకాదు, బయటనున్న బలమైన మిత్రపక్షం సలహాలను ఒత్తిడులను మన్నిస్తూ, స్వంత పార్టీవారి నోరు సైతం నొక్కి వారికి మొట్టికాయలు పెట్టగల 'పెద్దరికం' దానికుంది. నిజానికి డిఎంకె, ఎమ్‌డిఎమ్‌కెలు చివరిదాకా బిజెపి సంకీర్ణంలో కొనసాగ గలగడం వింతైన విషయమే! ఆ రెండు పార్టీలపై తమిళనాడులోని అధికార ఏ.ఐ.డి.ఎం.కె అధినేత జయలలిత జరిపిన దాడులు, అణచివేతలు, అవమానాలను బిజెపి తన దుర్మార్గ మౌనంతో ప్రోత్సహించిందనే చెప్పాలి. ఆ

రకంగా సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో కంటే వెలుపల వున్న, అదీ ఒకప్పుడు తనకు వెన్నుపోటు పొడిచి మరీ బయటికి పోయిన జయలలిత తోనే బిజెపి దగ్గరగా మసలుకుంది. అలానే సంకీర్ణంలో చేరకుండా వెలుపల నుండే మద్దతు నిస్తున్న టిడిపికి దాని అధినేత చంద్రబాబుకు బిజెపి వేస్తున్న పెద్దపీడ అసాధారణమైనదే. తన భాగస్వామ్య పక్షాల కంటే చివరికి స్వంత పార్టీ వారికంటే ఎక్కువగా చంద్రబాబునే బిజెపి మన్నిస్తుంది. ఇది స్పష్టంగా అందరూ చూడగలిగేదే! అయితే ఏఐడిఎంకె అధినేత జయలలిత, టిడిపి అధినేత చంద్రబాబులతో బిజెపి అంటకాగుడుకు ఒక అసాధరణ ప్రత్యేక కారణముందని మనం గ్రహించాలి. చంద్రబాబు, జయలలితలు ఖచ్చితమైన భిన్న తరహాల ఫాసిస్టు నేతలు. ఇక బిజెపి ముద్ర గుద్దుకున్న హిందూ ఫాసిస్టు పార్టీ. కనుక వీరి మధ్య పరస్పర అంటకాగుడులు అనేవి సంకీర్ణ అవసరాలు, ధర్మాలు, నీతులకి అతీతంగానే వుంటాయి.

ప్రజల సంగతి పక్కన వుంచి, వివిధ జాతీయ ప్రాంతీయ రాజకీయ పార్టీల వారీగా చూసినపుడు మెజారిటీ బిజెపి పట్ల వ్యతిరేకతతో వున్నారనేదిస్పష్టంగానే కనబడుతుంది. బిజెపి మతవాద పార్టీ అయినందు వల్లనే ఈ వ్యతిరేకత అనుకోలేం. నిజానికి సైద్ధాంతికంగా, సూత్రబద్ధంగా, నిజాయితీతో కూడిన నిలకడైన లౌకికవాద దృష్టితో బిజెపి ప్రాతినిధ్యం వహించే హిందూ దురహంకార తత్వంతో తలపడే పార్లమెంటరీ పార్టీలే లేవని చెప్పాలి. ఇతరుల సంగతలా వుంచి బిజెపికి జాతీయ ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ లౌకికతే పరమ బూటకం! బిజెపితో దీని వ్యతిరేకతల్లా అధికారాన్ని అందుకోవాలనుకునే రాజకీయ ప్రత్యర్థి వ్యతిరేకత మాత్రమే. బిజెపి హిందుత్వం కాకుంటే ఇంక దేని కారణంగా మెజారిటీ పార్టీలు బిజెపికి దూరంగా వుండ ప్రయత్నిస్తున్నాయి? బిజెపి నెత్తి నెత్తుకున్న సామ్రాజ్యవాద అనుకూల సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను, దాని 'సంస్కరణ'ల జోరును వ్యతిరేకిస్తూ దూరంగా వుండదలచాయా? అలా అనుకోడానికి ఎలాంటి ఆధారాలు లేవు. నిజానికి పార్లమెంటరీ పార్టీలు ఏ ఒక్కటి కూడా సామ్రాజ్యవాద సంస్కరణలను సూటిగా, దృఢంగా వ్యతిరేకించడం లేదు. రివిజనిస్టు సిపిఐ, సిపిఎంలు కూడా తమది అయిన తీరులో వాటిని సమర్థిస్తూ ఆహ్వానిస్తూనే వున్నాయి. కనుక ఎన్నికల నేపథ్యంలో బిజెపికి దూరంగా వుండాలని మెజారిటీ పార్టీలు నిర్ణయించుకోడానికి అసలు కారణమల్లా బిజెపి పాలనతో దాని ఫలితాలతో దారుణ కష్టనష్టాలకు గురైన అశేష జనసామాన్యంలో బిజెపి పాలనపట్ల గూడుకట్టుకున్న అసంతృప్తి, వ్యతిరేకతే. అంటే స్పష్టమైన ప్రభుత్వ వ్యతిరేకాంశమే. అది తమ కంటుకుందన్న భయంతోనే.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు నాలుగింటిలో మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ చిత్తుగానే ఓడిపోయి ప్రధాన ప్రత్యర్థి అయిన బిజెపి సంపూర్ణ మెజారిటీలతో అధికారంలోకి రావమడమనే దానికి ప్రధాన కారణం అక్కడి ప్రజల నుండి వ్యక్తమైన బలమైన ప్రభుత్వ వ్యతిరేకత లేక అధికార వ్యతిరేకతే (ఏంటీ ఇంకుంబెన్సీ ఫ్యాక్టర్). కాని ఈ వాస్తవాన్ని అంగీకరించడంలో బిజెపికి చాలా ఇబ్బంది వుంది. ఇలా అంగీకరిస్తే ఇక రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తాము ఓడిపోతామని అంగీకరించడమే అవుతుంది. కనుక తన వాగాడంబరత, వాదనా పటిమలతో ఈ ఫలితాలకు వక్రభాష్యాలు చెబుతూ ప్రజాభిప్రాయాన్నితనకు అనుకూలంగా మలుచుకో చూస్తోంది. కాంగ్రెస్ అసమర్థ దుష్పాలనను అసహ్యించుకున్న కారణంగానే ప్రజలు దాన్ని ఛీకొట్టారని అంటోంది. ఇతర కొన్ని రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ కళ్లు మిరుమిట్లు గొలిపేటట్టుగా సాగతున్న బిజెపి పాలనా తేజాన్ని, సాధిస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ముగ్ధులైపోయి తమకు పట్టం గట్టారని చెప్పుకుంటోంది. ఇది ప్రతికూల ఓటు (అంటే బిజెపి పట్ల అభిమానంతో కాక కేవలం కాంగ్రెస్‌పట్ల వ్యతిరేకతతో వేసిన ఓటు) కానే కాదని, బిజెపి సుపరిపాలనను రెండు చేతులా ఆహ్వానిస్తూ ప్రజలు ఇచ్చిన సానుకూల ఓటేనని వాధించడంలో ప్రజలకి నచ్చజెప్పడంలో అది అలసిపోతోంది.

తాను చెబుతున్నట్టుగానే తమ ప్రభుత్వ సుపరిపాలన, సాధించిన అభివృద్ధులను తెలుసుకునే ఆ మూడు రాష్ట్రాలలో ప్రజలు తమ పార్టీని గెలిపించడం నిజమే అయితే ఆ మూడు రాష్ట్రాలలోని ప్రజలకంటే మరింత దగ్గరగా తమ సుపరిపాలనని అభివృద్ధిని చూస్తుండిన ఢిల్లీ ప్రజలెందుకు తమను ఛీకొట్టారో బిజెపి చెప్పగలగాలి. బిజెపి వాదనలో నిజం లేకపోవడమే కాదు ఆ వాదనను నిజంగా తాను సైతం నమ్మటం లేదనే చెప్పాలి. ఆదరాబాదరగా లోక్‌సభ ముందస్తు ఎన్నికలకి సిద్ధపడిపోవడమే ఇందుకు తిరుగులేని నిదర్శనం. తన వాదనే నిజమైతే కేంద్రంలోనూ, కొత్తగా అధికారం చేపట్టిన ఆ మూడు రాష్ట్రాలలోనూ తమ సుపరిపాలనని అభివృద్ధిని ప్రజలకి మరింత చేరువ చేసి నిర్ణీత సమయానికే లోక్‌సభ ఎన్నికలకి తలపెడితే తప్పక లాభపడేదే. కానందుకు భిన్నంగా ముందస్తుకి ఆత్రుత పడిపోవడం ఎందుకంటే రోజులు గడిచే కొద్దీ ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతనేది మరింత మరింతగా పెరిగిపోతుంది. కనుకనే తప్పుడు వాదనలు, బూటకపు ప్రచారాలతో 'ముందస్తు'కి సిద్ధమైంది. నిజం చెప్పాలంటే అనూహ్యంగా మూడు ప్రత్యర్థి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో విజయం సాదించినందుకు బిజెపి ఎంత సంతోషిస్తోందో, అదంతా ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేకత నెగిటివ్ ఓటు ప్రభావమేననే సత్యం దాన్ని అంతగానూ కలవర పెడుతోందనే చెప్పాలి. ఎందుకంటే - బిజెపి నాయకత్వంలోని కేంద్ర ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రజలనెత్తిన పరమ దుర్మార్గంగా అప్రజాస్వామికంగా రుద్దిన, రుద్దుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు సంస్కరణలు విష ఫలితంగా ధనిక-పేదల మధ్య వ్యత్యాసాలు; పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు; పేదరికం, ప్రత్యేకించి గ్రామీణ పేదరికం; నిరుద్యోగం; సామాజిక అభద్రతా స్థితి; జనసామాన్యం దైనందిన జీవితంలో విపరీతమైన అలజడి అశాంతి, ఒత్తిడి అనేవి భయంకరంగా పెరిగిపోయాయి. ఈ దారుణ పరిస్థితి పరిణామాల ప్రభావాన్ని ఫలితాలను రేపటి ఎన్నికల్లో తాను చవి చూడాల్సి వస్తుందనే భయం మిజెపిని వణికిస్తోందనే చెప్పాలి. అంతేకాదు, నిన్న అసెంబ్లీ ఎన్నికలలో మంచి విజయాలు సాధించిన మూడు రాష్ట్రాలలో సైతం రేపటి లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ సరళి తనకు ఎదురు తిరగగలదనే భయం సైతం దానికుంది. కాని దాన్నంతటిని మేకపోతు గాంభీర్యంతో కప్పి పుచ్చేయాలని ప్రయత్నిస్తోంది.

ఈ నేపథ్యంలో తన ఎన్నికల ప్రచారాస్త్రలుగా ఎంచుకుని బిజెపి ముందుకు వెడుతున్న ప్రధాన నినాదాలని వాటి వాటి నేపథ్యాలను మనం లోతుగా పరిశీలించి అర్థం చేసుకోవాలి. అద్వానీ రథయాత్ర, బాబ్రీ విధ్వంసం, గుజరాత్ మారణకాండ - ఈ మూడు సందర్భాలలోనూ తన దురుసైన హిందుత్వ ఎజెండాతో బిజెపి స్పష్టంగా తన స్వంత అంచనాల కంటే ఎక్కువగానే ఎన్నికల రాజకీయ లబ్ది పొందింది. అంతేకాదు, ప్రయత్న పూర్వకంగా రగిలించిన కార్గిల్ యుద్ధంతో **99** ఎన్నికల్లో నెగ్గుకుని నెట్టుకొచ్చింది. స్పష్టమైన ఇలాంటి అనుభవాలు కలిగి వున్నప్పటికీ ఈ ఎన్నికల్లో మాత్రం బిజెపి తనఫాసిస్టు మతతత్వ ఎజెండాని పక్కన పెట్టుకుంది. అదే షజెండాను అది ఇప్పుడు చేపట్టినా దాన్ని అడిగేవారు అడ్డుకోగలవారు లేరనే చెప్పాలి. ఎందుకంటే తమ స్వంత అవసరాలు ప్రయోజనాల రీత్యా స్వయానా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులు వారికి ఊడిగం చేసే దేశంలోని దోపిడీ పాలకవర్గాలు స్పష్టంగా హిందూ ఫాసిజాన్ని ప్రోత్సహించాయి, ముందుకు నెట్టాయి (ఇందుకు నిదర్శనంగా ఎన్నైనా ఉదాహరణలు చూపవచ్చు, కాని ఆ వివరాలు మరో వ్యాసంలో పరిశీలిద్దాం) అయినా కూడా బిజెపి తన క్రూరమైన ఎజెండాని పక్కన పెట్టేసి, సాదుజంతువుగా వేషం మార్చేసి, తన 'అభివృద్ధి' 'సుపరిపాలన' 'ప్రభుత్వ విజయాలు-సాధించిన దేశ ప్రతిష్ట' అనే వాటిని తన ఎన్నికల ప్రచార నినాదాలుగా ఎంచుకుంటోంది. హిందుత్వ ఎజెండా తన ఎన్నికల విజయాలకి వుపయోగపడిన సందర్భాలు అనుభవాలు నిజమే. కాని, అన్ని సందర్భాలలోనూ అది పని చేస్తుందనే గట్టి హామీ లేదు. గుజరాత్ మారణకాండ, ఎన్నికల విజయాలు తరువత యావత్ దేశాన్ని గుజరాత్‌గా మార్చదలిచినట్టు ఉన్మత్తంగా బిజెపి బాహాటంగానే ప్రకటించింది. అలాంటి ప్రేలాపనల తరువాతనే జరిగిన ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి మాడు

పగిలించుకుంది. పైగా గుజరాత్‌లో లాగ ఎన్నికల్లో తప్పక లబ్ధి పొందగలంతటి స్థాయిలో ప్రజల మధ్య ఉద్రిక్తలను అభద్రతా భావాన్ని సృష్టించడం అనేది ఇతర రాష్ట్రాల న్నింటిలో సాధ్యమైపోయేది కాదు.

అందుకనే కాగితపు పూలలాంటి ఈ నినాదాలను ఎంచుకుంది. ఇవి పసలేని,వాసనలేని పూలన్న సంగతి ఇతరుల కంటే బాగా బిజెపికే తెలుసు. కాని, విపరీత ప్రచారంతో ఇవి నిజమైన పూలేనని నమ్మిస్తూ వాటిని అమ్మడానికి ప్రయత్నిస్తుంది, అమ్మేయగలనని ధీమా పడుతుంది. ఈ ధీమా అంత నిరాధారమైందేమీ కాదు. ఈ నినాదాల డొల్లతనాన్ని కప్పి పుచ్చుతూ ప్రజలను మభ్య పెట్టగల మరికొన్ని నినాదాస్త్రాలు కూడా బిజెపి అమ్ముల పొదిలో వున్నాయి. 'సుస్థిర పాలన' 'అంతర్జాతీయంగా తమ పాలనలో పెరిగిన దేశ ప్రతిష్ట' ఇత్యాదివి. చెప్పుకోదగ్గ ఎలాంటి సంక్షోభాన్ని తలెత్తనీకుండానే నల్లేరుమీది బండిలా సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుకు రాగలగ డం అనేది బిజెపికి విజయమే. అలానే వివిధ విదేశీ పర్యటనలు. నిర్దిష్టంగా అవి సాధించిన ఫలితాలేమిటి? అనేది చెప్పడానికేమీ లేకపోయినా ఏదేదో సాధించినట్టుగా ఊదర గొట్టుకునే అవకాశాలున్నాయి. అమెరికాకు అంటకా గుతూనే రష్యాతో కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే ఒప్పందాలు కుదుర్చుకో గలిగామని; చైనాతో దశాబ్దాల తరబడిగా అపరిష్కృతంగా వుంటున్న సరిహద్దు వివాదం, అలానే సిక్కిం వివాదాలను సుమారుగా పరిష్కరించేసుకున్నామని; కామన్‌వెల్త్ దేశాల సదస్సులో పాకిస్తాన్‌ని ఏకాకిని చేసేసామని; అమెరికా కాంగ్రెస్‌లో మన ప్రధాని వాజ్‌పాయి ప్రసంగం అందరినీ ఆకట్టేసుకుందని; కాంకన్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రుల స్థాయి సమావేశంలో మనమే చక్రం తిప్పామని – ఇలా ఎన్నెన్నో ఏకరువు పెట్టే అవకాశాలు బిజెపికి వున్నాయి. అన్నింటి కంటే ముఖ్యం. బిజెపికి తక్షణంగా తాత్కాలికంగానే అయినా బాగా కలిసి వస్తున్నవి కాశ్మీర్ తాజా పరిణామాలు. సార్క్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పాక్ అధినేత ముషారఫ్‌తో సాగించిన మంతనాలు, పరస్పరం చాచుకున్న స్నేహ హస్తాలు, పరస్పర పొగడ్తలు, పునరుద్ధరించిన ఇరుదేశాలమధ్య బస్సు యాత్రలు, సంఝోత రైలు రాకపోకలు, సరిహద్దులో కాల్పుల విరమణల అమలు, సామరస్య పూర్వక చర్చల ద్వారానే కాశ్మీర్‌తో పాటు రెండు దేశాల మధ్య నలుగుతున్న సమస్యలన్నింటినీ పరిష్కరించుకోవాలని ముషారఫ్ వాజ్‌పాయిల ప్రకటనలు; ఇంకోపక్క ముఖ్యమైన హురియత్ నేతలతో జనవరి **22**న దేశ ఉపప్రధాని అద్వానీ భేటీ అయి కాశ్మీర్‌పై చర్చించడానికి సిద్ధపడట; జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ముఫ్తీమహమ్మద్ సయ్యిద్‌తో సహా అన్నివేపుల నుండీ అంతమందీ ఈ పరిణామ పరంపరని సంబంధిత ప్రభుత్వ నిర్ణయాలను హర్షించడం, అభినందించడం – ఇవన్నీ బిజెపికి లాభించేవే. నిజానికి ఇందులో బిజెపి గొప్పతనం ఏమీ లేదు. ఇవేవీ బిజెపి స్వచ్ఛందంగా స్వయం ప్రతిభతో సాధిస్తున్నవీ కావు. అమెరికా నొక్కుతున్న స్విచ్‌లకి అనుగుణంగా వెలుగుతున్న బల్బులు ఇవన్నీ. వీటి కనెక్షన్లు ఎందువల్ల ఎప్పుడు పుటుక్కున తెగుతుందో తిరిగి చీకట్లు ఎప్పుడు కమ్ముకుంటాయో చెప్పలేం. అలా జరగదని హామీపడగల స్థితిలో బిజెపిసైతం లేదు. అందుకే అక్షరాలా 'దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకునే' తీరులో బిజెపి ఈ పరిస్థితి, పరిణామాలను సాధ్యమైనంత త్వరగా ఎన్నికల విజయాల్లోకి మార్చేసు కోడానికి తహతహ లాడుతుంది.

ఈ ఎన్నికల్లో పరస్పరంగా ప్రధాన ప్రత్యర్థులుగా తలపడుతున్న అధికార బిజెపి ప్రతిపక్ష కాంగ్రెస్ వీటిలో ఏదీ నెగ్గుకొస్తుంది? ఏ కారణాల చేత? అనే లోతైన అంచనాల్లోకి వెళ్లడం ఈ వ్యాసం వుద్దేశం కాదు. అలా వెళ్లాల్సిన అవసరం లేకుండానే మనం ఈ సందర్భంగా చెప్పుకోగలిగిన, చెప్పుకోవాల్సిన ముఖ్యమైన అంశం ఒకటుంది. గడచిన రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో వ్యక్తమైనట్టుగా ప్రభుత్వ వ్యతిరేకత అనేది చాపకింద నీరులా చాలా బలంగా పని చేస్తేనేతప్ప లేనప్పుడు తిరిగి బిజెపి నాయకత్వంలోని కూటమే నెగ్గుకొచ్చే అవకాశంవుంది.

ఇదే జరిగితే, దీనితోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికార టిడిపియే తిరిగి అధికారంలోకి రావడం అంటూ జరిగితే ఇక అలాంటి స్థితి మన వుద్యమానికి పెను సవాల్‌గానే వుంటుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే మన వుద్యమ రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్ జార్ఖండ్‌లు బిజెపి పాలనలోకి వెళ్లాయి. తన ప్రభుత్వం లాగా ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు మన వుద్యమంపై ఉక్కుపాదాన్ని మోపడం లేదని చంద్రబాబు తొలినుండీ అక్కసు వెళ్లగక్కుతున్నాడు. కనుక రేపు చంద్రబాబు ప్రభుత్వం తరహాలోనే ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లలో కూడా చాలా తీవ్ర స్థాయిలో అణచివేత కొనసాగవచ్చు. దీనికి తోడు బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కాశ్మీర్ జాతీయ పోరాటంతో సహా ఈశాన్య ప్రాంతాలలోని వివిధ జాతుల పోరాటాలన్నింటినీ ఒక పక్క అణచివేస్తూ తుడిచివేస్తూ ఇంకోపక్క 'శాంతి ప్రక్రియ' పేరుతో వాటిని లొంగదీసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. భూటాన్ ప్రభుత్వం మెడలు వంచి మరీ అక్కడి నుండి పని చేస్తుండిన 'ఉల్ఫా' తదితర సాయుధ తిరుగుబాటు సంస్థల శిబిరాలన్నింటినీ తుదముట్టింపజేసింది. వందలాది పోరాటకారులను నాయకులను మూకుమ్మడిగా హత్య చేయించింది. మరికొంతమంది ముఖ్య నాయకులతో పాటు వందలాది మందిని లొంగదీసుకుంది. బలమైన భారత సైన్యాన్ని కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల పోరాటాలు గడచిన ఐదు దశాబ్దాలుగా కట్టి పడవేసాయి అన్న వాస్తవం మనకు తెలీంది కాదు. అలాంటిది ఈనాడు ఆ పోరాటాల నుండి, తిరుగుబాట్ల నుండి భారత సైన్యానికి వెసులుబాటు కలిగితే ఇక అవి మోహరింపు అయ్యేది మన వుద్యమం మీదనే.

అయితే ఇదంతా నాణేనికి ఒక పక్క చిత్రం మాత్రమే! దీనికుండే రెండో పార్శ్వాన్ని చూడ్డంలో మనం విఫలం కారాదు, వెనుకబడిపోరాదు. అటు కేంద్రంలో బిజెపి ఇటు రాష్ట్రంలో టిడిపి తిరిగి అధికారాల్లోకి వస్తే పెను ముప్పుని ఎదుర్కొనేది మన పార్టీ వుద్యమాలే కాదు దేశ రాజకీయ గమనమే పెద్ద కుదుపుకి గురవుతుంది. అప్పుడిక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, మూడవ విడత సంస్కరణలు ప్రజలపై మరింత ముష్కర దాడులకి దిగుతాయి. టిడిపి, బిజెపిలనే కాదు, అధికారంలో కొంత నిల దొక్కుకున్న ఏ పాలకవర్గపు పార్టీ ప్రభుత్వమైనా ప్రజలపై క్రూరమైన దాడులు అణచివేతలు అమలు చేసేదిగానే వుంటుంది. లేకుంటే అది సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అమలు చేయలేదు, దోపిడీ పాలకవర్గాలకు ఊడిగం చేయలేదు.

అయితే అధికారంలో వుంటూ ప్రజల న్యాయమైన కోర్కెలు, హక్కులు, పోరాటాలపై క్రూరాతి క్రూరమైన దాడులు చేయడానికి అలవాటు పడిపోయిన బిజెపి, టిడిపిలు తిరిగి అధికారంలోకి వస్తే వాటి దాడులు మరింత పరస్పర కుమ్మక్కుతో మరింత క్రూరంగా బరితెగింపుగా వుంటాయి. అలాంటి పరిస్థితులు ప్రజలను మరింత తీవ్ర స్థాయిలో జీవన్మరణ పోరాటాల వేపు నెడుతాయి. గతంలో ఎప్పటికంటే కూడా విస్తృతమైన బలమైన ఫాసిస్టు వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా సమీకరణలు పోరాటాలు ముందుకొస్తాయి. వీటన్నింటినీ మన విప్లవోద్యమం తో సమన్వయం చేసుకుంటూ తద్వారా మన విప్లవ యుద్ధాన్ని బలోపేతం చేసుకుంటూ ఫాసిజాన్ని ఓడిస్తూ పురోగమించే ఆలోచనలు, ఎత్తుగడలు, పథకాలు, కార్యక్రమాలను మనం రూపొందించుకోవాల్సి వుంటుంది.

దేశానికి సంబంధించిన పై పరిస్థితి నేపథ్యంలో మన రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితి పరిణామాలను పరిశీలిద్దాం. ఏ రాష్ట్ర పరిస్థితి కూడా దేశ పరిస్థితిలో విడదీయరాని భాగంగానే వుంటుంది. కాగా, మన ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి ఇది మరింత నిజం. దేశంలో **12** రాష్ట్రాలకి విస్తరించి పాలకవర్గాలకి ప్రభుత్వాలకి సవాల్‌గా మారిన మన వుద్యమం పురిటిగెడ్డ ఆంధ్రప్రదేశ్ కావడం, ఇంకెక్కడి కంటే కూడా అత్యంత క్రూరం, హేయం అయిన అణచివేతను ఎదుర్కొంటూనే ఇక్కడ మన వుద్యమం నిలద్రొక్కుకో గలుగుతుండటం అనేది ఈ రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన ప్రత్యేకాంశం. కాగా, మన పార్టీ వుద్యమాలను పూర్తిగా తుడిచి పెట్టేయడమే తన ప్రభుత్వ లక్ష్యమని, ఇది సాధించకుండా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అభివృద్ధి అనేవి సాధ్యం కావని; ఈ అవసరాన్ని గుర్తిస్తూ ప్రజలు తాజాగా తీర్పు ఇవ్వాలని కోరుతూ ఫాసిస్టు చంద్రబాబు ఎన్నికల బరిలోకి దిగడం రాష్ట్ర ప్రత్యేక పరిస్థితికి జోడింపు అయిన ఒక అదనపు అంశం.

రాష్ట్ర నిర్ణీత కాల వ్యవధికి (**సెప్టెంబర్, 2004**) సుమారు సంవత్సరం ముందు నుంచే అంటే గడచిన ఆగస్టు నుంచే చంద్రబాబు ముందస్తు ఎన్నికల గూర్చిన ఆలోచనల్లో మునిగి వున్నాడని చెప్పాలి. ఇందుకు గల కారణాలేమిటో చూద్దాం. గడచిన నాలుగైదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని వరుస కరువు పీల్చి పిప్పి చేసాయి. పెండింగ్ ప్రాజెక్టులన్నీ నిత్య పెండింగ్‌లోనే పడుతన్న కారణంగా సాగునీటి తాగునీటి సంక్షోభాలతో కరువుల తాకిడికి ప్రజలు అల్లల్లాడిపోయారు. కరువు పీడిత ప్రజల చేత పని చేయించుకుని వారికి కూలిగా ఇవ్వనుద్దేశించిన **38**వేల కోట్ల రూపాయల కిమ్మత్తు చేసే కేంద్రం అందించిన 'పనికి ఆహారం బియ్యం' పాలక టిడిపి చోటా మోటా నాయకుల జేబుల్లోకి, దాన్ని ఆశ్రయించి వుండే బడా కాంట్రాక్టర్ల, మిల్లర్ల, డీలర్ల గోదాముల్లోకి చేరిపోయాయి. ఈ భారీ కుంభకోణంపై కొన్ని ప్రముఖ అంతర్జాతీయ నిజనిర్ధారణ సంస్థలతో సహా యావత్ ప్రతిపక్షాలు చివరికి చట్టబద్ధ రాజ్యాంగ అధికారాలను కలిగుండే 'కాగ్' సైతం అనేక సాక్ష్యాధారాలతో చంద్రబాబు ప్రభుత్వాన్ని దుయ్యబట్టాయి. కాని అదంతా అరణ్యరోదనే అయ్యింది. ఇది ఒక్కటే కాదు, రోజుకొక అవినీతి కుంభకోణం వెలుగు చూస్తూ చంద్రబాబు ప్రభుత్వం అవినీతి కుంభకోణాల మారుపేరా అన్నంతగా ప్రభుత్వ ప్రతిష్టని మూసీ నదిలో ముంచాయి. గడచిన వేసవిలో తాగునీటి సాగునీతి సమస్యలపై రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రజాందోళనలు బ్రద్దలయ్యాయి. వీటికి తోడు ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాజశేఖరరెడ్డి రాష్ట్ర వ్యాపిత పాదయాత్ర కసరత్తు చంద్రబాబు గుండెల్లో గుబులు పుట్టించింది. ఇంకోపక్క మన పార్టీ అధ్వర్యంలో గతంలో ఎప్పటికంటే కూడా చురుగ్గాను, విస్తృతంగాను, మిలిటెంట్‌గాను జరిగిన వరుస కరువు దాడులనేవి రాష్ట్రంలో సంచలనాన్ని సృష్టించాయి, కరువుకి తగిన విప్లవకర ప్రత్యామ్నాయ రాజకీయ కార్యక్రమాన్ని సందేశనాత్మకంగా ప్రజల ముందుంచడంలో మన కరువు దాడులు విజయవంతం అయ్యాయి. మన కరువు దాడలు ప్రభుత్వాన్ని చాలా కలవర పరిచాయనే చెప్పాలి. నాలుగు పక్కల నుండి చుట్టుముట్టిన ఇలాంటి రాజకీయ ఉక్కిరిబిక్కిరి ఉక్కపోత వాతావరణంలో, రాష్ట్ర వ్యాపితంగా కురవనారంభించిన భారీ వర్షాల వలన రాష్ట్ర వాతావరణ పరిస్థితిలోనూ చంద్రబాబు ఎదుర్కొనే రాజకీయ పరిస్థితిలోనూ, కాస్తంత ఊరట ఏర్పడింది. ఎన్నికలకు నిర్ణీత గడువు వరకు ఆగితే కాస్తంత ఈ అనుకూల వాతావరణం హరించుకుపోయే ప్రమాదం వుంది. కనుక సాధ్యమైనంత ముందస్తుగానే ఎన్నికలకి సిద్ధపడటం అవసరమని చంద్రబాబు భావిస్తూ వచ్చాడు. అందుకనుగుణంగానే గడచిన ఆగస్టులో తిరుపతి మహానాడు నిర్వహించి 'కోటి' బూటకపు వరాలతో ఎన్నికల బరిలోకి దిగాడనే చెప్పాలి. అయితే 'ముందస్తు'కి తగిన కారణాలు ఏవీ లేవు. కారణం కోసం, సాకు కోసం తర్జనబర్జనలు పడ్డాడు.

సరిగ్గా అదే సమయంలో జరిగింది 'అలిపిరి' ఘటన (అక్టోబర్ **1**). అంతే! ఇక ముందూ వెనుకా ఆలోచించకుండా ముందస్తు బరిలోకి వురికేసాడు చంద్రబాబు. ఇందుకు చంద్రబాబు రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చిందని చెప్పవచ్చు. తాను అంతకు చాలా ముందునుంచే ముందస్తు ఎన్నికల పథకంతో వుంటూ తగిన సాకు కోసం వెతుకుతున్న చంద్రబాబు అలిపిరి సంఘటనని అతడి అవసర రీత్యా సాకుగా వాడుకున్నాడు. అలిపిరి ఘటన కారణంగా తనపై సానుభూతి వెల్లువెత్తేయ గలదని భ్రమించాడు. వెల్లువ కాదు కదా, అతడి స్థాయి తరహా కొందరు ఘరానా బాబుల నుంచి వ్యక్తిగతంగా తప్ప, సామాన్య జనబాహుళ్యం నుంచి సానుభూతి సూచనలు సైతం వ్యక్తం కాలేదు. ఇది కొట్టొచ్చినట్టుగానే కనబడింది. దీంతో అహం దెబ్బతిని కృత్రిమ సానుభూతి సమీకరణకు చవకబారు ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఆ తంతంతా పత్రికల్లో సైతం వెక్కిరింతగా చర్చ అయిపోయి కూర్చున్నాయి. దీంతో చంద్రబాబు ఘోర పరాభవానికి గురయ్యాడు. ముందు చెప్పిన రాజకీయ అవసరానికీ, గురైన ఈ పరాభవానికి ఈ రెండింటికి సమాధానంగా పరిష్కారంగా ముందస్తు ఎన్నికలకి తలపడ్డాడు. నక్సలైట్ల అణచివేతే తన ఎన్నికల ప్రధాన ఎజెండాగా ప్రకటించుకోవడమనేది తన పరాభవాగ్నిని తానుగానే కొంత చల్లార్చుకునే ప్రయత్నమే తప్ప ముందస్తు ఎన్నికలకి ఇది ప్రధాన కారణం కానే కాదు. తన ముందస్తు ఎన్నికల ప్రతిపాదనకు లేని సహేతుకతని, ఆమోద యోగ్యతని కట్టబెట్టాలనే తాపత్రయంతో ఎంచుకున్నదే ఈ పరుష నినాదం.

అయినా ఇది ఎవ్వరినీ ఒప్పించలేక పోయింది. ఎందుకంటే అధికారాన్ని చేపట్టిన మరుక్షణం నుంచే నక్సలైట్ ఉద్యమంపై క్రూరాతి క్రూరం, నీచాతి నీచం అయిన అణచివేతని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తూనే వచ్చింది. కనుక దాన్ని కొత్తగా ఎజెండా కెక్కిస్తున్నానడం, దానికి ప్రజామోదం కావాలనడం దగుల్బాజీ వాదన తప్పవేరు కాదు. మన పార్టీ వుద్యమాలపై చంద్రబాబు ప్రభుత్వ అణచివేత కొత్తది కాకపోయినా అతడి ఈ ఉన్మత్త ప్రేలాపన ద్వారా అదనంగా బహిర్గతమైన విషయం ఏమంటే–ఆంతరంగికంగా అందులో వుంచుకోవాల్సిన, నిగ్రహించుకోవాల్సిన తన ఆందోళనని, అభద్రతా స్థితిని, అవమాన భారాన్ని, మన పార్టీ వుద్యమాల పట్ల అతడు పనిగట్టుకు మరీ పెంచుకున్న భయంకరమైన కసి, ద్వేషాలను భళ్లున వెళ్లగక్కుకున్నాడు. తన యీ పూనకంలో తనతో గొంతు కలపని ప్రతిపక్షాలపై నోరు పారేసుకున్నాడు. వారందరికీ మన పార్టీతో సంబంధాలను అంట గట్టాడు. మరీ ఇంత దురుసుగా, మొరటుగా వుండాల్సిన అవసరం లేదు. దానివల్ల ఎలాంటి అదనపు ప్రయోజనమూ లేదని నచ్చచెప్ప ప్రయత్నించిన మిత్రులపైన, తమ కదలికలు మరీ ఇబ్బందికరం అయిపోతున్నాయి గనుక పీపుల్స్‌వార్‌ని పనిగట్టుకు రెచ్చగొట్టవద్దని మొరపెట్టుకున్న పార్టీ ఎంఎల్ఏలు, ఇతర నాయకులపైన చిర్రుబుర్రు లాడుతూ ''ప్రాణాలు శాశ్వతం కాదు, ఇల్లు ఒదిలే ముందు భార్యాబిడ్డలకు చెప్పిరండి'' అంటూ హితబోధ చేసాడు.

ఎక్కడికక్కడ రిగ్గింగ్‌లకి దిగడం వల్ల రొష్టు పడటమే తప్ప పెద్ద ఫలితం వుండదనే ఆలోచనతో మొత్తం ఎన్నికల ప్రక్రియను రిగ్ చేసే కుట్ర పథకంతో లక్షలాదిగా బోగస్ ఓటర్లను చేర్పించాడు. దీనిపై ప్రతిపక్షాలు చేసిన గగ్గోలు ఫలితంగా జోక్యం చేసుకున్న ఎన్నికల కమిషన్ బోగస్ ఓట్ల ఏరివేతకు పూనుకుంది. ఈ బోగస్ ఓటర్ల సమస్యపై ప్రతిపక్షాలతో పాటు అధికార్లు, ప్రజలు సైతం ఎక్కడికక్కడ నిలేస్తున్నారని, పరిస్థితి ఇబ్బందిగా వుందని చెప్ప ప్రయత్నించిన పార్టీ కార్యకర్తలు నాయకులపై చిరాకు పడుతూ ''మీరీ విషయంలో మంత్రులుగా ఆలోచించవద్దు, మాట్లాడవద్దు. పక్కా రాజకీయ నాయకులుగానే వుండాలి, అలానే వుండండి. బోగస్ ఓటర్ల రద్దుని గట్టిగా అడ్డుకోండి, అధికార్లపై తిరగబడండి'' అని పాఠం చెప్పాడు. చంద్రబాబు 'రాజకీయ చతురత'ని, 'వ్యవహార దక్షత'ని ఎంతో మెచ్చుకునేవారు సైతం చంద్రబాబు ప్రవర్తనకి నివ్వెరపోయి వుంటారు.

ప్రారంభం నుంచి చంద్రబాబు రాజకీయ జీవితాన్ని, అతడి ఎదుగుదలని లోతుగా దగ్గరగా పరిశీలించేవారికి ఎవరికైనా చాలా స్పష్టంగా ఒక వాస్తవం అర్థం కాగలదు. రాజకీయ విలువలు, సూత్రాలు, నీతులు, సాంప్రదాయాలు లాంటి పెద్ద పెద్ద మాటలు చంద్రబాబు విషయంలో వర్తింపయ్యేవి కావు. అతడి విషయంలో ఇలాంటి మాటలను వుపయోగించడం ఒక రకంగా రాజకీయ అవివేకమే అవుతుంది. ఇతరులంతా రాజకీయాలలో నీతి, విలువలు, సూత్రాలు పాటించాలని అంటాడు. కాని తాను మాత్రం వాటిని అన్ని వేళలా అతిమొరటుగా ఉల్లంఘించుకునే పోతాడు. తన ప్రత్యర్థులు ప్రతిదాన్నీ రాజకీయం చేస్తారని నిందిస్తాడు. తాను మాత్రం నిద్రలో కూడా రాజకీయ వాదిగానే బతుకుతాడు. చంద్రబాబు రాజకీయ జీవిత చరిత్ర అంతా పరమ స్వార్థపూరిత అవకాశవాద కుట్రలు, వెన్నుపోట్ల చరిత్రే! ఇందుకు నిదర్శనాలు కోకొల్లలు.

చంద్రబాబు ఒక తరహా ఫాసిస్టు నేత. ఫాసిస్టులు రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఏమాత్రం సహించరు, తమ నిరంకుశాధికారాన్ని సవాల్ చేయడాన్ని భరించరు. ప్రత్యర్థులపట్ల ప్రతీకారానికి ప్రయత్నిస్తారు, పగని పెంచుకుంటారు. వీరు వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి పని కృతనిశ్చయంతోనే వుంటాయి. వ్యతిరేక ఫలితాలొస్తున్నా వీరు వెనక్కి తగ్గేవారుగా వుండరు. వీరు సాధారణంగా దిద్దుబాటుకి లొంగేవారుగా వుండరు. అవధుల్లేని ఆత్మవిశ్వాసంతో ప్రవర్తిస్తుంటారు. ఎదురు దెబ్బలు తింటే విపరీతమైన అభద్రతకి గురై పోతుంటారు. అభద్రతాస్థితి కారణంగానే తమ చేతిలో వున్న

అధికార దండాన్ని ఆసరా చేసుకుని క్రూర నేర పాలకులుగా చెలరేగిపోతారు. ప్రజల నుంచి, రాజకీయ ప్రత్యర్థుల నుంచి వ్యక్తమయ్యే అసంతృప్తులు, నిరసనలు, విమర్శలు, సవాళ్లు, ఆరోపణలు, వాదనలు వేటినీ వీరు ఖాతరు చేయరు. వీరికెలాంటి సహేతుక సమాధానాలు, పరిష్కారాల గూర్చి వీరు పట్టించుకోరు. తాము అధికారాన్ని అంటిపెట్టుకు వుండగలగటం, అధికారంతో వీటనన్నింటినీ అణచి పారేయడం మాత్రమే సరైన సమాధానం పరిష్కారం అనేది వీరి తాత్విక ధోరణిగానే వుంటుంది. తన రథయాత్ర ద్వారా అద్వానీ దేశంలో పారించిన నెత్తురుని బిజెపి అధికారాన్ని చేజిక్కించు కుని తుడిచేసింది. గుజరాత్‌ని నెత్తురు సముద్రంలో ముంచిన నరేంద్రమోడీ తిరిగి గెలిచి తానే దాన్ని పైకెత్తాడు. **500** మందికి పైగా ప్రభుత్వ వుద్యోగులను ఒక్క కలంపోటుతో పీకి పారేయడం పచ్చి నియంతృత్వ చర్య అని నిరసించే ప్రజలను, ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్య వాదులను జయలలిత తన దండనాధికారంతోనే సమాధాన పెడతానంటుంది.

అలిపిరి ఘటన తరువాత చంద్రబాబు చేస్తూ వచ్చిన విపరీత నిర్ణయాలు, వ్యాఖ్యలు, ప్రకటనలు అన్నీ ఈ కోవకు చెందినవే. వీటిని ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, పత్రికలు ఎవరూ హర్షించలేదు. తమ అభ్యంతరాలు, నిరసనలు, విమర్శలు గుప్పిస్తూనే వచ్చారు. అయినా 'దున్నపోతు మీద చినుకు'లా చంద్రబాబు చలించడు. వీటన్నింటికీ రేపటి తన ఎన్నికల విజయమే తగిన సమాధానం అవుతుందని అతడు భావిస్తాడు. ఎలాగైనా గెలిచి తీరాలని అతడు అహరహం ఆలోచిస్తాడు. సవ్యాపసవ్యాలను పట్టించుకోకుండా గెలుపు పథకాలు వేస్తాడు. ఎన్నికల్లో తామే గెలుస్తామని ధీమా ప్రకటించడం అందరికీ ఆనవాయితీయే! కాని చంద్రబాబు తన ప్రతి కదలికలోనూ తాము గెలవగలమనే ధీమాతో ప్రవర్తిస్తున్నాడు.

చంద్రబాబు ధీమా మరీ అర్థం లేనిది, నిరాధారమైనదీ అని కొట్టి పారేయలేము. ఆ పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం అనేది మచ్చుకి సైతం కనబడదు. అన్నింటిలో అధినేత చంద్రబాబుదే ఆఖరి మాట. మంత్రులు, శాసన సభ్యులు, కింది నుంచి మీది వరకు యావత్ పార్టీ యంత్రాంగం అతడిని కేవలం అనుసరిస్తారు. అతడికి ఎదురు చెప్పలేని అసహాయత బలహీనత వల్లనే ఇదంతా అనుకుంటే పొరపాటే. నయానో భయానో, మంచిగానో చెడుగానో అతడి నాయకత్వం తమకి గెలుపు సాధించి పెట్టగలదనే భరోసా వారిలో చంద్రబాబు కలిగించాడు. కనుక అరకొర అసంతృప్తులు తిరుగుబాట్లు తప్ప యావత్ పార్టీ యంత్రాంగం అతడి వెన్నంటి వుంటుంది. ఇక ప్రభుత్వ పాలనా యంత్రాంగం సుమారుగా మొగ్గేది అతడివైపే (ఇందుకు కారణాలేమి టనేది ఈ సంచికలోనే మరో వ్యాసంలో విశ్లేషించాం). కేంద్ర అధికారంలో వుంటున్న బిజెపి అధినాయకత్వం అన్నివిధాలా చంద్రబాబుకి కొమ్ము కాస్తూనే వుంది. రాష్ట్రంలోని తన స్వంత పార్టీవారు సైతం చంద్రబాబుకి ఇబ్బందులు కలిగించకుండా మసలుకోవాలని అది సలహా ఇస్తుంది. ఇక వెనుకనుండే పాలక వర్గాల సంగతి చెప్పనే అవసరం లేదు. ఎక్కువ శాతం చంద్రబాబు తమ విశ్వసనీయ సేవకుడు అనే వైఖరినే కలిగి వుంటారు.

ఇవన్నీ వున్నా ఓట్లు వేసేది అత్యధిక శాతంగా వుండే సామాన్య ప్రజలే కదా! ఆ ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత అనేది బలంగా వున్నప్పుడు ఇవి పని చేయగలవా? వాస్తవ ప్రజాభిప్రాయం మాత్రమే నిర్ణాయక శక్తిగా వుండేంతటి ప్రజాస్వామిక విలువలతో, స్ఫూర్తితో సాగే ఎన్నికలు కావివి. బూటకపు ప్రజాస్వామ్యానికి ఏకైక కొండగుర్తుగా సాగుతున్న ఎన్నికలివి. ఇక్కడ ప్రజాభిప్రాయం అనేది కూడా కబ్జాకి గురవుతుంటుంది. ఈ కబ్జా కళలో చంద్రబాబు ఆరితేరినవాడు. అడుగడుగునా అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ అనేకానేక అడ్డదారుల్లో దొడ్డి దారుల్లో అవినీతి కుంభకోణాలతో డబ్బు మేటలను పోగేసుకున్న అధికార పార్టీ రేపు ఎన్నికల్లో సారా ఏరులుగా పారిస్తుంది, డబ్బు విరజిమ్ముతుంది. దీన్ని కప్పి వుంచుకోడానికే 'మాకు ఓటు నోటు ఇవ్వండి', 'ఓటుకి డబ్బిచ్చే వాళ్లని తరమండి' అనే ఘరానా నినాదాలను అందుకున్నాడు చంద్రబాబు. చంద్రబాబు ఈ నినాదాలి స్తున్నాడంటే దానర్థం వాటికి పూర్తి వ్యతిరేకంగా డబ్బు, సారాలతో ఓట్లు కొల్లగొట్టడానికి పూనుకుంటాడనే!

అన్నింటికి మించి అధికార టిడిపికి అనుకూలించే అంశం ఏమంటే రాష్ట్రంలోని ప్రతిపక్షాల పరిస్థితి. వాటి మధ్య వుండాల్సినంత ఐక్యత లేదు. అదింకా సాధించ బడాల్సినదిగానే వుంది (ఈ వ్యాసం రాస్తున్న **17-01-04** నాటికి) అధికార టిడిపి-బిజెపి కూటమిని ఓడించడమే తమ ధ్యేయమని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ వ్యతిరేక ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా చూస్తామని ప్రతిపక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో ప్రకటిస్తున్నాయే గానీ అందుకనుగుణంగా నిర్దిష్టమైన పథకాలు కలిగి లేవు (ఇప్పటికీ). నిర్దిష్టమైన చర్యలు చేపట్టడం లేదు. ఈ విషయంలో సిపిఎం పిడివాద ధోరణి ప్రతిపక్ష ఐక్యతను దెబ్బతీయగలదిగానే వుంటుంది. ప్రతిపక్ష ఓట్ల చీలిక మీదే అధికార టిడిపి గెలుపు ప్రధానంగా ఆధారపడి వుందనే విషయం స్పష్టంగా అందరికీ అర్థమవుతున్నా దాన్ని నివారించే దిశలో ప్రతిపక్షాలు ఇప్పటికింకా నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు. అన్నింటికంటే ముఖ్యంగా కాంగ్రెస్-టిఆర్ఎస్‌ల మధ్య పొత్తు అనేది టిడిపి ఓటమికి విశేషంగా పని చేయగలదు. కాని అదింకా రూపం తీసుకోలేదు.

అంటే చంద్రబాబు టిడిపి ఓడిపోవాల్సిన అవసరం, ఓడిపోయే అవకాశాలు ఎంతగా వున్నాయో తిరిగి గెలిచే ప్రమాదమూ సుమారుగా అంతే వుంది. చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావడమంటూ జరిగితే కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకున్నా కూడా అతడి ఫాసిజం కొత్త కొత్త రూపాలలో మరింత తీవ్రస్థాయిలోనే చెలరేగుతుంది. రాష్ట్రంలోని మన పార్టీ ఉద్యమాలపై పెను సవాల్‌నే విసురుతుంది. దీన్ని ఎదుర్కొని ఓడించేందుకు మనం అన్ని రకాలా సిద్ధంగా వుండాలి.

పోతే, తిరిగి చంద్రబాబు ప్రభుత్వమే ఏర్పడితే రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితి పరిణామాలు, సమీకరణలు ఒక మలుపు తిరగ గలవనే చెప్పాలి. తమ అస్తిత్వ సమస్యని ఎదుర్కొనే ప్రతిపక్షాలు అనివార్యంగా దగ్గరయ్యే అవకాశాలు మెరుగవుతాయి. ఫాసిస్టు చంద్రబాబు నాయకత్వంలో రేపు తిరిగి ప్రభుత్వం ఏర్పడమంటూ జరిగితే రాష్ట్ర పరిస్థితి ఎలా వుండగలదనడానికి నేడు సంచలనాత్మకంగా సాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన, దానికి అణచివేతే పరిష్కారం అనే తీరులో ప్రవర్తిస్తున్న చంద్రబాబు ప్రభుత్వ వైఖరి అనేవి అద్దం పడతాయి.

ప్రజల న్యాయమైన హక్కులు, కోర్కెలు, ఆందోళనలపై చంద్రబాబు మరింత విరుచుకు పడతాడు. ఇంతకంటే ప్రధానంగా మనం చూడాల్సింది గతంలో ఎప్పటికంటే దృఢంగాను, ఐక్యంగాను, నిశ్చయాత్మకంగాను ప్రజల ప్రతిఘటనా పోరాటాలు వెల్లువెత్తుతాయి.

ప్రజా సమస్యలు, ప్రభుత్వ అణచివేత లాంటి ఉమ్మడి సమస్యలపై విశాల ఐక్యసంఘటనలు విస్తృత ప్రజా వుద్యమాలు బలపడే పరిస్థితులు అవకాశాలు పెరుగుతాయి. అలాంటి అవకాశాలను మనం సమర్థవంతంగా వుపయోగించు కోగలగాలి. చంద్రబాబు ప్రభుత్వం ప్రధానంగా మన పార్టీ వుద్యమాలపై ఎక్కుపెట్టనున్న తీవ్ర ఫాసిస్టు అణచివేత దాడిని ఎదుర్కోవడానికి ఇది చాలా అవసరమని మనం గుర్తించాలి.

అధికార టిడిపియే తిరిగి అధికారంలోకి వస్తే పెట్రేగనున్న ఫాసిజానికి మన ప్రజాయుద్ధం మాత్రమే నిజమైన నిలకడైన ధీటైన సమాధానం కాగలదని మనకు తెలుసు. అంటే మన సైనిక నిర్మాణాలను, సైనిక సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవాలి. మన సైనిక అవసరాలను సమకూర్చుకోడంలో మనం మరింత శ్రద్ధాసక్తులను మెలుకువలను పాటించాలి. మరో పక్క కీలకమైన ప్రజా సమస్యలపై విస్తృత ప్రజా సమీకరణలతో కూడిన బలమైన ప్రజా వుద్యమాలను నిర్మించాల్సి వుంటుంది. ప్రజా సమస్యలపై కలిసిరాగల శక్తులన్నింటినీ కలుపుకొంటూ బలమైన ఐక్యసంఘటనా వుద్యమాలను నిర్మించాల్సి వుంటుంది. శక్తివంతమైన ప్రజా రాజకీయ వుద్యమాలను నిర్మించడం అనేది మన ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడానికి సంబంధించిన, విస్తరింప చేయడానికి సంబంధించిన ఒక నిర్దిష్ట వ్యక్తీకరణ అనే స్ఫూర్తితో అవగాహనతో మనం పని చేయాలి.

# ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా
# చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధ దాడిని ఓడిద్దాం !

గడచిన సంవత్సర కాలంగా రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధకాండ తీవ్రతర మవుతూ వచ్చింది. ఈ నిర్బంధ కాండ గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. ముఖ్యంగా అలిపిరి సంఘటన తర్వాత మరింత తీవ్రతరమైంది. ఈ ఫాసిస్టు నిర్బంధ దాడిలో రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥జయపాల్, జిల్లాకమిటీ సభ్యులు కా॥మహేందర్, కా॥నర్సన్న, కా॥లత, కా॥సుదర్శన్‌లతో పాటు ఏరియా కమిటీ సభ్యులు కమాండర్లు, డిప్యూటీ కమాండర్లు, దళసభ్యులు, ప్రజలు-మొత్తం **64**మంది కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. వందలాది మంది ప్రజలు, సంఘ నాయకులు, సభ్యులు అక్రమంగా అరెస్టు కాబడి పోలీసుల చేతుల్లో తీవ్ర చిత్రహింసలకు గురైనారు. పదుల సంఖ్యలోనే పోటా చట్టం కింద కేసులు బనాయించబడి జైళ్ల పాలైనారు. రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడిన ప్రజాస్వామిక వాదులు, మేధావులు చంద్రబాబు ఫాసిస్టు పోలీసుల చేతుల్లో వేధింపులకు, చిత్రహింసలకు, కిడ్నాప్‌లకు, హత్యా ప్రయత్నాలకు గురైనారు. వారిపై కూడా పోటా చట్టం అమలయింది. ఈ నిర్బంధ తీవ్రత కేవలం విప్లవోద్యమంపైనే కాకుండా, సాగునీరు, తాగునీరు, గిట్టుబాటు ధరలు, పుద్యోగ భద్రత, వేతనాల పెంపు వంటి కనీస ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడిన వివిధ సెక్షన్ల ప్రజలపై కూడా అమలయింది.

## ఈ ఫాసిస్టు నిర్బంధ కాండ ఎందుకు ?

రాష్ట్రాన్ని ఇంతగా నిర్బంధపు నిప్పుల కుంపటిగా మారుస్తున్న చంద్రబాబుకు స్పష్టమైన ఆర్థిక రాజకీయ లక్ష్యాలున్నాయి. ఈ లక్ష్యాలను నెరవేర్చటంలో భాగంగానే ఫాసిజీకరణకు పూనుకున్నాడు. రాష్ట్రంలో పీడిత ప్రజానీకాన్ని కొల్లగొట్టి, సామ్రాజ్యవాదులకు, నిరంకుశ దళారీ బూర్జువా వర్గానికి లాభాలు చేకూర్చి పెట్టటమే చంద్రబాబుకున్న ఆర్థిక లక్ష్యం. అందుకు అనుగుణంగానే ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి, రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెడుతున్నాడు. మరోవైపు రాష్ట్రంపై, సామ్రాజ్యవాదుల రాజకీయ ఆధిపత్యం మరింతగా బిగుసు కోవడానికి తాబేదారులా వ్యవహరిస్తున్నాడు. ఈ రాజకీయ లక్ష్యానికి అనుగుణంగానే విధాన పరమైన నిర్ణయాలన్ని ప్రపంచబ్యాంకు కనుసన్నలలో జరుగు తున్నాయి. చంద్రబాబు తాను నిర్దేశించుకున్న ఈ ఆర్థిక, రాజకీయ లక్ష్యాల సాధనకు పరమ నిరంకుశంగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని రక్తసిక్తం చేయడానికి సిద్ధపడ్తున్నాడు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం అమలు జరుపుతున్న నిర్బంధాన్ని అర్థం చేసుకోవాలి.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బహుముఖ దాడి

ముఖ్యంగా **2003-04**లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో విప్లవోద్యమాన్ని అణచివేసేందుకు ముఖ్యమైన నిర్ణయాలు చేసాయి. నల్లమల కేంద్రంగా బలపడుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి, మహబూబ్ నగర్, నల్గొండ, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లా పోలీసు అధికారు లతో సమన్వయ కమాండ్‌ను ఏర్పాటు చేసారు. ఈ కమాండ్ నేతృత్వంలో ఐదు జిల్లాల పోలీసులు సమన్వయంతో నల్లమల అటవీ ప్రాంతాన్ని యుద్ధ రంగంగా మారుస్తున్నాయి. క్రిష్ణానది పరివాహక ప్రాంతంలో చేపలు పడ్తూ జీవిస్తున్న జాలరులను, అడవిలోని చెంచు ఆదివాసీలను భయోత్పాతానికి గురి చేస్తున్నారు. అడవి నుండి వెళ్లి పొమ్మని చెంచు ఆదివాసీలపై వత్తిడి తెస్తున్నారు. దళాల ఆచూకి తెలియగానే చుట్టుముట్టి దెబ్బ తీయడానికి వివిధ జిల్లాల పోలీసులు సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నారు. నల్లమల ప్రాంతంలోనే గాక రాష్ట్రంలోని ఉద్యమ ప్రాంతమంతటా పోలీసు బలగాల కేంద్రీకరణ పెరిగింది. ప్రతి జిల్లాలోనూ ఎంపిక చేసిన పోలీసులకు గ్రేహౌండ్స్ శిక్షణను ఇచ్చారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలకు ప్రత్యేకంగా **3** ప్లాటూన్ల గ్రేహౌండ్స్ బలగాలను పంపారు. ఈ జిల్లాల పోలీసులకు ఎస్ఎల్ఆర్-**80**; **9**ఎంఎం పిస్టల్-**35**; గ్రనేడ్స్-**200** సమకూర్చారు. దళాల సమాచారం అందగానే హుటాహుటిన వెళ్లి దాడులు నిర్వహించడానికి అనువుగా ఉద్యమ ప్రాంతంలోని ముఖ్యమైన పట్టణ కేంద్రాలలో పోలీసు బలగాలను పెంచారు. వీరికి తోడుగా రాష్ట్రంలో వున్న **12** ఏ.పి.ఎస్.పి బెటాలియన్ల నుండి **2** సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల నుండి అనేక కంపెనీల పోలీసు బలగాలను ఉద్యమ ప్రాంతానికి రప్పించారు. వారు స్థానిక పోలీసు బలగాలతో కలిసి కూంబింగ్స్ నిర్వహిస్తూ ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. నల్లమల పరిధిలో కొత్తగా మూడు పోలీసు స్టేషన్లను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం అమలులో భాగంగానే తక్షణ ఏర్పాట్లుగా మహబూబ్‌నగర్ జిల్లాలో మన్ననూర్, పదరలలో అవుట్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసారు. గుంటూరు, నల్గొండ, క్రిష్ణా జిల్లాలను కలిపే ప్రాంతంలో మన కదలికలను నియంత్రించ డానికి అనువుగా మాదిపాడులో అవుట్‌పోస్టును ఏర్పాటు చేసారు. అనంతపూర్ జిల్లాలో మన కార్యక్రమాల ఉధృతి పెరుగగానే ఎగువపల్లె, తగరకుంట, రాళ్లఅనంతపురంలలో అవుట్ పోస్టులను ఏర్పాటు చేసారు. ఈ అవుట్ పోస్టులన్నింటా **30** నుండి **60** మంది దాకా పోలీసులను వుంచారు. ఉద్యమ ప్రాంతంలోని అన్ని పోలీసు స్టేషన్ల ఫోర్టిఫికేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు, పోలీసు బలగాల సంఖ్యను పెంచారు. పోలీసు స్టేషన్ల రక్షణకు స్థానిక పోలీసులతో పాటు **1,2** సెక్షన్ల ఏ.పి.ఎస్.పి బలగాలను నిరంతరం వుంచుతున్నారు. ఈ అన్ని రకాల బలగా లు నిరంతరం కూంబింగ్‌లు జరుపుతూ దళాలను దెబ్బతీయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఒక్కొక్క దళంపై రెండు లేదా మూడు ప్లాటూన్ల పోలీసు బలగాలు ఒకేసారి కేంద్రీకరించటం, రొటేషన్ పద్ధతిలో నిరంతరం బ్యాచీలు తిరుగుతూ దళాలపై తీవ్ర వత్తిడిని పెంచటం, దళాలను గ్రామాలకు రానీయకుండా రాత్రుళ్లు గ్రామాలలో మాటువేయడం, దారుల్లో, నీటి తావుల్లో మాటుగాయడం, వీడియో కెమెరాల నుపయోగించి దళాలు మకాం వేసే స్థలాలను ఫోటోలు తీయటం, ప్రజలకు సైతం అర్థం కాకుండా అత్యంత రహస్యంగా తిరగటం - వంటి అనేక పద్ధతులు అవలంభిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట దళాన్ని నిర్మూలించడానికి **600** మంది పోలీసులు **20** మంది ఎస్ఐల నాయకత్వంలో ఒకేసారి కూంబింగ్‌లు నిర్వహించారు. దళాలకు ఆహారం, రక్షణ ఇస్తున్నారనే అనుమానంతో రాత్రిపూట పొలం పనులకు వెళ్లే రైతులను అటకాయిస్తున్నారు. అడవిలో పశువులు, మేకలు మేపుకునే మేపరులను అడవిలోకి రావద్దని బెదిరిస్తున్నారు. మైదాన ప్రాంతాలలో చిన్న చిన్న పోలీసు బృందాలు హీరోహోండాలపై గ్రామాలకు వెళ్లి సంఘ నాయకత్వంపై బహిరంగంగానే కాల్పులు జరుపుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నారు. గుంటూరు జిల్లా భట్రుపాలెం గ్రామంలో సుబ్బారావు అనే మిలీషియా కామ్రేడ్‌పై పోలీసులు గ్రామంలోనే కాల్పులు జరుపగా, తపంచాతో ప్రతి కాల్పులు జరిపి తప్పించుకున్నాడు. గడిచిన సంవత్సర కాలమంతా ఉద్యమ ప్రాంతంలోని అటవీ, మైదాన ప్రాంతాలన్నీ పోలీసు పదఘట్టనలతో యుద్ధ వాతావరణాన్ని తలపింప చేసాయి. గత సంవత్సర కాలంలోనే **25** ఎన్‌కౌంటర్స్ జరిగాయి. ఎక్కువ సంఖ్యలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్లు పెరుగుతున్న శత్రు దాడిని సూచిస్తున్నాయి.

ఉద్యమ ప్రాంతంలో కేంద్రీకరించిన ఈ పోలీసు బలగాలు ఒకవైపున దళాలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తూ మరోవైపు విప్లవ ప్రజానీకాన్ని అనేక వేధింపులకు గురిచేసాయి. గుంటూరు జిల్లాలోని బొటుకులపాయ చెంచు పెంటపై, కూంబింగ్‌కు వచ్చిన పోలీసు గుంపు ఒకటి అకస్మాత్తుగా దాడి జరిపి దొరికిన పురుషులను తీవ్రంగా కొట్టి వాళ్ల ముందే ముగ్గురు మహిళలపై

అత్యాచారం జరిపారు. నల్గొండ జిల్లా భూదేవిపాయ వద్ద మన గెరిల్లా దళం పోలీసులపై ఆంబుష్ జరిపి ఆరుగుర్ని గాయపరిచారు. దీంతో రెచ్చిపోయిన పోలీసులు భూదేవిపాయ, సోమరిపాయలలో చెంచు పెంటలపై దాడి చేసి గూడాలను తగులబెట్టారు. అనేక సందర్భాలలో దళాల సమాచారం చెప్పమని ప్రజల్ని వేధిస్తున్నారు.

చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం పార్టీని, సాయుధ బలగాలను పూర్తిగా నిర్మూలించాలని కలలు గన్నప్పటికీ సాధ్యం చేయలేక పోయింది. అయితే మనం తీవ్రంగానే నష్టపోయాము. ప్రభుత్వ సాయుధ బలగాలకు ప్రజా గెరిల్లా బలగాలకు మధ్య జరిగిన **23** ఎన్‌కౌంటర్స్‌లో **17** ఎన్‌కౌంటర్స్‌లో మనం నష్టపోకుండా రిట్రీట్ కాగలిగాము. మరో **6** ఎన్‌కౌంటర్స్‌లో **15**మంది కామ్రేడ్స్‌ను కోల్పోయాము. **47**మంది కామ్రేడ్స్‌ను పోలీసులు అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్స్ పేరుతో కాల్చి చంపారు. వారిలో **31** మంది దాకా గ్రామస్థాయి నాయకత్వం, మిలీషియా, ప్రజలు వున్నారు. వారిలో అత్యధికులు గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందినవారు. ఈ దాడులను మరింత తీవ్రతరం చేయడానికి జూన్ నెలలో ప్రభుత్వం పోలీసు డిపార్ట్‌మెంటుకు రెండు హెలికాప్టర్స్‌ను శాంక్షన్ చేసింది. ఈ హెలికాప్టర్స్ సహాయంతో క్రిందనున్న తమ సాయుధ బలగాలను సమన్వయిస్తూ, ఎన్‌కౌంటర్స్ జరిగిన సందర్భంలోనూ, ఆంబుష్‌లు నిర్వహించిన సందర్భం లోనూ తప్పుకున్న గెరిల్లా బలగాలను దెబ్బ తీయడానికి ప్లానులు రూపొందిస్తున్నారు. గాయపడిన తమ బలగాలకు, వెంటనే వైద్య సదుపాయం కల్పించి నైతిక స్థైర్యాన్ని నిలబెట్టడానికి కూడా ఈ హెలికాప్టర్స్ ను వాడుతున్నారు. జూన్ **2003**లోనే డి.జి.పి. రాములు నల్లమలలోకి రోడ్లు వేయాలనీ, గ్రామాలకు ఆయుధాలు ఇవ్వాలనీ (ప్రజల పేరుతో దోపిడీ వర్గాలకు, ఇన్ఫార్మర్లకు), పోలీసులకు ఆధునిక ఆయుధాలతో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాడు. నవంబర్ **2003**లో కేంద్ర హోంమంత్రి అద్వానీ ఆధ్వర్యంలో జరిగిన **9** రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల, డిజిపిల సమావేశంలో విప్లవోద్యమాన్ని అణచివేయడానికి, కేంద్రం నుండి అందించే నిధులు అప్పు రూపంలో కాకుండా పూర్తిగా గ్రాంటు రూపంలోనే వుంటాయని, కాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని హోంమంత్రి తెలియ చేసాడు. ఈ సమావేశంలోనే ఉద్యమ ప్రాంతానికి ప్రత్యేక సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌ను కేటాయించారు. అంతకు ముందు మే నెలలో జరిగిన జాయింట్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని విప్లవోద్యమాన్ని దెబ్బ తీయడానికి సంవత్సరానికి **14**కోట్ల రూ॥లు అవసరమని ఆంధ్రప్రదేశ్ డి.జి.పి. చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా స్పందించింది. ఈ నిర్ణయాలన్నీ దాడి తీవ్రతను మరింతగా పెంచేందుకు దోహదపడ్డాయి. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా విప్లవోద్యమంపై సాయుధ బలగాల దాడిని తీవ్రతరం చేస్తూనే మరోవైపు గ్రామీణ ప్రాంతంలో గల తెలుగుదేశం పార్టీకి చెందిన భూస్వాములు, పెత్తందారులు, గూండాలను దళాలపైకి వుసిగొల్పాలని ప్రయత్నించింది. అనంతపురం జిల్లాకు చెందిన రాళ్లఅనంత పురం గ్రామంలో గెరిల్లా బలగాలు ఎంఎల్ఏ శారదాంబ గన్‌మేన్‌పై దాడి చేసి ఆయుధాన్ని గుంజుకున్నారు. తర్వాత ప్రజా సమస్యలపై ఎంఎల్ఏ శారదాంబ తో మాట్లాడుతుండగా స్థానిక టిడిపి నాయకుల ప్రోద్బలంతో కొంతమంది టిడిపి కార్యకర్తలు దళంతో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణను నివారించు కోవాలని మన దళం చేసిన ప్రయత్నాన్ని అలుసుగా తీసుకుని, ఘర్షణకు దిగిన గుంపు దళంపై దాడి చేసి ఆయుధాలు గుంజుకున్నారు. ఈ సంఘటనను ఆసరా చేసుకుని శారదాంబను కిడ్నాప్ చేయడానికి వచ్చిన నక్సలైట్లను ప్రజలు తిప్పికొట్టారని తప్పుడు ప్రచారం చేస్తూ ఆ గ్రామానికి ప్రభుత్వం **10** లక్షల రూపాయలు కేటాయించింది. ఈసంఘటనకు ముందు నల్గొండ జిల్లాలోని దేవాలమ్మ నాగారం, కర్నూలు జిల్లాలోని వడ్లరామాపురం గ్రామాలలో కొందరు టిడిపి నాయకులు, కార్యకర్తలు గూండాలు దళంతో ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలను ఆదర్శంగా చూపిస్తూ నక్సలైట్లను ఎదుర్కొన్న గ్రామాలకు **10**లక్షల రూపాయలు శాంక్షన్ చేస్తామని చంద్రబాబు ప్రకటించాడు. మన దళాలపైకి టిడిపి లీడర్లను, కార్యకర్తలను గూండాలను ఉసిగొల్పటానికి విఫలప్రయత్నం చేసాడు. చంద్రబాబు ప్రభుత్వం విప్లవోద్యమంపై చేస్తున్న బహుముఖ దాడిలో సాయుధ బలగాల దాడి ఒక రూపమైతే సంస్కరణలు, ప్రచార దాడి, ఇన్ఫార్మర్లు, కోవర్టులు, నల్లదండు ముఠాలు ఏర్పాటు చేయడం వగైరా - ఇతర దాడి రూపాలుగా వున్నాయి.

## వివిధ రకాల పథకాలు

పోలీసులు కొంత కాలంగా ప్రజోపకరమైన పనులు చేస్తామంటూ సాధారణ పరిపాలనా వ్యవహారాల్లోకి తలదూరుస్తున్నారు. తామే రాజకీయ నాయకులుగా వ్యవహరిస్తూ కుప్పలు తెప్పలుగా వివిధ రకాల పథకాలు ముందుకు తెస్తున్నారు. యువతకు ఉపాధి శిక్షణ, గ్రామస్తులకు వైద్య శిబిరాలు; విద్యార్థులకు భవిష్యత్ బాట; కుటుంబాలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్; మాజీలకు విముక్తి సదస్సులు వంటి అనేక పథకాలతో ప్రజల్ని విప్లవోద్యమం నుండి దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. పల్లెతల్లి పిలుస్తుంది, బిడ్డలారా లొంగిపోండి, మా ఊరికి రండి - వంటి పిలుపులతో లొంగుబాట్లను ప్రోత్సహిస్తూ విప్లవకారులపై మానసిక యుద్ధాన్ని నిర్వహిస్తున్నారు. పోలీసులు ఒక వైపున అసాంఘిక శక్తులతోటి, దోపిడీ వర్గాల తోటి అంటకాగుతూ, మరోవైపు వివిధ పథకాల ద్వారా ప్రజల యెడల చూపిస్తున్న ప్రేమంతా కపట ప్రేమేనని ప్రజలు గుర్తిస్తున్నారు.

## ఇన్ఫార్మర్లు - కోవర్టులు

విప్లవోద్యమాన్ని దెబ్బతీయటంలో ఇన్ఫార్మర్ల వ్యవస్థ పోలీసుల చేతుల్లో ఒక బలమైన ఆయుధంగా వుంటున్నది. ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ ఇద్దరు లేక ముగ్గురు పోలీసులకు ఇన్ఫార్మర్స్‌ను తయారు చేసే బాధ్యత ఇస్తున్నారు. స్థానిక పోలీసులతో సంబంధం లేకుండానే ఎస్ఐబి పోలీసులు ప్రత్యేకంగా ఇన్ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను ఏర్పర్చుకుంటున్నారు. ఇన్ఫార్మర్స్ తయారీకి వివిధ పద్ధతులు అనుసరిస్తున్నారు. సరెండర్ల పేరుతో గ్రామీణ ప్రాంతం నుండి వందలాది మందిని, పోలీసు స్టేషన్లకు పిలిపించి, వారిలో కొందరిని డబ్బు ఆశ చూపో, బెదిరించో ఇన్ఫార్మర్స్‌గా మార్చుకుంటున్నారు. పోలీసులకు ప్రజలకు మైత్రి పెంచటం పేరుతో రాష్ట్రంలో **7, 595** మైత్రీ సంఘాలు పెట్టారు. దాదాపుగా ఈ సంఘాలన్నీ పోలీసులకు ఇంటలెజెన్సీ వ్యవస్థలుగా పని చేస్తున్నాయి. కొన్ని చోట్ల డ్వాక్రా మహిళలు కూడా ఇన్ఫార్మర్స్‌గా వ్యవహరిస్తున్నారు. గుంటూరు జిల్లాలో కొద్దిమంది డ్వాక్రా మహిళలు ప్రభుత్వానికి, పోలీసులకు అత్యంత విశ్వసనీయులుగా వుంటూ దళాలను దెబ్బ తీయడానికి సీరియస్‌గా ప్రయత్నించారు. అటువంటి వారిలో ఇద్దరిని ఖతం చేసి మరో ఇద్దరికి దేహశుద్ధి చేసారు. ప్రతి గ్రామంలోనూ కనీసం **5** నుండి **10** మందిదాకా ఇన్ఫార్మర్స్‌ను తయారు చేసారు. మెహబూబ్‌నగర్ జిల్లా మద్దిమడుగు గ్రామంలో ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను మన దళం బహిర్గతం చేసినపుడు అడవిలో కట్టెలు కొట్టేవారిగానూ, మేకలు మేపుకునేవారిగానూ, దుకాణాదారునిగానూ, గ్రామ నౌకరుగానూ వుంటూ దళం సమాచారం పోలీసులకు చేరవేస్తున్న **5** నుండి **10** మంది దాకా ఇన్ఫార్మర్లు బయట పడ్డారు. పట్టణ ప్రాంతాలలో కూడా ఇన్ఫార్మర్ల సంఖ్య పెరిగింది. బస్ స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, సినిమా హాళ్లు వంటి ముఖ్యమైన కూడళ్లలో ఇన్ఫార్మర్లను, వేరు వేరు కవర్లలో సెటిల్ చేస్తున్నారు. అలిపిరి సంఘటన తరువాత పట్టణాలపై పోలీసు కేంద్రీకరణ మరింత పెరిగింది. చర్యలో పాల్గొన్న సభ్యుల్ని పట్టుకోవడానికి కొంత మంది మాజీలను పట్టణాలకు తరలించారు. రాష్ట్రంలోని పట్టణ గ్రామీణ ప్రాంత మంతటా ఇన్ఫార్మర్లతో నింపి పోలీసులు తమ ఇంటలిజెన్సీ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు. ఇన్ఫార్మర్ వ్యవస్థ బలంగా కొనసాగుతున్న ప్రాంతాలలో మనం తీవ్రమైన నష్టాలకు గురైనాము. ఎంతో మంది విలువైన కామ్రేడ్స్ అమరులైనారు. ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను నిర్దాక్షిణ్యంగా దెబ్బతీసిన చోట నష్టాలను తగ్గించుకో గలిగాము.

## కోవర్టులు

ఈ సంవత్సర కాలంలో కోవర్టు ప్రయోగాలు కూడా పెరిగి పోయాయి. ముఖ్యంగా నల్గొండ జిల్లా ఎస్.పి.సజ్జన్నార్ ఆధ్వర్యంలో అశోక్, సిరాజ్‌లను కోవర్టులుగా మార్చుకున్నారు. వారిలో సిరాజ్ నల్గొండ జిల్లా క్రిష్ణపట్టి దళ డిప్యూటీ కమాండర్ కాగా, అశోక్ టైలర్‌గా వుంటూ పార్టీ అవసరాల మేర యూనిఫాంలు కుట్టేవాడు. వీళ్లిద్దరినీ పోలీసులు కోవర్టులుగా మార్చారు. ప్రమాదకరమైన విష పదార్థంతో ముఖ్యమైన నాయకత్వాన్ని హత్య చేయాలనే పథకాన్ని రూపొందించి వారందరికి ఇచ్చారు. గుంటూరు జిల్లాలో మట్టయ్య అనే వాడిని కోవర్టుగా మార్చి దళంలోకి పంపారు. ఈ కోవర్ట్స్ అందరినీ సకాలంలో పసిగట్టి మట్టు పెట్టటం వల్ల పెద్ద నష్టాలనే నివారించుకో గలిగాము.

## నల్లదండు ముఠాలు

రాష్ట్రంలో గత సంవత్సర కాలంగా నల్లదండు ముఠా కార్యకలాపాలు పెరిగాయి. గతంలో కొంత ముసుగులో పని చేసినప్పటికీ ప్రస్తుతం బహిరంగంగానే కర్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలో నయీం ముఠా దిగజారిన వాళ్లను రిక్రూట్ చేసుకుని తన ముఠాను బలోపేతం చేసుకుంటున్నది. ఈ ముఠాలోని సభ్యులు ఆయుధాలు పట్టి బహిరంగంగానే తిరుగుతున్నారు. మెహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలోని కొన్ని గ్రామాలకు టాటా సుమోలలో వెళ్లి సంఘ నాయకత్వాన్ని, సానుభూతి పరులను చంపుతామని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. వీళ్లు చిన్న చిన్న పట్టణాలలో కూడా బ్యాచీలుగా తిరుగుతూ మన కార్యకర్తల కోసం వేట సాగిస్తున్నారు. వీరు ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులతో కలిసి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న విషయాన్ని ఈ మధ్య జరిగిన సంఘటనలు మరింతగా రుజువు చేసాయి. ముఖ్యంగా సిరాజ్‌ను కోవర్టుగా మార్చడంలో నయీం ముఠాతో పాటు నల్గొండ జిల్లా పోలీసు అధికారులు, ఎస్ఐబి అధికారులు వున్నరన్న విషయం బహిర్గతం కావటంతో, వీరి మధ్య సంబంధాలు మరింత స్పష్టమైనాయి. ప్రభుత్వ అండదండలతోనే ఈ ముఠా పెట్రేగి పోయి హత్యాకాండను కొనసాగిస్తున్నది. డిసెంబర్ **2003**లో రంగారెడ్డి జిల్లా తిప్పాయిగూడెం గ్రామానికి చెందిన కా.రామిరెడ్డి, కా.నగేష్‌గౌడ్‌లను కిడ్నాప్ చేసి, ఘోరంగా చిత్రహింసలు పెట్టి చంపి, కోవర్టులను పట్టుకున్నామని కృష్ణపట్టి కార్యదర్శి పేరుతో ప్రకటనలిచ్చి గందరగోళం సృష్టించారు. నల్గొండ జిల్లాలో రాచకొండ మైదాన ప్రాంత ఆర్గనైజర్ కా.రఘు యాక్సిడెంటల్ ఫైర్‌లో గాయపడి, వైద్య సదుపాయం కోసం, ఒక ఇంటిలో వుండగా నయీం ముఠా సభ్యులు కాల్చి చంపారు. ఆ తరువాత పోలీసులు ఆ ఇంటివద్దకు వచ్చి కొన్ని రౌండ్ల కాల్పులు జరిపి రఘు హత్యను ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారు. అంతకు ముందే గాయపడిన రఘుకు మందులు తేవడానికి చిట్యాలకు వెళ్లిన మిలీషియా సభ్యుడు కా.గోపాలక్రిష్ణను నయీం ముఠా సభ్యులు దాడి శ్రీనివాసరెడ్డి, ఇప్పర్తి మంజులలు గుర్తించి పట్టుకున్నారు. ఆయనను కూడా తీవ్ర చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారు.ఇదే ముఠా నల్గొండ జిల్లా ఇప్పర్తి గ్రామానికి చెందిన జిఆర్‌డి సభ్యుడు వాసును పట్టుకుని కాల్చి చంపారు. వారి అరాచకాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయి.

## ప్రచార దాడి

చంద్రబాబు అసత్య ప్రచారంలో గోబెల్స్‌ను మించిపోయాడు. మన పార్టీని, ఉద్యమాన్ని అభివృద్ధి నిరోధకమైందిగానూ, శాంతి భద్రతలకు విఘాతం కల్గించేది గానూ ప్రసార సాధనాల ద్వారా నిరంతరం ఊదరగొడ్తున్నాడు. అలిపిరి సంఘటన తరువాత ఈ ప్రచార దాడిని మరింత తీవ్రతరం చేసాడు. ఏకంగా 'నక్సలైట్ సమస్య'ను ఎన్నికల ప్రధాన ఎజెండాగా చేసి, విప్లవోద్యమ అణచివేతకు ప్రజల నుండిపూర్తి సాధికారతను కోరుతున్నడు. నక్సలైట్ల వల్లనే రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందనీ, నక్సలైట్లను అణచివేయడం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనీ, నక్సలైట్లను అణచివేసి అభివృద్ధిని సాధించాలంటే తనను పూర్తి మెజారిటీతో గెలిపించాలని పదే పదే ఊదరగొడ్తున్నాడు. చివరకి స్కూలు పిల్లల వద్ద కూడా దీని ప్రస్తావన తీసుకొచ్చాడు. మరోవైపు పోలీసులు కళాబృందాల ద్వారా, జనజాగృతి జిల్లా పౌరహక్కులు, మహిళాల సంఘాల సమాఖ్య వంటి రకరకాల పేర్లతో కరపత్రాలు పంచడం ద్వారా విష ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

## ముగింపు

అభివృద్ధి నిరోధక చంద్రబాబు ప్రభుత్వం 'అభివృద్ధి' పేరిట సామ్రాజ్యవాద అనుకూల సంస్కరణలు అమలు జరుపుతన్నది. ఈ సంస్కరణల దుష్ప్రభావంతో వివిధ సెక్షన్ల ప్రజలు వీధిన పడ్తున్నారు. ధనికులు మరింత ధనికులుగానూ పేదలు మరింత పేదలుగానూ మారుతున్నరు. ఇట్లా ఉపాధి కోల్పోయి వీధిన పడ్తున్న ప్రజలు పోరాట మార్గన్ని ఎంచుకుంటున్నారు. మరోవైపు ఉద్యమ ప్రాంతాలలోని ప్రజలు కరువు దాడుల వంటి మిలిటెంట్ రాజకీయ పోరాటాల ద్వారా తమ సమస్యలను పరిష్కరించ పూనుకుంటున్నారు. ఇట్లా పోరాట మార్గం చేపడ్తున్న ప్రజానీకాన్ని చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం అత్యంత క్రూరంగా అణచి వేస్తున్నది. చంద్రబాబు ప్రభుత్వం పెంచి పోషిస్తున్న నరహంతక ఎస్ఐబి పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు, నల్లదండు ముఠాలు, మొత్తం పోలీసు యంత్రాంగం ప్రజలపై మూకుమ్మడి దాడులు చేస్తున్నారు. చంద్రబాబు అనుసరిస్తున్న ఈ ఫాసిస్టు విధానాల వల్ల ప్రజలలో అసహనం, అసంతృప్తి తీవ్రస్థాయికి చేరుతున్నది. ప్రస్తుత ఈ రాజకీయ పరిస్థితిలో, ఏకైక పరిష్కార మార్గంగా ప్రజల్ని ప్రజాయుద్ధంలోకి సమీకరించాలి. అందుకు అనుగుణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారంగా మిలిటెంట్ పోరాటం చేపట్టాలి. దాన్ని ప్రభుత్వ వ్యతరేక రాజకీయ పోరాటంగా మలచాలి. ప్రజలపై ప్రత్యక్షంగా నిర్బంధం అమలు జరుపుతునన్న వివిధ రకాల సాయుధ బలగాలను నిర్మూలించే విధంగా ప్రజల్ని సిద్ధపరచాలి. ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధంలో భాగస్వాములుగా వుంటున్న ఇన్ఫార్మర్లను ప్రజా వ్యతిరేకులను స్థానిక బూర్జువా రాజకీయ నాయకులను నల్లదండు ముఠాలను నిర్దాక్షిణ్యంగా శిక్షించాలి. చంద్రబాబు అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు విధానాలను బహిర్గత పరుస్తూ నిరంతరం ప్రచారం కొనసాగించాలి. ఈ క్రమంలో సాయుధ పోరాట రాజకీయాలను అర్థం చేయిస్తూ ప్రజల్ని సాయుధులను చేయాలి. తద్వారానే చంద్రబాబు తలపెట్టిన ఫాసిస్టు దాడిని ఓడించటం సాధ్యపడుతుంది.

**ఎర్రసైన్యం పోరాట సామర్థ్యం కేవలం మిలిటరీ టెక్నిక్‌పై మాత్రమే ఆధారపడదు. అది ప్రధానంగా దాని వర్గ చైతన్యంపైన రాజకీయ పలుకుబడిపైన అంటే శత్రు బలగాలను ధ్వంసం చేయడానికి విశాల ప్రజానీకాన్ని కార్మికులను కర్షకులను సమీకరించడంపైన ఆధారపడి వుంటుంది.**

**– కా॥మావో**

# ఇరాక్ ప్రజల వీరోచిత ప్రతిఘటనా యుద్ధంతో చావుదెబ్బలు తింటున్న అమెరికా సామ్రాజ్యవాదం

ఇరాక్ ప్రజల, గెరిల్లా బలగాల తీవ్ర ప్రతిఘటనను చవిచూస్తున్న అమెరికా దురాక్రమణ దారులు డిసెంబరు మొదటి వారంలో సద్దాం అరెస్టుతో అది సద్దుమణుగు తుందని కలలు గన్నారు. కానీ, క్రిస్మస్ రోజు పుదయాన్నే ప్రతిఘటనా గెరిల్లాలు బాగ్దాద్‌లోని హైసెక్యూరిటీ జోన్‌గా పిలవబడే ప్రాంతంలో వున్న అమెరికా కేంద్ర సైనిక కార్యాలయంపైనే రాకెట్‌లు కురిపించడంతో అమెరికా ఆశలు నీరుకారాయి. వాస్తవంగానే గెరిల్లాలు సద్దాం అరెస్టు తర్వాత కొద్దిరోజులు అమెరికా బలగాలను కాక ఇరాక్ కుమ్మక్కు దారులు, తొత్తు బలగాలపై దాడులు కేంద్రీకరించారు. దానితో అమెరికా అధికారులు సద్దాం అరెస్టుతో ప్రతిఘటనా శక్తుల నైతిక స్థైర్యం దెబ్బతిందని ప్రకటనలు గుప్పించారు. అయితే అమెరికా బలగాల చావు వార్తలు కొద్ది కాలానికే తిరిగి రావడం ప్రారంభమైంది.

ప్రతిఘటనకు ముఖ్య కేంద్రాలలో ఒకటైన సమర్రా పట్టణంలో సరిగ్గా క్రిస్మస్‌కు ముందురోజునే ముగ్గురు అమెరికా సైనికులు మట్టికరిచారు. రమాడి పట్టణంలో సద్దాం అరెస్టుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై అమెరికా సైనికులు కాల్పులు జరిపారు. దానితో నిరసన ప్రదర్శనలు సున్నీల బలం వున్న అన్ని పట్టణాలకు వ్యాపించాయి. దానితో అమెరికా సద్దాంకు అనుకూలంగా శాంతి ప్రదర్శనలు సైతం జరగడానికి వీలు లేదని నిషేధించింది. సద్దాం బందీగా వున్న ఫోటోలు టి.వి.లో ప్రదర్శించిన వెంటనే హుస్సేనియా, అమారియా పట్టణాలలో బాంబు పేలుళ్లు జరిగాయి. బాగ్దాద్‌కు 100కి.మీ. దూరంలోని కాల్దియా పోలీస్‌స్టేషన్‌పై జరిగిన మానవ బాంబు దాడిలో 17మంది చనిపోగా, అందులో ఎక్కువ మంది ఇరాకీ తొత్తు పోలీసులే. చివరికి ప్రతిఘటనా చర్యలు కుర్దు, షియాల ఆధిపత్యం వున్న ప్రాంతాలలోకి కూడా విస్తరించాయి. మొదటి గల్ఫ్ యుద్ధం (1991) నాటి నుండి అమెరికా అనుకూల కుర్దు ముఠాల ఆధీనంలో వున్న వుత్తరాది ఇర్బిల్ పట్టణంలో క్రిస్మస్‌కు ముందు జరిగిన సంఘటనలో ఇరాక్ ఆంతరంగిక శాఖ కార్యాలయం ముందు ఒక కారు బాంబు పేలింది.

ప్రతిఘటనతో అమెరికా బలగాలు ప్రజలపై పిచ్చెక్కినట్లు దాడులు చేస్తున్నాయి. ఇల్లిల్లు గాలించడం, ఎవరిని బడితే వారిని కాల్చి చంపడం నిత్యకృత్యమైంది. ఆపరేషన్ ఐరన్ గ్రిప్ (ఉక్కు పిడికిలి) పేరుతో అమెరికా బలగాలు హెలికాప్టర్లు, విమానాలు, బ్యాటరీ ఫీల్డ్ గన్స్ వుపయోగించి బాగ్దాద్‌తో సహా అంతటా దాడి చేసారు. బాగ్దాద్ దక్షిణ జిల్లాపై అమెరికా బలగాలు శక్తినంతా కేంద్రీకరించాయి. కానీ గతంలోని ఆపరేషన్ ఐరన్ హేమర్ (ఇనుపసుత్తి) లాగానే ఇది కూడా ఇరాకీ ప్రజల గొప్ప ప్రతిఘటనా శక్తి ముందు నిరుపయోగమని కొద్ది రోజులకే తేలిపోయింది. క్రిస్మస్‌కు ముందురోజు రాత్రంతా గెరిల్లాల విస్తృత బాంబు పేలుళ్లతో, తుపాకీ మోతలతో బాగ్దాద్ నగరం దద్దరిల్లి పోయింది. చివరికి డిసెంబరు 3వ వారంలో ఇరాక్‌లో అమెరికా పరిపాలనా నిర్వాహకుడు పాల్‌బ్రెమర్ కాన్వాయ్ వద్దనే బాంబు పేల్చి గెరిల్లాలు తుపాకీ కాల్పులు జరిపారు. రమ్స్‌ఫెల్డ్ రాక సందర్భంగా ఈ దాడి జరగడం గమనార్హం. ఇక చమురు నిల్వలను పైపు లైన్లను గెరిల్లాలు నిరంతరం పేల్చి వేస్తుండడంతో చమురు దాహంతో వచ్చిన అమెరికాకు చావుదెబ్బలే మిగిలాయి.

ఈ ప్రతిఘటన పెరుగుతూ కొత్త సంవత్సరం 2004లో మరిన్ని విజయాలు సాధించింది. ఫలూజా పట్టణం వద్ద ఒక బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను గెరిల్లాలు కూల్చగా నలుగురు అమెరికా సైనికులు చచ్చారు. కొద్దిరోజులకే తిక్రిత్ వద్ద అపాచే హెలికాప్టర్‌ను కూల్చగా అందులోని ఇద్దరు సైనికులను రక్షించ గలిగారు. కర్బలా వద్ద జరిగిన బాంబు దాడిలో నలుగురు బల్గేరియా సైనికులు, 10 మంది అమెరికా సైనికులు మట్టికరిచారు. బాగ్దాద్ పశ్చిమాన సీజ్జ్ ప్రాంతంలోని అమెరికా స్థావరంపై ఒకేసారి 6 మోర్టారు బాంబు దాడులు జరగడంతో 35మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. బాగ్దాద్‌కు 30కి.మీ. దూరంలో మందుపాతరలు వెలికితీస్తున్న అమెరికా సైనిక వాహనంపై జనవరి 15న జరిగిన బాంబు పేలుళ్లలో ముగ్గురు అమెరికా సైనికులు, ఇద్దరు ఇరాకీ పోలీసులు చనిపోవడంతో ఈ యుద్ధంలో మొత్తంగా చనిపోయిన అమెరికా సైనికుల సంఖ్య 500 దాటింది. గాయపడ్డవారు 7,000లకు చేరారు. ఇతర దేశాల బలగాలు, ఇరాకీ పోలీసులు కలిపి సుమారు 200పైగా చనిపోయారు. గత మే 1న యుద్ధంలో విజయం సాధించామని అమెరికా ప్రకటించుకున్న నాటికున్న సంఖ్యతో పోలిస్తే ఆ తర్వాత చనిపోయిన వారు రెట్టింపు వుంటారు. తిరిగి జనవరి 17న బాగ్దాద్‌లోని హైసెక్యూరిటీ జోన్‌లో వున్న అమెరికా సైనిక కేంద్రానికి 100మీ. దూరంలో కారు బాంబు పేలి 25మంది చనిపోయారు. అందులో ఇద్దరు అమెరికన్లు, కుమ్మక్కు దారులుగా పని చేస్తున్న ఇరాకీలు వున్నారు.

రోజుకు సుమారు 40 దాడులతో అమెరికా, బ్రిటన్ దురాక్రమణ బలగాలు, వారికి తోడుగా వచ్చిన ఇటలీ, స్పెయిన్, బల్గేరియా, పోలండ్ ఇతర బలగాలు ఇరాకీ తొత్తు ప్రభుత్వం పోలీసులు, అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చే ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి అధికారులు – ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా తగినంత వేగంతో తీవ్రతతో ఇరాకీ ప్రజల వీరోచిత గెరిల్లా ప్రతిఘటన పెరగడంతో 10 సంవత్సరాలపాటు ఆర్థిక ఆంక్షలతో తమను వేధించిన అమెరికా సామ్రాజ్యవాదులపై, వారి కుమ్మక్కు దారులపై ఇరాక్ ప్రజలకు ఎంతటి కసి వున్నదో వెల్లడవుతున్నది.

## ఉక్కిరి బిక్కిరి చేస్తున్న వరుస దాడులు

సద్దాం విగ్రహాలను ప్రజలు కూల్చి వేస్తున్నట్లు చూపించి, తమను తాము 'విముక్తి దాతలు'గా ప్రదర్శించుకుంటూ, మే 1న ఇరాక్‌పై విజయాన్ని ప్రకటించుకున్న అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ సైన్యాలకు త్వరలోనే వెన్నులో చలి పుట్టించే ప్రతిఘటన ఎదురయ్యింది. వియత్నాం పీడకల తిరిగి కనిపించడం ప్రారంభమైంది. సంపద్వంతమైన మెసపొటేమియా భూములు, బ్రహ్మాండమైన చమురు నిల్వలు చేజిక్కాయనుకున్న దోపిడీ దొంగలకు కన్నంలో వేలు పెడితే తేలు కుట్టినట్లయింది.

యుద్ధంలో గెలిచామని ప్రకటించుకున్న తర్వాత అమెరికా బలగాలకు మొదటి దెబ్బ జూన్ నెలలో బాగ్దాద్ విమానాశ్రయం వద్ద తగిలింది. ఒక ట్రక్ బాంబు దాడిలో 10మంది అమెరికా సైనికులు చావడంతో పాటు, మూడు సాయుధ శకటాలు, ఒక యుద్ధ ట్యాంకు దెబ్బతిన్నాయి. అదే ప్రాంతంలో వున్న ఒక సైనిక క్యాంపుపై గెరిల్లాలు 14 ఆల్‌సమూరా మిజైల్స్ ప్రయోగించగా 20మంది అమెరికా సైనికులు చచ్చారు. 23 హెలికాప్టర్లు ధ్వంసం అయ్యాయి. ఈ వార్త ఇస్లామిక్ ఆన్‌లైన్ నెట్ వెల్లడించింది.

ప్రతిఘటనా కేంద్రంగా వున్న ఫలూజా పట్టణంలో గెరిల్లాల ఆచూకీ కోసం వచ్చిన సాయుధ శకటాన్ని ఆంబుష్ చేయగా, అందులోని అమెరికా, బ్రిటన్ సైనికులందరూ చచ్చారు. తర్వాత గెరిల్లాల వెంటబడిన ఆరుగురు కమేండోలు కూడా మట్టికరిచారు. అమెరికా సైనిక కమాండ్ అక్కడికి బలగాలను తరలించగా గెరిల్లాలు ఉత్తరాదికి వెళ్లి దాడులు ఉధృతం చేసారు. ఆల్‌బకర్ ఓడరేవు వద్ద అమెరికా ఇంజనీర్లను తీసుకు వెళ్తున్న 3 మిలిటరీ బోట్లు ధ్వంసం అయ్యాయి. బాగ్దాద్‌లోని అమెరికా ఆయుధ నిల్వలపై జరిగిన ఆత్మాహుతి దాడులలో పెద్దఎత్తున మందుగుండు ధ్వంసం అయ్యింది. జులై 7న ముగ్గురు అమెరికా సైనికులు బాగ్దాద్‌లోనే మట్టికరిచారు. అదేరోజు బాగ్దాద్ పశ్చిమాన రమాడిలో నలుగురు సైనికులు గ్రనేడ్ దాడిలో గాయపడ్డారు. జూన్ 23న బస్రాలో ఆరు మంది బ్రిటీష్ సైనికులు ప్రజల చేతుల్లో మట్టికరిచారు.

ఇలా రాజధాని బాగ్దాద్‌తో సహా ప్రతీ చోటా ఎదురవుతున్న గెరిల్లా దాడులు అమెరికా బలగాలకు రక్షణలేని స్థితిని సృష్టించాయి. ఎప్పుడు ఏరోడ్డు పక్కన బాంబు పేలుతుందో, గ్రనేడ్ మీద పడుతుందో, ఏ ఇంట్లోంచి ఏ.కె.47 తూటాలు ఉరికి వస్తాయో తెలియని స్థితిలో అమెరికా బలగాలు అడుగు ముందుకేయాలి. క్యాంపులో వుంటే ఎప్పుడు ఏ రాకెట్ లేదా మోర్టారు బాంబులు వచ్చి మీద పడ్తాయో తెలియదు. ఆల్‌ఫరూక్ బ్రిగేడ్స్ షార్ప్ షూటర్లు చేసిన

దాడులు అమెరికా బలగాలకు నిద్ర లేకుండా చేసాయి.

ఇరాక్ సైనిక బలగాల జనరల్ కమాండ్, ఆల్‌ఫరూక్ జిహాద్ బ్రిగేడ్‌ల కమాండ్, ప్రజా ప్రతిఘటన విముక్తి దళాల కమాండ్ - ఈ ప్రతిఘటనా యుద్ధాన్ని సమన్వయం చేసుకుంటూ నడిపిస్తున్నాయి. రానున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముందే తయారు చేసుకున్న వివిధ రకాల ఇంప్రోవైజ్డ్ ప్రేలుడు పరికరాలను గెరిల్లాలు విస్తృతంగా వుపయోగిస్తున్నారు. ఇల్లిల్లూ గాలిస్తున్న సందర్భంగా ఒక ఇంటిలో నుండి 7 ఏళ్ల బాలుడు ఏ.కె.47తో ఎదురయ్యాడు అంటే ఇరాకీ ప్రజల ప్రతిఘటన ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ప్రతిఘటన కొనసాగుతుండగానే రంజాన్ మాసంలో గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేస్తున్నట్టు ప్రతిఘటనా బలగాలు ప్రకటించాయి. అక్టోబర్ చివరలో రంజాన్ మాసం ప్రారంభమైన రెండు రోజులకు అమెరికా బలగాల కేంద్రంగా వుపయోగపడుతున్న ఆల్‌రషీద్ హోటల్ పైకి చిన్న గాడిదల బండిలో తీసుకు వచ్చిన 10 రాకెట్లను గెరిల్లాలు ప్రయోగించడం సంచలనం కలిగింది. అత్యంత రక్షణ కలిగిన ఈ హోటల్‌లో అప్పుడు ఇరాక్ యుద్ధ వ్యూహ కర్తల్లో ఒకడైన ఉప రక్షణమంత్రి పాల్‌వుల్ఫోవిడ్జ్ కూడా వున్నాడు. ఈ దాడిలో ఒక అమెరికా కల్నల్‌తో సహా 15మంది చనిపోయారు. తర్వాతి రోజు ఒక్క రాత్రిలోనే 4 పోలీస్ స్టేషన్ల మీద, రెడ్‌క్రాస్ కేంద్ర కార్యాలయం మీద జరిగిన కారుబాంబు దాడులలో ముగ్గురు అమెరికా సైనికులు, 37మంది ఇరాకీ తొత్తు సైనికులు చనిపోయారు. దానితో ఇరాక్ నుండి ప్రపంచబ్యాంకు, ఐక్యరాజ్య సమితి, రెడ్‌క్రాస్‌లు తమ ఆఫీసులను ఎత్తివేసాయి. అక్టోబర్ 29న గెరిల్లాలు అమెరికా ప్రధాన యుద్ధట్యాంకును ధ్వంసం చేసారు. నవంబరు 2న బాగ్దాద్ విమానాశ్రయం వద్ద గెరిల్లాలు చినోక్ హెలికాప్టర్‌ను కూల్చగా 16మంది అమెరికా దురాక్రమణ సైనికులు కుక్క చావు చచ్చారు. అదే వారంలో తిక్రిత్ వద్ద బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను సైతం గెరిల్లాలు కూల్చారు వెంటనే ఫలూజాలో మరో చినోక్ హెలికాప్టర్ నేల కూలింది. ఇవి అమెరికా దురాక్రమణదారులకు మే 1 తర్వాత అతి పెద్ద నష్టం కలిగించాయి. ఇది జరిగిన తర్వాత అమెరికా బలగాలు నిస్పృహతో తిక్రిత్ ప్రజలపై హెలికాప్టర్లు, జెట్ విమానాలు వుపయోగించి బాంబులు కురిపించాయి. అందులో 500 పౌండ్ల బాంబులు కూడా వున్నాయి. కిర్‌కుక్‌లో అమెరికా నియమించిన ఇద్దరు జడ్జీలను గెరిల్లాలు కాల్చి చంపారు. నవంబరులోనే బాగ్దాద్ డిప్యూటీ మేయర్‌ను కాల్చిచంపారు. దక్షిణ ఇరాక్‌లోని నసారియా పట్టణంలోని ఇటలీ సైనిక స్థావరంపై నవంబరు 12న జరిగిన ట్రక్ బాంబు దాడిలో 14 మంది ఇటలీ పారామిలిటరీ పోలీసులు చచ్చారు. ఇది షియాలు అధికంగా వున్న ప్రాంతం కావడం విశేషం. ఇరాక్‌లో 2,300 ఇటలీ బలగాలు వున్నాయి. ఇందులో ఇద్దరు సైనికులు చచ్చారు. నవంబరు 29న ఇద్దరు జపాన్ దౌత్యవేత్తలను కాల్చి చంపారు. అమెరికాకు సహకరించడానికి అత్యంత వుత్సాహం చూపిన షియా రాజకీయ మత నాయకుడు మహమ్మద్ హకీంను కాల్చి చంపారు. దేశ ఆదాయం ప్రధానంగా ఆధారపడిన ఉత్తరాదిన వున్న చమురు పైపులైను ధ్వంసం చేసారు. నవంబరు 30న సరుకు రవాణా రైలును గెరిల్లాలు ధ్వంసం చేసారు. మరోచోట గెరిల్లాల దాడిలో 7మంది ఉక్రెయిన్ సైనికులు గాయపడ్డారు. మరో దాడిలో స్పెయిన్ కు చెందిన 7మంది ఇంటలీజెన్సీ అధికారులు ఆంబుష్‌కు గురై కుక్క చావు చచ్చారు. ఇవన్నీ ప్రధాన దాడులు మాత్రమే. వాస్తవ పరిస్థితి ఎలా వుందనేది ఆల్‌ఫరూక్ బ్రిగేడ్స్ జులై 7న జారీ చేసిన సమాచార పత్రంలోని ఈ వాక్యాలు చక్కగా ప్రతిబింబిస్తాయి.

''పోరాటకారులు అమెరికావాళ్లకు నిరంతరం ఆపదలు రుచి చూపిస్తారు. ప్రతి పట్టణంలో, ప్రతి జిల్లాలో, ప్రతి వీధిలో మహత్తర ఇరాక్‌లోని ప్రతి అంగుళం నేలలో భూమి అగ్నిపర్వతంలా ఉబికి వస్తుంది. రాళ్లు, చెట్లు కూడా ప్రతిఘటనను ప్రకటిస్తాయి. మాట మాత్రమే మూగబోయింది.

అమెరిక్లన్ల పుర్రెలను బద్దలు కొట్టే తూటాల ఈలలను పరిరక్షించండి. వాళ్ల శరీరాన్ని తునాతునకలు చేసే బాంబుల తుఫానును పరిరక్షించండి''.

## నీరుకారిన అమెరికా నైతిక స్థైర్యం

ఇరాక్ ప్రజా గెరిల్లా వీరుల ఈ ప్రతిఘటనతో అమెరికా బలగాల నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీసింది. మే 1న ప్రకటించుకున్నది తమ గెలుపు కాదని, తమకు తామే నిప్పుల గుండంలో చిక్కుకున్నామని తెలుసుకోవడానికి ఎన్నో రోజులు అవసరం లేకపోయింది. భయంకరమైన ప్రాణాంతకమైన దాడులు ఎదురవుతుండగా ప్రతికూలమైన 50 డిగ్రీల వేడి, ఎప్పుడు ఇంటికి చేరుతామో తెలియని పరిస్థితి, రోజూ తమ సహచరుల శవాలను మూటగట్టి స్వదేశాలకు పంపడం, కుటుంబ సభ్యుల ఆందోళన అమెరికా, సంకీర్ణ బలగాల ధైర్యాన్ని పూర్తిగా నీరు గార్చాయి. చివరికి వారి ధైర్యాన్ని నిలబెట్టడానికి స్వయంగా దొంగల ముఠా అధినాయకుడు బుష్ రహస్యంగా వచ్చి పలకరించి పోయాడు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రాజ్యానికి అధినాయకుడు తాను గెలిచానని, అక్కడి ప్రజలకు విముక్తి ప్రసాదించానని చెప్పుకుంటున్న జార్జ్ బుష్ ఆ దేశంలో అజ్ఞాతంగా, హఠాత్తుగా పర్యటించడం అమెరికా సైనికుల ధైర్యాన్ని నిలబెట్ట గలుగుతుందని ఎవరూ ఆశించలేరు. అందుకనే జార్జ్‌బుష్ ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి కాకుండా ఏ సైనికుడూ స్వదేశానికి వెళ్లడానికి వీలు లేదని, సర్వీసు పూర్తయినా ఇరాక్‌లో సంవత్సరం వుంటేనే సర్వీసు నుండి విడుదల చేయబడతారని ప్రకటించింది. ఇరాక్‌లో 3 సంవత్సరాలు పని చేయడానికి అగ్రిమెంటు రాసిస్తే, అలాంటి సైనికులకు 10వేల డాలర్ల బహుమతిని కూడా ఆశ చూపింది. అంటే ఇరాక్ నుండి బయట పడడానికి అమెరికా సైనికులు ఎంతగా ప్రయత్నిస్తున్నారో అర్థమవుతుంది.

ఇరాక్‌పై అమెరికా దురాక్రమణకు ఆ దేశ ప్రజల మద్దతు లేకపోవడమే కాక ఈ యుద్ధాన్ని నిలుపు చేయాలని గట్టిగా డిమాండు చేస్తున్నారు. అమెరికాలోని వాషింగ్టన్, లాస్‌ఏంజెల్స్‌తో సహా అనేక పట్టణాలలో అమెరికా దురాక్రమణ యుద్ధం నిలుపు చేయాలని ప్రజలు నవంబరు నెలలో ప్రదర్శనలు జరిపారు. అమెరికా బలగాలను వెంటనే వెనక్కు రప్పించాలని డిమాండు చేసారు. ఒక్క వాషింగ్టన్‌లోనే 140 నగరాల నుండి లక్ష పైగా ప్రజలు పాల్గొన్నారు. ఇరాక్‌లో మరణిస్తున్న సైనికుల కుటుంబాలు పోరాటంలో ముందుకు వచ్చి సంఘటితమయ్యారు. మిలిటరీ ఫ్యామిలీస్ స్పీక్ అవుట్ (సైనిక కుటుంబాల భావప్రకటన) పేరుతో తాత్కాలిక గ్రూపును ఏర్పరిచారు. ఇరాక్ నుండి తరలి వస్తున్న అమెరికా సైనికుల శవాల సంచులు ప్రజలలో తీవ్ర ఆందోళన కలిగిస్తుండడంతో ప్రభుత్వం వారి అంతిమ యాత్రలను కూడా నిషేధించింది. ఇదే సమయంలో ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా అమెరికా బలగాలపై దాడులు తీవ్రతరం కావడం అమెరికా ప్రజల నిరసనను మరింత పెంచుతున్నది.

## రాజకీయంగా వంటరి అయిన అమెరికా

ఇరాక్ ప్రజల మహత్తర ప్రతిఘటనతో మిలిటరీ రంగంలో గిజగిజలాడుతున్న అమెరికా రాజకీయంగా పూర్తిగా ఒంటరిదై పోయింది. మానవ విధ్వంసక ఆయుధాలు వున్నాయనే సాకుతో ఇరాక్‌పై దాడి చేసిన అమెరికా ఇప్పటివరకు అటువంటిది ఒక్కటి కూడా కనుగొనలేక పోవడం, తప్పుడు ఇంటలిజెన్సీ రిపోర్టులు సృష్టించి యుద్ధానికి పాల్పడ్డారని బయటపడి వివాదం చెలరేగడంతో బుష్, బ్లెయిర్‌ల పట్ల, అమెరికా, బ్రిటన్‌ల పన్నాగాల పట్ల ఆ దేశాల ప్రజలతో సహా ప్రపంచమంతా అసహ్యించుకుంటున్నది. బుష్, బ్లెయిర్ లిద్దరూ ఈరోజు ప్రజల దృష్టిలో యుద్ధ నేరస్తులుగానే చూడబడుతున్నారు.

ఇరాక్‌లో అమెరికా తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పర్చి అక్కడే తిష్ట వేయడాన్ని సద్దాంను వ్యతిరేకించే షియా ప్రజలు సైతం ఆమోదించటం లేదు. వెంటనే ఎన్నికలు జరపాలని షియా ప్రజలు తమ ప్రాంతాలలో జనవరి 2వ వారంలో పెద్దఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికా ఇరాక్ ప్రజల ప్రయోజనాలను పక్కకు పెట్టి తన ప్రయోజనాలకు అనుగుణంగా నడిపిస్తున్నదని షియా నాయకులు బహిరంగంగా ఆరోపించారు. ఇరాక్ ప్రతిఘటనతో తలక్రిందు లవుతున్న అమెరికా, ఇరాక్ పరిపాలనను ఐక్యరాజ్యసమితికి అప్పగించక పోయినా దాని ద్వారా ప్రపంచ దేశాల సైన్యాన్ని రప్పించి తన భారాన్ని తగ్గించుకోవాలని ఎత్తుగడ వేసింది. అందుకోసం అది ఐ.రా.స.లో ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ప్రపంచ దేశాల డిమాండుతో సవరించినా, అమెరికా ఆశించిన విధంగా సైన్యాలు రాలేదు. టర్కీ ఒప్పుకున్నా ఇరాకీ తొత్తు ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ వ్యతిరేకించడం, అంతర్గతంగా తీవ్ర ఒత్తిడి రావడంతో వెనక్కు తగ్గింది. యూరప్ దేశాలు, రష్యా తమ సైన్యాలను పంపడానికి నిరాకరించి అమెరికా పడుతున్న ఇబ్బందులను గమనిస్తున్నాయి. బ్రిటన్ ఇప్పుడున్న వాటికంటే ఎక్కువ సైన్యాలను పంపడానికి తన గూర్ఖా సైన్యాన్ని రిక్రూట్ పెంచుకోవడానికి

ప్రయత్నించి, నేపాల్ విప్లవకారులు అడ్డుకోవడంతో ఆగిపోయింది. మరోవైపు అరబ్ ప్రపంచంలో అమెరికా దురాక్రమణ, దాని సమర్ధన వున్న ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న దాడులపట్ల ఆగ్రహం బద్దలయ్యే స్థితికి చేరుతున్నది. ఇరాక్‌లోని తీవ్రమైన ప్రతిఘటనకు భయపడి భారత్, మరికొన్ని దేశాలు అమెరికా వత్తిడి వున్నా, సైన్యాలను పంపడానికి నిరాకరించాయి. ఇరాక్‌కు సైన్యాన్ని పంపాలని ప్రయత్నిస్తున్న ప్రతి దేశంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పంపిన దేశాలకు చెందిన సైనికులు నేలకొరిగిన మరుక్షణం ఆ దేశాలలో ప్రజలు పెద్దఎత్తున తమ సైన్యాలను వెనుకకు రప్పించాలని ఆందోళనకు దిగుతున్నారు. పోలండ్, ఇటలీలలో అటువంటి ఆందోళన చాలా తీవ్రంగా జరిగింది. ప్రజల తీవ్ర వ్యతిరేకత మధ్య కూడా రెండో ప్రపంచయుద్ధం తరువాత మొదటిసారిగా తన సైన్యాలను బయటి దేశాలకు పంపడానికి నిర్ణయం తీసుకుని జపాన్ ఇరాక్‌కు తన మొదటి టీంను పంపింది. అదే సమయంలో అమెరికా **25**వేల సైన్యాన్ని భారీ ఆయుధాలను ఉపసంహరించు కుంటున్నట్లు ప్రకటించింది.

ప్రపంచంలో మున్నెన్నడూ లేని విధంగా కేవలం రెండున్నర కోట్ల జనాభా కలిగిన ఇరాక్‌లోకి ప్రపంచంలోనే అతిగొప్ప సైనిక శక్తి అయిన అమెరికా బలగాలతో పాటుగా బ్రిటన్, జపాన్, ఇటలీ, స్వీడన్, ఉక్రెయిన్, పోలండ్, బల్గేరియా దేశాల సైనికులు మోహరించ బడ్డారు. 'కుంజెర యూదంబు దోమ కుత్తుక జొచ్చెన్ (ఏనుగుల గుంపు దోమ గొంతుకలో జొరబడ్డది)' అన్నట్లుగా ఇరాక్‌లో జొరబడ్డ ఈ సామ్రాజ్యవాద శక్తులన్నీ ఇరాక్ ప్రజల వీరోచిత ప్రతిఘటనా యుద్ధానికి గిజగిజ లాడుతున్నవి. కా.మావో చెప్పినట్లుగా అమెరికా సామ్రాజ్యవాదం ఒక కాగితం పులి అని ఇరాక్ ప్రజలు తమ శక్తితో నిరూపించారు. ఇరాక్ గెరిల్లాల నిరంతర దాడులకు తాను కోరుకున్న చమురు దక్కకపోగా అమెరికా నేడున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితిలో రోజుకు సుమారు **3** బిలియన్ డాలర్లు ఇరాక్‌లోని బలగాలపై ఖర్చు అవుతుండడం అమెరికాకు పెనుభారంగా మారింది. చివరికి కా.మావో చెప్పినట్లుగా ఇరాక్‌పై ఈ దురాక్రమణ యుద్ధం అమెరికాకు పెద్ద బరువును తలకెత్తుకుని కాళ్లపై పడేసుకున్న చందంగా తయారైంది. అటు ఆఫ్ఘనిస్తాన్‌లోనూ అమెరికా బలగాలపై దాడులు పెరుగుతుండడం, నేపాల్ విప్లవోద్యమం కూడా అందుకు సిద్ధమవుతుండడం చూస్తే ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువు అమెరికా సామ్రాజ్యవాదానికి త్వరలోనే సోవియట్ సామ్రాజ్యవాదులకు పట్టిన గతే పట్టనున్నదని స్పష్టమవుతున్నది. ఈ పరిస్థితిలో అకుంఠిత దీక్షతో అనంతమైన త్యాగాలతో ఇరాక్ ప్రజలు సాగిస్తున్న వీరోచిత ప్రతిఘటనా యుద్ధం కలిగిస్తున్న గొప్ప విప్లవోత్సాహం, ప్రపంచ ప్రజలందరినీ తమ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని, దోపిడీ వర్గాలపై సాగిస్తున్న ప్రజా యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసేలా ఉద్యుక్తులను చేస్తుందని చెప్పవచ్చు. అంతిమంగా సామ్రాజ్యవాదానికి గోరీ కట్టే రోజు కోసం కార్మికవర్గం ఎక్కడి కక్కడ సిద్ధం కావాలి.

పత్రికా ప్రకటన

## జూనియర్ డాక్టర్ల న్యాయమైన కోర్కెలకు మద్దతుగా, వారి సమ్మె విజయాన్ని కోరుతూ తేదీ 19-1-04న రాష్ట్ర వ్యాపిత బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి!

రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ల సమ్మె నేటికి ౩౦వ రోజుకు చేరింది. ఎలాగైనా సమ్మెను విచ్ఛిన్నం చేసి అణచివేయాలనే వైఖరినే చంద్రబాబు ప్రభుత్వం ప్రదర్శిస్తుంది. యావన్మంది ప్రజలు సమ్మెకు మద్దత్తుగా కదిలి ప్రభుత్వ పన్నాగాన్ని ఓడించి జూనియర్ డాక్టర్ల సమ్మె విజయానికి తోడ్పడాలని మా పార్టీ కోరుతుంది.

జూనియర్ డాక్టర్ల ప్రధాన కోర్కెలలో వారి స్వంత ప్రయోజనాలతోపాటు సామాన్య ప్రజల ప్రయోజనాలు కూడా ఇమిడి వున్నాయి. ఇది అభినందనీయమైన ఒక గొప్ప విషయమే తప్ప తప్పు కాదు. తమ భవిష్యత్తుని దెబ్బతీసేది తమ బతుకులను బండబార్చేది ప్రభుత్వ విధానాలే అయినపుడు ప్రజలు ఆ విధానాలనే నిలదీస్తూ పోరాడుతారు. ప్రజల్లో పౌరుల్లో భాగం అయిన జూనియర్ డాక్టర్లు ప్రజాకంటకమైన ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం తప్పకాదు. అవసరం.

తాను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలెన్నుకున్న ముఖ్యమంత్రినని పదే పదే చెప్పకునే చంద్రబాబు ప్రభుత్వ విధానాలను జూనియర్ డాక్టర్లు ప్రశ్నించడాన్ని సహించం అని అసహనాన్ని ప్రదర్శిస్తున్నాడు. అంటే తనని తన పార్టీని గెలిపించి అధికారం అప్పజెప్పడం మాత్రమే ప్రజలు చేయాల్సిన పని. ఆ తరువాత తన ప్రభుత్వం ఏం చేయాలనేది ప్రపంచబ్యాంకు చెబుతుంది తప్ప ప్రజలు కాదు. ఇదీ చంద్రబాబు ప్రభుత్వ వ్యవహార సరళి.

రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం రుద్దుతున్న ప్రపంచబ్యాంకు విధానాల కారణంగా అన్ని రంగాల ప్రజలు అనేక కష్టనష్టాలకు గురవుతూ అనివార్యంగా పోరాటాల వేపు నడుస్తున్నారు. ప్రజల నిరసన పోరాటాలను అణచివేయడమే తగిన పరిష్కారం అనే పాఠాన్ని ప్రపంచబ్యాంకు బోధిస్తోంది. బాబు ప్రభుత్వం ఆ పాఠాన్ని అక్షరాలా అనుసరిస్తోంది. జూనియర్ డాక్టర్ల సమ్మె విషయంలో ప్రభుత్వం పాటిస్తున్నది ఈ పాఠాన్నే.

మొండి వైఖరి, పంతం, పట్టుదల లాంటి సాదాసీదా మాటలు ప్రభుత్వ వైఖరి ప్రమాదకర స్వభావాన్ని దాని తీవ్రతని మరుగుపరుస్తాయి. ఇది ఖచ్చితమైన ఫాసిస్టు పోకడ. ఈ దుష్ట పోకడ అన్ని రంగాల ప్రజల్ని ప్రజల న్యాయ పోరాటాలన్నిటినీ కబళించే ప్రమాదం వుంది. కనుక ఇది కేవలం జూనియర్ డాక్టర్ల సమస్యగానే భావించలేం.

చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ఫాసిస్టు పోకడకి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజాస్వామ్య వాదులంతా, అన్ని ప్రజా సంఘాలు, అన్ని ప్రతిపక్ష పార్టీలు యావన్మంది ప్రజలు సమైక్యంగా పోరాడి ప్రభుత్వ వైఖరిని ఓడించాలని, జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమ్మె పోరాట విజయానికి నడుం బిగించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తుంది.

ఇందులో భాగంగానే రానున్న ౧౯-౧-౦౪ తేదీన రాష్ట్ర వ్యాపిత బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కూడా మా పార్టీ ప్రజలను కోరుతుంది.

## హిందూ ఫాసిజానికి సవాల్ విసిరిన చిక్కమగళూర్ ప్రకటన

# సామ్రాజ్యవాద ప్రపంచీకరణ-పాలకవర్గాలు - ఫాసిజం

గడచిన సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగిన పార్టీ రాష్ట్ర ప్లీనం ఆమోదించిన రాజకీయ తీర్మానంలో దేశంలో పెరిగి పోతున్న హిందూ ఫాసిజం ప్రమాదం పట్ల పార్టీ శ్రేణులను ప్రజలను అప్రమత్తం చేసింది. ఆ తీర్మానం గుర్తింపజేసిన ఒక ముఖ్య విషయం ఏమంటే ప్రపంచ సామ్రాజ్యవాద శక్తుల ప్రయోజనాలు, వారి తక్షణ అవసరాల రీత్యాను; వారికి ఊడిగం చేసే దేశీయ దోపిడీ పాలక వర్గ ప్రయోజనాలు, తక్షణ అవసరాల రీత్యాను ఇక్కడ హిందూ ఫాసిజం అనేది పెచ్రేగుతోంది. అంటే ఇక్కడ కేవలం తన ఎన్నికల ప్రయోజనాలు ఓట్లవేట కోసమే బిజెపి దాని సంఘపరివార్ అంగాలు హిందూ ఫాసిజాన్ని ఆశ్రయించడం లేదు. అంతకంటే విస్తృతమైన నిలకడైన తీరులో ఇతర పాలకవర్గ పార్టీలన్నింటి కంటే ఎక్కువగా దేశంలోని దోపిడీ పాలకవర్గాల సాన్నిహిత్యాన్ని వారి విశ్వసనీయతని సంపాదించే లక్ష్యంతోనే బిజెపి హిందూ ఫాసిజాన్ని దేశ ప్రజలపై రుద్ద ప్రయత్నిస్తోంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యం, దాని విధానాలైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను వాటిని వెన్నంటి వుండే ఆర్థిక సంస్కరణలను భుజాన్నెత్తుకున్న ఏ పాలకవర్గ పార్టీ అయినా, ప్రభుత్వం అయినా ఏదో తరహా ఫాసిజాన్ని ఆశ్రయించక అమలు చేయక తప్పని పరిస్థితులు ఈనాడు నెలకొని వున్నాయి. ఇందుకు కారణం ఏమంటే - ప్రపంచ సామ్రాజ్యవాదానికి అధినాయకత్వ స్థానంలో వుంటున్న, ఏకధ్రువ ప్రపంచాధినేత స్థానంలో వుంటున్న అమెరికన్ సామ్రాజ్యవాదం పచ్చి ఫాసిస్టు శక్తిగా ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతోంది. అంతేకాదు, తమ దేశ ప్రజలపై సైతం అమెరికన్ ప్రభుత్వం ఫాసిస్టు తరహాలోనే వ్యవహరిస్తోంది. అమెరికా చెప్పిన దానికల్లా ఔనంటూ తలూపని వారెవరైనా తన శత్రువులుగానే అమెరికా భావిస్తుంది. అలాంటి వారి పని పట్టడం అమెరికా హక్కు మాత్రమే కాదు, దాని అంతర్జాతీయ పవిత్ర బాధ్యత కూడా! ఇవే మాటలు కాకపోయినా ఖచ్చితంగా ఇదే అర్థాన్ని ఇచ్చే బెదిరింపు దురహంకార, దుర్మార్గ ప్రకటనలు అమెరికా అధ్యక్షుడు బుష్ అనేక సందర్భాలలో ఇచ్చాడు. ప్రకటనలివ్వడమే కాదు, అక్షరాలా అదే సూత్రాన్ని బుష్ పాలనా యంత్రాంగం పాటిస్తూ వస్తోంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై రుద్దిన అన్యాయ యుద్ధాలు, ఇంకా అనేక దేశాలపై సైనిక దాడి జరప గలమనే బుష్ బెదిరింపులు ఇందుకు నిదర్శనాలు. అమెరికా ప్రవచించే ఆర్థిక రాజకీయ విధానాలను అక్కున చేర్చుకునే వారంతా సహజంగానే బుష్ సూక్తులను భుజాన్నెత్తుకుంటారు. టెర్రరిజం బూచిని చూపెట్టి తన వ్యతిరేకులందరి నోరు నొక్కేయడంలో తనపై తిరగబడ్డ వారందరినీ అణచి పారేయడంలో బుష్ ముఠా దేశ దేశాల దోపిడీ పాలక వర్గాలకి ప్రభుత్వాలకి ఆదర్శప్రాయం మార్గదర్శి అయిపోయింది. అంతేకాదు, టెర్రరిజం బూచితో పాలిత ప్రజల్లో విపరీత అభద్రతా భావాన్ని సృష్టించి వారి పౌర ప్రజాస్వామ్య హక్కులన్నింటినీ హరించేస్తూ కూడా వారి రక్షకుడుగా ప్రజల మౌన ఆమోదాన్ని పొందిన బుష్ ఈ విషయంలో కూడా తన అనుయాయులందరికీ గురుతుల్యుడై పోయాడు. ఒక్కమాటలో చెప్పాలంటే తన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను ప్రపంచ దేశాలన్నింటిపై రుద్దాలంటే ఫాసిస్టు తరహాలో ఆయా దేశాలను లొంగదీసుకోవడమే తగిన మార్గం అనేది బుష్ తత్వం, బుష్ తర్కం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను భుజాన్నెత్తుకున్న మన దేశ దోపిడీ పాలకవర్గాలు వారి ప్రభుత్వాలు సైతం ఖచ్చితంగా దేశంలో అనుసరిస్తున్న అమలు చేస్తున్న సూత్రం ఇదే. దేశ ప్రజలపై సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను రుద్దడానికి వీలుగా అందుకు అడ్డొచ్చే ప్రజా ప్రతిఘటనను అణచివేయాలంటే ఏదో తరహా ఫాసిజాన్ని ఆశ్రయించడం తప్ప ఇతరత్రా మార్గాలు లేవని మన దేశ పాలక వర్గాలు పాలకవర్గ పార్టీలు ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈసూత్రాన్ని ఇతరులెవ్వరి కంటే కూడా సూటిగాను, చురుగ్గాను ఆచరిస్తున్న కేంద్రాధికారంలోని బిజెపి అగ్రనేతలు, వాజ్‌పాయ్, అద్వానీలు గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత లాంటి వారంతా కరడుగట్టిన ఫాసిస్టులుగానే తప్ప కనీస ప్రజాస్వామ్య విలువలకి కూడా ప్రతినిధులుగా వుండలేక పోతుండటం అనేది సరిగ్గా ఈ కారణంగానే.

ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్‌లపై సైనిక దండయాత్ర లెందుకు ? అంటే అక్కడి ప్రజలను నియంతృత్వాల చెర నుంచి విడిపించి వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను రుచి చూపించడానికి అంటాడు బుష్! బాబ్రీ విధ్వంసం ఎందుకూ? అంటే హిందూ జాతీయవాదాన్ని జాగృతం చేసి దేశ సమగ్రతని, సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికే అంటాడు అద్వానీ. గుజరాత్ మారణకాండ ఎందుకూ? అంటే ఈ దేశంలో మెలగాల్సిన తీరుని ముస్లింలకి ఎరుక చేయడానికే అంటాడు నరేంద్రమోడీ. న్యాయమైన తమ కోర్కెల సాధనకి ప్రజాస్వామ్య యుతంగా చట్టబద్ధంగానే సమ్మెకు తలపడినంత మాత్రాన వందలాది ప్రభుత్వోద్యోగుల వుద్యోగాలు ఊడపెరికి పంపడం న్యాయమేనా? అంటే వారి సమ్మె పాలనకి పెద్ద ఆటంకంగా, ప్రజలకి పెద్ద వేధింపుగా వుంటుంది కనుక రాష్ట్రంలోని ప్రభుత్వ వుద్యోగులు ఇకపై ఏనాడు సమ్మెకు దిగకుండా వారిని కట్టడి చేయడానికి ఇలాంటి కఠిన చర్యలు అవసరమే అటుంది జయలలిత. ఇక చంద్రబాబు సంగతి చెప్పనే అవసరం లేదు. అక్షరాలా పపంచబ్యాంకు బుర్రలోంచే ఆలోచిస్తూ బుష్ నోట్లోంచే వదరుతూ వుంటాడు. తనని తన విధానాలను ఏ కాస్తంత విమర్శించే వారిని కూడా అభివృద్ధి నిరోధకులని ఆడి పోసుకుంటూ తన గొప్ప ప్రజాహిత పాలన చూసి ఓర్వలేని వారుగానే చిత్రిస్తూ వారంతా టెర్రరిస్టులు నక్సలైట్లతో చేతులు కలిపేస్తున్నారని ప్రచారం లంకించుకుంటాడు.

వీరంతా వివిధ రకాల ఫాసిస్టు పాలకులుగా నిలద్రొక్కుకో గలుగుతున్న తీరుని మనం లోతుగా పరిశీలించి విశ్లేషించుకోవాల్సి వుంటుంది. ఫాసిస్టు పాలకులుగా బహిర్గత మవుతున్న వీరిని ఇలాంటి మరికొందరిని చూస్తే మన రాజకీయ వ్యవస్థ తన బూటకపు ప్రజాస్వామ్య ముసుగుని మరింత మరింతగా తొలగించేసుకుంటూ క్రమక్రమంగా ఫాసిజీకరించ బడుతున్న తీరుని మనం గమనించగలం. అంతేకాదు, ఈ దుష్పరిణామంతో సమన్వయం అవుతూ దేశంలోని కార్యనిర్వాహక వ్యవస్థ న్యాయవ్యవస్థలు సైతం ఫాసిజీకరించ బడుతున్న క్రమాన్ని గుర్తించగలం. ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ లాంటి వున్నతాధికార వర్గాలు రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే మెలుగుతూ ప్రభుత్వ సేవకులుగానే తప్ప ప్రజాసేవాదృష్టికి చాలా దూరంలోనే వుంటుంటారు. ఈ ధోరణి ఇటీవల మరీ పెరిగి పోవడాన్ని గమనించవచ్చు. కాగా ఇటీవలి మరో పరిణామం ఏమంటే క్రింది స్థాయి వుద్యోగ సంఘాల నాయకత్వాలు కేవలం పైరవీగాళ్లుగాను, ఎన్నికల సమయాన్ని కనిపెట్టి బూటకపు ఆందోళనలకు పిలుపులనిస్తూ, కన్నీటితుడుపుగా అరకొర రాయితీలను రాబట్టించుకుని ఆందోళనలను విరమింప చేస్తూ వుద్యోగుల హక్కులు కోర్కెలకి నీళ్లొదిలేస్తున్నారు. ఆ సంఘం ఈ సంఘం అనే తేడా లేకుండా అన్ని కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వ వుద్యోగ సంఘాల తీరుతెన్నులు సుమారుగా ఇలానే వుంటున్నాయి. నయానో భయానో ప్రభుత్వోద్యోగులను తమ చెప్పుచేతుల్లో వుంచుకుని పని చేయించుకోవడం పట్ల ప్రభుత్వాలు అప్రమత్తంగా వుంటున్నాయి. కొత్తగా ఒక్కగానొక్క వుద్యోగం సైతం ఇవ్వకుండా వున్న వుద్యోగులలో చాలామందిని రకరకాల కారణాలు, వాదనలతో ఇళ్లకి పంపించేస్తూ వడపోతలో మిగిలిన వారంతా ఏ చిన్న అలజడి ఆందోళనలు చేయకుండా తమకు అణుకువగా మెలిగేటట్లు

ప్రభుత్వాలు రకరకాల ఎత్తుగడలను ప్రయోగిస్తున్నాయి. వివిధ రంగాలకి చెందిన ప్రజల న్యాయమైన హక్కులు, కోర్కెలు, ఆందోళనలను క్రూర దమనకాండ ప్రయోగంతో అణచివేస్తూనే ఇంకోపక్క ప్రభుత్వోద్యోగులను బుజ్జగించుకుంటూ లేక వివిధ రూపాలు పద్ధతుల్లో బెదిరిస్తూ తమ చేతుల్లో వుంచుకుంటున్నాయి. ఇందులో చంద్రబాబు ఆరితేరిపోయాడనే చెప్పాలి. ఇందుకు భిన్నమైన మరో తరహాకి చెంది జయలలిత ప్రయోగం కూడా మనకు తెలుసు. ఒకప్పుడు అనేక సమరశీల సమ్మె పోరాటాలు ఇతర అనేక రూపాల ఆందోళనలు నిర్వహిస్తూ అనేక సందర్భాలలో ప్రభుత్వాల మెడలు వంచి తమ న్యాయమైన హక్కులు కోర్కెలను సాధించుకున్న చరిత్ర వున్న ప్రభుత్వోద్యోగులు ఈనాడు అలాంటి పోరాటాల అవసరం మరింత ఎక్కువగా వున్నా కూడా తమకు పట్టనట్టుగా వుండి పోతుండడాన్ని మనం ఈ నేపథ్యం నుంచే అర్థం చేసుకోవాలి. ఈ పరిస్థితులు వాతావరణంలోనే వున్నతాధికార వర్గాలు మరీ నిరంకుశంగా ప్రజా వ్యతిరేకంగా పాలక ప్రభుత్వాల ఫాసిస్టు పాలనను సుగమం చేస్తున్నాయి, దాన్ని వేగవంతం చేస్తున్నాయి. క్రమక్రమంగా కార్యనిర్వాహక వ్యవస్థ ఫాసిసైజ్ అవుతున్న తీరు ఇదే. సామ్రాజ్యవాద ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో గతంలో ఎప్పటికంటే కూడా విచ్చలవిడిగా పెచ్చరిల్లిపోతున్న అవినీతి అక్రమాలు అనేవి ఈ ఫాసిజీకరణలో భాగంగానే చూడాలి. సామ్రాజ్యవాద సంస్కరణలు – ఆర్థిక రాజకీయ అవినీతి, కుంభకోణాలు వీటి మధ్య సంబంధం వస్తువు – ఛాయ సంబంధమేనని మనం ఇది వరకే చెప్పుకున్నాం.

ఇక దేశంలోని న్యాయ వ్యవస్థ తాజా తీరుతెన్నుల గూర్చి కొంత ప్రత్యేకంగానే చర్చించాలి. ఆ లోతుల్లోకి ప్రస్తుతానికి పోలేముగాని శాసన కార్యనిర్వాహక వ్యవస్థలలో బలపడుతున్న ఫాసిస్టు పోకడలన్నింటికీ నిర్వివాదంగా, నిశ్చయాత్మకంగా బరితెగింపుగా వత్తాసు పలకడమే తమ విధిగా ఎంచుకుని వ్యవహరిస్తున్నాయి. దేశంలోని హైకోర్టులు అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు భోపాల్ విషవాయువు విలయం విషయంలో, ఎన్‌రాన్ విద్యుత్ ప్రాజెక్టు విషయంలో, నర్మద ప్రాజెక్టు, ఢిల్లీ నగరంలో కాలుష్యం నియంత్రణ పేరుతో లక్షలాది కార్మికులకి ఉపాధిగా వుంటున్న వేలాది చిన్న పరిశ్రమలను మూయించేసే విషయంలో విద్యని, వ్యాపార సరుకుగా మారుస్తూ ప్రైవేటీకరించే విషయంలో, పురుషాధిపత్య పితృస్వామ్య భావజాలాకు బాసటగా దారుణమైన లింగ వివక్షని పరోక్షంగా సమర్థించే విషయంలో – ఇలా అనేక సందర్భాలలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు, దేశంలోని దోపిడీ పాలకవర్గాల విధానాలకి నైతికత సాధికారతలను కల్పిస్తూ, కోర్టులు పరమ అనైతికంగానే సోకాల్డు రాజ్యాంగ స్ఫూర్తికి సైతం భిన్నమైన తీర్పులను వెలువరించాయి. కాగా ఇటీవలి కాలంలో మరీ బరితెగింపుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకి కొమ్ముకాస్తూ తీర్పులు ప్రకటిస్తున్నాయి మన కోర్టులు. చిల్లర మల్లర మోసాలు, దౌర్జన్యాలు, నేరాలపై పోసికోలుగా వ్యాఖ్యానాలు చేసే మన కోర్టులు అద్వానీలు, చంద్రబాబులు, నరేంద్రమోడీలు, జయలలితలు అనుసరించే అమలు చేసే ఫాసిస్టు జనహనన విధానాలు కార్యక్రమాలలో తమ జోక్యానికి వ్యాఖ్యానానికి వచ్చిన వాటన్నింటికీ ఎలాంటి తటపటాయింపు లేకుండా తమ ఆమోద ముద్ర వేస్తూనే వున్నాయి. ఆ నేరపూరిత చర్యలు, విధానాలకు మద్దతుగా సుదీర్ఘ భాష్యాలు చెబుతూనే వున్నాయి. అంతేకాదు, ఈ నరహంతక ఫాసిస్టు పాలకులపై వారి దుష్ట పాలనపై ఆరోపణలతో న్యాయం కోసం తమని ఆశ్రయించిన ఫిర్యాదులను కటువు పదజాలంతో కసిరికొడుతూ హేళన చేస్తూ హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నాయి, ఘనత వహించిన కోర్టులు.

ప్రజాస్వామిక విలువల వలువలు వలిచేస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కేస్తున్న శాసన కార్యనిర్వాహక వ్యవస్థల తీరుతో రోసిపోయి ఇక ఈ దుస్థితికి విరుగుడుగా పని చేయగలిగేది న్యాయ వ్యవస్థేనంటూ అమాయకంగా నమ్ముతూ వచ్చిన వారందరి భ్రమలను పటాపంచలు చేసేస్తూ మన న్యాయ వ్యవస్థ తన వికృత ఫాసిజీకరణని నగ్నంగానే ప్రదర్శించుకుంటోంది.

అంటే, ప్రజాస్వామ్య కట్టడానికి మూడు మూల స్తంభాలుగా పని చేయాల్సిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు దాసోహం అంటున్నాయి. కనుకనే అవి ఫాసిజాన్ని కౌగలించుకుంటున్నాయి. ఇక నాల్గవ స్తంభంగా చెప్పుకునే పత్రికలు ఇతర ప్రసార వ్యవస్థల గూర్చి చాలానే చెప్పుకోవాలి గాని అందుకు ఇది సందర్భం కాదు. కాని ఒక్క విషయం చెప్పుకోగలం. మూల వ్యవస్థలు మూడూ ఫాసిజంలో ముడుచుకుపోయిన పరిస్థితుల్లో ఈ నాల్గవ స్తంభం నిటారుగా నిలకడగా నిలబడగలగడ మనేది సాధ్యం కాదు.

ఫాసిజం అంటే ఏమిటి? నియంతృత్వానికి దీనికి వుండే తేడా ఏమిటి? అనే చర్చలోకి కూడా ప్రస్తుతానికి పోలేము. కాని, ఫాసిజానికి సంబంధించిన ఒక విలక్షణాంశాన్ని గూర్చి చెప్పుకోవాలి. క్రూరాతిక్రూరమైన తన నిరంతర దాడికి గురయ్యే, బలయ్యే బాధిత జనసామాన్యం నుంచే ఒక నిర్ణీత భాగం ప్రజలు నిత్యం తన వెన్నంటి వుండేలా ఫాసిస్టు పాలన పకడ్బందీ ఏర్పాటు చేసుకుంటుంది. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రతి ఫాసిస్టు పాలనకి ఖచ్చితమైన కొంత సామాజిక దన్ను అంటూ వుంటుంది. ఇలాంటి సామాజిక దన్నుని సమకూర్చి పెట్టే ఆ నిర్ణీత భాగపు జన సామాన్యం ఎవరై వుంటారు? వారెలా ఒక ఫాసిస్టు పాలన చుట్టూతా సమీకరించబడతారు? అనేవి ఆయా దేశ, ప్రాంత, కాల, పరిస్థితులపై ఆధారపడి వుంటూ భిన్నభిన్నంగా వుంటుంటాయి. కుల, మత, ప్రాంతీయ తత్వాలు, జాతీయ దురహంకార, జాత్యాహంకారం వర్ణవివక్ష, వ్యక్తిపూజ ఇలాంటివన్నీ ఫాసిజానికి దన్నుగా కొంత నిర్ణీత భాగం ప్రజల సమీకరణలో పని చేస్తుంటాయి.

అద్వానీలు, చంద్రబాబులు, నరేంద్రమోడీలు, జయలలితలు – వీరంతా కరడుగట్టిన భిన్న తరహాల ఫాసిస్టులుగా మారడానికి ఎవరికి వారికి తమది అయిన ఒక ప్రత్యేక తరహా మానసిక స్థితి, వ్యక్తిత్వం, వుద్దేశాలు, ఆవేశాలు, ప్రవర్తనా సరళి, పని సరళి, భవిష్యత్ అవలోకన అనేవి వుంటుంటాయి. వారి వారి ఫాసిస్టు తరహా పాలనల్లో వీటి పాత్ర తక్కువేమీ కాదు. కొన్ని సందర్భాలలో ఇవే ప్రధాన పాత్రని సైతం పోషించవచ్చు. కాని అలాంటి సందర్భాలు అరుదైన మినహాయింపులే. సాధారణంగాను, ప్రధానంగాను వీరి పాలనారీతులు , విధానాలు, కార్యక్రమాలను నిర్దేశించేవి నియంత్రించేవి దోపిడీ పాలకవర్గాల అవసరాలు, ప్రయోజనాలు మాత్రమే. దీన్ని సోదాహరణంగా తరువాత చర్చిద్దాం.

ముందుగా ఈ సందర్భంగా మనం తప్పక పరిగణనలోకి తీసుకోవాల్సిన మరో ముఖ్య విషయాన్ని గూర్చి తెలుసుకోవాలి. అదేమంటే – పాలకవర్గాల అవసరాలు, ప్రాధాన్యతలు మారిపోయినపుడు తదనుగుణంగా ఈ ఫాసిస్టు పాలక నేతల విధానాలు కార్యక్రమాలు కూడా మారుతాయి. ఇలా మారిపోడానికి వారి వారి ప్రత్యేక లక్షణాలేవీ అడ్డంగా నిలవవు. అలా నిలిచే శక్తి వాటికుండదనే చెప్పాలి. ఉదాహరణకి టెర్రరిజానికి రూపాంతరంగా నామాంతరంగా ఇస్లామిక్ మిలిటెన్సీని ఇస్లామిక్ తిరుగుబాటుని చిత్రిస్తూ బుష్ ఇచ్చిన టెర్రరిజం వ్యతిరేక పిలుపు ఇక్కడ భారత పాలకవర్గాలకి ప్రత్యేకంగా కేంద్రాధికారంలో వున్న హిందూ ఫాసిస్టు బిజెపికి ఎంతగానో లాభించింది. టెర్రరిజం వ్యతిరేకత పేరుతో ముస్లిం వ్యతిరేకతలను, పాక్ వ్యతిరేకతలను రెచ్చగొట్టి హిందుత్వ శక్తులను దురుసుగా కూడగట్టి అది తన అధికారాన్ని పదిల పరుచుకుంది. కాని, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై తన పూర్తి స్థాయి ఆధిపత్యాన్ని సాధించుకున్న అమెరికా ఇంతవరకూ ఊదరగొడుతూ వచ్చిన తన ఇస్లామిక్ వ్యతిరేక వైఖరిని రేపు వేరు కారణాల వల్ల సడలించుకోవడం అంటూ జరిగితే అందుకు తగ్గట్టుగా భారత పాలకవర్గాలు బిజెపి నాయకత్వంలోని హిందుత్వ శక్తులు తమ ముస్లిం వ్యతిరేకత పాక్ వ్యతిరేకతలను కూడా సడలించుకోక తప్పదు. నిజానికి ఇలాంటి పోకడలు

ఇప్పటికే కొంత పొడసూపుతున్నాయి. నిన్నటిదాకా సరిహద్దు టెర్రరిజాన్ని ఎగదోస్తున్న దుష్టపాలకుడుగా నియంతగా ఈసడిస్తూ అతడి ముఖం చూసేది లేదు, అతడితో మాట్లాడేది లేదు అంటూ ప్రతిరోజూ భీకర ప్రతిజ్ఞలు ప్రకటనలు గుప్పిస్తూ వచ్చిన వాజ్‌పాయ్, అద్వానీలు నేడు అమాంతంగా పాక్ అధ్యక్షుడు ముషారఫ్‌ని కౌగలించేసుకుంటున్నారు. ఇస్లామాబాద్‌లో ఇటీవలనే ముగిసిన సార్క్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా వాజ్‌పాయ్-ముషారఫ్‌లు పరస్పరం పొగడ్తలతో ముంచెత్తుసుకున్నారు. అంతేకాదు, అద్వానీ రథయాత్ర, అటుపై సాగిన బాబ్రీ మసీద్ విధ్వంసం, ఆ తరువాత జరిగిన గుజరాత్ మారణకాండ – ఈ అన్ని సందర్భాలలో రాజకీయంగా ఎంతగానో లబ్ధి పొంది అధికార ఫలాలను జుర్రుకున్న అనుభవాలున్న బిజెపి; దేశాన్నంతటినీ గుజరాత్‌గా మార్చేయాలని ఉబలాటపడటమే గాక దాన్ని బాహాటంగానే చాటుకున్న బిజెపి ఆ అనుభవాలు ఆలోచనలను ఇప్పుడు అలవోకగా పక్కన పెట్టేస్తూ 'అభివృద్ధి', 'సమర్థపాలన', 'సుపరిపాలన' నినాదాలతో ముందస్తు లోక్‌సభ ఎన్నికలకు ముస్తాబవుతోంది.

ఇకిప్పుడు సామ్రాజ్యవాద అవసరాలు, పాలకవర్గాల అవసరాలకు అనుగుణంగానే వివిధ రకాల ఫాసిజం తలెత్తుతుంది. అనేదాన్ని గుజరాత్ మారణకాండని ఒక మచ్చుగా తీసుకుని విశ్లేషించి దీన్ని సమర్థవంతంగా నిర్ధారిద్దాం.

## గుజరాత్ మారణకాండ : పాత్రధారి మోడీ – సూత్రధారి అంబానీ!

గుజరాత్ మత మారణకాండ హాహాకారాలు చెలరేగుతున్న సమయంలో కేవలం ఒకరిద్దరు మినహా బడా పారిశ్రామిక వాణిజ్య వేత్తలంతా సుమారుగా ఆ మారణకాండకు తమ మౌన ఆమోదాన్ని అందించారు. ఎన్నికల్లో మోడీ గెలిచిన తరువాత అంబానీ లాంటి బడా దళారీ బూర్జువాలు మొదలుకుని, మనువాది వ్యతిరేక ముఖ్యమంత్రిగా చెప్పుకునే మాయావతితో సహా అనేకమంది బడా పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి సినీ నటులు, స్వయానా దేశ ప్రధాని వాజ్‌పాయ్ సైతం మోడీ విజయోత్సవ సభకు గాంధీనగర్‌కి వరుసకట్టి హాజరయ్యారు. నరహంతక మోడీకి ముఖ్యమంత్రి కిరీటధారణ చేసి మురిసిపోయారు. తరువాత, దేశంలో ప్రముఖ పారిశ్రామిక వాణిజ్య సంఘాల సమాఖ్య అయిన 'ఫిక్కీ' అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ప్రవాస భారతీయ మేళాలో మోడీ ప్రధాన ఆకర్షణగా వెలిగిపోయాడు. ఆ తరువాత జనవరి మధ్యలో 'భారత పారిశ్రామిక సమాఖ్య' (సి.ఐ.ఐ.) ఆధ్వర్యంలో దేశ వాణిజ్య కేంద్రం అయిన ముంబాయిలో మరో పెద్ద సమావేశం జరిగింది. 'అవధుల్లేని గుజరాత్' పేరుతో సాగిన ఈ సమావేశంలో గోద్రెజ్ కంపెనీ అధినేత జయ్‌హయద్ గోద్రెజ్; లార్సన్ అండ్ టోబ్రోకి చెందిన ఏ.ఎం.నాయక్; 'ఎస్సార్'కి చెందిన ప్రశాంత్ రూయా; ఐ.డి.బి..కి చెంది పి.పి.వోరా; మోర్గాన్ స్టేన్లేకి చెందిన నిమేష్ కంపానీ; థామస్ కుక్‌కి చెందిన ప్రదీప్ మాథవ్‌జీ లాంటి దేశంలో ప్రముఖులైన వేయిమంది పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. వారంత నమ్మశక్యంకాని రీతిలో నేర్పు మోడీపై అభినందనల పొగడ్తల జడివానలు కురిపించేసారు. అంటే, దేశంలోని పారిశ్రామిక వాణిజ్య వర్గాలలో ఒక బలమైన సెక్షన్ మోడీని భుజాన ఎత్తుకున్నదనే చెప్పాలి.

''ఈ సమావేశం ఇదేదో గుజరాత్‌కే సంబంధించినది అనిగానీ లేక ఒక ప్రాంతీయ సంబంధమైనదని గానీ భావించరాదు. ఇదొక జాతీయ స్థాయి ప్రాధాన్యత గల ఘటన'' అని సి.ఐ.ఐ. డైరెక్టర్ జనరల్ తరుణ్‌దాస్ ఉగ్గడించాడు. ఈ సందర్భంగా వివిధ జాతీయ ప్రాంతీయ పత్రికలలో ప్రమరించబడిన పూర్తి పేజీ ప్రకటనల నిండా మోడీ సూక్తులే. మోడీ ముందు చూపుని (విజన్) గోద్రెజ్ ఎంతగానో కొనియాడాడు. ఆ రకంగా మోడీ హంతక రాజకీయాలకి సాధికారతని సామాజిక గౌరవాన్ని కట్టబెట్టింది సి.ఐ.ఐ. తనకు జరిగిన ఈ ఘన సత్కారానికి బదులుగా మోడీ తన ప్రభుత్వ ఆర్థిక సంస్కరణలను మరింత వేగవంతం చేస్తుందని హామీ పడ్డాడు. అంతేకాదు, రాష్ట్రంలోని ప్రభుత్వరంగంలో వున్న ఎరువుల కంపెనీ లన్నింటినీ ప్రైవేటీకరించాలనే గుజరాత్ పారిశ్రామిక వేత్తల చిరకాల కోరికను ఆమోదిస్తున్నట్టు ప్రకటిస్తూ మోడీ ఈ సభలోనే వారికి భరోసా ఇచ్చాడు. ఇది జరిగిన తరువాత గుజరాత్‌కి చెందిన ఇద్దరు బడా పారిశ్రామిక వేత్తలు మోడీ మంత్రి వర్గంలో చేరడమనేది ఈ సమావేశపు పతాక సన్నివేశం. స్టీల్, పిగ్ ఐరెన్, రసాయనాల పరిశ్రమల అధినేత అయిన అంబానీ పారిశ్రామిక కుటుంబానికి చెందిన పేరులో సైతం దళారీతనాన్ని కలిగుండే సూరజ్ దలాల్ ఒకరు కాగా ఇంకొకరు నూరుకోట్ల టర్నోవర్‌తో కూడిన అపోలో గ్రూప్ ఇండస్ట్రీస్ అధినేత అనీల్ పటేల్.

## అంబానీ డబ్బు సంచుల్లో గుజరాత్ బంధీ

గుజరాత్ మారణకాండపై నిజనిర్ధారణ పరిశీలనలు జరిపిన వివిధ జాతీయ అంతర్జాతీయ స్వతంత్ర సంస్థలన్నీ ముక్తకంఠంతో ఆ మారణకాండకు గుజరాత్ ప్రభుత్వం పాలనా యంత్రాంగాలే బాధ్యత వహించాలని తగిన సాక్ష్యాధారాలు చూపుతూ మరీ నిర్ద్వంద్వంగా ప్రకటించాయి. కానీ ఈ మారణకాండపై అధికారిక పరిశీలన జరిపిన 'నానావతి కమిషన్' మాత్రం ''జరిగిన మారణకాండలో పోలీసుల ప్రక్కనుండి గానీ, పౌర పాలనా యంత్రాంగం నుండి గానీ తీవ్రమైన తప్పులు జరిగాయని అందుబాటులో వున్న సాక్ష్యాధారాలు ఏవీ చూపడం లేదు'' అని ఘరానాగా ప్రకటించేసి చేతులు దులిపేసుకుంది. గుజరాత్ రాష్ట్ర పరిణామాలను నియంత్రిస్తున్న అంబానీ డబ్బు సంచుల పాత్రని అర్థం చేసుకోకపోతే ఈ నానావతి కమిషన్‌తో సహా పాలక వ్యవస్థలన్నీ మోడీకి ఎందుకు కొమ్ము కాస్తున్నాయో మనకి అర్థం కాదు.

పన్ను విధింపు తరువాత కూడా **2002-03** సంవత్సరంలో గుజరాత్‌లోని అంబానీ పెట్టుబడుల నికర లాభం **4104**కోట్లు! అంటే, భారతదేశం మొత్తంలోని యావత్ ప్రైవేట్ రంగంలోని లాభాల మొత్తంలో ఇది **30**శాతం. ఇందులో **35** శాతం గుజరాత్ ప్రభుత్వం అప్పనంగా అంబానీలకి బహుకరించిన లాభాలే. **2002-03**లో మోడీ ప్రభుత్వం అంబానీ కంపెనీల కిచ్చిన అమ్మకపు పన్ను రాయితీలే **1190** కోట్లు. ఇది నమ్మశక్యం కానంతటి భారీ మొత్తం. ఇలా రాష్ట్ర ఖజానాని అంబానీలకి తోడి పెట్టినప్పుడు సహజంగానే అంబానీల జేబులో రాష్ట్ర పాలనా యంత్రాంగ మంతా బంధీ అవుతుంది. ఎందుకంటే, ఈ భారీ మొత్తంలో **2** శాతం ముడుపులకి కేటాయింపు. అంటే **24**కోట్లు. ఈ కోట్లతో అంబానీ ఎవరి నైనా కొనేయగలడు. కరువులు, భూకంపాల లాంటి ప్రకృతి విలయాల సందర్భంగా గుజరాత్ ప్రభుత్వం ఖర్చు చేసినది నామమాత్రమే. కానీ, గడచిన రెండు సంవత్సరాలలో అంబానీలకి మోడీ ప్రభుత్వం **2**వేల కోట్లు అప్పనంగా ధారపోసింది. ఆ రాష్ట్ర వార్షికాదాయం మొత్తం **20**వేల కోట్లు. అంటే తన వార్షికాదాయంలో గుజరాత్ ప్రభుత్వం అంబానీలకి **10**శాతం ధార పోస్తోందన్న మాట!

హిందూ ఫాసిస్టు శక్తులకి – నిరంకుశ దళారీ బూర్జువాలకీ మధ్య మిలాఖత్తులు ఎందుకో ఇప్పుడు స్పష్టంగానే అర్థమవుతుంది. అందుకనే బడా పారిశ్రామిక వాణిజ్య వర్గాల వారంత నరేంద్రమోడీని అంతలా నెత్తికెక్కించుకుంటున్నారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండీ నిజమైన శత్రువుల నుండీ దారి మళ్లించే లక్ష్యంతో సాగుతున్నదే ఈ హిందూ ఫాసిజం-దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల మిలాఖత్తు అనేది. మోడీ పాలనలో ప్రజల నెత్తిన రుద్దబడిన సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ పాలకవర్గాల విధానాలు మధ్యతరగతితో సహా అశేష జన సామాన్యాన్ని మూల మూలకి నెట్టేసాయి. రాష్ట్రంలో వ్యవసాయం అనేది గతంలో ఎన్నడూ ఎరుగనంతటి సంక్షోభ స్థితిలో పడిపోయింది. గుజరాత్‌ని వరుసగా నాలుగు

పెద్ద కరువులు పట్టి పల్లార్చాయి. రాష్ట్రంలో పరిశ్రమలు ఎన్ని వున్నా కూడా గుజరాత్ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిపోయింది. భారీ నర్మదా ప్రాజెక్టు ఆ రాష్ట్రంలోని మొత్తం ఆదివాసీ ప్రజల బ్రతుకులను నిలువునా ముంచేసింది. దాని కాంట్రాక్టర్లు మాత్రం కోట్లు కొల్లగొట్టుకున్నారు. దాని నీటితో లాభపడింది కూడా కేవలం భారీ వ్యవసాయ క్షేత్రాల యజమానులు, బడా భూస్వాములు కొంతమంది ధనిక రైతులు మాత్రమే. ముప్పిరిగొన్న ఈ సమస్యలతో ప్రజల తీవ్ర అసంతృప్తి భళ్లున బ్రద్దలు కానున్న తరుణంలో సంఘపరివార్ క్షుద్రశక్తులు ప్రజల అసంతృప్తి జ్వాలని మత వైషమ్యాల వేపుగా మళ్లించివేసాయి. అవి క్రిస్టియన్లకి వ్యతిరేకంగాను, మత మార్పిడులకి వ్యతిరేకంగాను ప్రతీఘాతక వుద్యమాలను లేవదీసాయి. ఆదివాసీల, దళితుల రైతాంగ పోరాట సంస్కృతిని సంస్కృతీకరించడం ప్రారంభించాయి; వారిలో సులువుగానే మత విద్వేష విష జ్వాలలను రగిల్చాయి. వారిని ముస్లింలపైకి ఉసిగొల్పాయి. ఇదంతా ప్రజల అసంతృప్తిని కోపాగ్నిని దారి మళ్లిచేసి ధనాధిపతుల ప్రయోజనాలు కాపాడ్డానికే. కనుకనే బడా బాబులంతా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు.

గతంలో ఎప్పటికంటే కూడా దురుసుగా హిందూ ఫాసిసజం విరుచుకు పడటం అది ఒక రాజకీయ శక్తిగా నిలద్రొక్కుకో గలుగుతుండటం, సంఘటిత పడుతుండటం అనే పరిణామం వెనుక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అవసరాలు, దేశీయ దోపిడీ పాలక వర్గాల ప్రయోజనాలు అవసరాలు ఎలా పని చేస్తున్నాయనే విషయాన్ని వివరంగానే పరిశీలించాం. ఇకిప్పుడు ఈ హిందూ పాసిజం అనే మహమ్మారితో తలపడటమెలా? దాని దూకుడుకు ముకుతాళ్లు వేయడమెలా? అనే చర్చలోకి వెళదాం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానలకి వ్యతిరేకంగాను, వాటిని తలకెత్తుకున్న దేశీయ దోపిడీ పాలకవర్గాలు ప్రభుత్వాలు అనుసరించే ప్రజాకంటక దోపిడీ అణచివేత విధానాలు కార్యక్రమాలకి వ్యతిరేకంగాను వివిధ రంగాల ప్రజలను వివిధ రకాల పోరాటాలలో సమీకరించాల్సి వుంటుంది. ఈ పోరాటాలు సహజంగానే హిందూ ఫాసిజాన్ని నేరుగా కాకపోయినా పరోక్షంగా బలహీనపరచగల స్వభావాన్ని కలిగి వుంటాయి. కాని ఇది మాత్రమే చాలదు. హిందూ ఫాసిజంతో నేరుగా తలపడాల్సిన అవసరం వుంది. అది ఈనాడు ఎప్పటికంటే కూడా ఎక్కువగా వుంది. కనుక బలమైన హిందూ ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనను మనం నిర్మించాల్సి వుటుంది. మన పార్టీ 9వ కాంగ్రెస్, అలానే గడచిన మన రాష్ట్ర పార్టీ ప్లీనం ఈ అవసరాన్ని నొక్కి చెప్పాయి కూడా. ఇలాంటి ఐక్యసంఘటనా నిర్మాణానికి ఈ రోజు అవకాశాలు సైతం గతంలో ఎప్పటికంటే పక్వమై వున్నాయి. ఇందుకు స్పష్టమైన నిదర్శనం 'చిక్కమగళూర్' ప్రకటన.

## బాబ్రీ విధ్వంసాన్ని వెక్కిరించిన బాబా బుడంగిరి

పెట్రేగిపోతున్న హిందూ ఫాసిజానికి అడ్డుకట్టలు వేయగలమని, వేసి తీరాలని 'చిక్కమగళూర్ ప్రకటన' చాటి చెప్పింది. **2002** డిసెంబర్ **29**న కర్నాటక రాష్ట్ర చరిత్రలో ప్రముఖంగా నిలిచి పోతుంది. ఈరోజు అక్కడి ప్రజాస్వామ్య లౌకిక శక్తుల పునరుద్ధాన దినంగా నిలుస్తుంది. గుజరాత్ మారణకాండ తరువాత మూగబోయిన లౌకిక గొంతులు విచ్చుకున్న రోజుగా ఇది గుర్తుండి పోతుంది. హిందూ ఫాసిస్టు మూకలకి కూడా ఇది మరుపురాని ఒక దుర్దినంగా జ్ఞాపకం వుండిపోతుంది. 'బాబా బుడంగిరి' సమస్యని ఒక దక్షిణ భారత అయోధ్యగా మలిచేసి తద్వారా ఒక్క కర్నాటకలోనే గాక యావత్ దక్షిణ భారతంలో కాషాయ శక్తులను కదం తొక్కించేయాలని ఉబలాట పడిపోయిన హిందూ ఫాసిస్టు మూకలకి కర్నాటకలోని విప్లవ సాంస్కృతిక సంస్థ 'కర్నాటక విమోచన రంగ' (కె.వి.ఆర్) చొరవతో కదిలిన లౌకికవాద ప్రగతిశీల శక్తులు గట్టిగా బుద్ధి చెప్పాయి. ఆ వివరాల్లోకి వెళదాం.

## బాబా బుడంగిరి - దత్తపీఠం వివాద నేపథ్యం

బెంగుళూరుకి **270**కి.మీ, చిక్కమగళూర్‌కి **20** కి.మీ. దూరంలోని సహ్యాద్రి కొండల వరుసలోని ఒక కొండ శిఖరంపై బాబా బుడంగిరి దర్గా వుంది. శతాబ్దాల తరబడిగా ఈ దర్గా హిందూ-ముస్లింల ఉమ్మడి పవిత్ర యాత్రాస్థలిగా వుంటూ వస్తోంది. చరిత్ర ప్రకారం దాదా హయత్ ఖలీదార్ అనే ఒక సూఫీ సన్యాసి తన మత ప్రచార యాత్రా క్రమంలో అరేబియా నుండి ఈ కొండ ప్రాంతానికి చేరి ఈ దర్గా వద్ద మకాం చేసాడు. ఆ ప్రాంతపు అమాయిక రైతాంగ ప్రజలపై అక్కడి పాలెగాళ్లు చేస్తుండిన క్రూర దోపిడీ పీడనలను అతడు పరిశీలించాడు. చలించిపోయాడు. పాలెగాళ్లకు వ్యతిరేకంగా అక్కడి రైతాంగ ప్రజలను సమీకరించి వారి చేత అనేక పోరాటాలు నిర్వహింప చేసాడు. పాలెగాళ్ల అకృత్యాలను చాలా వరకు అరికట్టింప చేసాడు. ఆ క్రమంలో ఆ ప్రాంతపు ప్రజల దృష్టిలో అతడు దైవ సమానుడిగా మారిపోయాడు. అతడిని దత్తాత్రేయుని అవతారంగా అక్కడి గ్రామీణ ప్రజలు చెప్పుకుంటారు. కొన్నాళ్ల తరువాత అతడు నమ్మకస్తులు, సమర్థులు అయిన తన శిష్యులకు ఆ దర్గా నిర్వహణ బాధ్యత అప్పజెప్పి తన మత ప్రచార కార్యక్రమం కొనసాగించడానికి వెళ్లిపోయాడు. ఆ క్రమంలో మెమెన్ దేశానికి చెందిన సయ్యద్ షా జమాలుద్దీన్ అనే సూఫీ అనుయాయి ఈ దర్గా నిర్వహణ బాధ్యతలు చేపట్టాడు. ఈ జమాలుద్దీనే తరువాత అక్కడి ప్రజలలో 'బాబా బుడాన్'గా ప్రసిద్ధి పొందాడు. అది లగాయితూ ఆ దర్గా 'బాబాబుడాంగిరి'గా పిలవబడుతూ వచ్చింది.

**1960**ల దశకం వరకు ఆ దర్గాపై ఎలాంటి వివాదం లేదు. **60-70**ల మధ్యలో ఒకసారి కర్నాటక వక్ఫ్‌బోర్డు ఆ దర్గాని తన వశంలోకితీసుకోడానికి ప్రయత్నించింది. కాని దర్గా నిర్వహణ బాధ్యత చూసే సజ్జాద్ నిషాన్ అందుకు అంగీకరించలేదు. అది హిందూ-ముస్లిం రెండు మతాల వారి ఉమ్మడి వారసత్వ సంపదగా కొనసాగుతూ వస్తోంది. అలాంటి దర్గాని కేవలం ముస్లింలకే చెందేలా దాన్ని వక్ఫ్‌బోర్డుకి కట్టబెట్టడానికి నిషాన్ అనుమతించలేదు. దీనిపై వక్ఫ్‌బోర్డు ప్రభుత్వాన్ని ఆశ్రయించగా కర్నాటక ప్రభుత్వం ఆ దర్గాని వక్ఫ్‌బోర్డు వశం చేస్తూ **1975**లో ఆదేశించింది. ఈ ప్రభుత్వ ఆదేశాలు చెల్లనేరవంటూ సజ్జత్ నిషాన్ చిక్కమగళూర్ జిల్లా కోర్టులో సవాల్ చేసాడు. **1980**లో జిల్లా కోర్టు ప్రభుత్వాదేశాలు చెల్లవని తీర్పు చెప్పింది. దర్గాని సజ్జత్ నిషాన్‌కే అప్పజెప్పింది. జిల్లా కోర్టు తీర్పుని సవాల్ చేస్తూ వక్ఫ్‌బోర్డు **1991**లో కర్నాటక హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు పూర్వపరాలన్నింటినీ పరిశీలించిన రాష్ట్ర హైకోర్టు దర్గా నిర్వహణకి సంబంధించి **1975**కి ముందునాటి పరిస్థితులే యధాతధంగా కొనసాగాలని విస్పష్టమైన తీర్పు ప్రకటించింది. అంటే దర్గాపై సజ్జాద్ నిషాన్ యాజమాన్యాన్ని ధృవీకరించింది. మరో మాటలో చెప్పాలంటే ఆ దర్గా హిందూ ముస్లింల ఉమ్మడి వారసత్వ ఆస్థి అని అధి ఉమ్మడి పుణ్యస్థలి అని నిర్ధారించింది.

ఆ దర్గా చుట్టూ అల్లుకుని వున్న సుదీర్ఘ సాంస్కృతిక చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకునే రాష్ట్ర హైకూర్టు అలాంటి తీర్పు ప్రకటించిందని చెప్పాలి. ఏమంటే బాబాబుడంగిరి దర్గా శతామ్దాల తరబడిగా కర్నాటకలోని హిందూ ముస్లింల మిశ్రమ లౌకిక సాంప్రదాయానికి ఒక బలమైన ప్రతీకగా కొనసాగుతూ వచ్చింది. మత సామరస్యానికి సమిష్టి జీవన విధానానికి సంబంధించిన గొప్ప చరిత్ర కర్నాటకకు వుంది. కర్నాటక ప్రజల మిశ్రమ లౌకిక సంస్కృతికి, వారి ఉమ్మడి సాంప్రదాయాలకు స్పష్టమైన వ్యక్తీకరణే అక్కడి విస్తృత వ్యాప్తిలో వున్న దక్కన్ ఉర్దూ భాష. అక్కడి ప్రజలలో బలంగా వేళ్లూనుకుని వున్న సూఫీ సాంప్రదాయం కారణంగా అక్కడి హిందూముస్లిం మతాల మధ్య సయోధ్య సంలీనం అనేవి స్పష్టంగా కనబడతాయి. అక్కడ సూఫీ అనేది రైతాంగ సంస్కృతిగా మారిపోయింది. కనుకనే కర్నాటక

అంతటా, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో అనేక సూఫీ మసీదులు, దర్గాలు కనబడతాయి. అక్కడ మనకి మత ఛాందసవాదం అనేది మచ్చుకి కూడా కనబడదు. హిందూ దత్త సాంప్రదాయం ముస్లిం సూఫీ సాంప్రదాయం అనేవి ఒకదాన్నుండి ఒకటి వేరుచేసి చూడలేనంతగా కర్నాటక జానపద సంస్కృతిలో అవి రెండూ కలగలిసిపోయి కనబడతాయి. దత్తాత్రేయుడు విష్ణువు అవతారమని ప్రతీతి! కాని, వింత ఏమిటంటే హిందూ భగవంతుని ఇతర అవతారాలన్నింటికీ భిన్నంగా దత్తపంత్ లేక దత్తపీఠం బలమైన బ్రాహ్మణ వ్యతిరేకతకు ప్రాతినిధ్యం వహిస్తూ అవధూత్ సాంప్రదాయంలో భాగంగా కొనసాగుతూ వచ్చింది. ఏ రకంగా చూసినా కూడా దత్తాత్రేయుడు అబ్రాహ్మణీయతకు ప్రతినిధిగానే కనబడతాడు, బ్రాహ్మణేతర సాంప్రదాయానికి ప్రతినిధిగానే కనబడతాడు. అక్కడ దత్తత్రేయుని పూజలు కూడా హిందూ ముస్లిం సాంప్రదాయాల మిశ్రమంగానే వుంటాయి. మరో ముఖ్య విషయం ఏమంట దత్తాత్రేయుడు శైవ వైష్ణవుల ప్రతినిధి మాత్రమే కాడని, అతడు సూఫీ సాంప్రదాయ ప్రతినిధి కూడా అని కర్నాటక ప్రభుత్వ అధికారిక గెజిటెడ్ సైతం స్పష్టంగా ప్రకటించింది.

ఈ ఉజ్వల చారిత్రక సాంస్కృతిక వాస్తవికతని సంకుచిత హిందూ ఫాసిస్టు సంస్థ విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి) జీర్ణించుకోలేకపోయింది. హిందూ ముస్లింల ఉమ్మడి వారసత్వ సంపద అయిన 'బాబా బుడంగిరి'ని కేవల హిందువుల 'దత్తపీఠం'గా మార్చేడానికి పూనుకుంది. అశ్వమేథయాగం తరహాలో **1989**లో అద్వానీ సాగించిన రథయాత్ర తరువాత కర్నాటకలో దురుసుగా దూసుకొచ్చిన వి.హెచ్.పి 'దత్తపీఠం సంరక్షణ సమితి' అనేదాన్ని ఏర్పరిచింది. ఆ దర్గా శతాబ్దాల చరిత్రలో ఏనాడూ లేనిది మొట్టమొదటిసారిగా దర్గాలో బ్రాహ్మణ పూజారుల చేత పూజలు నిర్వహింప జేసింది. బాబ్రీ మసీద్ విధ్వంసం బిజెపి ఎన్నికల విజయంతో వి.హెచ్.పి మరింత మొరటుగా దురుసుగా దర్గాలోని ప్రతిమకి (దత్తాత్రేయునికి) హిందూ సాంప్రదాయంప్రకారం హోమం, హవనం, పూజలు నిర్వహించింది. దత్త గురువుల పరంపరలో సాంప్రదాయంగా సహచరిగా వుండే బ్రాహ్మణేతర విశ్వాసం అనేదాన్ని హిందూ వ్యతిరేకతగా చిత్రించి హిందువులలో ముస్లిం వ్యతిరేకతని రెచ్చగొట్టింది. తేదీ: **3-12-1998**న పది వేల మంది ప్రజా సమీకరణతో నాలుగు దిశల నుండీ రథయాత్రలతో 'బాబాబుడంగిరి'ని చుట్టుముట్టింది. దర్గాని తమకు అప్పజెప్పాలని ప్రభుత్వానికి హుకుం జారీ చేసింది. దర్గాని మరిచిపోవాలని దాన్ని విడచి పోవాలని ముస్లింలని తీవ్ర హెచ్చరికలతో ఆదేశించింది. దర్గాపై సజ్జాద్ నిషాన్ పారంపర్యాన్ని నిరాకరిస్తూ, ధిక్కరిస్తూ 3రోజులపాటు 'దత్తజయంతి ఉత్సవం' నిర్వహించింది. తరువాత వరుసగా **2000, 2001, 2002** సంవత్సరాలలో దత్తజయంతికి ముందు రెండు వారాల దత్తమేళా నిర్వహణ చేపట్టింది. విహెచ్‌పి యొక్క ఈ దురాగతాలను దురుసుదనాన్ని కర్నాటకలోని కాంగ్రెస్‌ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తూ వుండి పోయి అన్ని రకాలుగా విహెచ్‌పికి సహకరిస్తూనే వచ్చింది. శాంతిభద్రతల నెపంతో కాంగ్రెస్ ప్రభుత్వంతన బూటకపు లౌకికత్వాన్ని కప్పి పెట్టుకోడానికి తాపత్రయపడింది. బాబ్రీమసీద్ విధ్వంసాన్ని పి.వి. నరసింహారావు ప్రభుత్వం అనుమతించిన తరహాలోనే ఇక్కడ సైతం కుహనా లౌకిక కగాంగ్రెస్ ప్రభుత్వం 'బాబాబుడంగిరి' దురాక్రమణని అనుమతించేసింది.

**2002** డిసెంబర్‌నెల ప్రారంభంలో **15**వేల మంది ప్రజా సమీకరణతో విహెచ్‌పి దత్త జయంతి శోభాయాత్ర నిర్వహించింది. చిక్కమగళూర్‌లో మూడు రోజుల దత్తజయంతి జరిపి **4**వ రోజున బాబాబుడంగిరిలో మహాసమ్మేళన్ నిర్వహించింది. ఈ సందర్భంగా జరిపిన ప్రదర్శనల్లో ముస్లింలని బండబూతులు తిడుతూ, కారుకూతలు కూస్తూ రెచ్చగొట్టుడు నినాదాలు, పోస్టర్లతో విహెచ్‌పి విషం చిమ్మింది. వీటన్నింటి పరాకాష్టగానే తేదీ **24-12-02**న బాబాబుడంగిరిలో విహెచ్‌పి అధినేత తొగాడియా నేతృత్వంలో 'ధర్మసమావేశం' జరిగింది. ఈ సందర్భంగానే తొగాడియా లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులందరికీ ముస్లింలందరికీ మరొక శిక్ష విధిస్తూ ప్రకటించాడు.

## చిక్కమంగళూర్ ప్రతిఘటన

హిందూ ఫాసిస్టు విహెచ్‌పి చేసిన ఈ వీరంగం, ప్రదర్శించిన విర్రవీగుడులకు ధీటైన ప్రతిస్పందనగా వెలువడినదే **29-12-02**నాటి చారిత్రిక చిక్కమగళూర్ ప్రకటన! కర్నాటక విమోచన రంగ (కె.వి.ఆర్) ప్రదర్శించిన చొరవ, చేసిన కృషి ఫలితంగా **100** ప్రగతిశీల లౌకికవాద సంస్థలు, **200** ప్రముఖ లౌకికవాద ప్రగతికాముక మేధావులు కలిసి 'మత సామరస్య వేదిక'గా ఏర్పడి, ఈ వేదిక అధ్వర్యంలో **29-12-02**నాడు చిక్కమగళూర్‌లో **10**వేల మంది పైచిలుకు జన సమీకరణతో హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా చారిత్రక ప్రదర్శన బహిరంగ సభా కార్యక్రమాలు నిర్వహించారు. బెల్గాం నుండి కొలార్, కార్వార్ నుండి రాయచూర్ వరకు రాష్ట్రం నలుమూలల నుండీ లౌకికవాద సంస్థలు శక్తులూ ఈ కార్యక్రమాలకి కదిలి వచ్చాయి. దేశంలో పేరున్న లౌకికవాది స్వామి అగ్నివేష్ ప్రదర్శనను ప్రారంభించగా, ప్రజా గాయకుడు గద్దర్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

'బాబాబుడంగిరి దర్గా మత సామరస్య చరిత్ర సాంప్రదాయాలను రక్షించుకుందాం', 'హిందూ ఫాసిజం నశించాలి', 'అడుగడుగునా పోరాటం నేర్చుకుందాం - బ్రతకడం కోసమే చావడం నేర్చుకుందాం', 'కర్నాటక మరో గుజరాత్ కాజాలదు' అనే ప్రధాన నినాదాలతో చిక్కమగళూర్ మారుమ్రోగిపోయింది. ప్రదర్శన అనంతరం మధ్యాహ్నం **2.30** గంటలకి అజాద్ పార్క్ వద్ద జరిగిన బహిరంగ సభలో **37** మంది వక్తలు మాట్లాడారు. 'కర్నాటక విమోచన రంగ' ప్రతినిధులు; సిపిఐ, సిపిఎం పార్టీల రాష్ట్ర కార్యదర్శులు; 'మహిళా జాగృతి' ప్రతినిధి; 'బందయా సాహిత్య సంఘటన' ప్రతినిధి; సియుసిఎల్ ప్రతినిధి; 'జనమత్' ప్రతినిధి; వివిధ ముస్లిం సంస్థల ప్రతినిధులు అలానే ప్రొ.కె.రాందాస్; ప్రొ.రాజేంద్ర చెన్ని; డా.మల్లికగంటి; జి.కె.గోవిందరావు భాను ముషతక్, ఎస్.కె.కాంత్, చంప, శ్రీధర్ తదితర ప్రముఖులంతా మాట్లాడారు.

మొత్తం కార్యక్రమాన్ని సమీక్షిస్తూ స్వామి అగ్నివేష్

''యావత్ దేశాన్ని గుజరాత్‌గా మార్చాలని తొగాడియా కోరుకుంటున్నాడు. కాని యావత్ భారత దేశాన్ని చిక్కమగళూర్‌గా మారుస్తామని మనం తొగాడియాకి తెలియజేద్దాం'' అని ప్రకటించాడు.

సభలో పాల్గొన్న మరో వామపక్ష నేత,

''ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనా నిర్మాణానికి సమయం ఆసన్నమైంది. ఈ మహా ప్రదర్శన నిర్వాహకులు ప్రదర్శించిన లాంటి సాహసం, కృత నిశ్చయం అనే వి అలాంటి ఐక్యసంఘటనా నిర్మాణానికి అవసరం''

అని ప్రకటించాడు.

హిందూ ఫాసిజంతో నేరుగా తలపడే ఇలాంటి ఐక్యసంఘటనా కార్యక్రమాలు పోరాటాలు మరింతగా బలపడాల్సి వుంటుంది. వీటికి సమాంతరంగాను, వీటికి బాసటగాను సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వాటిని దేశ ప్రజల నెత్తిన రుద్దుతున్న దేశీయ పాలకవర్గాలు, ప్రభుత్వాల విధానాలకి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు విస్తృతపడాల్సి, బలపడాల్సి వుంటుంది. మరీ ముఖ్యంగా సామ్రాజ్యవాదానికి ఊడిగం చేసే దోపిడీ పాలకవర్గాల అధికారాన్ని అంతం చేసే లక్ష్యంతో దేశంలో సాగుతున్న కమ్యూనిస్టు విప్లవోద్యమం మరింతగా బలపడి పురోగమించాల్సి వుంటుంది. ఈ ముప్పేట వుద్యమాల సమన్వయ శక్తితో హిందూ ఫాసిజాన్ని తుదముట్టించాలి.

# చైనాలో పురివిప్పుకున్న పెట్టుబడిదారీ విధానానికి వత్తాసు పలికిన చైనా కమ్యూనిస్టు పార్టీ 16వ మహాసభ

చైనాలోని నూతన పెట్టుబడిదారీ వర్గం తెలివిమీరింది. వారు పాశ్చాత్యం నుండే కాక సోవియట్ యూనియన్ రివిజనిస్టు అనుభవం నుండి నేర్చుకుంటున్నారు. **1989**లో మహా సోవియట్ సామ్రాజ్యం విపరీతమైన నిరంకుశ వర్గం, అవినీతిమయమైన రాజ్య పెట్టుబడిదారీ వ్యవస్థ మూలంగా రాత్రికి రాత్రే కూలిపోవడాన్ని చూసిన తరువాత పెద్దఎత్తున వున్న ప్రభుత్వ సంస్థలను రద్దుపరిచి పెద్దఎత్తున ప్రైవేటు రంగాన్ని తీసుకొచ్చారు. **1997** నుండి ప్రపంచంలోని అన్ని దేశాల్లాగానే చైనావారూ ప్రపంచీకరణలో భాగస్వాములయి పోయారు. ఏడాది క్రితం వారు ప్రపంచ వాణిజ్య సంస్థలోకి ప్రవేశించడంతో ఈ క్రమం ఒక గెంతు రూపం తీసుకుంది. అయితే అందరు రివిజనిస్టుల లాగే వారు మార్క్సిజానికే కాక మావో ఆలోచనా విధానానికే కట్టుబడి వున్నట్టు చెప్పుకుంటారు. వారు వారి బూర్జువా విధానాలను ''చైనా లక్షణాలు గల సోషలిజం'', ''సోషలిస్ట్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ'', ''మూడు ప్రాతినిధ్యాంశాలు'' మొదలగు ఆకర్షణీయమైన పదజాలం మాటున దాచుకుంటున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ **16**వ కాంగ్రెస్ డెంగ్ ప్రతిపాదించి గత **13** సంవత్సరాలుగా అతని నమ్మకమైన అనుచరుడైన జియాంగ్‌జెమిన్ నేతృత్వంలో ఆ విధానాలలోనే పురోగమిస్తూ ముందుకు వెళుతోంది. ఈ కాంగ్రెస్ ప్రత్యేకంగా గుర్తించదగినది ఎందుకంటే అధికారికంగా అది కమ్యూనిస్టు పార్టీ ద్వారాలను వాణిజ్యవేత్తలు పెట్టుబడి దారులకు తెరిచేందుకు నిర్ణయించింది.

చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ ఇంత నగ్నంగా వున్నా ఇంకా కొంత మంది చైనా సోషలిస్టు దేశంగానే వుందనే తప్పుడు వాదాన్ని ప్రచారంలో పెడుతుంటారు. భారతదేశంలోనూ ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమంలోనూ చైనా కమ్యూనిస్టు పార్టీ చెప్పిన దానిని చిలుక పలుకుల్లా పలికే లెక్కలేనంత మంది బూటకపు కమ్యూనిస్టులు వారి వారి రివిజనిస్టు వైఖరితో దానిని గురించి సరైన అంచనాకు రావటానికి సిద్ధం కాకపోవటం వలన వేచి చూచే వైఖరిని చేపట్టినట్టు నటిస్తారు. భారతదేశంలో సిపిఐ మరియు సిపిఎంలు మొదటి తరహావి కాగా సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ రెండవ తరహాకు చెందినది. సిపిఐ, సిపిఎంలు వారి పార్టీ ప్రతికల్లో ఈ కాంగ్రెస్‌ను ఎలుగెత్తి చాటగా, లిబరేషన్ పార్టీ ఇటీవల తాము జరిపిన కాంగ్రెస్‌లో ''చైనా అనుభవాన్ని దగ్గర నుండి పరిశీలించి దానిని అరమరికలు లేకుండా అధ్యయనం చేయాలని తొందరపడి ఎటువంటి నిర్ధారణలకు రాకూడద''ని అంతిమంగా అంగీకరించారు.

వాస్తవం ఏమిటంటే సి.పి.సి. అమూలాగ్రం రివిజనిస్టు పార్టీయే కాగా చైనా పెట్టుబడిదారీ వ్యవస్థగా వుంది. చైనాతో మంచి వ్యాపారం చేసే పాశ్చాత్య ప్రపంచం దానిని పెట్టుబడిదారీగానే గుర్తిస్తున్నా మన రివిజనిస్టులు అలా చూడటానికి సిద్ధం కావటం లేదు. రివిజనిస్టులతో వచ్చిన సమస్య ఏమంటే వారు నామమాత్రపు సోషలిస్టు స్థితిని చూపుతూ ప్రజలను వారి శ్రేణులను వీలైన మేరకు మోసపుచ్చుతుంటారు. తూర్పు యూరప్ దేశాలు, రష్యా విషయంలో వారు అదే చేసారు. నిజానికి రుమేనియాలోని చెసెస్క్యూ పాలకవర్గం కూల్చివేతకు కొద్దిరోజుల ముందుగానే సిపిఎం అక్కడి సోషలిస్టు ప్రయోగాన్ని దాని నాయకుడిని ఎలుగెత్తి చాటింది. అవినీతిమయమైన 'కమ్యూనిస్టు పార్టీలు' తుడిచి పెట్టుకుపోయిన మీదటే సిపిఎం తదితర ఈ తరహా రివిజనిస్టులకు వాస్తవం ముందుకొచ్చింది. నిస్సందేహంగా కమ్యూనిస్టు పార్టీ ముసుగు కొనసాగినంత కాలం పపంచంలోని రివిజనిస్టులు ప్రజలను మోసపుచ్చుతూనే వుంటారు.

కానీ వాస్తవం ఏమిటంటే సిపిసి మరియు చైనా వ్యవస్థ ప్రతి అంశంలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థ కనపడుతుంది. అది దాని ఆర్థిక వ్యవస్థ లోనూ, దాని సైద్ధాంతిక దృక్కోణంలోనూ, దాని రాజకీయాల లోనూ, దాని సంస్కృతిలోనూ - మరీ ప్రత్యేకంగా ప్రజల మధ్య త్వరిత గతిన పెరుగుతున్న వర్గ విభజనలోనూ పేదరికంలోనూ దానిని చూడవచ్చు.

## చైనా బూర్జువా ఆర్థిక వ్యవస్థ

సిపిసి **16**వ కాంగ్రెస్ చేపట్టిన జియాంగ్ జెమిన్ నివేదిక ఏమంటుందంటే ''కాంగ్రెస్ వక్కాణించే దేమిటంటే దేశాన్ని పరిపాలన చేయటంలోనూ పునశ్శక్తివంతం చేయటంలోనూ అభివృద్ధే పార్టీకి అతి పెద్ద ప్రాధాన్యత గలిగిన అంశం. దానికై ఆర్థికాభివృద్ధినే కేంద్ర కర్తవ్యంగా చేపట్టటం ఆవశ్యమని ఉత్పాదక శక్తులను విడుదల చేస్తూ అభివృద్ధి చేయాలని, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని, సైన్స్, విద్య ద్వారా అలాగే నిలకడైన అభివృద్ధి వ్యూహంతో దేశాన్ని పునశ్శక్తివంతం చేసేందుకు పూనుకున్నారు. అలాగే ఆర్థిక నిర్మాణాన్ని వ్యూహాత్మకంగా సర్దుబాటు చేయటం, మౌలికంగా పారిశ్రామికీకరణను సాధించటం, దానిని శక్తివంతంగా అమలు చేయటం, ఆధునికీకరణను వేగవంతం చేయటం, జాతీయ ఆర్థిక వ్యవస్థలో నిలకడగానూ, త్వరితంగానో చక్కటి అభివృద్ధిని సాధించి ప్రజల జీవన ప్రమాణాలను క్రమంగా మెరుగుపరచాలని కాంగ్రెస్ భావిస్తోంది''. భారత్‌లో ఎనిమిది శాతం పెరుగుదల రేటు ద్వారా భారత్ పేదరికాన్ని తుడిచి పెడుతుందని వాజ్‌పేయి పదే పదే అంటున్నాడు. ఆర్థికాభివృద్ధి ద్వారా పేదరికాన్ని నిర్మూలించ గలమనే మార్గం విషయంలో వాజ్‌పేయికి, జియాంగ్‌జెమిన్‌కు ఒకే రకమైన ఆలోచన వున్నట్టు అర్థమవుతూంది. ఈ విషయంలోసిపిఎం పార్టీ వైఖరి అలానే వుంది. సిపిఎం జనరల్ సెక్రెటరీ అయిన హర్‌కిషన్‌సింగ్ సూర్జీత్ తన ''సిపిసి **16**వ కాంగ్రెస్‌పై కొన్ని ఆలోచనలలో'' (పీపుల్స్ డెమోక్రసీ, డిసెంబరు **15, 2002**) ''సోషలిజంలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయటం చరిత్రలో మునుపెన్నడూ చేపట్టనటువంటి ఓ కొత్త బాటలు వేసే గొప్ప పని'' అని పేర్కొన్నాడు. తదుపరి అతడు ఈ కాంగ్రెస్‌లో చేపట్టిన ప్రతి నిర్ణయాన్ని పొగుడుతూ వచ్చాడు. సిపిఐకి చెందిన ఎ.బి.బర్దన్ తన ''చైనా కమ్యూనిస్టు పార్టీ **16**వ కాంగ్రెస్‌పై సంక్షిప్త వివరణ''లో ప్రస్తుత ఆర్థిక విధానాలను సమర్థించేందుకు, ఉత్పాదక శక్తుల సిద్ధాంతానికి మద్దతుగానూ భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పేరుతో ప్రైవేటు రంగంతోపాటుగా ప్రభుత్వ రంగం వుండటాన్ని సమర్థిస్తూ వచ్చాడు. బర్దన్ సూత్రాలను విస్మరిస్తూ కేవలం వ్యవహార సరళినే నెత్తికెత్తుకుంటూ ''అప్పటికి వున్న సామాజిక వ్యవస్థను బట్టి సామాజిక అభివృద్ధి మార్గం దేశ దేశానికి వేరవుతుందని తద్వారా భవిష్యత్‌లో సృష్టించే వ్యవస్థ వేరవుతుందని స్పష్టమవుతోందని'' తన వాదనను ముందుకు తెచ్చాడు.

కానీ, నిజానికి వాస్తవం ఏమిటి? దానికై చైనా ఆర్థిక వ్యవస్థను సంక్షిప్తంగా చూద్దాం. ఆ తదుపరి పాఠకులే అది సోషలిస్టా లేదా క్యాపిటలిస్టా అనేది తమకు తాముగా తేల్చుకోవచ్చు.

**1976**లో మావో మరణం తరువాత కుట్ర ద్వారా అధికారాన్ని చేపట్టిన డెంగ్ ముఠా మునుపటి కాలం ఆర్థిక విధానాలను తిరగదోడుతూ వచ్చింది. **1978**లో మొదటి దశ ఆర్థిక విధానాలు **11**వ కేంద్ర కమిటీ మూడవ ప్లీనంలో మార్కెట్ శక్తులకు ఎగుమతి ప్రాధాన్య అభివృద్ధికి అధిక పాత్రను కల్పిస్తూ వచ్చారు. వ్యవసాయంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను వ్యక్తిగత వ్యవసాయానికై భూమిని లీజుకు ఇచ్చారు. ద్వంద్వ మారకపు రేట్లను, ద్వంద్వ ధరల వ్యవస్థను, ప్రవేశపెట్టటం ద్వారా మార్కెట్ పాత్రను కల్పించటంలో సహాయపడింది. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ నిధుల మంజూరీలను బదిలీ చేస్తూ ప్రజలకు అవసరమైన వివిధ

వస్తువుల తయారీకి నిధులను మళ్లించటం, అలాగే లాభాలు మరియు రాబడుల ప్రాతిపదిక మీద ఆధారపడి లోన్లు ఇచ్చే బ్యాంకులకు నిధులను బదిలీ చేసరు. **1980**లలో సంస్కరణలలో ''కాంట్రాక్టు బాధ్యతా'' వ్యవస్థను ప్రవేశపెట్టి సంస్థలను వాటి కోటాను పూర్తి చేసిన మీదట బహిరంగ మార్కెట్‌లో తమ సరుకులను లాభానికై అమ్ముకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ విధంగా దొడ్డిదారిన ఫ్యాక్టరీ సరుకులు మరలిపోవటానికి అందుకు సంబంధిత వివరాలు మేనేజర్ వద్ద వుంచేట్టుగా నిర్ణయించారు.

ఈ విధానాలను డెంగ్ ముందుకు తెస్తూన్న అప్రతిష్టకరమైన వాక్యం ''ధనవంతులవటం చాలా గొప్ప విషయం'' అనే దానిని ప్రాచుర్యంలోకి తెచ్చాడు. **1980**లలో భారత దేశంలోని జాతీయాకరణ చెందిన రంగాలలో లాగే సంపద బ్రహ్మాండంగా పోగుపడింది. అవినీతి, బంధుప్రీతి, ప్రభుత్వ సంస్థలను ఇష్టానుసారంగా పిండుకోవటం సర్వ సాధారణమై పోయింది.

దీనిని కూడా డెంగ్ తిరిగి తిరిగి పేర్కొన్నట్టుగా ''ఒకసారి కిటికీలు తెరిచిన తరువాత ఈగలు తప్పక ముసురతాయి'' అనే ప్రకటన ద్వారా సమర్ధించుకున్నాడు. దీనికి సరైన ఉదాహరణ ప్రజావిముక్తి సైన్యమే వివిధ పారిశ్రామిక సంస్థలతో కూడిన ఒక బృహత్ కూడలిగా మారిపోయింది (వివిధ వ్యాపార సంస్థల సంతగా మారిపోయింది). ప్రజా విముక్తి సైన్యం సామ్రాజ్యం దాదాపు **20**వేల సంస్థలతో కూడి వుండింది. **1980**ల ప్రారంభంలో నుండి ప్రజా విముక్తి సైన్యం తన వాణిజ్య కార్యకలాపాలు పెంచటంతో అవినీతి, బంధుప్రీతి విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజావిముక్తి సైన్యం తన వాణిజ్య కార్యకలాపాలు పెంచటంతో అవినీతి, బంధుప్రీతి విపరీతంగా పెరిగిపోయాయి. ప్రజావిముక్తి సైన్యం ఆర్థిక వ్యవస్థలోని లాభదాయకమైన ప్రతి రంగంలోకి ప్రవేశించి రవాణా నుండి గనుల త్రవ్వకం, రియల్ ఎస్టేట్, టెలికమ్యూనికేషన్స్, చివరికి ఐదునక్షత్రాల హోటళ్ల నిర్వహణను చేపట్టింది. ప్రజా విముక్తి సైన్యం కింద వున్న **400** ఔషద కంపెనీలు చైనా మందులలో **10**శాతం ఉత్పత్తి చేయగా, సైన్య ఫ్యాక్టరీలు దేశంలోని **20** శాతం కార్లు, ట్రక్కులు, సగం మోటారు సైకిళ్లను వుత్పత్తి చేస్తూండినాయి. ఇంతేకాక ప్రజావిముక్తి సైన్యం **1500** జనావాసాలలోని హోటళ్లు, నిర్జన ప్రదేశంలోని హోటళ్లు, వివిధ వినోద కేంద్రాలను నడిపింది. ఈ కంపెనీల మొత్తం శ్రామిక శక్తి దాదాపు **5** మిలియన్లుగా వుంటుంది. ఇవి పౌర వుత్పత్తిలో దాదాపు **80** శాతం మేరకు చేపట్టాయి.

అవినీతి, బంధుప్రీతి, అనేవి ప్రధానంగా జీవితంలోని ప్రతి అంశంలోనికి ప్రవేశించడంతో **1989**లో **2** లక్షల మంది యువకులు ఉప్పెనలా 'తియానాన్‌మిన్ స్క్వేర్'ను ఆక్రమించి నెలరోజుల పాటు తమ స్వాధీనంలో పెట్టుకున్నారు. ఆ తిరుగుబాటుకు కమ్యూనిస్టు కోణం లేనప్పటికీ అది నయా రివిజనిస్టు పాలకుల దుష్ట చర్యలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడి నందున దానిని పాలక రివిజనిస్టు పార్టీ నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. **1989** జూన్ **5**నాడు సైన్యం ప్రవేశించి (తిరుగుబాటుదార్ల ఆక్రమణ ఏప్రిల్ **22**న ప్రారంభమైంది) తిరుగుబాటు చేసిన యువకులపై యుద్ధానికి దిగింది. ఆ తీవ్ర యుద్ధంలో వందలాది మంది అమాయకులు హతులైపోగా సుమారు వంద మంది సైనికులు సైతం హతమయ్యారు. ఇరువైపులా వేలాది మంది గాయపడ్డారు.

ఈ తిరుగుబాటు నేపథ్యంలో **1992**లో జరిగిన సి.పి.సి **14**వ కాంగ్రెస్ విపరీత వేగంతో కొనసాగుతుండిన 'సంస్కరణల'ను క్రమబద్ధం చేయాలంటూ ప్రణాళికా బద్ధమైన ఆర్థిక నియంత్రణకు గల ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. సంస్కరణలకు కట్టుబడిన వాడూ, నిరంకుశ పాలకుడూ అయిన జియాంగ్ జెమెన్‌ను డెంగ్ **1989**లోనే పై స్థాయి నాయకత్వ స్థానంలోకి తీసుకొచ్చారు. డెంగ్ అవసాన దశకి కొద్ది ముందు నుంచి కూడా వాస్తవ పాలనా వ్యవహారాలు జియాంగే చూస్తూ **1997**లో డెంగ్ మరణం తరువాత ఇక పూర్తి స్థాయిలో పాలనాధికారాన్ని జియాంగ్ జెమెన్ చేపట్టాడు. ఈ కాంగ్రెస్‌తో జెమెన్ సైతం డెంగ్ తరహాలోనే తెరవెనక్కు తప్పుకుని సంస్కరణలను చురుగ్గా పట్టుదలగా అమలు చేసే తన గుంపు వ్యక్తులతో నాయకత్వ స్థానాలు నింపి మరీ పోయాడు.

కానీ, **1997**లో జరిగిన **15**వ కాంగ్రెస్ రెండవ దశ సంస్కరణలను ముందుకు నెడుతూ, ప్రభుత్వ రంగాన్ని పూర్తి స్థాయిలో పడగొట్టి ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించేందుకు పూనుకుంది. **1997**లో సిపిసి ''వాటాలు నిలుపుకునే విధానం''కి ఆమోద ముద్ర వేస్తూ చిన్న, మధ్యతరహా ప్రభుత్వ సంస్థలను ప్రభుత్వ మరియు ప్రైవేట్ యాజమాన్యం గల కంపెనీలుగా మార్చేందుకు అవసరమైన విధాన నిర్ణాన్ని తీసుకుంది. భారీ ఆర్థికనిర్మాణాలతో కూడిన హాంకాంగ్‌ను తమ దేశంలో విలీనం చేసుకున్న తరువాత ఈ క్రమం మరింత తీవ్రతరం, వేగవంతం అయింది. **1997** నుండి **50**ఏళ్లపాటు హాంకాంగ్‌ని అదే స్థితిలో వుంచేందుకు వుద్దేశిస్తూ సి.పి.సి **1984**లోనే అందుకు సంబంధించిన ఉమ్మడి ప్రకటన ఇప్పించింది. సి.పి.సి పేర్కొన్న ఒక దేశం – రెండు వ్యవస్థలు అనేది నిజానికి, వాస్తవాచరణలో ఒక దేశం ఒక వ్యవస్థ అనే బూర్జువా తరహాలోనే వుంటోంది. నిజానికి ఏ ప్రభుత్వానికైనా దాని అజమాయిషీలో వుండే ఒక ప్రాంతంలో పెట్టుబడిదారీ వ్యవస్థని ఇంకో భాగంలో సోషలిజాన్ని అమలు చేయడమనేది, అదీ **50** సంవత్సరాల పాటు నిర్వహించ గలగడమనేది అసాధ్యం!

**15**వ కాంగ్రెస్‌లో చేపట్టిన పంథాను పాటిస్తూ పెద్దఎత్తున చిన్న, మధ్యతరహా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించారు; ప్రజా విముక్తి సైన్యానికి గల పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని అది వదులు కోవాలని ఆదేశించారు; విదేశీ పెట్టుబడులు సులభంగా దేశంలో ప్రవేశించాయి; వర్తమాన ఖాతాలో ద్రవ్య మారకానికి అవకాశమిచ్చారు; **1999**లో 'ప్రపంచ వాణిజ్య సంస్థ'లో చేరేందుకు సి.పి.సి. సగ్గుమాలిన ఒప్పందాన్ని కుదుర్చుకుంది; అన్నింటికంటే ఘోరంగా ప్రభుత్వరంగ సంస్థలను పెద్దయెత్తున క్రమబద్ధీకరిస్తూ మిలియన్ల మంది కార్మికులను పని నుండి తొలగించేసి ప్రభుత్వ పెట్టుబడులను భారీ మొత్తాలలో స్టాక్‌మార్కెట్లకు మళ్లించింది చైనా ప్రభుత్వం. రెడ్‌చిప్ కంపెనీలుగా చెప్పుకునే **40** కంపెనీలు హాంకాంగ్ మార్కెట్‌లో విరివిగా అమ్ముడు పోయాయి. ఈ ప్రభుత్వరంగ సంస్థలు దక్షిణ కొరియాలోని చేబోల్ల తరహాలో రూపు దిద్దుకుని జపాన్‌కి చెందిన కైరెట్‌సస్ లక్షణాలు కలిగి వుంటాయి. వివిధ సంస్థలు మరియు కార్పోరేట్ గ్రూపుల మధ్య అనుసంధానంగా వుండే డైరెక్టరేట్‌ల మీద ఇవి ఆధారపడి వుంటుంటాయి. **1999** నాటికి బీజింగ్‌లోనే **51** మెక్‌డోనాల్డ్ విభాగాలు వున్నాయి. చైనాలోని పెద్ద నేషనల్ పెట్రోలియం కార్పోరేషన్ అయిన పెట్రోచెమ్ కంపెనీ న్యూయార్క్ స్టాక్ ఎక్సేంజ్‌పై **2.9** బిలియన్ల ఈక్విటీని పెట్టింది.

**1999**లో జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ తన అధికార పత్రంలో ప్రైవేట్ వ్యాపారాన్ని ఆస్తిని కాపాడే చట్టాన్ని ప్రవేశపెట్టి విదేశీ యాజమాన్యాన్ని సరళతరం చేసింది. షాంఘై తన ప్రైవేట్ రంగాన్ని బార్లా తెరిచింది. ప్రభుత్వ రంగంలో విదేశీ పెట్టుబడులను స్వేచ్ఛగా ఆహ్వానించింది.

ఈ విధంగా పెట్టుబడిదారీ విధానంలోకి నగ్నంగా మరలటాన్ని జియాంగ్ జెమెన్, రష్యా విప్లవ విజయం తరువాత తొలినాళ్లలో లెనిన్ అనుసరించిన (నాలుగా దశాబ్దాల తరువాత కాదు) నూతన ఆర్థిక విధానంతో సరిపోల్చి సమర్ధించుకున్నాడు. తన ఈ తిరగదోడే విధానానికి ముసుగు తొడుగుతూ జెమెన్, చైనాలో సోషలిజం చాలా ప్రాథమిక స్థాయిలో వుందని; ''వచ్చే చాలా కాలం వరకూ'' అలానే వుంటుందని ప్రకటించాడు. ''ఇక నుండి చైనా ఆర్థిక వ్యవస్థలో ప్రైవేట్ రంగం ముఖ్య పాత్ర పోషస్తుందని, ఇది మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానంకి విరుద్ధం ఏమీ కాదు'' అని చైనా అధికార్లు బహిరంగంగానే ప్రకటించారు. **2000** సంవత్సరం ఏప్రిల్ **8** నాటి 'ది ఇకనామిస్ట్' పత్రిక దీన్నే మరింత నిర్మొహమాటంగా చెప్పింది ''**1997**లో జరిగిన **15**వ కాంగ్రెస్ ఒక మైలురాయి. ఈ నూతన దశలో పదుల వేల కొద్దీ చిన్న, మధ్యతరహా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి అవి మునగటమో లేక తేలడమో ఏది జరిగినా మంచిదేననే తీరులో వ్యవహరించారు. **1999**లో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ రంగాన్ని గుర్తించే హామీలను రాజ్యాంగంలో చొప్పించారు''.

ఏడాది క్రితం చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరే సమయానికి, ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచే చైనా విధానం మరో గెంతు వేసింది. తైవాన్ పాలనకు వ్యతిరేకంగా సి.పి.సి ఏమి ఆడిపోసుకున్నప్పటికీ, గడచిన రెండు సంవత్సరాలలో తైవాన్‌కి చెందిన పెద్ద సంస్థలన్నీ చైనాలో భారీ పెట్టుబడులను పెట్టాయి. చైనాలోని విదేశీ మరియు మిలాఖత్తు సంస్థలనేక వాటికి తైవాన్ కార్య నిర్వాహకాధికారులే సారధ్యం వహిస్తున్నారు. నిజం చెప్పాలంటే గడచిన రెండు సంవత్సరాలలో చైనాలోని తైవాన్ జనాభా **3** లక్షల నుంచి **5** లక్షలకి సుమారుగా రెండింతలుగా పెరిగింది. ఏసర్, కొంపాల్, హాన్‌హామ్ ప్రెసిషన్ ఇండస్ట్రీస్ మరియు నాన్యా ప్లాస్టిక్స్ లాంటి కంపెనీలు జియాంగ్‌సు రాష్ట్రానికి చెందిన ఒక్క కున్‌షాన్ ప్రాంతంలోనే **7.5** బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టాయి. కనుక జరుగుతూ వచ్చినదల్లా ఏమంటే చైనా తైవాన్, హాంకాంగ్‌ల చుట్టూతా ఒక బృహత్ చైనా ఆర్థిక సౌధ నిర్మాణం పెరుగుతూ వచ్చింది. ఈ బృహత్ చైనా ఇప్పటికే **1.7** ట్రిలియన్ డాలర్ల జి.డి.పిని సాధించింది. ఇది జపాన్ దేశపు జి.డి.పిలో సగం. ఈ అంకెను కొనుగోలు శక్తి తూకంతో సరి చూసినట్లయితే (ఇది ధరల స్థాయిల్లో తేడాకి జవాబుదారీగా వుంటుంది) **7.8** ట్రిలియన్ డాలర్లుగా వుంటుంది (యూరోపియన్‌లోని **9.3** ట్రిలియన్ డాలర్ల అమెరికాలోని **10.4** ట్రిలియన్ డాలర్లతో దీన్ని సరిపోల్చి చూడొచ్చు). ముందుగా చైనా దక్షిణ తీర ప్రాంతానికి సరుకుల వుత్పత్తిదారులు పెద్దఎత్తున హాంకాంగ్ నుండి తరలివచ్చారు, ఇక ఇప్పుడు తైవాన్ నుంచి సైతం తరలి వస్తున్నరు. చైనాలో శ్రమ కారుచౌకగా లభ్య మవుతున్న కారణంగా జపాన్ నుంచి సైతం వ్యాపారాలు తరలుతున్నాయి. నిజం చెప్పాలంటే ఈనాడు చైనా ఆర్థిక రాజధాని హాంకాంగే! ఎందుకంటే, హాంకాంగ్ అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లోకి చైనా పెట్టుబడులు చాలా లోతుగా ప్రవేశించాయి, అలానే హాంకాంగ్ స్టాక్ మార్కెట్‌లోకి కూడా! అంతేకాదు, ప్రముఖ హాంకాంగ్ ద్రవ్య యజమానులు, పెట్టుబడి దారులంతా ఈనాడు బీజింగ్ విధాన నిర్ణేతల సలహాదారులుగా వుంటున్నారు.

## చైనా - ప్రపంచ వాణిజ్య సంస్థ

**15**వ కాంగ్రెస్‌లో చేపట్టిన పంథాని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా, **1999**లో చైనా అమెరికాతో ఒక అవమానకరమైన ఒప్పందంలోకి వెళ్లింది, ప్రపంచ వాణిజ్య సంస్థలో తాను చేరడానికి వీలుగా అమెరికా ఆమోదాన్ని పొందడానికి ఇలాంటి ఒప్పందం చేసుకుంది. చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరడానికి అమెరికా అంగీకారానికి భారీగానే తనను తాను తాకట్టు పెట్టుకుంది. ఇందుకు చైనా మార్కెట్‌లోకి అమెరికా చొరబాటుకి వీలుగా ఇచ్చిన హామీలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. అలానే ఇందుకు చైనా నుండి అమెరికా పిండుకున్న ఇతర రాయితీలు సైతం బుర్ర తిరగేంతవిగా వుంటాయి, ఇవన్నీ అమెరికా చైనాపై విధించిన షరతులే! సగటు టారిఫ్ స్థాయిని చైనా **10** శాతం కంటే తక్కువకి తగ్గించుకోవాల్సి వచ్చింది. వ్యవసాయ టారిఫ్‌లను **17** శాతానికి తగ్గించింది, భారత దేశంలో ఇది రెట్టింపు. గోధుమ లాంటి ఆహార దినుసుల విషయంలో ఇది సున్నా! విదేశీ పెట్టుబడులపై, ప్రత్యేకించి టెలికాం రంగం ద్రవ్యరంగం, మరియు చిల్లర వ్యాపార రంగాలకి సంబంధించిన పెట్టుబడులపైన నిషేధాలు, అలానే దిగుమతులపైన ఆంక్షలు అనేవన్నీ ఇకపై ఎగిరిపోతాయి. ఇవన్నీ **2005**నాటికి అమలులోకి వచ్చి తీరాలి! చైనా ఆలస్యంగా ప్రపంచవాణిజ్య సంస్థలో చేరినందుకు గాను చెల్లించాల్సిన రుసుం కంటే ఇది అనేక రెట్లు అధికం! అంతేకాదు, చైనాలానే కొత్తగా అందులో చేరదలిచిన వారు చెల్లించ నంగీకరించే రుసుములతో పోలిస్తే ఇవి దారుణం! వ్యవసాయ రంగంలో ధారపోసిన రాయితీల కారణంగా దేశంలోకి పత్తి, ఉన్ని, సోయాబీన్‌ల దిగుమతులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి **10** మిలిటన్ల పేదరైతులు పని కోల్పోతారు, **18** శాతం వ్యవసాయిక భూమి వుత్పత్తికి దూరం అవుతుంది. వ్యవసాయ రంగంలోని వుత్పత్తుల నష్టాలు బిలియన్ల డాలర్లలో వుంటాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో తన చేరికను సుగమం చేసుకోడానికి గాను సి.పి.సి. తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలోనే ఈ నష్టాలను చూడాలి. సాంప్రదాయిక వ్యవసాయోత్పత్తులను వుత్పత్తి చేసే భూమి నుండి చైనా ఇప్పటికే తప్పుకుంది; సంవత్సరానికి ఇప్పటికే **10** నుండి **20** మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవడం ప్రారంభమైంది, ఫలితంగా **200** మిలియన్ల గ్రామీణ ప్రజలు కనబడని నిరుద్యోగానికి బలైపోయే వున్నారు.

వస్తూత్పత్తి రంగంలోని మొత్తం టారిఫ్‌లలో (సుంకాలు) సగటున **9.4** శాతం తగ్గించడానికి, **2005** నాటికల్లా పరిమాణాత్మక ఆంక్షలన్నింటి తొలగింపుకి చైనా అంగీకరించింది. ఆటో దిగుమతుల పైన సుంకం దారుణంగా పడిపోయింది. **1999**లో ఒప్పందం కుదిరిన నాటికి **100** శాతంగా వుండిన ఈ సుంకం **2000** సంవత్సరానికి **25** శాతంగాను **2006**నాటికి అది కేవలం **10** శాతానికి పడిపోతుంది. దీనికి తోడు సంవత్సరానికి అదమపక్షంగా **6** బిలియన్ల ఆటోలను దిగుమతి చేసుకోవాలని అది ప్రతి సంవత్సరం **15** శాతం చొప్పున పెరగాలని ఆ పెరుగుదల అనేది **2005**లో అసలు కోటా అనేదే రద్దయ్యేంత వరకు కొనసాగాలనేది కూడా ఒప్పందాంశం. ఈ చర్యల వలన ఆటో పరిశ్రమ అతి దారుణంగా దెబ్బతిని పోతుంది. చిన్న తరహా ఆటో తయారీ కంపెనీలన్నీ అదృశ్యమైపోయి వాటి స్థానే రెండు లేక మూడు గుత్త సంస్థలు, ప్రత్యేకించి ట్రాన్స్ నేషనల్ కంపెనీలకి చెందిన భారీ ఆటో సంస్థలతోడు భాగస్వామ్య సంస్థలుగా వుండే గుత్త సంస్థలకి ఆటో పరిశ్రమ నంతటినీ అప్పజెప్పేందుకు సిపిసి సిద్ధపడిపోయింది.

ఇక సేవా రంగంలో, టెలికమ్యూనికేషన్ రంగంలో భూతల ఆంక్షలు అన్నింటినీ దశలవారీగా తొలగించతడానికి సిపిసి అంగీకరించింది. టెలికమ్యూనికేషన్ సేవలలో విదేశీ మదుపుదారులకి **49** శాతం వాటా కట్టబెట్టడానికి కూడా సిపిసి అంగీకరించింది. ఇక భీమారంగంలో రాగల **5** సంవత్సరాల లైసెన్సింగ్ క్రమంలో అమలు కావాల్సిన భూతల హద్దులు అన్నింటినీ చెరిపేసింది. సిపిసి తద్వారా చైనాలోని కీలక నగరాల్లోకి అమెరికా సంస్థల ప్రవేశాన్ని సుగమం చేసింది. రాబోయే **2, 3** సంవత్సరాలలో ఇది పూర్తి కానుంది. విదేశీ భీమా కంపెనీలు అదనపు సేవలను అందించేందుకు సైతం అంగీకరిస్తూ వారి కార్యకలాపాల పరిధి విస్తరణకు సి.పి.సి. అంగీకరించింది. జాయింట్ వెంచర్స్‌లో (సంయుక్త కంపెనీలు) వారికి **50** శాతం యాజమాన్యం కలిగి వుండేట్టు వారిని అనుమతించడమైంది (భారత్‌లో ఇప్పటికే అది **26** శాతంగానే వుంది). చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యత్వం తీసుకున్న దరిమిలా అలా చేర్చుకున్నందుకు నజరానాగా చైనా తన పునఃభీమా వ్యాపారాన్ని పూర్తిగా విదేశీ భాగస్వామ్యానికి తలుపులు తీయాల్సి వచ్చింది, అలానే తలుపులు బార్లా తెరచింది. ఇక భ్యాంకు సేవారంగంలో భూతల అలానే ఖాతాదార్ల ఆంక్షలన్నింటినీ ఎత్తివేస్తూ రాగల ఐదు సంవత్సరాలలో చైనా మార్కెట్‌లోకి విదేశీ సంస్థల ప్రవేశం ముమ్మరమవుతుంది. ఇవన్నీ కూడా ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలకి సైతం అతీతం అనేది గమనార్హం!

వీటన్నింటికంటే కూడా చైనా చేపట్టిన 'డంపింగ్ వ్యతిరేక' మరియు 'పరిరక్షణ' చర్యల విషయంలో చైనా అమెరికాకు అసాధారణ రాయితీలు అందించింది. ఇలా చొరబడిన అమెరికా **15** సంవత్సరాల తరువాత చైనా దిగుమతులపై తన డంపింగ్ వ్యతిరేక చర్యలను అమలు చేయడానికి ఇదే పద్ధతిని వినియోగించుకుంటుంది. కాని అప్పుడు చైనా ఇలాంటి దాడి నుండి తాకిటి నుండి రక్షణను కోరుతూ చట్టపర రక్షణ కోసం అభ్యర్థింఛడానికి వీలు కల్పించే ఎలాంటి ప్రాతిపదికాంశాలు ప్రపంచ వాణిజ్య సంస్థ ఓప్పందంలో లేవు. అదేవిధంగా, రాగల **12** సంవత్సరాల పాటు చైనా దిగుమతులపై అమెరికా అవసరమనిపిస్తే అంటే అవి ఇబ్మడిముబ్బడిగా వచ్చి పడుతుంటే, ఏకపక్షంగానే చైనా దిగుమతులకు వ్యతిరేకంగాఅదుపు చర్యలు చేపట్టే అవకాశమూ దానికుంది. దీనిపై సైతం ప్రపంచ వాణిజ్య సంస్థలోని రక్షణ ఏర్పాట్లు ఏవీ కూడా చైనాకు వుపకరించవు. అందులోని చట్టపర రక్షణ ఏర్పాట్లను చైనా వినియోగించుకో జాలదు.

యూరోపియన్ యూనియన్‌తో తను చేసుకున్న ఒప్పందంలో చైనా

ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం కింద తనకు దక్కాల్సిన సబ్సిడీలు, పన్ను మినహాయింపులు లాంటి రాయితీలు అవకాశాలను కల్పించే అనేక చట్టాలను ఆశ్రయించే వీలు లేకుండా చేసుకుంది.

ఇలాంటి ఘోరమైన ఒప్పందాలు చేసుకున్న తరువాత కూడా, ప్రపంచీకరించ బడుతున్న ప్రపంచంలోని ఇతర బూర్జువా వ్యవస్థల నుండి చైనా వ్యవస్థను వేరు చేసి చూడడం సాధ్యమా? అయినా కూడా దీనిని 'చైనా లక్షణాలతో కూడిన సోషలిజం' అని అంటున్నారు. ఇందులో 'చైనాది' అంటూ ఏముంది కనుక? అది అంటించుకున్నవన్నీ అచ్చమైన అమెరికా లక్షణాలనే కదా! అయినా నేటికీ సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ మనలను ఇంకా 'వేచి చూడాలని' 'ఎటువంటి తొందరపాటు నిర్ధారణలకు రాకూడదు' అని సలహా యిస్తుంది.

ఇందులో నిజం ఏమిటంటే, సోవియట్ యూనియన్, తూర్పు యూరోపు దేశాల పతనాలను అనుభవాలను చూసిన సిపిసి రివిజనిస్టు నాయకత్వం త్వరగానే ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానాన్ని వదులుకుంది. సోషలిజాన్ని ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానాన్ని ఒకేగాటన కట్టి చూపుతూ సిపిఐ, సిపిఎం తరహా రివిజనిస్టులంతా ప్రపంచ ప్రజలను తేలికగానే గందరగోళ పరిచేవారు. కానీ, ఈనాడు అలా చూపడం గందరగోళపరచడం ఏమాత్రం సాధ్యంకాని తీరులోనే వుంది చైనా తీరు. ఎందుకంటే అక్కడ ఇక ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం అనేది మచ్చుకి సైతం కనబడదు కదా! అక్కడ చైనాలో కొద్దిమంది సంపన్నులు కావడాన్ని సమర్ధిస్తూ బర్ధన్ ఎంతదాకా పోయాడంటే, బూర్జువా ప్రచారాన్ని నెత్తికెత్తుకుంటూ 'సోషలిజం అంటే పేదరికాన్ని పంచడం కాదు' అనే వాదనను లంకించుకున్నాడు! నిజమే! కాని చుట్టూ విస్తృతంగా పేదరికం ఆవరించి వుండగా మధ్యన కొద్దిమంది సంపదలు పోగేసుకోవడం సైతం సోషలిజం కాదు కదా! 'ధనవంతులవడం అనేది చాలా గొప్ప విషయం' అనే డెంగ్ మంత్రానికి బర్ధన్, సూర్జిత్‌లు ఇటీవలి సోషలిస్టు సిద్ధాంతంలో ఒక భాగమని చూస్తూ భాష్యం చెబుతుంటే, లిబరేషన్‌వారు దాని పరిణామాలను 'నిస్సంశయంగా' చూడాలని భావిస్తూ దాని పర్యవసానాలపట్ల ఆశావహంగానే వుండదలచానంది.

చైనా ఆర్థిక వ్యవస్థ లక్షణాలు, దాని దిశాగమనం చూసాం. ఇక ఇప్పుడు ప్రజలపై దాని ప్రభావం, అక్కడ చైనా వ్యవస్థలో పెరుగుతున్న వర్గ విభజనలను చూద్దాం!

## నిఖార్సయిన బూర్జువాజీ లేచి నిలబడతావా!

చైనాలో బూర్జువాలు ఎక్కడున్నారని సిపిఐ, సిపిఎంలు అడగవచ్చు! మహా అయితే అక్కడి 'కమ్యూనిస్టు'లో కొన్ని లోపాలు వుండవచ్చుగాక! కాని, ఖచ్చితంగా సిపిసి సభ్యులు మాత్రం పెట్టుబడిదారులు కాజాలరు, వారిని అలా అనలేం అని అంటారు వీరు! దీనిని ఇలా గాక ఇంకోలా చూడటం అనేది పిడివాదం అవుతుందని కూడా వారు అంటారు. ఈ పిడివాదులంతా స్వచ్ఛమైన సోషలిజాన్ని చూడాలనుకునే ఊహాజనిత వాదులేతప్ప ఆచరణ సాధ్యమైన, మార్కెట్ ఆధారిత, ప్రపంచీకరణ చెందిన నూతన తరహా సోషలిజం వారికి పట్టదు అని విసుక్కుంటారు.

కాట్స్కీ, ప్లెఖనోవ్‌ల కాలం నాటి నుండి కూడా, రివిజనిస్టులతో వచ్చిన సమస్య ఏమిటంటే వారు మార్క్సిజాన్ని తలక్రిందులుగా చూస్తూ వారు ఎల్లవేళలా కూడా ఆచరణ యోగ్యమైన రాజకీయాలు (మరియు ఆర్థికాంశాలు) పేరుతో మార్క్సిస్టు సూత్రాలను తలక్రిందులు చేస్తారు. మార్క్సిజం పేరుతో బూర్జువా వాదనలను ముందుకు పెడుతూ మార్క్సిస్టు మూల సూత్రాలను విస్మరించడం; వాటితో విభేదించే వారినల్లా దూషిస్తూ వారికి ముద్రలు తగిలించడం అనేది వారి పద్ధతి! నిస్సందేహంగా మార్క్సిజం ఒక శాస్త్రమే! (సమాజానికి సంబంధించి) ఇతర శాస్త్రాల లాగానే అది సైతం అభివృద్ధి అవుతుంటుంది, దానిని అభివృద్ధి పరచాలి! శాస్త్రంలో ఒకానొక భాగం తప్పు అని తేలితే దాన్ని సరిగ్గా పరిశీలించి, అందులోని తప్పేవిటో స్పష్టంగా చెప్పాలి, అలానే ఆ భాగం ఎందుకు మారాలో కూడా చెప్పాలి. అలా చేయకుండా చెప్పులకి తగ్గట్టుగా పాదాలను నరుక్కోవడం అనేది ఆచరణ సాధ్యం కానిది, ఆచరణకు అయోగ్యమైనది. అలానే ఈ రివిజనిస్టులు చైనా వ్యవస్థలోని బూర్జువా వాస్తవికతతో సర్దుకు పోవాల్సినవిగా లేక అక్కడి వాస్తవికతలో ఇమిడిపోయేవిగానే మార్క్సిస్టు సూత్రాలను చూస్తుంటారు.

బూర్జువా వ్యవస్థకూ అలానే సోషలిస్టు వ్యవస్థకూ భిన్నభిన్నమైన కొన్ని ప్రాథమిక సూత్రాలు వుంటాయని మనకు అర్థం చేయిస్తుంది మార్క్సిస్టు ప్రాథమిక జ్ఞానం! వీటి ప్రాతిపదికగా పరిశీలిస్తే సంబంధిత సమాజం మౌలికంగా బూర్జువా సమాజమా? లేక అది మౌలికంగా సోషలిస్టు సమాజమా? అనేది అర్థమవుతుంది. అది ఏ రూపమైనా తీసుకోవచ్చు, కానీ, సారం ఏమిటనేద ప్రశ్న! ఉధాసరణకు నేటి చైనాలో 'విలువ సూత్రం' అలానే లాభాపేక్ష అనేవి ఉత్పత్తి క్రమాన్ని అధిగమించుకు పోతున్నాయా? లేక జనబాహుళ్యం సంక్షేమ కోసం ఉత్పత్తి అనేది ఆధిపత్య స్థానంలో వుందా? అక్కడి సమాజం స్వభావాన్ని నిర్ధారించేందుకు మనం తర్కించాల్సిన అసలు ప్రశ్న ఇదే!

సమాజం సోషలిజంలోకి పరివర్తన చెందే దశలో, బూర్జువా సంబంధాలను నిరంతరాయంగా నిరోధిస్తూ ధనిక-పేదల మధ్య అంతరాన్ని పూడ్చేందుకు వర్గ పోరాటాన్ని ముఖ్యమైన సాధనంగా ఎంచుకోవాల్సి వుంటుంది. ఉత్పత్తి, వుత్పాదకత, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అనేవి దానికి (అంటే వర్గ పోరాట క్రమానికి) లోబడే వుండాలి. చైనా లాంటి వెనుకబడిన దేశంలో వుత్పత్తి శక్తులను అభివృద్ధి పరుచడం అత్యవసరమే అయినా వర్గ పోరాటంపై అది పైచేయి సాధించి నట్లయితే అది తప్పక పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకే దారితీస్తుంది, పెట్టుబడిదారీ విధానం తిరిగి నెలకొంటుంది. డెంగ్ తన వుత్పత్తి శక్తుల సిద్ధాంతంతో సరిగ్గా చేసింది ఇది మాత్రమే! బర్ధన్ మనలను నమ్మించ చూస్తున్నట్టుగా నిజమైన సోషలిజం అనేది ఏనాడూ పేదరికాన్ని ప్రస్తుతించదు. అదే సమయంలో అది విశాల ప్రజానీకాన్ని బలిపెట్టి మరీ కొద్దిమంది ధనవంతులై పోవడాన్ని సైతం అంగీకరించదు, అనుమతించదు. కనుకనే, **1976**కు పూర్వపు చైనాలో ధనాధిపతు లెవరూ లేరు, నిజానికానాడు పేదలుగా వుండేవారు సైతం లేరు. ధనికులు-పేదల మధ్య అంతరాలు తగ్గుతూ వచ్చాయి. నిస్సందేహంగా నేటి చైనాలో కొద్దిమంది దగ్గర మేటలు పడుతున్నట్టుగా ఆనాడు ఎవరివద్ద పోగుపడేది కాదు. అలాంటిది **1978**ల నాటి నుండి అమలవుతూ వచ్చిన డెంగ్/జియాంగ్ విధానాల మూలంగా ఒకవైపు చైనాలో కోటీశ్వరులుగా కొద్దిమంది ఎదిగిపోవడం, ఇంకోపక్క విస్తృత జనసామాన్యం పేదరికంలో మగ్గుతుండడం అనేది మనకు కనబడుతుంది. పెద్ద సంఖ్యలో వున్న మధ్యతరగతి ఈ అంతరాలను మరుగు పరుస్తోంది (భారత దేశంలో లాగానే).

**1976**కు పూర్వపు చైనాలో వుత్పత్తి లక్ష్యం ప్రజల బాగోగులు మాత్రమే! ప్రజలకు జీవితావసరాలను సమకూర్చడం, క్రమంగా వారి జీవన ప్రమాణాలను పెంచడం మాత్రమే. కానీ, **1978** తరువాత చైనాలో లాభమే ఉత్పత్తి ఏకైక లక్ష్యంగా మారిపోయింది. శ్రామికుల నుండి అదనపు ఉత్పత్తిని కొల్లగొట్టి దాన్ని పెట్టుబడిదారుల (ప్రభుత్వ లేక ప్రైవేట్) పరం చేయడమే ఉత్పత్తి లక్ష్యం అయింది. విప్లవానంతర చైనాలో తొలిదశలో ఉత్పత్తి క్రమంలో ఏర్పడిన మిగులు అనేది సామాజికోత్పత్తిలో తిరిగి మదుపుగా వినియోగించబడేది. ఆ రకంగా అప్పటి వుత్పత్తి మిగులు అనేది తిరిగి సమాజ పరం అవుతుండేది. శ్రామికవర్గ ప్రభుత్వం/పార్టీ నిర్దేశించిన ప్రణాళికలకు అనుగుణంగా ఇది జరుగుతుండేది! కాని, అదే ప్రభుత్వం/పార్టీ ఒకసారి బూర్జువాగా మారిపోయిన తరువాత (రివిజనిస్టుగా మారిపోయిన తరువాత) ప్రభుత్వ సంస్థల తీరు సైతం ప్రజాసంక్షేమం పట్టించుకోవడం గాక

లాభార్జనే ధ్యేయంగా వుంటుంది. పర్యవసానంగానే అక్కడ అవినీతి, బంధుప్రీతి అనేవి అలవిలేనివిగా పెరిగిపోయాయి.

మునుపటి వారి కంటే చైనా నూతన పాలకులు భారీగా సాధించిన పెరుగుదల/ఉత్పత్తి స్థాయిలు అనేవి ప్రస్తుత వ్యవస్థ ఆధిక్యతను తెలియజేసేవి కావు. ఊదరగొట్టుకుంటున్న ఈ గణాంకాలన్నీ మహా అయితే సమర్ధవంతమైన పెట్టుబడిదారీ వ్యవస్థ చిహ్నాలు మాత్రమే! దీనికి తోడు – అప్పటికి మూడు దశాబ్దాలుగా జరుగుతూ వచ్చిన సోషలిస్టు నిర్మాణం కారణంగా ప్రజల్లో పెరిగిన కొనుగోలు శక్తి, దేశవ్యాపితంగా అభివృద్ధి అయిన విస్తృత మౌలిక సౌకర్యాల మూలంగానే అలాంటి త్వరితాభివృద్ధి సాధ్యమైందని మనం మరిచిపోరాదు. (ఉతాహరణకు తాచాయ్ చమురు క్షేత్రాలు, భారీ స్థాయి నీటిపారుదల ప్రాజెక్టులు). ఈ కారణం చేతనే చైనాలో తలసరి వస్తువుల వాడకం అనేది భారత్ లాంటి అర్ధవలస అర్ధభూస్వామ్య దేశాలలో కంటే ఎక్కువగా వుంది. ఉత్పత్తిలో పెరుగుదల రేటు వెర్రిగా పెరిగిపోవడం అనేది సోషలిస్టు దశలో ప్రధాన లక్ష్యం కానేకాదు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడమే ప్రధానం! దీనికి తోడు వుత్పత్తి శక్తుల అభివృద్ధికీ – ఉత్పత్తి సంబంధాలకు మధ్య సమన్వయాన్ని, సమతుల్యతని అది లక్ష్యంగా చేసుకుని దాన్ని సాధించాల్సి వుంటుంది. ఎందుకంటే – ఉత్పత్తి సంబంధాలు వెనుకబడి పోతుండగా ఇంకోపక్క వుత్పత్తి శక్తుల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేసినట్లయితే అటు పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకే దారి తీస్తుందని సోవియట్ అనుభవం మనకు స్పష్టం చేసింది. కనుకనే సాంస్కృతిక విప్లవం ద్వారా ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించాలని మావో కోరుకున్నాడు. కనుక ఉదాహరణకు ఒక ఫ్యాక్టరీలో కార్మికులకూ – యాజమాన్య సిబ్బందికీ (ప్రత్యేకించి యజమాని) మధ్య సంబంధం అనేది క్రమేపీ ఉత్పత్తి క్రమంలో సాధారణ నియంత్రణ క్రిందకి రావాల్సి వుంటుంది. (ఉమ్మడి నియంత్రణ క్రిందకి). కేవలం వుత్పత్తికే ప్రాధాన్యత నిస్తూ యాజమాన్యం కార్మికుల మధ్య (అంటే ఇక్కడ మేనేజర్ – కార్మికులు అనే) ఉత్పత్తి సంబంధాలను నిర్లక్ష్యం చేస్తే మెల్లగా యాజమాన్య సిబ్బంది నూతన బూర్జువాగానూ, అదనపు విలువను చేజిక్కించుకునే మేనేజర్ ఫ్యాక్టరీకి నిజమైన యజమానిగాను మారిపోతారు. సాంస్కృతిక విప్లవ కాలంలో ఉత్పాదకత తక్కువగా వున్నా కూడా ఉత్పత్తి సంబంధాలనుగాని పునర్ వ్యవస్తీకరిస్తే ఉత్పాదకత పెద్ద యెత్తున విస్తరించి వుండేది. కానీ, దురదృష్టవశాత్తు, అప్పటికే బాగా వేళ్లూనుకున్న బూర్జువా శక్తులు మావో కన్నుమూసిన వెనువెంటనే రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడంతో యిది జరగలేదు. డెంగ్ అధ్వర్యంలో ఉత్పత్తి పెద్దయెత్తున పెరిగినా దానితో పాటే పెట్టుబడిదారీ విధానం సైతం పెరిగింది. ఫ్యాక్టరీలో మేనేజర్ కొత్త తరహా పెట్టుబడిదారుడై కూర్చున్నాడు. అలానే అఖిల చైనా స్థాయిలో పార్టీ నాయకులంతా, పై స్థాయి అధికారులంతా నూతన పాలక బూర్జువా వర్గంగా అభివృద్ధి అయ్యారు.

**1978**లో చైనాలో ప్రారంభమైన పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ, అక్కడి వ్యవస్థలో పదునెక్కుతుండిన వర్గ వైరుధ్యాలు అనేవి **15**వ కాంగ్రెస్ తరువాత, ప్రపంచీకరణ చెందిన దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక పెద్ద గెంతుగా దూసుకెళ్లాయి. విచిత్రమైన విషయం ఏమంటే – నియంతృత్వ కమ్యూనిస్టు పాలనగా తప్పుడు చిత్రీకరణకు గురైన సాంస్కృతిక విప్లవ కాలంలో తలెత్తిన 'ప్రజాస్వామ్య కుడ్యం' ()పై నయా ఉదారవాది డెంగ్ విరుచుకు పడ్డాడు. మావో ఆలోచనా విధానానికి అనుగుణంగా మావోయిస్టు తరహాలో నాటి రాజ్యాంగంలో పొందుపరుస్తూ ప్రజలకిచ్చిన 'నాలుగు మహా స్వేచ్ఛలు' సమ్మెహక్కుతో సహా, అనే వాటిని సైతం డెంగ్ నూతన రాజ్యాంగం మూలన పెట్టింది. ఇది జరిగిన తరువాత కూడా తియనాన్‌మిన్ తిరుగుబాటు తరువాత గడచిన దశాబ్ది కాలమంతటా కార్మిక, రైతాంగ పోరాటాలు (తిరుగుబాట్లు సైతం) మరింత మరింతగా చెలరేగుతూనే వచ్చాయి.

కమ్యూన్లని, కోపరేటివ్‌లని రద్దు చేసేసిన తరువాత ఘోరంగా దెబ్బతిని పోయినవి ఏవంటే చైనా గ్రామీణ ప్రాంతాలేనని చెప్పాలి. జనభాలో **70** శాతం మంది వుండే గ్రామీణ ప్రాంతాలలో పెట్టుబడిదారీ శక్తులు విజృంభించడంతో అక్కడ వర్గ సమీకరణలలో మార్పులు చోటు చేసుకున్నాయి. సాలీనా **8** నుండి **10** మిలియన్ల గ్రామీణ వ్యవసాయ కార్మికులు ఉపాధికి దూరమైపోతో వచ్చారు. వరదలు మరో **14** మిలియన్ల మందిని నిర్వాసితులను చేసాయి. ఆ రకంగా ఏ విధమైన సాంఘిక భద్రతా లేకుండా, భూమి కాని ఎలాంటి వుద్యోగంకానీ లేకుండా వుంటున్న జనాభా చైనా గ్రామీణ వ్యవస్థలో ఈనాడు **20**కోట్ల మంది వుంటారు. ఇలాంటి నిర్వాసిత గ్రామీణ ప్రజలు ఎల్లవేళలా చైనాలోని నగరాలలో చిన్న చిన్న వుద్యోగాల కోసం దేవులాడడాన్ని మనం గమనించ వచ్చు! ఇలా దేవులాడే వారు **80** నుంచి **130** మిలియన్ల మధ్య వుంటారు. ఇలాంటి దుర్భర జీవితాలను వెళ్లదీసే ఈ దౌర్భాగ్య జనబాహుళ్యమే పెట్టుబడిదారీ పునరుద్ధరణ దుష్ప్రభావానికి ఎక్కువగా గురైనది!

చైనాలోని మరే ఇతర వర్గం కంటే కూడా ఈ గ్రామీణ నిర్వాసిత ప్రజలే పట్టణవాసుల తూష్ణీకార దృష్టికి, అధికార యంత్రాంగపు న్యాయ వివక్షతకి ఎక్కువగా గురవుతుంటారు. నిజానికీ నిర్వాసిత జనాభా అంతా రెండవ తరగతి పౌరులు మాత్రమే! ఏమంటే కుటుంబ రిజిస్ట్రేషన్ (కుటుంబ నమోదు) – దీనినే 'హుకాన్' అంటారు – తో కూడిన పట్టణ వాసులకుండే హక్కులు సదుపాయలేవీ వీరి కుండవు. ఈ హుకాన్ లేకుండా ఏ ఒక్కరూ బడిలో చేరలేరు, వైద్య సదుపాయం పొందలేరు, ఇంటిని కలిగుండలేరు. ఉదాహరణగా చూడాలంటే – కళ్లు మిరుమిట్లు గొలిపేట్టుగా జరిగిన చైనా రిపబ్లిక్ **50**వ వార్షికోత్సవాల సందర్భంగా బిచ్చగాళ్లు, వేశ్యలు, **3** చక్రాల బళ్లను నడిపేవారు, అనాధ పిల్లలు, మతి స్థిమితంలేనివారు – ఇలాంటి వారిని **3** లక్షల మందిని బీజింగ్ నగరం నుండి వెలుపలికి తరిమివేసారు. ఇంకా అనేక మందిని 'సంక్షేమ కేంద్రాల'లో ఒక రకమైన బంధీలుగా నిర్బంధించారు, వీరి స్థితి ఎక్కువ పాళ్లు నిర్బంధ శిబిరాల్లో వున్నవారి లాంటిదే! అధికారుల 'నిర్బంధ, పునరావాస' విధానాల ఆత్మసాక్షాత్కారానికి ఇవి నిదర్శనాలు, ఎందుకంటే న్యాయాన్ని పొందే క్రమాన్ని ఏ మాత్రం ఖాతరు చేయకుండా సాగే అక్రమ నిర్బంధాలన్నింటినీ సదరు విధానాలు అనుమతించ గలవు.

డెంగ్ ఆర్థిక సంస్కరణలు ఎంతటి వేగంతో ఉరకలు వేసాయంటే, **1980**వ దశకం ప్రారంభం నాటికే చైనా గ్రామీణ ప్రాంతంలో **100** మిలియన్ల మంది అదనపు శ్రమశక్తిగా పోగుపడ్డారు. చైనాలో పెట్టుబడిదారీ విదానం అభివృద్ధి కావడానికి దోహదపడింది ఇదిగో ఈ అపార నిరుద్యోగ సైన్యమే! గ్రామీణ చైనా అంతటా గ్రామీణ వాణిజ్య సముదాయాలను అభివృద్ధి చేయడం ద్వారానే చైనాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయింది. ఈ అదనపు శ్రమశక్తి అంటూ లేకుంటే, అత్యధిక పెరుగుదల రేట్లని సుసాధ్యం చేసే స్థాయిలో చైనా నూతన పాలకవర్గం అపార లాభాలను పిండుకోగలిగి వుండేది కాదు. చైనాలోని నూతన ప్రైవేట్ రంగానికి అవసరమైన శ్రమశక్తిని కారుచౌకగా అందించింది ఈ నిర్వాసిత వలస ప్రజలే! కాని వారి శ్రమకి ఎలాంటి ప్రాముఖ్యత వున్నట్టుగా కనబడదు.

ఉదాహరణకి, హాంకాంగ్‌కి దగ్గరలోని ఝూంగ్‌షన్ మరియు చుట్టుపక్కల జిల్లాలోని వరి పొలాలన్నీ ఫ్యాక్టరీలుగా మారిపోయాయి. దూర గ్రామాల నుండి పని కోసం పొట్టచేత పట్టుకు వచ్చి చేరిన నిర్వాసిత కూలీలే అక్కడ పనికి మందలు మందలుగా చేరిపోయారు. అలాంటి వేతన కూలీలలో ఎక్కువ శాతం మంది లిఖిత ఒప్పంద పూర్వక కాంట్రాక్టు పద్ధతిలో బానిస కూలి రేట్లకే పని చేసే యువతులే! సంవత్సరం కాలం పూర్తి కాకుండానే మధ్యంతరంగా ఏ ఒక్కరూ పనిని విడిచి వెళ్లిపోకుండా కట్టడి చేయడానికి వీలుగా యాజమాన్యాలు ఆరు మాసాల జీతాన్ని ఇవ్వకుండా తమ వద్దనే వుంచేసుకుంటారు, గడువు కాలం సంవత్సరం పూర్తిగా పనిలో వుండకుండా పోయేవారెవరైనా తమ ఆరు మాసాల శ్రమఫలాన్ని ఒదులుకోవాల్సిందే! ఈ యువతులు, బాలికల్లో ఎక్కువ మంది రోజుకి **12** గంటల పనితో కూడిన **7** రోజుల వారంతో కూడిన నెలసరి వేతనాలకి పని చేస్తుంటారు, వీరికెలాంటి బోనస్‌గాని, అదనపు పని కాలపు చెల్లింపుగాని

వుండవు. ఈ షూంగ్‌షన్ ప్రాంతంలో ప్రతిదీ ప్రైవేటీకరించబడే వుంటాయి. ఇంకా ఆ మూలా ఈ మూలా మచ్చుగా మిగిలిపోయిన సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు పట్టణ మరియు గ్రామీణ వాణిజ్య సముదాయాలు వాటి ముసుగులను తొలగించుకుంటూ తాము కూడా ప్రైవేటుచకరించ బడడానికి సిద్ధం అంటూ తహతహలాడి పోతున్నాయి.

**1978**ల నుండి డెంగ్ అమలు చేసిన సంస్కరణలు ఒక్క వ్యవసాయ రంగాన్నే కాదు, యావత్ దేశాన్ని కూడా ప్రైవేటీకరణ వేపు నెట్టాయి. **1978** నాటికి ప్రభుత్వ యాజమాన్య సంస్థలు జి.డి.పి.లో **77.6** శాతం కలిగి వుండగా **1992** నాటికి అది కేవలం **48.1** శాతం మాత్రమే! ఇంకో పక్క గ్రామీణ ప్రాంతాలలోని 'సమిష్టి వ్యాపార సంస్థ'ల వాటా అనేది **38** శాతానికి పెరగగా ప్రైవేట్ సంస్తల వాటా కేవలం **14** శాతమే!

**1990**ల ప్రారంభం నాటికే చైనా ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యాపార సంస్థలు అవినీతి, బంధుప్రీతి, ప్రైవేటుగా ఆస్తుల పోగువేత లాంటి సవాలక్ష రుగ్మతలకి నిలయాలైపోయాయి. 'చైనా లక్షణాలతో కూడిన విలక్షణ సోషలిజం' అంటే ఇదే కాబోలు! ద్రవ్యోల్బణం ఏ సంవత్సరం **20** శాతానికి తక్కువగా వుండదు. దేశ పశ్చిమ ప్రాంతంలోనూ, ఇతర వెనుకబడిన ప్రాంతాలలోనూ రైతాంగ తిరుగుబాట్లు జరుగుతూ వచ్చాయి. పని కోల్పోయిన శ్రామిక జనబాహుళ్యం వీధుల్లో పడ్డారు. ఆర్థిక పరిస్థితి అత్యంత వేగంగానే పురోగమించినా కూడా అది సంక్షోభం దిశగానే ప్రయాణించింది. సోవియట్ యూనియన్ తూర్పు యూరోప్ దేశాలలో అక్కడి ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థలు కుప్పకూలిపోయిన అనుభవాలు వుదాహరణలు తలబొప్పి కట్టిన తీరులో కట్టెదుటనే కనబడుతున్నాయి. దీనికి అదనంగా జోడింపు అయింది ఆగ్నేయాసియా, (సౌత్ ఈస్ట్ ఏసియా)లోని 'పులుల' అనుభవం. ఈ పులులు అప్పటికే పిల్లుల్లా ముడుచుకుపోయాయి. దీని ప్రభావం చైనా ఆర్థిక వ్యవస్థకి ఒక హెచ్చరికగానే పని చేసింది. ఈ అంశాలన్నీ మూకుమ్మడిగా **1997**లో చైనా కమ్యూనిస్టు పార్టీ (సి.పి.సి) తన **15**వ మహాసభల ద్వారా **2**వ విడత సంస్కరణలను వేగవంతం చేయడానికి దారితీసాయి.

సి.పి.సి నాయకత్వపు సృజనాత్మకతను రుజువు చేసే చర్యలుగా వీటిని బహుశా రివిజనిస్టు సి.పి.ఐ, సిపిఎంలు భావించవచ్చు! సాంప్రదాయ ఛాందస మార్క్సిస్టుల ఆలోచనకి భిన్నమైన ఈ తీరుని వారు అందుకే ఆహ్వానిస్తుండవచ్చు! నిజమే! సిపిసి చేపట్టిన చర్యలు నిజానికి రోగగ్రస్థమైన ప్రభుత్వ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అవసరాలకి తగినవే, కాని ఇక్కడ సిపిసి సోవియట్ పంథాని అనుసరించకుండా తెలివిగా వ్యవహరించిందనే చెప్పాలి. అయితే దీనికి సోషలిజంతో ఎలాంటి సంబంధమూ లేదుకాక లేదు. తాము సృజనాత్మక పెట్టుబడిదారులని చైనా కమ్యూనిస్టు పార్టీ పాలకులు రుజవు పరుచుకున్నారు, కనుకనే వారు తమ పార్టీ అంత్యక్రియలను మరి కొద్ది సంవత్సరాలపాటు వాయిదా వేసుకో గలిగారు, అంతే! మొత్తం ప్రైవేటీకరణ వేపు, ఐఎంఎఫ్ తరహా ఆర్థిక విధానం వేపు మళ్లిపోవడం ద్వారా తాత్కాలికంగా అభివృద్ధి నిలకడనేది సాధ్యమైంది కావచ్చు! కాని అది అపరిమిత మానవ మూల్యంతోనే సధ్యామైందనేది మరిచిపోరాదు.

**1998** నాటికే **20** మిలియన్ల మంది ప్రభుత్వ రంగ వుద్యోగలు 'లే ఆఫ్'కి (తాత్కాలిక నిరుద్యోగం/పని లేమికి) గురయ్యారు. ప్రభుత్వ రంగాన్ని, పట్టణ సంక్షేమ వ్యవస్థని సమూలంగా సంస్కరించ బోతున్నట్టుగా **1998** మార్చి **17**న చైనా ప్రధాని ఝురేఝంగ్జీ ప్రకటించాడు. ఇందులో దాగున్న పథకం ఏమంటే – 'అసమర్థ' ప్రభుత్వ రంగ సంస్థలకి రుణాల కోత; రాగల మూడు సంవత్సరాలలో **30** మిలియన్ల మంది ప్రభుత్వ వుద్యోగులను ఊడబెరికి ఇళ్లకి పంపడం; పట్టణాలలో గృహ సముదాయాలను అమ్మకం పెట్టుడం ద్వారా నిధులు పెంచుకోవడం; వైద్య సంక్షేమంపై భారీగా కోత – ఇవీ 'సంస్కరణలు'! ఇక వీటితో పాటే **40**గా వుండిన మంత్రివర్గాలను **29**కి తగ్గించేయడం ద్వారా **17**వేల మంది పౌర సేవా రంగంలోని సీనియర్ అధికార్లని ఇళ్లకి పంపడం సైతం జరిగిపోయింది.

ఉదాహరణగా లియోనింగ్ పట్టణాన్నే తీసుకుంటే – ఈ పట్టణంలో **1995** నాటికి **12** మిలియన్ల పట్టణ కార్మికవర్గం, **3.3** మిలియన్ల నిరుద్యోగ యువత వుండేవారు. **1996** నాటికి ఈ పట్టణ నిరుద్యోగతం **8** లక్షలకి ఎగబాకిపోయింది, **1998** నాటికి పట్టణంలోని మొత్తం శ్రమశక్తిలో **18** శాతం నిరుద్యోగులై పోయారు. ఇకప్పటి నుండి ప్రతి ఏటా **4** లక్షల మందికి తక్కువ కాకుండా ఆ పట్టణంలో నిరుద్యోగు లవుతున్నారనేది అధికార గణాంకాలు చెప్పే సత్యమే!

పాత ప్రభుత్వరంగ సంస్తలు అంటే తొలినాటి ప్రభుత్వరంగ సంస్థలు సంస్థ వుద్యోగులకు మంచి జీతాలు ఇస్తుండేవి; మంచి గృహవసతి కల్పించేవి; సంస్థ నడిపే స్కూళ్లలో వుద్యోగుల పిల్లలను చదివించేవి; వుద్యోగ కుటుంబాల వైద్య బాధ్యతలు చూసేవి; పదవీ విరమణ చేసిన వుద్యోగులకు పెన్షన్ హక్కుని అమలు చేసేవి. కాని ఇపుడు పరిస్థితి మారిపోయింది, పూర్తిగా మారిపోయింది. క్రమక్రమంగా ఈ సౌకర్యాలు, రాయితీలన్నీ కోతపడ్డాయి. ఇప్పుడు వుద్యోగులు ప్రతిదానికీ డబ్బు చెల్లించాల్సిందే, ఇల్లు, పిల్లల చదువు, వైద్యం అన్నీ కొనుక్కోవాల్సినవే! ఇదంతా ప్రపంచబ్యాంకు దుర్వాసనగా లేదా?! కాని సిపిఐ, సిపిఎంలు అలా అనడాన్ని ఒప్పుకోవు. ఇదంతా 'చైనా స్వాభావిక లక్షణాలతో కూడిన సోషలిజం'గా అర్థం చేసుకోవాలని అవి మనకి సలహా ఇస్తాయి.

ఆ రకంగా మిలియన్లకొద్దీ ప్రజలు పేదరికం బీదరికం వేటు పడిపోతుండగా ప్రధాన నగరాలన్నింటిలో కొత్త ధనిక వర్గాలు తలెత్తడాన్ని మనం గమనించ వచ్చు! ఇది జరుగుతుంది ఒక్క హాంకాంగ్‌లోనే కాదు, పెద్ద నగారలన్నింటిలో జరుగుతున్నదే! ఉదాహరణకి బీజింగ్ నగరంలో ఈనాడు అతి విలాసవంతమైన భవన సముదాయాలు వున్నాయి. కనుకనే 'అట్లాంటిక్ ప్లేస్' అనే ఒక కాంప్లెక్సులో ఒక ఇంటి ఖరీదు **60** లక్షల రూపాయలు. ఈ కాంప్లెక్సులో పార్క్‌ల్యాండ్, సరస్సు, ఈతకొలను, టెన్నిస్‌కోర్టులు, క్లబ్బు వుంటాయి. ఝియాంఘ్జి కొత్తగా రూపుదిద్దుకున్న పట్టణం, ఇది షాంఘై నదికి ఇరువైపులా విస్తరించి వుంది. ఇది చైనాలో 'సిలికాన్ వేలి'గా వెలిగిపోతోంది. ప్రసిద్ధ తైవానీ కంప్యూటర్ కంపెనీలన్నీ ఇక్కడే వుంటాయి. అంతే కాదు ప్రధాన అమెరికా జపాన్ కంపెనీలకు సైతం ఈ నగరం స్థావరమే! ఇక షాంఘై నగరం **5** నక్షత్రాల హోటళ్లతో కూడిన నూతన ధనిస్వాముల స్వర్గం! అనేలానే ఝింటియాండి ప్రాంతం **3.5** బిలియన్ డాలర్ల విలువ చేసే ఒక అతి ఖరీదైన కాంప్లెక్స్ సెంటర్‌గా పెరిగిపోయింది, ఇది **68** అంతస్థుల కాంప్లెక్స్, అతి విలాసవంతమైన హోటల్ దీనిలో వుంది. ఇక జియాంగ్సు రాష్ట్రంలోని కున్‌షాన్ నగరం అలానే పెద్ద నగరాలైన ఛాంగ్‌క్వింగ్, షెజ్‌పాన్, డాంక్వింగ్ – వీటన్నింటి పరిస్థితి సుమారుగా ఇదే! అంతేకాదు ఈ దుష్ప్రభావం అనేది క్వింగ్‌డావో, తియన్‌జిన్ అనే ఎల్లోనది పైని చిన్న పట్టణాలకి అలానే డాలియన్ అనే మరో చిన్న పట్టణానికి సైతం సోకిపోయింది. ఈనాడు హాంకాంగ్ అనేది సుమారుగా చైనా 'వాల్‌స్ట్రీట్'గా మారిపోయింది. చైనాలో తలెత్తిన నూతన బూర్జువా వర్గీయులు తమ అమెరికా, జపాన్, తైవాన్‌లలోని తమబోటి సహచర వర్గీయులతో చెట్టాపట్టాలేసుకు తిరగడాన్ని మనం నైట్ క్లబ్బుల్లోను, ఈ నగరాల్లోని విలాసవంతమైన రెస్టారెంట్లన్నింటిలోనూ మనం గమనించవచ్చు!

చైనాలో నూతన బూర్జువాని కనుగొనడం పెద్ద కష్టమేమీ కాదు. వారు వారి ఆడంబరమైన, విలాసవంతమైన ఖర్చు ద్వారానే తమ ఆనవాళ్ళని చాటుతుంటారు! ఆహా! 'ధనంతో తులతూగు తుండటమే గొప్ప విషయం!' కదా! ఈ గొప్ప ప్రచవచాన్ని అందించిన డెంగ్ బ్రతికి వుండినట్లయితే తన ప్రవచనాలు తన కృషి ఎంత చక్కగా ఫలించిందో చూసి తరించేవాడు కదా! కాని మన సిపిఐ, సిపిఎంలు వీటన్నింటి గూర్చి కళ్లు మూసుకుంటాయి, కాగా సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ ఇంకా 'ఈ కొంగ్రొత్త అనుభవాన్ని నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలి' అనే అంటుంది.

***(మిగతా భాగం వచ్చే సంచికలో)***

# అరుదైన ఒక పుస్తకం గూర్చి! అది చెప్పిన ఒక భయానక విప్లవ విద్రోహం గూర్చి!!

ఇంగ్లండులోని డబ్లిన్ నగరం నుండి ప్రచురించబడే 'సండే ట్రిబ్యూన్' పత్రికకు ఉత్తర ఐర్లెండ్ సంపాదకుడుగా పని చేస్తుండేవాడు ఎడ్ మోలోనీ. మోలోనీ పరిశోధనాత్మక పాత్రికేయుడు. మంచి రాజకీయ విశ్లేషకుడు కూడా. అతడు ఇటీవలనే 'ఐరిష్ రిపబ్లికెన్ ఆర్మీ రహస్య చరిత్ర' అనే పుస్తకాన్ని రాసి ప్రచురించాడు. మోలోనీ గడచిన **20** సంవత్సరాలుగా ఐర్లెండ్ ఉత్తరాదిన సాగుతున్న సాయుధ సంఘర్షణపై శ్రద్ధాశక్తులతో పరిశీలన జరుపుతూ వచ్చినవాడు. ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ఐ.ఆర్.ఏ.తోనూ, ఆ పోరాటాన్ని విచ్ఛిన్నం చేసి అణచివేయ ప్రయత్నిస్తున్న బ్రిటీష్ ఐరిష్ ప్రభుత్వ వ్యవహారాలతోనూ సన్నిహిత పరిచయం కలిగున్నవాడు మోలోనీ. వాటికి సంబంధించి లోతైన సమాచారం కలిగున్నవాడు. సీరియస్ జర్నలిస్టు అయిన మోలోనీ తన వృత్తిధర్మంలో భాగంగా కొంతమందికి చాలా ఇబ్బందిని కలిగించే అనేక చేదు ప్రశ్నల్ని లేవనెత్తుతూ వచ్చాడు ఇలా ప్రశ్నించడానికి అతడు ఏనాడూ వెరవలేదు. పాత్రికేయ సాంప్రదాయక ప్రవర్తనకి సంబంధించిన చాదస్తాలెన్నింటికో అతడు ఒక సవాల్‌గా నిలిచాడు. ఐ.ఆర్.ఎ. బ్రిటీష్ ప్రభుత్వాలతో కుదుర్చుకున్న ఒక 'శుభ శుక్రవారపు ఒప్పందం' పట్ల అనుమానాన్ని నిరసను వ్యక్తం చేసినందుకుగాను మోలోనీ తన సంపాదక పదివికి ఎసరు తెచ్చుకున్నాడు. అయినా అతడు లొంగలేదు. ఐ.ఆర్.ఏ ఆంతరంగిక వ్యవహార సరళిపై పరిశోధనాత్మక కృషి చేస్తూ వచ్చిన మోలోనీ రాసిన పుస్తకం ఐ.ఆర్.ఏ ఆంతరంగిక నిర్మాణ స్థితిపై వెలువరించిన ఒక అధికార పత్రం అనే ఎప్పవచ్చు. మోలోనీ పుస్తకంపై మనోట్టమొదటి సమీక్ష న్యూజలాండ్ నుంచి వెలువడే 'రివల్యూషన్' పత్రిక **2002** మార్చి–మే సంచికలో వెలువడింది. ఆ సమీక్షా సారాంశమే ఈ వ్యాసం.

దేశదేశాల్లోని అనేక జాతీయ పోరాటాలకు, ప్రత్యేకించి బ్రిటిష్ వలసాధిపత్యంలో మగ్గుతుండిన వివిధ జాతుల పోరాటాలకి ఐరిష్ జాతీయ పోరాటం అనేది గొప్ప వుత్తేజంగా వుంటూ వచ్చేది. ఐరిష్ రిపబ్లిక్ స్ఫూర్తి అనేది (ఐరిష్ రిపబ్లికనిజం) వివిధ జాతీయ పోరాటాలకు ఆదర్శప్రాయంగా వుంటుండేది. కేవలం దమననీతి అణచివేతల తోనే ఐర్లెండ్ స్వాతంత్ర్య పోరాటాన్ని అంతం చేయడం బ్రిటిష్ వలస రాజ్యానికి అలవికానిదై పోయింది. క్రూరమైన అణచివేత ద్వారా ఐరిష్ సమాజంలో తానే సృష్టించిన అశాంతికి తెరదించాలని చెబుతూ, కీలుబొమ్మ ఐరిష్ ప్రభుత్వాన్ని మధ్యవర్తిగా పెట్టుకుని బూటకపు 'శాంతి ప్రక్రియ'కి తెరతీసింది బ్రిటిష్ ప్రభుత్వం. తడిగుడ్డతో గొంతు కోసే బ్రిటిష్ ప్రభుత్వ శాంతి ప్రక్రియ విధానం అనేది ఆద్యంతం స్వయానా ఐ.ఆర్.ఏ అధినేత జెర్రీ ఆడమ్స్ కనుసన్నల్లోనే సాగిపోవడం అనేదే అసలు విషాదమంతా. ఈ విషాదం పూర్వాపరాలను ఈ విద్రోహం తీరు తెన్నులను కళ్లకు కట్టినట్టు తన పుస్తకంలో ప్రదర్శించాడు మోలోనీ.

ఆల్ఫ్రెడో స్కాప్పాటిసి అనే బ్రిటిష్ గూఢచారి ఏజెంట్, స్టేక్‌నైఫ్ అనే సరికొత్త నామంతో (కోడ్ నేమ్) ఐరిస్ రిపబ్లికెన్ ఆర్మీ (ఐ.ఆర్.ఏ)లోకి చొచ్చుకు పోయాడు. అలా చొచ్చుకు పోయిన స్కాప్పాటిసి అప్పటికి **20** సంవత్సరాల బట్టి ఐ.ఆర్.ఏకి నాయకత్వం వహిస్తుండిన దాని అధినేత గెర్రీ ఆడమ్స్‌కి అతి తక్కువ కాలంలోనే అత్యంత విశ్వసనీయ ఆప్తమిత్రుడై పోయాడు. అంతేకాదు, చకచకా ఐ.ఆర్.ఏ ఆంతరంగిక భద్రతా విభాగపు ఉపనాయకుడుగా ఎదిగి పోయాడు. ఆ స్థాయిలో, స్థానంలో అతడు ఏకంగా **25** సంవత్సరాలపాటు నిరాటంకంగా కొనసాగాడు. ఐ.ఆర్.ఏ అధినేత ఆడమ్స్‌ని, ద్వితీయ శ్రేణికి చెందిన మరి కొంతమంది నాయకులను తన బుట్టలో వేసుకోడానికి స్కాప్పాటిసి బ్రిటిష్ ప్రభుత్వం సైన్యాలకు సంబంధించిన ఎలాంటి ప్రాధాన్యతా ప్రమాణాలు లేని సమాచారాన్ని వారికి అందిస్తూ వారికి దగ్గరయ్యాడు. ఆరకంగా స్కాప్పాటిసి ఒక డబల్ ఏజెంట్‌గా ద్విపాత్రాభినయం చేసి విద్రోహాన్ని రక్తి కట్టించాడు. ఐ.ఆర్.ఏ మెడలు వంచాడు.

అధినేత ఆడమ్స్ ఆమోదంతోనే ఐ.ఆర్.ఏ అగ్రనాయకులు కొందరితోసహా **40** మంది మెరికల్లాంటి ఐ.ఆర్.ఏ కార్యకర్తలను అనుమానిత ఇన్ఫార్మర్లు అనే ముద్రతో నిలువునా హత్య చేయించాడు స్కాప్పాటిసి. ఆడమ్స్ ఆమోదంతో బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'శాంతి ప్రక్రియ'ను వ్యతిరేకించడమే వారంతా చేసిన నేరం. జాన్ మెక్కాన్ విల్లే లాంటి ప్రముఖ నాయకునితో పాటు చాలా మంది ఐ.ఆర్.ఏ కార్యకర్తలు 'అదృశ్యమై పోయిన' వారి జాబితాలో చేరిపోయారు. నిజానికి వీళ్లందరినీ ఆడమ్స్ ఆమోదం, ఆశీర్వాదాలతో స్కాప్పాటిసి నిలువునా హత్య చేయించాడు. కాని వీరి ఆచూకీ తమకు తెలీనే తెలియదంటూ ఇన్నాళ్లుగా ఐ.ఆర్.ఏ.ను దబాయిస్తూనే వచ్చింది.

ఐ.ఆర్.ఏ.లో అత్యధిక శాతం మంది అనుమానానికి అసమ్మతికి గురైన 'శుభ శుక్రవారపు ఒప్పందం'ని ఐ.ఆర్.ఏ నెత్తిన బ్రిటిష్ ప్రభుత్వం రుద్ద గలిగిందీ అంటే అది స్కాప్పాటిసి గూఢచౌర్యం; అతడితో అన్నిరకాల అపవిత్ర మైత్రీ బంధాన్ని ఏర్పర్చుకుని అతడికి అమ్ముడుపోయిన ఐ.ఆర్.ఏ అధినేత ఆడమ్స్ ఆమోదం వల్లనే అది సాధ్యమయ్యింది.

అంతేకాదు ఎస్కాండ్ ఆర్మ్స్ హిప్‌మెంట్ (ఎస్కాండ్ ఆయుధ నౌక) ఐ.ఆర్.ఏ.కి చిక్కకుండా దాన్ని ఐ.ఆర్.ఏ చిక్కబట్టుకునే పథకాన్ని భగ్నపరిచింది ఈ స్కాప్పాటిసీయె. అదీ ఆడమ్స్ సాయంతో. ఆ పథకమే ఐ.ఆర్.ఏ వశమై వుంటే దాని ఎదురుదాడి (అఫెన్సివ్) చాలా తీవ్రంగా వుండేది. ఐ.ఆర్.ఏ యొక్క ఈ వైఫల్యం అనేది ఆడమ్స్ 'శాంతి వ్యూహాన్ని' మరింత బలోపేతం చేసిందనే చెప్పాలి. తమ చెప్పుచేతల్లో వుంటూ పని చేసే ఆడమ్స్‌కి అడ్డు చెప్పే, అతడికి చిక్కులూ చికాకులూ కలిగించే వారందరినీ ఐ.ఆర్.ఏ నుండి తుడిచి పెట్టేయడానికి బ్రిటిష్ గూఢచారి విభాగం స్కాప్పాటిసి ద్వారా విజయవంతంగానే కృషి చేసింది. జిమ్ లినాయ్ తదితర ముఖ్య ఐ.ఆర్.ఏ శక్తులను అలానే నిర్మూలించింది. **1987**లో బ్రిటిష్ సైన్యం జరిపిన ఒక మాటు దాడిలో వీరంత హతమయ్యారు.

ఈ విద్రోహ కుట్రలన్నింటినీ కాదనలేని వాస్తవాలు వాదనలతో మోలోనీ తన పుస్తకంలో కళ్లకు కట్టినట్టుగా అభివర్ణించాడు. ఆడమ్స్ లాంటి ఐ.ఆర్. నాయకుల నిజాయితీ లేమినీ, వారి దిగజారుడు తదనాన్ని, అమ్ముడుపోయే తీరుని, వారి లొంగుబాటు మెకానిజాన్ని మోలోనీ శక్తివంతంగా బహిర్గత పరిచాడు. చాలా మందిలో ఎంతో గౌరవ స్థానాన్ని పొందిన ఐరిస్ రిపబ్లిక్ నిజానికి ఈ దిగజారుడు నాయకత్వం తలపెట్టిన విద్రోహాన్ని నిస్సందేహంగా ఎండగట్టాడు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదం గుండెల్లో గుబులు పుట్టించిన ఐ.ఆర్.ఏ తిరుగుబాటు ఒక క్రమంలో బూటకపు శాంతి వ్యూహం దిశగా ఎలా పతనమై పోయిందో మోలోనీ తన పుస్తకంలో సాక్ష్యాధారాలతో సాధికారంగా నమోదు చేసారు. అయినా ఇప్పటికీ తాము 'ఓడిపోని ధిక్కార సేన'గా కొంతమంది ఐ.ఆర్.ఏ నాయకులు చెప్పుకోవడాన్ని మోలోనీ ఎద్దేవా చేస్తాడు. ఐ.ఆర్.ఏని నడుపుతూ వచ్చిన వివిధ స్థాయిల నాయకుల వ్యక్తిగత వ్యవహార సరళిని, ప్రవర్తనలని సోదాహరణంగా వివరిస్తూ మోసం, విద్రోహం, విశ్వాస ఘాతుకం, అణచివేతలతో ఐ.ఆర్.ఏ హరించుకు పోయింది అని ప్రకటిస్తాడు. అంతేకాదు, ఐ.ఆర్.ఎ. గూర్చి మెచ్చుకోలుగా ప్రచారంలో వుండే చాల విషయాలు, ఎక్కువ పాళ్లు కల్పిత ప్రచారాలేనని కొట్టి పారేస్తారు మోలోనీ. ఉదాహరణకు, ఐ.ఆర్.ఎ. నేత బ్రెయిన్ నేనన్ ఒక 'ఉద్దండ

రాడికల్ మార్క్సిస్టు'గా చిత్రించబడుతూ వచ్చాడని, నిజానికతడు మార్క్సిస్టు కానే కాదని తేల్చి చెబుతాడు మోలొనీ.

ఐర్లండు స్వాతంత్ర్య పోరాటం గూర్చి, దాన్ని నడుపుతున్న ఐ.ఆర్.ఏ గూర్చి మోలొనీ తన పుస్తకంలో చాలా విషయాలే చెప్పాడు. ఇంకా చెప్పాల్సినవి కూడా మరికొన్ని వుండవచ్చు. అంతకంటే ముఖ్యంగా చెప్పేవాటిని మరికొన్ని కోణాల నుంచి చూసి చెప్పాల్సిన అవసరమూ మిగిలి వుండవచ్చు. ఏమైనా ఐరిష్ రిపబ్లికన్ పోరాటం దాని నాయకత్వ విద్రోహానికే బలయ్యింది అనేది ఒక నిర్వివాద వాస్తవమేనని చెప్పాలి. ఈ విద్రోహాన్ని సవివరంగా సాధికారికంగా చెప్పగలిగిన మోలొనీ అభినందనీయుడు. ఉన్నత లక్ష్య సాధనకోసం రక్తార్పిత త్యాగాల రహదారుల్లో ప్రయాణించే వుద్యమాలు, లక్ష్యాన్ని సాధించకుండానే బూటకపు శాంతి ప్రక్రియల దిశగా దారి మళ్లిపోవడం అనేది విద్రోహమే. కమ్యూనిస్టు విప్లవోద్యమంతో పాటు వివిధ జాతీయ పోరాటాలు జాతుల పోరాటలు నడిపేవారంత ఈ విద్రోహం నుంచి నేర్చుకోవాల్సింది చాలానే వుంటుంది. ఇందుకు దోహదపడు తున్నందుకు కూడా మోలొనీ అభినందనీయుడు.

★ ★ ★

ఏమైనా ఇక్కడొక ప్రశ్న మన బుర్రల్ని తొలచక మానదు. అదేమంటే ఉన్నత స్వాతంత్ర్య లక్ష్యంతో ప్రారంభమైన ఐరిష్ రిపబ్లికన్ వుద్యమం కేవలం కొందరి నాయకుల విద్రోహానికే బలై నాశనమై పోయిందని చెప్పడం సహేతుకమేనా? అనేదే ఆ ప్రశ్న! నాయకత్వ విద్రోహం వల్ల ఒకానొక వుద్యమం చాలా తీవ్రంగానే దెబ్బతిన పోవచ్చు, చాలాకాలం వరకు కోలుకోలేని దుస్థితిలో పడిపోనూ వచ్చు. కాని అది శాశ్వతంగా నాశనం అయిపోవడ మంటూ జరగదు. అలానే శత్రు పక్షం నుంచి అమలయ్యే క్రూర దారుణ అణచివేత ఉద్యమంలో దొర్లే తీవ్రమైన తప్పులు – వీటివల్ల సైతం ఉద్యమాలు తాత్కాలికంగానే అయినా తీవ్రంగానే నష్టపోతాయి. ఉద్యమంలో దొర్లే తప్పులు, వుద్యమంపై శత్రువు అణచివేతల కంటే వుద్యమ నాయకత్వం ప్రక్క నుండి జరిగే విద్రోహం వల్లనే ఏదేని ఉద్యమం ఎక్కువగా దెబ్బతింటుంది.

సంబంధిత ప్రజా బాహుళ్యం ఆశలు ఆకాంక్షలకి ప్రాతినిధ్యం వహించే వర్గ విప్లవోద్యమం గానీ లేక ఏ జాతీయ, జాతి పోరాటం గానీ పైన చెప్పిన మూడు రకాల కారణాలు (తప్పులు, విద్రోహం, శత్రు నిర్బంధం) ముప్పేటగా దాడి చేస్తేతప్ప, వాటిలో ఏదో ఒకదాని కారణంగా, అదెంత బలీయంగా పని చేసినా కూడా, పూర్తిగా తుడిచికు పెట్టుకు పోవడ మనేదానికి ప్రధాన కారణం దానికి ప్రాతిపదికగా వుండే సిద్ధాంత రాజకీయాల డొల్లతనంలోనూ అటుపై దాని నిర్మాణ దుర్బలత్వంలోనూ వుంటుంది. ఇక ఆ తరువాత చెప్పుకోవాల్సినవే శత్రు నిర్బంధం, నాయకత్వ విద్రోహం ఇత్యాదివన్నీ!

*(25వ పేజీ తరువాయి భాగం)*

చెపుతున్నాడు. అయితే ఇప్పటికే ఈ సంస్కరణలు అమలు చేయడం ద్వారా చేతులు కాల్చుకున్న అర్జెంటీనా లాంటి దేశాలు మన ముందు తార్కాణంగా వున్నా, చంద్రబాబుకు ఆ గుణపాఠాలు పట్టటం లేదు. మన రాష్ట్రంలో కూడా సంస్కరణల తాలూకు చేదు అనుభవంలోకి వచ్చింది. ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్‌ల వల్ల వందలాది మంది రైతాంగం, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, కరువు, సాగునీరు, తాగునీరు వంటి సమస్యలు రాష్ట్రాన్ని పట్టి పల్లార్చుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమిస్తుంటే చంద్రబాబు ఫాసిస్టు పోలీసు మూకలు తీవ్రంగా అణచివేతకు పూనుకుంటున్నాయి. ఇప్పుడు చంద్రబాబుకు ఒక్కటే దృష్టి ఆరు నూరైనా సంస్కరణలు అమలుజరుపటమే. అంటే రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టటమే. ఈ లక్ష్యసాధన కోసం అహర్నిశలు పని చేస్తానంటున్నాడు. నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతానంటున్నాడు. ఎంతటి రక్తపాతమైనా ఫర్వాలేదంటున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రజల ప్రయోజనాలు పరిరక్షించ బడాలంటే ప్రజా యుద్ధమే పరిష్కార మార్గంగా వుంటుంది. అందుకే ప్రజలను ప్రజాయుద్ధంలోకి సమీకరిస్తున్నాం. ఈ నేపథ్యంలోనే చంద్రబాబుపై మా దాడిని కూడా అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. చంద్రబాబుపై మాకు వ్యక్తిగత ద్వేషం లేదు. మాకు ఆయనకూ మధ్య వున్న విభేదం సిద్ధాంత రాజకీయ పరమైనదే. మేము ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షలు నెరవేరే ప్రజాస్వామ్యం, సోషలిజం, కమ్యూనిజం కోరుతున్నాం. ఆయన దోపిడీ వర్గాల ప్రయోజనాలు నెరవేరే టూరిజం, గ్లోబలిజంలను కోరుకుంటున్నాడు. ఈ విరుద్ధ సిద్ధాంత రాజకీయ విబేధాలే దాడుల రూపంలో వస్తుగత స్థితిని తెలుసుకుంటున్నాయి. అందుకే రాష్ట్ర అభివృద్ధికి ఏ యిజము అవసరమో ఏ ఆర్థిక రాజకీయ విధానాలు అవసరమో విస్తృత చర్చ జరగటం అవసరమని భావిస్తున్నాం.

ఇకపోతే చంద్రబాబు మాకు వ్యతిరేకంగా ''ప్రజాయుద్ధాన్ని'' ప్రకటించాడు. అంటే మాకు వ్యతిరేకంగా ప్రజలను వుద్యమింప చేస్తా నంటున్నాడు. అయితే మా వుద్యమ ప్రాంతాలలో చంద్రబాబు నిర్వహించ తలపెట్టిన ''ప్రజావుద్యమా''నికి పునాదే లేదనేది తెలియ చేస్తున్నాం. అది చంద్రబాబుకు వృధా ప్రయాస అని కూడా తెలియ చేస్తున్నాం. ఇక్కడి ప్రజలకు నక్సలిజం ఒక సమస్య కాదు. వారి సమస్యలకు నక్సలిజం పరిష్కారం మాత్రమే. ఇప్పుడు వాళ్లకు శత్రువులు ప్రభుత్వం, పోలీసులే. ఈ విషయాన్ని చంద్రబాబు విజ్ఞతతో గుర్తించటం అవసరం. ఒకవేళ చంద్రబాబు ప్రజా వుద్యమం పేరుతో పెత్తందారులకు తెలుగుదేశం కార్యకర్తలకు, గూండాలకు ఆయుధాలిచ్చి దాడులు చేయాలని చూస్తే పర్యవసానం చాలా సీరియస్‌గా వుంటుందని హెచ్చరిస్తున్నాం. మరోవైపు చంద్రబాబుపై మేము చేసిన దాడివల్ల రాష్ట్ర ప్రజల్లో సానుభూతి పెరిగిందని ప్రచారం చేస్తున్నారు. ఇది వట్టి బూటకం. కొద్దిమంది రాజకీయ నాయకుల్లో, పత్రికల్లో మాత్రమే ఆ సానుభూతి వ్యక్తమయ్యింది. ఈ పరిస్థితిని కప్పి పెట్టుకోవటానికి మంత్రివర్యులంతా సానుభూతి కోసం ప్రజలను సమీకరించటానికి పడరాని పాట్లు పడ్డారు. చివరికి ఈ కార్యక్రమం అంతా ఒక ప్రహసనంలా ముగిసింది.

ఇక చివరగా రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ప్రజాస్వామిక వాదులు మాతో చర్చలు జరపాలనే డిమాండ్ చేస్తుంటే చంద్రబాబు పెడచెవిన పెడుతూ చర్చలు ఆసరా చేసుకుని వాళ్లు బలపడాలని చూస్తున్నారని మాట్లాడు తున్నాడు. అంటే నిర్బధం సడలితే ప్రజలు మా రాజకీయాలకు దగ్గరవుతా రన్న వాస్తవాన్ని చంద్రబాబు ఒప్పుకోక తప్పలేదు. అయితే పరిస్థితి ఎప్పుడూ ఇదేవిధంగా వుండదు. ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఎంతటి నిర్బంధాన్నైనా ప్రజలు అధిగమిస్తారనే చారిత్రక సత్యాన్ని చంద్రబాబు గుర్తించాలి. ఎల్లకాలం నిర్బంధంతో ప్రజలను అణచి వుంచలేరని తెలియ చేస్తున్నాం. చివరగా చంద్రబాబు ఆర్థిక, రాజకీయ విధానాలే మా ప్రజా యుద్ధాన్ని బలోపేతం చేస్తాయని తెలియ చేస్తున్నాం.

రామకృష్ణ,
సెక్రటరీ,
సిపిఐ(ఎం-ఎల్)(పీపుల్స్‌వార్),
ఆంధ్రప్రదేశ్.

## గమనిక

***జనవరి-ఫిబ్రవరి, 2003 సంచిక తరువాత కొన్ని సాంకేతిక కారణాలవల్ల క్రాంతి పత్రికను తీసుకురాలేక పోయాం. 10 నెలల సుదీర్ఘకాలం క్రాంతి పత్రికను విప్లవ శ్రేణులకు, ప్రజానీకానికి అందించలేనందుకు చింతిస్తూ ఇక నుండి పత్రికను క్రమబద్ధం చేస్తామని పాఠకులకు తెలియచేస్తున్నాం. అట్లాగే పత్రికను నడిపించడంలో మీ వంతు బాధ్యతగా మీ మీ ప్రాంతాల నుండి పోరాట వార్తలను ఎప్పటికప్పుడు పంపవలసిందిగా కోరుతున్నాం.***

# అలిపిరి సంఘటన ఆసరాగా చంద్రబాబు ప్రభుత్వం మా పై చేస్తున్న పలు వక్రీకరణలకు మా సమాధానం

అలిపిరి సంఘటన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి దేవేందర్‌గౌడ్ మాకు ప్రజాస్వామిక వ్యవస్థపైన, రాజ్యాంగంపైన నమ్మకంలేదు కనుక మాతో చర్చలు అవసరం లేదని మా పార్టీనీ, ఉద్యమాన్ని నిర్మూలించటమే రాష్ట్ర అభివృద్ధికి తక్షణ ఏకైక కర్తవ్యమని మాట్లాడుతున్నారు. ఇక మా పార్టీని వుద్యమాన్ని నిర్మూలించాలను కోవడంలో చంద్రబాబుకు గల చారిత్రక అజ్ఞానాన్ని ప్రక్కన పెడితే ప్రజాస్వామ్యం విషయంలో చంద్రబాబు మాటలకూ, చేతలకూ వున్న తేడాను గమనించాల్సినదిగా కోరుతున్నాం. ఈ సందర్భంగానే ప్రజాస్వామ్యం గురించి చంద్రబాబు ప్రభుత్వమే కాకుండా ప్రతిపక్షాలు ఇతర 'పెద్దలు' మాట్లాడుతున్నారు. కనుక దీనిపై విస్తృత స్థాయిలోనే చర్చ జరగాలని కోరుతున్నాం. ప్రజాస్వామ్యం గురించి విస్తృతమైన, లోతైన అర్థాన్ని ప్రక్కన పెడితే కనీసంగా చంద్రబాబు ప్రజాస్వామ్యం పేరుతో చెబుతున్న సూత్రాలనూ, హక్కులను కాపాడుతున్నాడా? అని మేము ప్రశ్నిస్తున్నాం. పట్టపగలు నిరాయుధులుగా ఇంటి వద్ద వున్న కా॥లత, కా॥కౌముదిలను పట్టుకొచ్చి కాల్చి చంపటం చంద్రబాబు ప్రజాస్వామిక సూత్రాలలో భాగమేనా? అని ప్రశ్నిస్తున్నాం. అయితే ఈ రాష్ట్రంలో ఇది మొదటి సంఘటన కాదు. ఇక్కడ సాధారణ సంఘ సభ్యులైనా, కేంద్ర నాయకులైనా, బూటకపు ఎన్‌కౌంటర్లకు గురికావాల్సిందే. చంద్రబాబు చెబుతున్న 'ప్రజాస్వామిక వ్యవస్థ లాంటి' వ్యవస్థలను నడుపుతున్న పెరూ, టర్కీలలో కూడా ప్రముఖ నాయకత్వం దొరికినప్పుడు కూడా చంపలేదు. పెరూలో విప్లవ నాయకుడు కా॥గొంజాలోను, టర్కీలో కుర్దిష్ జాతి పోరాట నాయకుడు ఓక్‌లాన్‌ను ఆ పాలక వర్గాలు ఎంత నియంతలైనా కాల్చి చంపలేదు. వాళ్లు రాసుకున్న చట్టాలను పూర్తిగా అమలు జరుపక పోయినప్పటికీ ప్రపంచ పౌర సమాజానికి భయపడి కనీసంగా వాళ్లను గాలి, వెలుతురు సోకని సింగిల్ సెల్స్‌లోనైనా వుంచారు. కాని చంద్రబాబు మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థను గురించి భువనభోంతరాలు దద్దరిల్లేటట్లు అరుస్తూ పరమ నియంతలాగ మా కేంద్ర కమిటీ నాయకులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలను అత్యంత క్రూరంగా కాల్చి చంపటాన్ని ఏమనాలి? ఇది కూడా చంద్రబాబు బ్రాండు ప్రజాస్వామ్యమేనా? ఇక హక్కుల కోసం పోరాడే అన్ని సెక్షన్ల ప్రజానీకం ప్రతిరోజూ ఏదో ఒక చోట చంద్రబాబు బ్రాండు ప్రజాస్వామ్యాన్ని చవిచూస్తూనే వున్నారు.

అసలు ప్రజాస్వామ్యమంటే ఓటుహక్కు కల్పించటమేనా? ఈఅర్థవలస అర్థ భూస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఎన్ని పరిమితులు వున్నాయన్నది ప్రక్కన పెడితే ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమానత్వానికి; హక్కులకు చంద్రబాబు బ్రాండు ప్రజాస్వామ్యంలో స్థానం లేదా? నిజంగా వాటికి స్థానం వుంటే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాటి పరిస్థితి ఏమిటి? ప్రతి గ్రామంలోనూ, వేల సంవత్సరాలుగా కరడుగట్టుకుపోయిన అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థ సమూలంగా నాశనం కాలేదనేది వాస్తవం కాదా? ఇలా ధ్వంసం చేయబడనప్పుడు అక్కడ ప్రజాస్వామ్య సంస్కృతికీ విలువలకు హక్కులకూ, స్థానం ఎక్కడ వుంటుంది? ఇప్పటికే గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య ఆర్థిక దోపిడీ అణచివేతలు మూడు పువ్వులూ, ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయనేది వాస్తవం కాదా? ఇక సాంఘిక అణచివేత పరిస్థితి ఏమిటి? వందలాది గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, దళితులను గుడులలోకి రానీయక పోవటం, దళిత మహిళలపై అత్యాచారాలు, దళిత మహిళలను 'ఒసేయ్!', 'అమ్మే' అని సంభోదించటం వాస్తవం కాదా? నిత్యం కొన్ని గ్రామాలలో నైనా తన్నులూ, గుద్దులూ తినని దళితులు వున్నారా? రక్తం చిందించని రోజు వుందా? ఈ పరిస్థితులన్నింటిని కూడా తన బ్రాండు ప్రజాస్వామ్యంలో భాగంగా చూడాలని చంద్రబాబు అర్థం కాబోలు.

అయితే అప్పుడప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా దళితుల, మహిళల సమస్యలను చేపట్టటం లేదా అంటే చేపట్టిందనే చెప్పాలి. అన్ని సమస్యల పరిష్కారానికి ''సర్వరోగ నివారణి''లా పని చేసే జన్మభూమి పథకంలో భాగంగానే ఈ సమస్యలను చేపట్టింది. అప్పుడప్పుడు భూ పంపకాల పేరుతో ప్రకటనలు కూడా చేసింది. అయితే ఈ కంటితుడుపు కార్యక్రమాల, ప్రకటనల వెనుక చంద్రబాబు ప్రభుత్వ నిజాయితీ ఎంతో పరిశీలించమని కోరుతున్నాం. చంద్రబాబుకి నిజాయితీ వుంటే కారంచేడు, నీరుకొండలలో దోషులెందుకు శిక్షించ బడలేదు? ప్రజలు పోరాడి సాధించుకున్న భూస్వాముల భూముల్లో (ప్రభుత్వ సీలింగ్ చట్టం ప్రకారం భూస్వాములకు చెందని) **144** సెక్షను ఎందుకు విధించినట్లు? ఇటువంటి ఎన్నో ప్రశ్నలకు సూటి సమాధానం దొరకాలంటే చంద్రబాబు ప్రభుత్వం ఏ పక్షాన పని చేస్తుందో తెలుసుకోవలసి వుంటుంది. చంద్రబాబు ప్రభుత్వమే కాదు యాభై ఆరు ఏళ్లుగా కేంద్రాన్నీ, రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న పాలక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏ పక్షానికి కొమ్ము కాస్తున్నాయో తెలుసుకోవలసి వుంటుంది. ఈ పార్టీలన్నీ సామ్రాజ్యవాదులకు, వారికి వూడిగం చేస్తున్న నిరంకుశ దళారీ బూర్జువా భూస్వాములకు ప్రాతినిధ్యం వహిస్తున్నవి. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను దెబ్బతీస్తున్నాయి. దీని పర్యవసానంగానే పేదలు మరింత పేదలుగానూ, ధనికులు మరింత ధనికులుగానూ మారారు. అందుకే భారత సమాజం ప్రజాస్వామిక స్వరూపాన్ని సంతరించుకోలేక పోయింది. ఈ పరిస్థితులలోనే దేశ సామాజిక వ్యవస్థను ప్రజాస్వామికీకరించటంలో భాగంగా ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యలపై మా పార్టీ నాయకత్వంలో పోరాటాలు చేపట్టాం. అయితే వేల సంవత్సరాలుగా కరడుకట్టుకపోయి ప్రస్తుతం ఆధునిక రాజ్యం అండతో కొనసాగుతున్న అగ్రకుల భూస్వామ్య వ్యవస్థలో ఈ హక్కుల సాధన నల్లేరు మీద నడకలా లేదు. సమానత్వం, స్వేచ్ఛ, హక్కులు అడిగినందుకే ప్రతి గ్రామం యుద్ధరంగంగా మారుతున్నది. పీడిత ప్రజానీకం స్థానిక దోపిడీ వర్గాలతో పాటు రాజ్యంతో కూడా పోరాడవలసి వస్తున్నది. అయితే గత **30** సంవత్సరాలుగా మేము చేపట్టిన పోరాటాల ఫలితంగా ప్రజలు అనేక ప్రజాస్వామిక హక్కులను పొందగలిగారు. కొన్ని ప్రాంతాలలోనైనా వేలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నారు. పోచిగాడు పోచయ్యగా పిలువబడుతున్నాడు. గ్రామరాజ్య కమిటీల ఆధ్వర్యంలో పీడిత ప్రజానీకం నిజమైన అధికారాన్ని పొందగలుగుతున్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ప్రజలు సాధించుకున్న ప్రజాస్వామిక విజయాలను దెబ్బ తీయడానికి రోజు రోజుకూ నిర్బంధాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎవరు నిజమైన ప్రజాస్వామ్యాన్ని కోరుతున్నారో అర్థం చేసుకోవలసిందిగా కోరుతున్నాం.

చంద్రబాబు మా మీద చేసే ప్రచార దాడిలో భాగంగా అప్పుడప్పుడు సోషలిజం, కమ్యూనిజం కాలం చెల్లిన సిద్ధాంతాలని, ప్రస్తుతం వున్నది టూరిజం ఒక్కటేనని మాట్లాడుతున్నాడు. ఈ 'విలువైన' కొటేషన్‌ను అలిపిరి సంఘటన సందర్భంగా కూడా ప్రస్తావించాడు. అయితే మన ముఖ్యమంత్రికి భారత రాజ్యాంగంలోని .......లో సోషలిస్టు అనే పదాన్ని చేర్చుకున్నట్టు కూడా గుర్తు లేదు. సోషలిజం కాలం చెల్లిన సిద్ధాంతమని మాట్లాడటం ద్వారా చంద్రబాబుకు తాము రాసుకున్న రాజ్యాంగం మీద ఏపాటి గౌరవం వున్నదో తెలుస్తున్నది. ఇక కునారిల్లిపోతున్న భారత ఆర్థిక, సామాజిక వ్యవస్థ పురోగతికి టూరిజం రాచబాట అని చెప్పటం ద్వారా చంద్రబాబు మనోగతం మరింత స్పష్టమవుతున్నది. చంద్రబాబు ముందు ఇవాళ ఒక బృహత్తర లక్ష్యం వుంది. ఆ లక్ష్యమేమిటంటే ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు అమలు జరపటమే. ఈ సంస్కరణలు రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు సర్వరోగ నివారిణిలా పని చేస్తున్నాయని

***(కొరవ 24వ పేజీలో)***

రిపోర్టులు

# కరువు దాడులతో చంద్రబాబు ప్రభుత్వాన్ని బెంబేలెత్తించిన విప్లవ ప్రజానీకం

చంద్రబాబు దివాళాకోరు ఆర్థిక విధానాలతో రాష్ట్రం మరొక్కసారి కరువు వాతన పడింది. తన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి చంద్రబాబు, ప్రకృతి వైపరీత్యాలను కరువుకు కారణంగా చూపుతూ, కేంద్రం నుండి **5** లక్షల టన్నుల బియ్యాన్ని పనికి ఆహార పథకం క్రింద తెచ్చాడు. అయితే అవినీతి పరులైన తెలుగుదేశం నాయకులు వేల టన్నుల బియ్యాని బ్లాక్‌లో అమ్ముకోవటంతో, తెచ్చిన బియ్యం ప్రజల నోటి కందలేదు. పనికి ఆహార పథకం, తెలుగు దేశం నాయకుల భోజన పథకంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ ఇచ్చిన కరువు వ్యతిరేక క్యాంపెయిన్‌కు ప్రజల నుండి అనూహ్యమైన స్పందన వచ్చింది. రాష్ట్ర వ్యాపితంగా మార్చి, ఏప్రిల్ మాసాలలో కరువు వ్యతిరేక క్యాంపెయిన్‌ను చేపట్టారు.

కరువు వ్యతిరేక క్యాంపెయిన్‌లో భాగంగా మెహబూబ్‌నగర్ జిల్లాలోని సిద్ధాపూర్, ఇప్పళ్లపల్లి, కొండనాగుల, మనుచింతపల్లి గ్రామాలలోను, నీలగిరి టూరిస్టు కేంద్రం పైనా; నల్గొండ జిల్లాలోని, చింతపట్ల, అజ్మాపూర్ గ్రామాలలోనూ; నల్లమల డివిజన్‌లోని కొలుకుల, వీరభద్రాపురం గ్రామాలలోనూ; కడప జిల్లాలోని రాయవరం, సైకంవారిపల్లె గ్రామాలలోనూ; అనంతపురం జిల్లాలోని బండమీపల్లె గ్రామంలోనూ ప్రజలు పార్టీ నాయకత్వంలో కరువు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో **20**మంది నుండి **200** మంది దాకా ప్రజలు కదిలారు. అనంతపురం జిల్లా బండమీదపల్లె గ్రామంలోని భూస్వామి ఇంటిపై, **22** ట్రాక్టర్లతో ప్రజలు కదిలి దాడి జరిపారు. ఈ దాడులు ప్రధానంగా ప్రజా పీడకులైన భూస్వాములు, షావుకార్లు, మిల్లు యజమానులు, రేషన్‌షాపు డీలర్లపై ఎక్కుపెట్టబడ్డాయి. ఈ దాడులల్లో **1000** క్వింటాళ్ల దాకా ధాన్యం, లక్షల రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకులు, కొద్ది మొత్తంలో బంగారం వెండి స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లాలోని సైకంవారిపల్లె కి చెందిన భూస్వామి, ప్రజా కంటకుడు, తెలుగుదేశం నాయకుడైన సైకం బసివిరెడ్డిని ఖతం చేసి ధాన్యం, ఇతర సమానులతో పాటు **8**ఎంఎం రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కేవలం రెండు నెలలోనే వరుసగా జరిగిన ఈ **12** దాడులు, రాష్ట్ర వ్యాపితంగా పెద్ద చర్చనీయాంశమైనాయి. రాకీయంగా మంచి ప్రభావాన్ని వేసాయి. అయితే మరోవైపు, కరువు దాడులతో బెంబేలెత్తిన చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం, పీడిత ప్రజానీకంపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. రాష్ట్ర వ్యాపితంగా వందలాది మంది రైతాంగాన్ని పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేసారు. అనేక మందిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టారు. కరువు దాడిలో సహకరించిన సానుభూతి పరులైన వాహన యజమానులను కూడా అరెస్టులు చేసి కేసులు బనాయించారు. వాహనాలు సీజ్ చేసుకున్నారు. కొన్ని చోట్ల కరువు దాడిలో ప్రజలు స్వాధీనం చేసుకున్న ధాన్యాన్ని పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఒకవైపున కరువు దాడిలో పాల్గొన్న ప్రజానకంపై దాడులు నిర్వహిస్తూనే మరోవైపు బుజ్జగించే చర్యలు చేపట్టింది. ముఖ్యంగా చెంచు ఆదివాసీ ప్రాంతాలలో ప్రభుత్వ యంత్రాంగమంతా హడావిడిగా కదిలి, ఆదివాసీ ప్రజలకు బియ్యం, చీరలు, ధోవతులు, మందులు సరఫరా చేసారు. ఈ దాడుల సందర్భంగా కొన్ని పత్రికలు పని గట్టుకుని దుష్ప్రచారం చేసాయి. వీరభద్రాపురం గ్రామంలో షావుకారి ఇంటిపై పీడిత ఆదివాసీ ప్రజలు దాడి చేసినప్పుడు ధాన్యం, నిత్యావసర వస్తువులతో పాటు, అప్పటిదాకా పీడిత ప్రజల్ని క్రూరంగా పీడించి రాయించుకున అప్పు పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. దీంతో దుర్మార్గుడైన ముసలి షావుకారు తట్టుకోలేక చనిపోయాడు. ఈ సంఘటనను పత్రికలు ఘోరంగా వక్రీకరిస్తూ మహిళ మెడలోని మంగళ సూత్రాన్ని బలవంతంగా లాక్కోవడం వల్ల, షావుకారు తట్టుకోలేక చనిపోయాడని ప్రచారం చేస్తూ సెంటిమెంట్స్‌ను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాయి.

రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న కరువు దాడులను నిర్వీర్య పరచడానికి ప్రభుత్వం చేస్తున్న కుటిల ప్రయత్నాలను స్థానిక గెరిల్లా దళాలు తిప్పికొట్టాయి. కరువు దాడుల అనంతరం, రికవరీ కొచ్చే పోలీసులపై మన గెరిల్లా దళాలు ఆంబుష్‌లు నిర్వహించాయి. ప్రకాశం జిల్లా అల్లిపాలెం ఆపర్చ్యునిటీ ఆంబుష్‌లో ఒక ఎస్ఐ తీవ్రంగా గాయపడ్డాడు. మిగిలిన ఆంబుష్‌లలో పోలీసులను నష్టపరచలేక పోయినప్పటికీ, వాళ్ల దూకుడుకు మన దళాలు అడ్డుకట్ట వేసాయి. ప్రజల సహకారంతో మిలీషియా, గెరిల్లా బలగాలు ప్రతిఘటనా చర్యలు చేపట్టడం వల్ల పోలీసులు సాఫీగా రికవరీ కార్యక్రమాన్ని చేపట్టలేక పోయారు. ప్రజలు తాము స్వాధీనం చేసుకున్న ధాన్యం, నిత్యావసర సరుకులలో కొంత భాగాన్ని దక్కించుకో గలిగారు. కొన్ని జిల్లాల్లో అరెస్టు అయిన ప్రజానీకాన్ని విడిపించు కోవడానికి స్థానిక తెలుగు దేశం నాయకులపై మన దళాలు వత్తిడి తెచ్చాయి. నల్గొండ జిల్లాలో అరెస్టు అయిన ప్రజలని విడిపించుకోవడానికి టి.డి.పి లీడర్లపై వత్తిడి తేవడమే కాక, అరెస్టు అయినవాళ్లు జైలు నుండి బయటకు వచ్చేదాక ఒక్కొక్క కుటుంబానికి నెలకు **20** కేజీల బియ్యం ఇవ్వాలని డిమాండ్ పెట్టి సాధించారు.

ఈ క్యాంపెయిన్‌లో, కరువు దాడులతో పాటు వేలాది క్వింటాళ్ల ధాన్యాన్ని షావుకార్లు, మిల్లు యజమానులు, పెత్తందార్ల నుండి వసూలు చేసి ప్రజలకు పంచారు. గుంటూరు జిల్లాలో **2,500** క్వింటాళ్ల బియ్యాన్ని వసూలు చేసి ప్రజలకు పంచారు. వెల్లటూరు బ్యాంకుపై దాడి చేసి స్వాధీనం చేసుకున్న ఏడున్నర లక్షల రూపాయలను, కరువు నిధిలో జమచేసి ఖర్చు చేసారు. అనంతపురం జిల్లాలో **1000** క్వింటాళ్ల ధాన్యం వసూలు చేసి **700** క్వింటాళ్లు ప్రజలకు పంచారు. పోలీసు నిర్బంధం వలన **300** క్వింటాళ్లు పంచలేక పోయారు. ఇదే జిల్లాలో కరువు చెక్కుల పంపిణీలో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా కనగానపల్లి ఎంఆర్‌వో ఆఫీసు ముందు ప్రజలన్ని కదలించి రెండుసార్లు ధర్నా నిర్వహించారు. ఇద్దరు ప్రజా వ్యతిరేకులకు దేహశుద్ధి చేసి **17** వేలు రికవరీ చేసారు. అక్రమంగా రవాణా అవుతున్న **80** క్వింటాళ్ల కరువు బియ్యాన్ని ప్రజలకు పంచారు. నల్గొండ జిల్లా పాగిళ్ల గ్రామంలో పనికి ఆహార పథకం అమలులో అవినీతికి పాల్పడిన వారి నుండి **70**వేలు వసూలు చేసి, ఆ డబ్బును బియ్యం రూపంలో ప్రజలకు పంచారు. మెహబూబ్ నగర్ జిల్లాలో కరువు పనికి ఇస్తున్న కూలీని పెంచారు. మహిళలకు **30**రూ॥లు పురుషులకు **60**రూ॥లు ఇస్తున్న కూలీని స్త్రీ, పురుషు లిద్దరికీ సమానంగా **80** రూ॥లకు పెంచారు. శ్రీశైలం రిజర్వాయర్ లో చాపలు పట్టుకునే జాలర్లను సంఘటిత పరిచి డిమాండ్ చేయడం ద్వారా కమీషన్‌దారుల నుండి పుట్టికి **50**కిలోల బియ్యాన్ని సాధించారు – స్థానిక ప్రజాసంఘాల ద్వారా జిల్లాలో గంజి కేంద్రాలు ఏర్పాటు చేసారు.

కరువు దాడులతో పాటు పంపిణీ కార్యక్రమం చేపట్టడం వల్ల కరువు వాతన పడిన ప్రజలకు మన కార్యక్రమం కొంత ఊరట నిచ్చింది. పార్టీకి ప్రజలు మరింత సన్నిహితం కావడానికి దోహద పడింది. ఈ మొత్తం క్యాంపెయిన్‌లో ప్రభుత్వాన్ని, రాజకీయంగా బహిర్గత పరుస్తూ పోస్టర్లు, కరపత్రాలు, పత్రిక ప్రకటనల ద్వారా, విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు వారి స్వీయ అనుభవం నుండే సాయుధ పోరాట రాజకీయాలు అర్థం చేయిస్తూ, వారిని ప్రజా యుద్ధంలోకి సమీకరించే లక్ష్యంతో క్యాంపెయిన్ కొనసాగింది.

# విప్లవ ప్రతీఘాతుక శక్తులను నిర్మూలిస్తూ పురోగమిస్తున్న ప్రజాయుద్ధం

*ప్రభుత్వ తలపెట్టిన బహుముఖ దాడిలో భాగంగా ఉద్యమ ప్రాంత మంతటా, ప్రభుత్వం విప్లవ ప్రతీఘాతుక శక్తులను పెంచి పోషిస్తున్నది. ముఖ్యంగా దళాల సమాచార సేకరణకు అధిక ప్రాధాన్యతనిస్తూ రకరకాల రూపాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటున్నది. నూతన పరిణామంగా, విప్లవోద్యమాన్ని దెబ్బతీయటంలో స్థానిక టిడిపి లీడర్ల పాత్ర పెరిగింది. పోలీసు అధికారులు, స్థానిక టిడిపి నాయకులు రహస్య సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడికక్కడ ఇన్‌ఫార్మర్ల, కోవర్టుల యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటమే కాకుండా, వాటి నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ సాయుధ అణచివేత దాడిలో మన బలగాలు దెబ్బతిన్నచోట భూస్వాములు, పెత్తందార్లు తిరిగి పెత్తనం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని ఓడించి, ప్రజలు రాజ్యాధికారం హస్తగతం చేసుకోవటం లో భాగంగానే ఒక సంవత్సర కాలంగా మన గెరిల్లా దళాలు, ప్రజా మిలీషియా పదుల సంఖ్యలోనే భూస్వాములను, అధికారపక్ష రాజకీయ నాయకులను, ఇన్ఫార్మర్లను, కోవర్టులను ఇంకా ఇతర ప్రజా వ్యతిరేకులను ఖతం చేసారు.*

## గుంటూరు జిల్లా

### మహిళా రేపిస్టు సుభానీ ఖతం

గుంటూరు జిల్లా జూలకల్లు గ్రామానికి చెందిన సుభానీ మహిళా రేపిస్టు. **2** సంవత్సరాల క్రితం ఆ గ్రామానికే చెందిన **16** సంవత్సరాల ఆదిలక్ష్మి అనే యువతిని తన గ్యాంగ్‌తో కలిసి దారుణంగా అత్యాచారం చేసి పాశవికంగా చంపేసాడు. ఈ సంఘటన చుట్టుపక్కల గ్రామాల్లో బాగా సంచలనం కలిగించింది. అంతే కాకుండా మహిళలు ఒంటరిగా చీకటిలో దొడ్డికి వెళ్లాలన్నా భయపడే వారు. వీనికి టిడిపి రాజకీయ నాయకుల అండదండలు కూడా వుండడంతో వీనికి ఎదురే లేకుండా పోయింది.

ప్రజల డిమాండ్ మేరకు మే నెలలో వీడిని ఖతం చేయడం జరిగింది. ఈ యాక్షన్‌ను ప్రత్యేక మహిళా దళం చేసింది. దీంతో గ్రామ మహిళల్లో ఇంకా వుత్సాహాన్ని పెంపొందించింది. వీడిని చంపడంవల్ల మహిళలు పీడ విరగడయిందని ఎంతో సంతోషించారు.

### హెచ్చరించినా పద్ధతులు మార్చుకోని పోలీస్ ఇన్ఫార్మర్ నాగార్జున ఖతం

జూలకల్లు గ్రామానికి చెందిన నాగార్జున అనేవాడు ఇన్ఫార్మర్‌గా గత **7** సంవత్సరాల నుండి వుంటున్నాడు. **4** సంవత్సరాల క్రితం వీన్ని ఇంటరాగేషన్ నిమిత్తం దళం వద్దకు తీసుకురాగా దళం ఏమరుపాటుగా వున్నప్పుడు పారిపోయాడు. మరల వాణ్ణి తీసుకుని రావడానికి వెళ్లగా, ప్రజల సమక్షంలో బుద్ధిగా వుంటానని ఒప్పుకున్నాడు. వాడి కులస్థులందరు కూడా ఈసారి వాడు ఏదైనా తప్పు చేస్తే మేమే వాణ్ణి మీకు అప్పగిస్తాం ఇప్పటికి వదిలేయండని ప్రాధేయపడడంతో వీడిని వదిలి వేసాం. అయినా వీడు తన పాత పద్ధతులనే కొనసాగిస్తుండడంతో ఖతం చేయడం జరిగింది.

### పోలీస్ ఇన్ఫార్మర్ మంగళి లక్ష్మయ్య ఖతం

పమిడిపాడు గ్రామానికి చెందిన కోటిరెడ్డి కాంగ్రెస్ రాజకీయాలను నడిపిస్తూ గ్రామంలోకి వస్తున్న పోలీసులకు రహస్యంగా విందులు ఇస్తూ, ఇన్ఫార్మర్‌గా పని చేస్తూ, మాదిగపల్లెపై దాడికి కారకుడైనాడు. గతంలో చాలాసార్లు దళం వద్దకు పిలిపించి హెచ్చరికలు కూడా చేసినప్పటికి వినిపించుకోలేదు.

అదే గ్రామానికి చెందిన మంగళి లక్ష్మయ్య అనే వ్యక్తి పోలీసులతో నిత్యం సంబంధాల్లో వుంటూ, కోటిరెడ్డికి కుడిభుజంగా వ్యవహరిస్తూ పల్లెపై పోలీసులు జరిపిన పకడ్బందీ దాడుల్లో ప్రధాన పాత్ర వహించాడు. అంతేకాక మేకలు కాసుకునే నెపంతో కొడుకుని అడవికి పంపించి దళం కోసం వెతికించాడు. తను మార్గదర్శిగా వుంటూ పోలీసులను అడవిలోకి తెచ్చాడు. వీరిద్దరినీ ఇంటారేషన్ చేసి ప్రజలు ఖతం చేసి తమ పీడ వదిలించుకున్నారు.

### ప్రజావ్యతిరేకి, ఇన్ఫార్మర్ అచ్చిరెడ్డి ఖతం

గుమ్మనంపాడుకు చెందిన అచ్చిరెడ్డి గత కొంతకాలంగా ఇన్ఫార్మర్‌గా పని చేస్తూ, గ్రామస్థులపై ఆధిపత్యం చెలాయిస్తూ, మాలపల్లెపై దాడి చేయించాడు. ఎన్నిసార్లు చెప్పినా తన పద్ధతులు మార్చుకోకపోవడంతో వీడిని చంపి వేయడం జరిగింది. ప్రజలు బాగా సంతోష పడ్డారు.

### గ్రామ భూస్వామి, ఇన్ఫార్మర్ నల్లబోతుల రామాంజనేయులుకు శిక్ష

అడిగొప్పుల గ్రామానికి చెందిన నల్లబోతుల రామాంజనేయులు, వాటర్‌షెడ్ ఛైర్మన్‌గా వుంటూ మహిళలపై దౌర్జన్యాలు చేస్తున్నాడు. అంతేకాక నిత్యం పోలీసులతో సంబంధాల్లో వుంటూ ఇన్ఫార్మర్‌గా పని చేస్తూ గ్రామ భూస్వామిగా చెలామణీ అవుతున్నాడు. గతంలో హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో వీడిని హతమార్చడం జరిగింది.

### కోవర్టు మట్టయ్య (రాజేష్) ఖతం

మేళ్లవాగుకు చెందిన మట్టయ్య (రాజేష్) స్థానిక ఎస్‌ఐ, ఎస్.పి.తో నిత్యం సంబంధాల్లో వుంటూ దళంలోకి కోవర్టుగా వచ్చాడు. మనకు ఒక నెల వీడు దళంలో వున్న తర్వాత వీడి ప్రవర్తనపై కొంత అనుమానం కలిగి ఇంటికి వెళ్లి పని చేయమని పంపించాము. అయితే వీడు వూర్లో పని చేయకుండా చుట్టుపక్కల గ్రామాల్లో దళ సమాచారం కోసం తిరగడం మొదలుపెట్టాడు.

మండల కేంద్రాల్లో వుంటూ టౌన్‌కి వెళ్లిన మన కార్యకర్తలను పట్టించడానికి ప్లాన్ వేసాడు. మన ఇంటరాగేషన్‌లో ఎస్‌పి దళాన్ని పట్టిస్తే **3** లక్షల డబ్బులు, వుద్యోగం ఇస్తానని చెప్పినట్లు ఒప్పుకున్నాడు. ఇంటరాగేషన్ చేసి సమాచారం సేకరించి వీడిని చంపడం జరిగింది.

*(మొత్తంగా పై కార్యక్రమాలన్నీ 2002, మే 1 నుండి జూన్ 15 వరకు జరిగినవి.)*

### కోవర్టు ప్రోత్సాహకుడు ఇన్ఫార్మర్ బూసినాగిరెడ్డి హతం

బొల్లాపల్లి మండలం మేళ్లవాగు గ్రామానికి చెందిన బూసి నాగిరెడ్డి టిడిపి రాజకీయాల్లో చేరి, స్థానిక ఎంఎల్ఏకు కుడి భుజంగా ఎదిగాడు. పోలీసులతో సన్నిహితంగా మెలుగుతూ పమిడిపాడు పల్లెపై దాడి చేయించాడు. చుట్టుపక్కల గ్రామాలను పార్టీకి వ్యతిరేకంగా ఆర్గనైజ్ చేస్తూ, మట్టయ్య అనే కోవర్టు ద్వారా దళాన్ని నిర్మూలించాలని చూసాడు. దాంతో ప్రజల డిమాండ్ మేరకు వాడిని ఖతం చేయడం జరిగింది.

### దళానికి విషం ఇచ్చి చంపాలనుకున్న పోలీస్ ఇన్ఫార్మర్ అడిగొప్పుల అన్నమ్మ ఖతం

అడిగొప్పుల గ్రామానికి చెందిన దళిత స్త్రీ రాయపాటి అన్నమ్మ మొదట్లో పార్టీతో సన్నిహితంగా వుండేది. భూ పోరాటాలలో భూమిని పొందినది, అరెస్టయ్యింది. డబ్బులకు ఆశపడి తన కూతురిని ఎస్ఐతో వివాహేతర సంబంధానికి ప్రోత్సహించింది. ఇన్ఫార్మర్‌గా మారింది. దళానికి విషం పెట్టేందుకు ప్రయత్నించింది. పల్లెలో చిన్నసైజు పెత్తందారుగా వుంటూ డ్వాక్రా గ్రూప్ లీడర్‌గా ఎదిగింది. సంఘ నాయకులను అరెస్టు చేయించడంలో ముఖ్య పాత్ర పోషించింది.

ఆమె పద్ధతులు మార్చుకొమ్మని ఎన్నిసార్లు హెచ్చరించినా వినక పోవడంతో ఒకసారి దేహశుద్ధి చేసి, గ్రామం నుండి బహిష్కరించాం. అయినా మరింతగా

రెచ్చిపోయి ఇన్ఫార్మర్‌గా కొనసాగడంతో గ్రామస్థుల డిమాండ్ మేరకు ఖతం చేయడం జరిగింది.

ప్రభుత్వం ఆమె ఇన్ఫార్మార్ కాదనీ – దళిత మహిళ, డ్వాక్రా గ్రూప్ లీడర్‌ను అన్యాయంగా చంపారని మనకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసింది, డ్వాక్రా మహిళలతో ర్యాలీ కూడా చేయించింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మాత్రం అన్నమ్మను చంపడం వల్ల చాలా సంతోషించారు.

ఆ తరువాత మనం అన్నమ్మ, కమలమ్మలను శిక్షించడానికి గల కారణాలను వివరిస్తూ కరపత్రాలు వేసాము.

## భూస్వామి అలవాల హనిమిరెడ్డి ఖతం

శిరిగిరిపాడు గ్రామ భూస్వామి అయిన అలవాల హనిమిరెడ్డి **1989** నుండి మన పార్టీకి వ్యతిరేకంగా వుంటూ మన దళాన్ని **1989**లో పట్టుకుని కొట్టి, తుపాకులు లాక్కొని పోలీసులకు అప్పజెప్పాడు. గ్రామ సంఘాన్ని దెబ్బతీసాడు. ఆనాటి నుండి కొనసాగిస్తున్న పార్టీ వ్యతరేక కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజల డిమాండ్‌తో వీడిని ఖతం చేయడం జరగింది. వూర్లో అందరికీ వీడు వ్యతిరేకి. వీడి ఖతం ప్రజలు పీడ వదలిందనుకున్నారు.

## పిన్నెల్లి వెంకటరామిరెడ్డిపై చర్య

కండ్లగుంట గ్రామస్తుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మహిళా రేపిస్టు. మహిళలపై అత్యాచారాలు చేస్తూ, అసభ్యంగా వ్యవహరించేవాడు. సారా తాగి పేద ప్రజలను కొట్టడం, తిట్టడం వంటి ప్రజా వ్యతిరేక విధానాలు చేసేవాడు. గ్రామంలోని వీడి దౌర్జన్యాలకు విసిగిన ప్రజలు చేసిన డిమాండ్ మేరకు వీడి కాళ్లు విరగొట్టడం జరిగింది. దీనితో మరణించాడు.

# <u>నల్లగొండ జిల్లా</u>

## ప్రజాద్రోహి, రౌడి, వ్యభిచారి దేప జనార్ధన్‌రెడ్డి హతం

నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని డివిజన్‌లలో ప్రజలను పోరాటాల నుండి ప్రక్కదోవ పట్టించడానికి ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవా సంస్థ అయిన వివేకానంద యూత్‌క్లబ్‌కు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు దేప జనార్దన్‌రెడ్డి ఆ పదవిలో కొనసాగుతూ ఆ సంస్థ కింద వచ్చే కోట్లాది రూపాయల నిధులతో ఆస్తిపరుడైయినాడు. తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకుడిగా కూడా వుంటూ ప్రభుత్వ అభివృద్ధి పథకాల (వాటర్‌షెడ్, పనికి ఆహార పథకం) పేరిట వచ్చే నిధులలోనూ వాటా దక్కించుకున్నాడు. ఈ విధంగా కోట్ల రూపాయలు ప్రజా ధనం అక్రమంగా సంపాదించాడు.

అంతేగాక తన దగ్గిర పనిచేసేవారు ఎదురు మాట్లాడినందుకే **10-15** మంది దాకా హత్య చేసాడు. దాదాపు **10** మందికి పైనే మహిళలను అత్యాచారాలు జరిపి చంపాడు. తాను చదువుకునే రోజుల్లోనే తన రౌడీ ముఠాలతో అరాచకాలు చేయించాడు. తన గూండాలయిన పెద్ద మూల, నేతల లాలయ్య, సన్నాల లింగయ్య (డిండి ఘణపురం), దేవరకొండ వడ్డెర విజయ్, దేవరకొండ కండక్టర్ శ్రీనులు కలిసి పేర్వాల నర్సింహులను, తండ్రి కొడుకును పిలిచినట్లు పిలిచి, ఎత్తుకపోయి గొంతు పిసికి చంపి, తీసుకుపోయి నాగార్జున సాగర్‌లో పడేసిండు. ప్రజా వ్యతిరేకి, అవినీతిపరుడు, రౌడి, గూండా, వ్యభిచారి, పోలీస్ ఇన్ఫార్మర్ కూడా అయిన దేప జనార్థన్‌రెడ్డి హెచ్చరికలు చేసినప్పటికీ ఖాతరు చేయకుండా మరింత ఎక్కువ చేయడంతో దేవరకొండలోని అతని తోటవద్ద పిజిఏ జూన్ **19**న వాడిని ఖతం చేసింది. ప్రజలు పండగ చేసుకున్నారు. దేవకొండ, చందంపేట ఏరియాల్లో పేద ప్రజల్లో మంచి స్పందన వచ్చింది.

## తాళ్లవెళ్లంల ఎన్‌కౌంటర్ కారకుడు విజయేందర్‌రెడ్డి హతం

చిట్యాల మండలం, తాళ్లవెళ్లంల గ్రామానికి చెందిన విజయేందర్‌రెడ్డి గ్రామ టిడిపి పార్టీ సింగిల్‌విండో ఛైర్మన్. తాళ్లవెళ్లంల ఎన్‌కౌంటర్‌లో కా.సాగర్‌తో పాటు **6**గురు కామ్రేడ్స్ అమరులు కావడానికి కారణభూతుడు. అందుకే వాడిని అక్టోబర్ **3, 2003**న పిజిఏ గెరిల్లాలు వాడిని ఖతం చేయడం జరిగింది.

## కోవర్ట్ ప్రోత్సాహకుడు గట్టనాగయ్య ఖతం

చందంపేట మండలం సంద్రలగడ్డ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ కార్యదర్శి, డీలర్ అయిన నాగయ్య తన మేనల్లుడు అయిన వెంకటేష్‌కు మన పార్టీ సంబంధాలు వున్నాయని బట్టలు కుట్టి పెడుతున్నాడని తెలిసి పోలీసులకు పట్టించి అతన్ని కోవర్ట్‌గా తయారు చేసిన దాంట్లో ముఖ్యపాత్ర పోషించాడు. కోవర్ట్‌గా మారిన వెంకటేష్ పార్టీ క్యాంపుల్లోకి వచ్చి పార్టీ నాయకత్వంపై విష ప్రయోగం చేసి హత్య చేయాలని ప్రయత్నించి మనచేత చిక్కి కుక్కచావు చచ్చాడు. ఈ కుట్రలో నాగయ్యతోపాటు దేవరకొండ డివిజన్‌కు చెందిన అనేక మంది టిడిపి నాయకులు కూడా వున్నారు. వుద్యమాన్ని నిర్మూలించాలని టిడిపి ప్రభుత్వం దాని నాయకులు చేస్తున్న కుట్రలను ఎక్కడి కక్కడ దెబ్బతీయటంలో భాగంగా నాగయ్యను ఖతం చేయాలని నిర్ణయించుకోవడం జరిగింది. తమ కుట్ర విఫలమైందని పసిగట్టిన నాగయ్య చావు భయంతో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ జీవనం కొనసాగిస్తుండగా జనవరి **2**నాడు బస్సులో దేవరకొండకు పోతుండగా సమాచారం అందుకున్న మన యాక్షన్ టీం వాడి గ్రామం పక్కనే బస్సు ఆపి బస్సులోనే వాడిని కాల్చి చంపడం జరిగింది. పోలీసు ఇన్ఫార్మర్, కోవర్ట్ కుట్రలకు పాల్పడ్డ వారికి ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించడం జరిగింది.

## పోలీస్ ఇన్ఫార్మర్ బద్దెల సత్యనారాయణ (వెంకట్) ఖతం

కృష్ణపట్టి దళ కమాండర్‌గా పని చేసి ఆగస్టు **2003**లో శత్రువుకు సరెండర్ అయి శత్రువు ప్రలోభాలకు ఆశపడి కృష్ణపట్టి దళం ప్రాంతంలో సంఘాలు, సానుభూతిపరులను అనేక మందిని అరెస్టు చేయించాడు. దళం వుపయోగించే మకాంలను పోలీసులను వెంట తీసుకుని వచ్చి చూపించాడు. తనకు తెలిసిన అనేక డంపులు, అమర్చిన లాండ్‌మైన్స్ చూపించడమేకాక వుద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాడు. దాంతో రాచకొండ ఎల్‌జిఎస్ వాని స్వంత గ్రామం సంస్థాన్ నారాయణపురంలో **24-11-2003**న కాల్చి చంపడం జరిగింది.

## పోలీస్ ఏజెంట్, మాజీ నక్సలైట్ జాలగోవింద్ (హరి) పిజిఏ చేతిలో హతం

చందంపేట మండలం పెద్దమూల గ్రామస్తుడు. గతంలో సంఘంలో పని చేసి **2002**లో దళంలో రిక్రూట్ అయి రాచకొండ దళసభ్యునిగా **3** నెలలు పని చేసి **2002** డిసెంబరులో శత్రువు ముందు సరెండర్ అయ్యాడు. శత్రువు ఇచ్చే పునరావాసం, డబ్బులకు ఆశపడి వృత్తి ఇన్ఫార్మర్‌గా మారాడు. ఎస్.పి. సజ్జన్నార్ కనుసన్నల్లో వుంటూ సెల్‌ఫోన్ వెంటపెట్టుకుని హైద్రరాబాదు, నల్లగొండ, దేవరకొండ హైవేలపై తిరుగుతూ వారి కదలికలను పోలీసులకు అందించడానికి సంవత్సర కాలంగా ప్రయత్నిస్తున్నాడు. అట్లే గ్రామంలోకి వచ్చి పోతూ దళం, సంఘం సమాచారం ఒకవైపు ఇస్తూనే మరోవైపు మీకేం కాకుండా సరెండర్ చేయిస్తా అని హామీలిచ్చి సరెండర్ చేయించి తీవ్ర చిత్రహింహలకు, కేసులు, జైలుపాలు చేసి ఇబ్బందులకు గురిచేసాడు. చివరకు కొత్తగా జిల్లాకు వచ్చిన ఎస్.పి. బాలసుబ్రమణ్యం ప్రోత్సాహంతో నల్లదండు ముఠాలో పూర్తికాలం కార్యకర్తగా పని చేయడానికి సిద్ధపడి చివరిసారిగా గ్రామానికి వచ్చి కె.పి.ఎల్‌జిఎస్, ఎస్‌జిఎస్‌ల చేతిలో చిక్కి చచ్చాడు.

## చింతకుంట ఎన్‌కౌంటర్ కారకుడు చెవ్వ హనుమంతు హతం

దేవరకొండ మండలం చింతకుంట్ల గ్రామంలో **2-9-97**న కృష్ణపట్టి దళంపై ఎన్‌కౌంటర్ జరిగి కా.జ్యోతి,స్వర్ణలు అమరులు అయ్యారు. దళం ఒక ఇంట్లో వున్న విషయాన్ని గ్రామ టిడిపి లీడర్ చెవ్వ హనుమంతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో గతంలో వీడిని ఖతం చేయడానికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. **20-12-03**న మధ్యాహ్నం మన యాక్షన్ టీం వాడి ఇంట్లోనే మట్టుపెట్టడం జరిగింది.

## టిడిపి లీడర్ పోలీసు ఇన్ఫార్మర్ కొట్టెవెంకటయ్య హతం

చందంపేట మ,డలం పాత కంబాలపల్లి గ్రామానికి చెందిన కొట్టె వెంకటయ్య టిడిపి లీడర్ వాటర్‌షెడ్ ఛైర్మన్‌గా లక్షరాపాయలు ప్రజాధనాన్ని మింగడమేకాక పోలీసులతో సంబంధాలలో వుండి దళం, పార్టీకి సహకరిస్తున్న

వారిని, సంఘం వాళ్ల సమాచారం పోలీసులకు అందించేవాడు. ఇది మానుకోవాలని కె.పి. ఎల్‌జీవీఎస్ ప్రచారం చేయగా మానుకోక పోగా దేవరకొండకు మకాం మార్చి తన కార్యకలాపాలను యధావిధిగా నడిపిస్తున్నాడు. **8-4-03**న కంబాలపల్లి గ్రామంలో వున్నాడని తెలిసి ఎస్‌జీవీఎస్, ఎల్‌జీవీఎస్ వాడి ఇంటిపై దాడి చేసి కాల్చి చంపడం జరిగింది.

## కోవర్టు సిరాజ్ (ఆజాద్) పిజిఏ చేతిలో కుక్కచావు

మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాలకు చెందిన సిరాజ్ **1992**లో ఆర్‌ఎస్‌యులో పని చేస్తూ అరెస్టు అయి బైటికి వచ్చాడు. అప్పటి నుండి **2002** వరకు వివిధ సంఘాలలో పని చేసి తెలంగాణా కళాసమితి కన్వీనర్‌గా పని చేస్తున్నందున **1999**లో నయీం ముఠా దాడికి గురయ్యాడు. ఈ క్రమంలో **2002**లో మెదక్‌లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి రిక్రూట్ అయి నల్లగొండ జిల్లా వుద్యమంలోకి అడుగు పెట్టి కృష్ణపట్టి దళ డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తూ ఆగస్టు **25**న ఏపిటిల పని మీద దళం నుండి బైటికి వెళ్లి నల్లదండు చేతికి చిక్కి వాడి బెదిరింపులకు లొంగి సహకరించడం మొదలు పెట్టాడు. ఈ నల్లదండు ముఠా ద్వారా పోలీసుల చేతుల్లోకి వెళ్లి, పోలీసుల ప్రోద్బలంతో డబ్బుకు ఆశపడి కోవర్టుగా మారాడు. ఈ టైంలోనే తనకున్న ఏపిటిలు మిస్ చేసి బయట తిరుగుతున్న సమయంలో జిల్లాకమిటీ సభ్యుడు కా.నర్సింహులు (మంద ఓబులేష్) అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్లి సిరాజ్‌కు కలిసి అతడు పెట్టిన షెల్టర్‌లోనే వుండి వైద్యం చేయించుకున్నాడు. ఈ విషయాన్ని సిరాజ్ పోలీసులకు తెలియజేయగా కా॥నర్సింహులును సెప్టెంబరు **28**న నల్లగొండ పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడం జరిగింది. ఈ క్రమంలోనే మెదక్, సిఓను అనారోగ్యంతో ఒక షెల్టర్‌లో వున్న మహిళా కామ్రేడ్‌ను, మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక పి.ఆర్‌ను పోలీసులకు చూపించాడు. బహిరంగ ప్రజాసంఘాలకు సంబంధించిన విస్తృత సమాచారాన్ని ఇంటలిజెన్స్ పోలీసులకు అందించాడు. చివరికి దళానికి విష ప్రయోగం చేయడానికి సిద్ధమయ్యాడు. అట్లే దళం లోపల కోవర్టు ఆపరేషన్ పూర్తి చేసుకుని బైటకు వచ్చి కామ్రేడ్స్ గద్దర్, వరవరరావు, ఏపిసిఎల్‌సి లక్ష్మణ్‌లను నల్లదండు ముఠాలతో కలిసి హత్య చేయడానికి సిద్ధపడ్డాడు. ఇంత నీచమైన స్థితికి దిగజారిన కోవర్టు సిరాజ్ దళం దగ్గరకు వచ్చి తప్పుడు రిపోర్టులతో నాయకత్వాన్ని నమ్మించడానికి ప్రయత్నించి విఫలమై పిజిఏ ఇంటరాగేషన్‌లో వాడు ఎంత నష్టం చేసింది, ఇంకెంత నష్టం చేయడానికి సిద్ధపడిందీ అనే విషయాలను బైటపెట్టాడు. ఈ కోవర్టు ద్రోహి ద్వారా ప్రభుత్వ పోలీసుల నీచమైన అప్రజాస్వామిక హింసోన్మాద, కుటిల పద్ధతులను ప్రజానీకానికి బహిర్గతం చేయడానికి నవంబర్ **4**న విలేకరుల ముందు ప్రవేశపెట్టడం జరిగింది. ఆ తర్వాత ఈ కోవర్టు కుక్కని చంపడం జరిగింది.

## పోలీస్ ఇన్ఫార్మర్ టిడిపి లీడర్ సుబ్బారావు హతం

ఆంధ్రా నుండి వచ్చి చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద హైవేపై ధాబా హోటల్ పెట్టుకుని జీవిస్తూ టిడిపి రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేసేవాడు. ఆందోల్ మైసమ్మ గుడి ఛైర్మన్ వీడి హోటల్ పోలీసులకు, గ్రామ టిడిపి నాయకులకు ఆఫీసుగా పని చేసేది. మన పార్టీకి సంబంధించిన సమాచారాన్ని టిడిపి నాయకుల ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు తెలియ జేసేవాడు. అట్లే హోటల్ పరిసర ప్రాంతాల్లో ఏ అనుమానిత వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇచ్చేవాడు. దీంతో **9/12/03**న మన యాక్షన్ టీం వాడి హోటల్‌లోనే కాల్చి చంపడం జరిగింది.

## టిడిపి మండల బిసి సెల్ అధ్యక్షుడు, పోలీస్ ఇన్ఫార్మర్, మాజీ నక్సలైట్ బింగి అంజయ్య హతం

చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన బింగి అంజయ్య **1994-97** వరకు వివోఆర్‌ఎస్ అధ్యక్షునిగా పని చేసి అరెస్టు అయ్యి క్రమేపీ పార్టీకి దూరమై, టిడిపిలో చేరి వుద్యమానికి వ్యతిరేకంగా భూస్వాముల పంచన చేరి పోలీసులకు దగ్గరయ్యాడు. ఎన్నిసార్లు తన పద్ధతి మార్చుకోవాలని చెప్పినా మార్చుకోకపోగా దళం గ్రామంలో మీటింగ్ పెట్టిన సందర్భంగా టిడిపి కార్యకర్తలను, డ్వాక్రాగ్రూపు లీడర్‌ను ఉసగొల్పి దళాన్ని ఒక ప్లాను ప్రకారం చర్చలలో దించి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ విషయాన్ని ప్రజల సహకారంతో ముందే తెలుసుకున్న దళం అక్కడి నుండి ప్రక్కకు తప్పుకుంది. అప్పటికే పోలీసులు గ్రామంలోకి ప్రవేశించారు. తృటిలో ఎన్‌కౌంటర్ తప్పిపోయింది. ఈ ద్రోహిని సెప్టెంబర్ **11**న చంపడం జరిగింది.

# మహబూబ్‌నగర్ జిల్లా

## కొల్లాపూర్ తెలుగుదేశం సర్పంచ్ గౌతంగౌడ్ ఖతం

గౌతం గౌడ్ గతం నుండి కూడా పార్టీకి వ్యతిరేకంగా వుండటమే కాకుండా **1996**లో తను కాంట్రాక్ట్ చేస్తున్న పనుల విషయమై మాట్లాడడానికి దళం పిలిపించినప్పుడు తను రాకుండా పోలీసులను పంపించాడు. పోలీసులు ఏర్పర్చిన మైత్రి సంఘం అధ్యక్షునిగా వుంటున్నాడు. మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి, జగన్నాథంలకు కుడి భుజంగా వుంటూ ప్రభుత్వ మోసపూరిత విధానాలతో ప్రజలను దోపిడీ చేస్తున్నాడు.

సి.ఐ. మధుకర్‌స్వామి అండదండలతో ఇన్ఫార్మర్ వ్యవస్థను బలపర్చ చూస్తున్నాడు. మనం ఎన్నిసార్లు హెచ్చరించినా తన పద్ధతులు మార్చుకోలేదు. దీంతో పాలక పార్టీలో క్రియాశీల కార్యకర్తగా వుంటూ, ప్రజా వుద్యమాన్ని దెబ్బతీయడంలో ముందుపీఠిన వుంటున్న గౌతం గౌడ్ను **27-6-03**న నలుగురితో కూడిన టీం కాల్చి చంపడం జరిగింది.

## ఇన్ఫార్మర్ తుమ్మల వెంకటస్వామి ఖతం

పానగల్ దళ ఏరియాలో గల మొలచింతలపల్లి గ్రామానికి చెందిన తుమ్మల వెంకటస్వామి **1996**లో పార్టీకి పరిచయమై **1998**లో పి.ఆర్‌గా వచ్చాడు. కొద్ది కాలానికి ఊగిసలాటకు గురై వెళ్లిపోయాడు. మరలా తిరిగి **99**లో పార్టీలోకి వచ్చాడు. అతడిలో ఊగిసలాట కొనసాగుతూ వుండటం వల్ల, మళ్లీ బైటకువెళ్లాడు. ఈసారి పోలీసులకు లొంగిపోయి పార్టీ తీవ్ర నష్టాన్ని చేసాడు. సంఘాలలోని వ్యక్తులను, సానుభూతిపరులను పట్టించటం, మందుపాతరలు చూపించడం, పోలీసు బ్యాచీల వెంట తిరగటం చేసాడు. చివరికి పానగల్ దళంలో కమాండర్‌తోపాటు మరో ముగ్గురు అమరులు కావడానికి కారణమైనాడు. మనం ఎన్నిసార్లు చెప్పినా తన పద్ధతులు మార్చుకోక తన మకాంను కొల్లాపూర్ మార్చుకున్నాడు. దీంతో **2003** ఏప్రిల్ **2**న గెరిల్లాదళం పండుగకు సొంత గ్రామం వచ్చిన వెంకటస్వామిని ఖతం చేసింది.

## కోవర్టు హనుమంతరావు ఖతం

శ్రీశైలం ఎస్.ఐ వెంకటరెడ్డి హనుమంతరావును కోవర్టుగా తయారు చేసాడు. శ్రీశైలంకు చెందిన హనుమంతరావుకు, మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల దళం సమాచారం అందించటంకానీ, దళంలో చేరి నాయకత్వాన్ని కాల్చి రావడంగానీ చేయాలని పురమాయించాడు. ఈ పని చేస్తే లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి మొదటి విడతగా **20**రూ॥లు ఇచ్చాడు. దీంతో దళం ఆచూకి కోసం కృష్ణానదిలో చేపలు పట్టేవారిని ఎంక్వైరీ చేస్తున్న హనుమంతరావును స్థానిక దళం పట్టుకుని ఇంటరాగేషన్ చేసి కాల్చి చంపారు.

## కొల్లాపూర్ టిడిపి మండల కన్వీనర్ పోతుల తిరుపాల్ ఖతం

కొల్లాపూర్ టిడిపి మండల కన్వీనర్, మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ అయిన పోతుల తిరుపాల్ టిడిపికి రాజీనామా చేసినట్లు చేసి తిరిగి టిడిపి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చాడు. ఇతడు గ్రామ భూస్వామి, పెత్తందారే గాక స్థానికంగా, పోలీసు నిర్బంధానికి కారకుడైనాడు. ఇతడిని **23-11-03**న అతడి ఇంటి వద్దనే గెరిల్లాదళం కాల్చి చంపింది.

## టిడిపి ఉపసర్పంచ్, వడ్డీవ్యాపారి రాములుగుప్త ఖతం

మిడ్జిల్ మండలం, రాంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాములు గుప్తా ఆ గ్రామానికి ఉపసర్పంచ్‌గానే కాక వడ్డీ వ్యాపారిగా వుంటూ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ వచ్చాడు. ఇతడిని **20-11-03**న మన గెరిల్లా దళం ఇంటి వద్దనే కాల్చి చంపింది.

# గుంటూరు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి మండలాలలో
# జైత్రయాత్రలా కొనసాగిన సారా పోరాటం

గుంటూరు జిల్లా వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో దాదాపు **10** సంవత్సరాల నుండి పార్టీ పని చేస్తున్నది. పార్టీ చేస్తున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్న గ్రామాలలో గుడిపాటి చెరువు ఒకటి. ఈ గ్రామంలో బలమైన భూస్వాములతో పోరాడి పేద చెంచు గిరిజనులు, ఇతర కులాల వారు భూమి సంఫాదించుకున్నారు. ఆ భూమినే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. **6** సంవత్సరాల కిందట ఈ గ్రామంలోని మహిళలు సారా పోరాటం చేసి సారాయి బంద్ పెట్టారు. అప్పటినుండి ఇప్పటిదాకా గ్రామంలో సారా అమ్మకాలు లేవు. వేరే గ్రామం నుండి ఎవరైనా తీసుకొచ్చినా, పారబోయటం, పగలగొట్టటం జరుగుతుంది.

ఈ మధ్య కాలంలో మండలంలోని మరికొన్ని గ్రామాలకు మన కార్యక్రమాలు విస్తరించాయి. జిల్లాలో అన్ని మండాలలతో సహా వెల్దుర్తి మండలంలో కూడా కరువు సమస్య తీవ్రంగా వుంది. తీవ్రమైన కరువు పరిస్థితుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పేద ప్రజలకు ఒక్కో ఇంటికి **50**కిలోల చొప్పున బియ్యం పార్టీ పంపిణీ చేసింది. ఈ కార్యక్రమం ప్రజలపై మంచి ప్రభావం వేసింది. ఈ టైములో గుడిపాటి చెరువుకు **3** కి.మీ దూరంలో వున్న కండ్లకుంట గ్రామంలో ప్రజలు భూస్వాముల భూమిని పంచుకోవటానికి (పోరాడి) సిద్ధపడ్డారు. ఈ క్రమంలోనే సారాయి పోరాటం చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపుతో గ్రామంలోని సభ్యులు దీన్ని ఒక కార్యక్రమంగా తీసుకున్నారు.

కండ్లకుంట గ్రామంలో **2000** జనాభా వుంటుంది. వెల్దుర్తి మండలాన్ని శాసించే బలమైన భూస్వాములు వున్న గ్రామం ఇది. ఈ గ్రామంలో **2003** మే నెలలో సారా పోరాటం మొదలైంది. మొదట **40** మంది యువకులతో సమావేశం వేసి సారాయివల్ల వస్తున్న నష్టాలు ఏంటి? సారాయివల్ల ఆరోగ్యం, ఇటు కుటుంబం కూడా ఎట్లా ఇబ్బందుల పాలవుతుందన్న విషయాన్ని వివరించగా యువకులంతా కూడా సారాయి బంథ్ చేయాలని మాట్లాడారు. ఈసారి మల్లీ **20** మంది మహిళలను కలిసి సమావేశం వేసి సారాయి బంద్ పెట్టటం వల్ల లాభాలు ఏంటి అని వివరించగా సారాయి వల్ల వస్తున్న సమస్యలు మహిళలు మాట్లాడారు. తరువాత ముత్తరాసి బజారులో **26** మంది మహిళలతో, సాకలిగడ్డ, లంబాడిగడ్డలలో **15**మంది మహిళలో ఎరుగలిగడ్డలో **10** మంది మహిళలతో, యాదవుల గడ్డలో **29** మంది మహిళలతో, రెడ్డి కులంలోని కొంతమంది మహిళలతో సమావేశాలు వేసి సారాయి తాగటం వల్ల వస్తున్న సమస్యలు మాట్లాడి, సారాయికి అలవాటుపడ్డ పురుషులు ఇండ్లలోని సామాను అమ్ముకోవటం, బియ్యం అమ్ముకోవటం జరిగి కుటుంబాలను ఎంత ఇబ్బందులపాలు చేస్తున్నారో వివరించటంతో మహిళలు, నిత్యం మా బతుకులలో అదే జరుగుతున్నదని బాధపడి, సారాయికి వ్యతిరేకంగా పోరాడటానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేసారు. సారా వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పరిచాము. ఈ సమావేశాల తరువాత గ్రామంలో ఊరేగింపు తీయాలని నిర్ణయించుకుని మనతో కలిసివచ్చే వారి కందరికీ కబురుపెట్టి 'సారాకు వ్యతిరేకంగా పోరాడండి', 'వర్థిల్లాలి సారా వ్యతిరేక కమిటీ', 'సారాయి తాగకండి, చావు కోరి తెచ్చుకోకండి' అంటూ నినాదాలు ఇస్తూ సాయంత్రం **5** గంటల నుండి **7** గంటల దాకా గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు తీసాము. ఈ ఊరేగంపులో మహిళలు, యువకులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఊరేగింపు అయిన తరువాత బహిరంగ సభ జరిగింది. పాటలు పాడి, అందరూ కలిసికట్టుగా వుంటే సారాయిని ఎలా బంద్ పెట్టవచ్చో వివరించాము. ఉత్తేజకరమైన వాతావరణంలో బహిరంగ సభ జరిగింది. 'సారాయి తాగిన కొంప నాశనమన్నా, తగులుకుంటే అది వదలదురన్నా' అనే పాట ప్రజల్లోకి బాగా పోయింది. బహిరంగ సభ తరువాత గ్రామంలో ఎవరి నోట విన్నా ఇదే పాట వుంది. ఊరేగింపు, సభ అయిన మరుసటి రోజు సారాను బంద్ చేయాలని, 'సారా వ్యతిరేక పోరాట కమిటీ వర్ధిల్లాల'ని పోస్టర్స్ వేసాం. సారాయి బంద్ పెట్టటానికి **3** రోజులు గడువు పెడుతూ బహిరంగ సభలో మాట్లాడాము. సభ జరిగిన మరుసటి రోజు సారా అమ్మే వాళ్లను **20** మందిని పిలిచి మాట్లాడాము. వారితో చాలా సామరస్యంగా మాట్లాడి తీసుకు రావద్దని చెప్పాము. తీసుకు రావద్దని చెప్పిన తరువాత కూడా తీసుకువచి అమ్మితే శిక్ష తప్పదని హెచ్చరించాము. మేము తీసుకురామని మాట్లాడారు. బహిరంగ సభ జరిగిన నాలుగవ రోజు నుండి గ్రామంలో సారాయి పూర్తిగా బంద్ అయింది. నెల రోజుల తరువాత మాలపల్లెలోని ఒకతను సారాయి సీసాను తెచ్చుకున్నాడు. ఈ విషయంలో పంచాయితీ చేయాలని అందరికీ కబురు చేసి **50** మంది మహిళలు, **60** మంది పురుషులతో పంచాయితీ జరిగింది. అతనితో మాట్లాడాము. తన తప్పును ఒప్పుకుని మరోసారి తెచ్చుకోనని మాట్లాడాడు. జనం అందరం చూసేటట్టుగా ఒక అరుగు ఎక్కి సీసాను పగలగొట్టాడు. ఇదే గ్రామంలో కల్లును కూడా ఒక క్రమంలో బంద్ పెట్టించడం జరిగింది.

కండ్లకుంటకు **3** కి.మీ దూరంలో కొత్తపుల్లారెడ్డి గూడెం వుంటుంది. ఇది పెద్ద గ్రామం. **3**వేల జనాభా వుంటుంది. ఈ గ్రామంలో మెజారిటీగా లంబాడీలు వుంటారు.తరువాత యాదవులు, ఇతర కులాలవారు వుంటారు. కండ్లకుంట గ్రామంలో బంద్ అయిన తరువాత పుల్లారెడ్డి గూడెంలో పోస్టర్స్ వేసాం. **40** మంది మహిళలను సమావేశ పరిచి సారాయి గురించి మాట్లాడితే సారాకు వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధపడ్డారు. ఈ **40** మందిలో **5** గురితో సారా వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. యాదవుల బజారులో **30** మంది, మాదిగపల్లెలో **35** మంది మహిళలను కలిసి మాట్లాడాము. ఈ గ్రామంలో కూడా బహిరంగ సభ, ఊరేగింపు జరపాలని నిర్ణయించుకున్నాము. పోస్టర్లు వేసిన మరుసటి రోజు **20**మంది పోలీసులు గ్రామంలోకి వచ్చిన, అన్నలు వస్తారంట కదరా, సారాయి బంద్ పెడతారంట కదా అని మాట్లాడారు. మాకు ఏమి తెలియదని ప్రజలు మాట్లాడంతో పోలీసులు వెళ్లిపోయారు. పోలీసులు వెళ్లిన మరుసటి రోజు ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపుకు పక్క గ్రామం అయిన కండ్లకుంట నుండి కూడా మహిళలు **80**మంది కదిలారు. ఈ మహిళలు కదలటానికి కారణం కండ్లకుంట నుండి పురుషులు వచ్చి పుల్లారెడ్డి గూడెంలో సారాయి తాగి వచ్చి ఇండ్లల్లో మహిళలను ఇబ్బంది పెడుతున్నారు. ఈ కారణంగా కండ్లకుంట నుండి **80** మంది మహిళలు కదిలారు. గూడెంలో జరిగిన ఊరేగింపు **400** మంది మహిళలు, **100** మంది పురుషులతో జరిగింది. గ్రామంలో మెయిన్ బజారుగుండా ఊరేగింపు జరిగింది. గ్రామ సెంటరులో మీటింగ్ ఏర్పాటు జరిగింది. వెయ్యి మందితో మహిరంగ సభ జరిగింది. సారాయివల్ల ఎదుర్కొంటున్న, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మాట్లాడి వారం రోజులు గడువు పెట్టి ఈ గడువు తరువాత కూడా అమ్మితే శిక్ష తప్పదని మాట్లాడాము. సారా మొత్తంగా బంద్ జరిగింది. అయితే కొద్దిరోజుల తర్వాత అక్కడక్కడ దొంగచాటుగా అమ్ముతున్నారని తెలిసింది. గ్రామంలోని యువకులను, మహిళలను పిలిచి ఈసారి స్త్రీ, పురుషులతో కమిటీ ఏర్పాటు చేసాం. యువకులు మహిళలు కలిసి గ్రామంలోని వారిని కలుపుకుని మొత్తం **80** మంది (స్త్రీ, పురుషులు) కదిలి ఇండ్లల్లో వున్న సారా బెల్లాన్ని తీసుకొచ్చి సెంటర్లో వేసారు. **8** బస్తాల బెల్లం అయ్యింది. ఈ బెల్లాన్ని గ్రామస్తులకు ఇంటికి కొంత పంచి పెట్టాము. ఊరికి రెండు కి.మీ. దూరంలో వున్న సారా కుండలను పగలగొట్టి వచ్చారు. సారా మొత్తంగా బంద్ అయ్యింది.

రెండు సవత్సరా కిందట ఈ గూడెంలో సారాయి బాగా అమ్మేవారు. కాసేవారు. దీనితో **20**మంది ఎక్సైజు పోలీసులు వచ్చి పట్టుకున్నారు. సారాయి

కాయటానికి వీలు లేదని మాట్లాడారు. దీంతో లంబాడీవాళ్లు ఖచ్చితంగా మేము కాస్తము. మా జీవనాధారం అదే అని మాట్లాడి పోలీసులను భయ పెట్టటానికి వారి కండ్లల్లో కారం చల్లారు. దీంతో పోలీసులు 6 రౌండ్స్ ఫైర్ చేసారు. ఈ ఫైరింగ్‌లో ఒక బాబుకు కాలికి తూటా తగిలింది. ఇటువంటి చరిత్ర వున్న పుల్లారెడ్డి గూడెంలో సారాయి పూర్తిగా బంద్ కావటం అన్నది మండలంలో చర్చనీయాంశమైంది. అన్నలవల్ల మాత్రమే ఇది జరిగింది. గూడెంలో సారాయి బంద్ చేయటం ఇంకెవరి వల్ల కాదు అని ప్రజలు మాట్లడుకోవటం జరిగింది

కండ్లకుంటకు 5 కి.మీ దూరంలో లచ్చుమ్మబావి వున్నది. ఈ గ్రామంలో 1200 జనాభా వుంటుంది. ఇది మాచర్ల మండలంలోని గ్రామం కండ్లకుంటలో బంద్ అయిన తరువాత 2003 మే 12న లచ్చుమ్మబావిలో 50 మందితో సమావేశం వేసి 10 మందితో సారా వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు చేసాం. ఈ 10 మందిలో 5గురు మాదిగపల్లెవాళ్లు, ఐదుగురు యాదవులు. 60 మది మహిళలతో మాట్లాడాము. మహిళలు సారాయిని పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సారాయి అమ్మే వారిని నలుగురిని పిలిచి మాట్లాడాము. ఈ నలుగురిలో ఇద్దరు మాదిగపల్లెవాళ్లు, మరో ఇద్దరు యాదవులు. ఖచ్చితంగా తేవద్దని అర్థం చేయించాము. పోస్టర్లు కూడా వేసాము. దీంతో లచ్చుమ్మబావి తండాలో సారాయి పూర్తిగా బంద్ అయ్యింది.

లచ్చుమ్మబావికి 6 కి.మీ దూరంలో వున్న రేగులారం తాండాలో 500 మంది వుంటారు. పోస్టర్స్ వేసాము. చుట్టుపక్క గ్రామాలలోని ప్రభావంతో పోస్టర్ల దెబ్బతో సారాయి ఆగిపోయింది. అలాగే శ్రీరాంపురం తాండాలో ముగ్గురు ముఖ్యమైన వాళ్లను పిలిచి మాట్లాడి పోస్టర్లు ఇచ్చాము. ఆ ముగ్గురు వెళ్లి పోస్టర్లు వేసి సారాయిని బంద్ చేసారు. ఈ గ్రామానికి రెండు కి.మీ. దూరంలో బోదిలేడు గ్రామం వుంటుంది. గ్రామ జనాభా 1000 మంది వుంటారు. మెజారిటీగా కమ్మవాళ్లు వుంటారు. భూస్వాములు వున్న గ్రామం. గ్రామం నుండి మాదిగపల్లెకు చెందిన నల్గురిని పిలిచి మాట్లాడి, పోస్టర్లు రాసి ఇచ్చాం. మాదిగపల్లెవాళ్లు పోస్టర్లు వేయటంతో సారాయి బంద్ అయింది. బోదిలేడుకు 2కి.మీ. దూరంలో గుల్లపాడు వుంటుంది. ఇక్కడ కూడా పోస్టర్లతోనే సారాయి బంద్ అయ్యింది.

వెల్దుర్తి మండలంలోని గొట్టిపాళ్ల జనాభా వెయ్యి వుంటుంది. ఈ గ్రామంలో 40 మంది మహిళలతో మాట్లాడాము. దీనిలో ఐదుగురితో సారా వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు చేసాం. ఈ గ్రామంలో టిడిపి, కాంగ్రెస్ గ్రూపులుంటాయి. ఇటువాళ్లతో, అటువాళ్లతో సపరేటుగా మాట్లాడాము. గ్రామంలో 60మంది మహిళలు, కొంతమంది పురుషులతో ఊరేగింపు జరిగింది. 'వర్ధిల్లాలి మహిళల ఐక్యత', 'పోరాడండి సారాయికి వ్యతిరేకంగా', 'సారాయి తాగకండి, అక్కలను కొట్టకండి' అన్న నినాదాలతో చాలా వుత్సాహంగా జరిగింది. బస్సులు ఆగే సెంటర్‌లో మీటింగు పెట్టాము. 200 మంది వచ్చారు. బహిరంగ సభలో చాలా వుషారుగా మహిళలు పాల్గొన్నారు. మీటింగు అయిన తరువాత ఆరుగురు సారా అమ్మేవాళ్లను పిలిచి మాట్లాడి, హెచ్చరించాము. కల్లు అమ్మేవాళ్లను కూడా పిలిచి మాట్లాడాము. దీంతో సారాయి, కల్లు ఒక నెలరోజులు పూర్తిగా బంద్ అయ్యింది. నెలరోజుల తరువాత ఒక మహిళ, ఒక పురుషుడు సారాయిని రహస్యంగా అమ్ముతున్నట్టు తెలిసింది. దీంతో కమిటీ సభ్యులు మాట్లాడుకుని 10మంది మహిళలు 10 మంది పురుషులు కలిసి వారిద్దరి ఇండ్లపై దాడి చేసి 3 లీటర్ల సారాయిని పట్టుకుని ప్రజల ముందు పెట్టి మాట్లాడి హెచ్చరించారు. తప్పయిందక్కా, ఇంకోసారి తీసుకురానంటూ సారాయి అమ్మే మహిళ మాట్లాడింది. దీంతో మళ్లీ పూర్తిగా సారాయి బంద్ అయ్యింది.

గొట్టిపాళ్లకు 18కి.మీ. దూరంలో గంగలకుంట గ్రామం వుంటుంది. ఈ గ్రామంలో మొదట పోస్టర్లు వేసాం. మనతో సంబంధాలు వున్నవారితో మాట్లాడి గ్రామంలో జనాన్ని పోగేసి మాట్లాడమని చెప్పాం. 80 మందిని పోగేసారు. ఈ 80 మందితో గ్రామం మొత్తం తిరిగి నినాదాలు ఇవ్వడం జరిగింది. ఊరేగింపు తరువాత బంద్ కాలేదు. మళ్లీ స్థానిక పార్టీ నాయకత్వం మాట్లాడింది. 100 మందితో మరోసారి ఊరేగింపు జరిగింది. ఊరేగింపు కంటె ముందు మహిళలతో మాట్లాడి ఐదుగురితో సారా వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు చేసారు. ఊరేగింపు జరిగి సభ తరువాత సారా అమ్మేవాళ్లను హెచ్చరించటం జరిగింది. సారాయి, కల్లు కూడా పూర్తిగా ఆగింది. అయితే కొద్దిరోజుల తరువాత కల్లు మాత్రం దొంగ చాటుగా అమ్ముడు పోతున్నది. కమిటీవాళ్లు 20 మంది మహిళలను కలుపుకుని వెళ్లి పారబోసారు. దీంతో, సారాయి, కల్లు బంద్ అయింది.

జెండాపెంట, మర్సుపెంట లో కూడా మాట్లాడాము. సారాయి కాసేవాళ్లను పిలిచి మాట్లాడాము. బంద్ అయింది.

కొత్త తాండాలో 200 మంది జనాభా వుంది. కాసేవాళ్లను పిలిచి మాట్లాడి 5 రోజుల గడువు ఇచ్చాము. 7వ రోజు 50 మంది గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి ఇండ్లల్లో వెతికితే ఒకరి ఇంటో ల 10లీటర్ల క్యానులో సారాయి దొరికింది. సారాయికాసే వాళ్లతో మాట్లాడాము. సారాయి క్రింద పారబోసారు. గ్రామస్థులు సారాయి అమ్మే అతనితో కులదేవుడి ముందు ప్రమాణం చేయించారు. గుడిలో గంట కొట్టారు. ఈ కార్యక్రమంలో 150 మంది వరకు గ్రామస్థులు పాల్గొన్నారు. పార్టీకి సంబంధించిన వాళ్లు ఎవ్వరూ లేకుండా, గ్రామస్థులు తమకు తాము చేసుకున్న పంచాయితీ ఇది. ఈ ప్రమాణంతో తాండాలో సారాయి పూర్తిగా ఆగిపోయింది. పాపిరెడ్డి కుంట తాండాకు వెళ్లి దళం మీటింగు పెట్టింది. మా బతుకు దెరువు సారాయి మీదనే వుంది. మరి మా బతుకు తెరువు ఏంటి? అని ప్రశ్నించారు. భూములు కొట్టుకోవటం ద్వారానే, భూమి మీద ఆధారపడి బతకటం ద్వారానే మీ సమస్యను పరిష్కరించుకోవాలి తప్ప సారాయి అమ్మికాదు అని దళం సమాధానం చెప్పి, తాండాలో సారాయిని బంద్ చేయించటం జరిగింది.

వజ్రాలపాడు తాండాలో కూడా మాట్లాడితే సారాయి బంద్ అయింది. హనుమాపురం తాండాలో ఈ ప్రభావంతో తమంత తామే మాట్లాడుకుని బంద్ పెట్టుకున్నారు. బటుకులపాయలో, కుంకుడుచెట్టు తాండాలో, కయ్యాలో దళం మాట్లాడిన వెంటనే బంద్ అయ్యింది.

జులై 25, 2003 వరకు కండ్లకుంటలో సారాయి బంద్ నడుస్తున్నది. అయితే మండాది గ్రామం నుండి రెడ్డి కుర్రవాడు ఐస్ పెట్టెలలో ఫీఫ్‌లిక్కర రహస్యంగా తెచ్చి అమ్ముతున్నాడు. పైకి చూడటానికి ఐస్ అమ్మినట్టుగానే వుంటుంది. గ్రామస్థులు కొంత మంది ఈ విషయం తెలుసుకుని ఆ కుర్రవాడిని హెచ్చరించారు. అయితే కొంత మంది రెడ్ల ప్రోద్బలంతో ఈ కుర్రవాడు లిక్కర్ అమ్ముతున్నాడు. సారా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు, దాదాపు 40 మంది మహిళలను తీసుకువెళ్లి గ్రామసెంటర్‌లో ఆ కుర్రవాడిని తీసుకొచ్చి గతంలో హెచ్చరించినా నీవు మళ్లీ రహస్యంగా అమ్ముతూనే వున్నావు నిన్ను శిక్షిస్తున్నా మంటూ ఒక పక్క గుండు గీయించి మరోపక్క మీసం తీసేసి గ్రామస్థులు ఏకగ్రీవంగా చేసిన తీర్పు మేరకు గ్రామంలో ఊరేగించటం జరిగింది. దీంతో దొంగచాటుగా అమ్మటం కూడా ఆగిపోయింది.

సారాయి ఆగిపోయిన తరువాత మహిళలు దళం గురించి, పార్టీ సభ్యుల గురించి ఎంతో అభిమానంతో, సానుభూతితో ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అంటేనే తమ సమస్యలు పట్టించుకునే తోబుట్టువులుగా భావించి ఎవ్వరికీ చెప్పని సమస్యలు పార్టీసభ్యులకు చెప్పటం వారికి ఎంతో సహకరించటం జరుగుతున్నది. ''నా పుట్టింటివాళ్లంటే కూడా నాకు అంత ప్రేమ వుండదు. మీరు వచ్చారని తెలిస్తే అంత సంతోష మనిపిస్తుంది. నాకు పండగపూట కూడా పండగ చేయబుద్ధి కాదు. మీరు కలిసినప్పుడే నాకు పండగ'' అని మహిళలు మాట్లాడుతున్నారంటే ఈ పోరాటం ప్రభావం ఎంత వున్నదో తెలుస్తున్నది.

# పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడు కా॥ కారుమంచి ప్రసాద్ (జయపాల్)కు విప్లవ జోహార్లు!

మే **23, 2003**లో కడప జిల్లా, కాలివీడు మండలం చాకిబండ వద్ద గ్రేహౌండ్స్ బలగాలు ఒక్కసారిగా చుట్టుముట్టి జరిపిన కాల్పులో కా॥జయపాల్‌తోపాటు కా.సంధ్య (ఏసిఎం), మరో ఇద్దరు ప్రజలు (రమణప్పనాయుడు, కదిరప్పనాయుడు) మృతి చెందారు. వీరందరికి, పార్టీ శ్రేణులు, గెరిల్లా బలగాలు, విప్లవ ప్రజానీకం ఘనంగా నివాళులర్పించి విప్లవ జోహార్లు తెలియజేసాయి.

కామ్రేడ్ జయపాల్ ప్రకాశం జిల్లా నర్సాయపాలెం గ్రామంలో **1955**లో ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. తన రెండు పదుల విప్లవ జీవితం, విప్లవోద్యమ అభివృద్ధి క్రమంలో విడదీయరానంతగా కలగలిసి పోయింది. పార్టీలో వచ్చిన రెండు సంక్షోభాలలో అతివాద, మితవాద అవకాశవాదాలను తిప్పికొట్టి సరైన పంథాను నిలబెట్టటంలో ముందుపీఠిన నిలబడ్డాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీని నిర్మూలించాలని, ఉమ్మడిగా చేపట్టిన నిర్బంధ క్యాంపెయిన్స్‌ను తిప్పికొట్టటంలో దృఢంగా నిలబడి ప్రజలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. పార్టీ అభివృద్ధి క్రమంలోని ప్రతి మలుపులోనూ, పార్టీని వర్గ పోరాట కొలిమిలో సానబడుతూ, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడుగా మెట్టుమెట్టుగా ఎదుగుతూ వచ్చాడు.

తెలంగాణా సాయుధ పోరాట కాలంలో తన కుటుంబం విప్లవ సానుభూతిపరుల కుటుంబం కావటంవల్ల, చిన్నతనం నుండి ప్రగతిశీల విప్లవ భావాలవైపు ఆకర్షించబడుతూ వచ్చాడు. **1970**ల చివరికల్లా హైస్కూల్ విద్యతోపాటు సాంకేతిక విద్య (పాలిటెక్నిక్)ను కూడ పూర్తి చేసి బ్రతుకు తెరువుకు అన్వేషణ ప్రారంభించాడు. అదే సమయానికి రాష్ట్రంలో జగిత్యాల జైత్రయాత్ర వెలుగులు నలుదిశలా వ్యాపిచటంతో, శ్రామికవర్గ సాంస్కృతిక సైనికులైన విప్లవ రచయితల కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఈ సంస్థ కార్యకలాపాలు ప్రగతిశీల భావాలుగల కా॥ జయపాల్ సహజంగానే ఆకర్షించాయి. సాహిత్యరంగం యెడల అభిరుచి, ఎంతో కొంత ఆ రంగంలో ప్రవేశం గల కా॥జయపాల్ వి.ర.సం.లో సభ్యత్వం స్వీకరించాడు. అది మొదలు చివరికంటా తన విప్లవ జీవితంలో వెనక్కి తిరిగి చూడలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా విప్లవ భావాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు.

**80**ల ప్రారంభానికి తానున్న చీరాల ప్రాంతంలో, రాడికల్ విద్యార్థి యువజన సంఘాల కార్యకలాపాలు ఊపందుకోవటంతో, తాను కూడా యువజన రంగం కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటూ ఆ సంఘ నాయకత్వ బాధ్యతలు కూడా వహించాడు. **1984** నాటికి పూర్తికాలం కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటినుండి ప్రకాశం జిల్లా మైదాన ప్రాంత గ్రామాలలో ఆర్గనైజర్‌గా పని చేస్తూ వచ్చాడు. గ్రామీణ ప్రాంతంలో జరిగే వ్యవసాయిక విప్లవంలో ప్రధాన పాత్రధారులు, నాయకత్వ బాద్యత వహించ వలసిన వారు, దళితులేనని, పార్టీ ఇచ్చిన అవగాహనను తన ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా అవగతం చేసుకుని, దళితుల నాయకత్వంలో పీడిత వర్గాలను సమైక్య పరిచాడు. ఈ క్రమంలో కారంచేడు, చుండూరు వంటి సంఘటనలు జరగటంతో దళిత సమస్య ప్రధానంగా భూమి సమస్యే అయినప్పటికీ, సాంఘిక సమస్యగా దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు అనుగుణంగా ఒక నిర్మాణం అవసరమని బలంగా అభిప్రాయపడ్డాడు. తన అభిప్రాయాలకు పార్టీలో కూడా బలం చేకూరడంతో, **94**లో కులసమస్యపై ప్రత్యేక పర్‌స్పెక్టివ్ రూపొందించుకున్నాము. ఆ తరువాత ప్రత్యేక నిర్మాణం ఏర్పర్చుకున్నాము. తాను మైదాన ప్రాంత ఆర్గనైజర్‌గా వున్నప్పుడే కారంచేడు సంఘటనలో అశువులు బాసిన వారందరికీ చీరాలలో స్మృతి చిహ్నం ఏర్పాటు చేయించే విషయంలో కీలక పాత్ర వహించాడు. తాను ఎంతగా దళితుల జీవితంతో మమేకమైనాడంటే, తన మరణానంతరం తన దేహాన్ని కారంచేడు మృతవీరుల ప్రాంగణంలో ఖననం చేయాలని కోరుకున్నాడు. ఆయన కోరికను తెలుసుకున్న స్థానిక దళిత పీడిత వర్గం, ఆ వీరుని మృతదేహాన్ని కారంచేడు మృతవీరుల ప్రాంగణంలో ఖననం చేసి ఆయన్ని అంతగా సొంతం చేసుకున్నారు. **1982** మొదలు **1990** వరకు ప్రకాశం జిల్లా మైదాన ప్రాంతం లోని అనేక గ్రామాలలో భూస్వాములకు వ్యతిరేకంగా పీడిత రైతాంగాన్ని కదిలించి పార్టీలోకి సమీకృతులను చేసాడు. తిమ్మసముద్రం గ్రామంలో భూమి సమస్యపై దళితులందరిని కదిలించి కరణం బలరామమూర్తి నాయకత్వంలోని భూస్వాములకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం నడిపాడు. ఈ క్రమంలోనే **1990**లో ప్రకాశం-నెల్లూరు ఉమ్మడి జిల్లా కమిటీలో సభ్యుడిగా నియమించబడ్డాడు. **1990**ల నాటికి జిల్లాలో మన కేంద్రీకరణ మైదానాల నుండి వెనుకబడిన అటవీ ప్రాంతానికి మారింది. ఈ నిర్ణయంలో భాగంగానే కా॥ జయపాల్ కూడా నల్లమల అటవీ ప్రాంతంలోని గెరిల్లా దళాలకు నాయకత్వంవహిస్తూ ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నాడు. **1995**లో నల్లమల కేంద్రంగా దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతాలను కలిపి ఒకే కమిటీ క్రిందకు తేవాలన రాష్ట్రకమిటీ నిర్ణయంలో భాగంగా ఏర్పడిన నల్లమల ఫారెస్టు డివిజన్‌కు సెక్రటరీగానూ, దక్షిణ కోస్తా రాయలసీమ ఉమ్మడి రీజియన్ కమిటీలోకి సభ్యుడిగాను కా॥జయపాల్‌ను ఎన్నుకున్నారు. తాను నల్లమల డివిజన్‌కు నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన తరువాత, అక్కడి మలేరియా వాతావరణంలో తీవ్రమైన అనారోగ్యానికి గురైనా, మొక్కవోని దీక్షతో కఠోరమైన గెరిల్లా జీవితానికి అలవాటుపడుతూ విప్లవోద్యమ అభివృద్ధికి తీవ్రమైన కృషి సల్పాడు. ఈ క్రమంలోనే వేంపెంట దళితవాడపై స్థానిక భూస్వాములు దాడి జరిపి మారణకాండను సృష్టించినప్పుడు అందుకు బాధ్యుడైన ఎంఎల్ఏ బుడ్డావెంగళరెడ్డిని అంతమొందించటంలో కీలక పాత్ర వహించాడు. ఇదే సమయంలో వేంపెంటలో జరిగిన సంఘటనను వక్రీకరిస్తూ కుహనా మేధావులు, మితవాద అవకాశవాదులైన జె.ఎస్ గ్రూపు చేస్తున్న దాడిని ప్రతిభావంతంగా తిప్పికొడ్తూ, బుక్‌లెట్ రూపంలో రాష్ట్ర ప్రజానీకానికి అక్కడ జరుగుతున్న వర్గ పోరాట వాస్తవాలను అందించాడు.

**1999**లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో, కా॥జయపాల్‌ను రాష్ట్రకమిటీ సభ్యుడిగా ప్లీనం ప్రతినిధులు ఎన్నుకున్నారు. **1999** చివరికి పార్టీ అధికార పత్రికను నడిపే బాధ్యత స్వీకరించి **2001** జనవరిదాకా కొనసాగించాడు. **2001**లో జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో తిరిగి రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడి రాయలసీమ ఉద్యమ బాధ్యతలు స్వీకరించాడు. ఈ బాధ్యతలు స్వీకరించిన తరువాత అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసే క్రమంలోనే శతృవు చేసిన దాడిలో అమరుడైనాడు.

కా॥ జయపాల్ గొప్ప కమ్యూనిస్టు విలువలు కల్గిన విప్లవకారుడు. కాడర్‌తో అత్యంత ప్రజాస్వామిక సంబంధాలు కలిగి వుండేవాడు. ఆయన క్యాడర్‌ను ఎంతగా ప్రేమించేవాడో, క్యాడర్ ఆయన్ను అంతగా ప్రేమించే వాళ్లు. పితృస్వామ్యంపైన కులతత్వంపైన నిరంతరం పోరు సల్పేవాడు. ఆయన తన భావాలకు అద్దంపడుతూ అనేక కథలు కవితలు రాసాడు. ఆయన రాసిన కరపత్రాలలో రాజకీయ విమర్శలు శతృవును సూటిగా తాకేవి. పోలీసులను ఆలోచింపచేస్తూ రాసిన కరపత్రం పోలీసు శాఖలోని అధికారులకు దడ పుట్టించింది. భారతదేశ విప్లవోద్యమ చరిత్రలో, వర్గ పోరాట కొలిమిలో మండి గొప్ప కమ్యూనిస్టుగా రాటుదేలిన కా.జయపాల్ పీడిత ప్రజల హృదయాలలో సదా నిలిచి వుంటాడు. ఆయన ఆశయసాధనకు పునరంకితమవుతూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం.

# నల్లగొండ ముద్దుబిడ్డ, నగరోద్యమ నాయకుడు
# కా॥నోముల రమణారెడ్డి(మహేందర్)కి విప్లవ జోహార్లు!

ఏప్రిల్ 20, 2003న హైదరాబాదు సిటీలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద సిటీ కమిటీ కార్యదర్శి కా॥మహేందర్, సిటీ కమిటీ సభ్యుడు కా॥శ్రీధర్‌లను బూటకపు ఎదురుకాల్పుల్లో కాల్చిచంపారు.

నల్లగొండ జిల్లా, వలిగొండ మండలం సంగెం (కొండంబావి) గ్రామంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. 31 ఏండ్ల తన జీవితంలో దాదాపు 15 ఏండ్లపాటు ప్రజలకోసం జీవించాడు. తాను పుట్టి పెరిగింది, తెలంగాణా సాయుధ పోరాటానికి వెన్నెముకగా నిలిచిన ఉద్యమ ప్రాంతం కావడంతో సహజంగానే కమ్యూనిస్టు రాజకీయాలు వంటపట్టాయి. దానికితోడు మన పార్టీ రాజకీయాలతో ప్రభావితుడైనాడు. 1989లో చౌటుప్పల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలోనే రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి వివిధ పోరాటాలకు, నిర్మాణాలకు నాయకత్వం వహించాడు. 1990-91లో డిగ్రీ చదువు కోసం హైదరాబాదు వెళ్లి ఆర్ఎస్‌యులో పని చేస్తూ తన విప్లవ జీవితాన్ని కొనసాగించాడు. కా॥సురేష్, వీరన్నల ప్రేరణలో మరింతగా రాజకీయంగా పదునెక్కి 1992లో పూర్తికాలం విప్లవకారుడైనాడు. అట్లా ప్రారంభమైన మహేందర్ పార్టీ జీవితంలో రాజకీయంగా, మిలిటరీపరంగా, ఆర్గనైజేషనల్‌గా ఎదిగాడు. పట్టణ ఉద్యమాన్నైనా, గ్రామీణ ఉద్యమాన్నైనా నడపడంలోనూ ఏ పనినైనా సమర్ధవంతంగా నిర్వహించడంలోనూ నాయకత్వ విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఇవేగాక ప్రజలతో, క్యాడర్‌తో కలిసిపోవడంలోనూ ముందే. ఇన్ని రకాల నైపుణ్యాలన్నీ ఒకరిలో చూడటం అరుదే! అటువంటి అరుదైన వ్యక్తిత్వం ఆయనది.

ఆ కామ్రేడ్‌ది మొదటి నుండే గొప్ప మిలిటెంట్ స్వభావం. 1994లో తన సి.ఓ అరెస్టయ్యి, అతని రూమ్ మీద దాడి చేస్తే, మిద్దె మీద పడుకున్న మహేందర్ తప్పించుకున్నాడు. తన రక్షణ చూసుకోకుండా తన వద్ద వున్న 20 రూ॥తో పెట్రోల్ డబ్బా కొని, ఒక్కడే వెళ్లి బస్సు తగులబెట్టి సి.ఓ అరెస్టు గురించి చాటాడు. అట్లా కర్తవ్యాన్ని నిర్వహించడంలో దేనికయినా సిద్ధపడే తత్వం. ఆ తరువాత యాదిగిరిగుట్ట రెయిడ్‌లోనూ అతనిలోని మిలిటెన్సీ ప్రస్ఫుటమవుతుంది. ఆ రెయిడ్‌లో అస్సాల్ట్ టీమ్‌లో వున్నాడు. ముందుగా బంకర్‌లో వున్న సెంట్రీని చంపనిదే చొరవ మన చేతిలోకి రాదు. ఆలోపే భుజానికి తూటా తగిలినప్పటికీ దాన్ని ఏ మాత్రం లక్ష్య పెట్టకుండా చొరవగా దూసుకెళ్లి సెంట్రీని చంపి యాక్షన్ సక్సెస్‌కు కారణభూతుడైనాడు. అతనిలోని ఆ సాహసత్వం మనకందరికీ ఆదర్శం.

సిటీలో విద్యార్థి రంగంలో సి.ఓ.గా పని చేస్తూ 1994లో అరెస్టయి ఒకటిన్నర సం॥పాటు జైలు జీవితం గడిపాడు. ఇతనిలోని మిలటెన్సీ గురించి ఎరిగిన శత్రువు తీవ్రంగా చిత్రహింసలు పెట్టాడు. అయినా అన్నిటినీ తట్టుకుని రహస్యాలను కాపాడాడు. మరింత కసిగా జైలు పోరాటాలన్నిటా పాల్గొన్నాడు. కమ్యూన్ మెయింటెనెన్స్, జైలు పత్రిక నిర్వహణ వగైరా కార్యక్రమాలన్నిటిలో కీలక పాత్ర వహించాడు. అదివరకు ఎన్నడూ కలం పట్టకపోయినా జైలు పత్రిక కోసం గల్పికలు, కవితలు, వ్యాసాలు, పాటలూ రాసేవాడు. గంటల తరబడి ఫెయిర్ కాపీలు రాస్తూ జైలులోనూ అలుపెరగక శ్రమించేవాడు. తను ఎక్కడున్నా క్రమశిక్షణ సూత్రాలకు కట్టుబడి వుండటం, తన విధిని ఖచ్చితంగా నిర్వహించడం, శ్రమ చేయడం, అందరితో కలిసి పోవడం అనేవి సర్వసాధారణ విషయాలుగా అమలు చేసేవాడు.

1995లో జైలు నుండి విడుదల కాగానే పార్టీ నిర్ణయం మేరకు నల్లగొండ జిల్లా ఉద్యమంలో అడుగు పెట్టాడు. కొంతకాలం కనగల్ దళ డిప్యూటీ కమాండర్‌గా 1996-98 వరకు రాచకొండ దళ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయి నిర్మాణ స్ఫూహతో పని చేసాడు. మిలిటెంట్లకు రెగ్యులర్‌గా రాజకీయ క్లాసులు నిర్వహిస్తూ, మిలిటెన్సీని పెంపొందించే దిశగానూ కృషి చేసేవాడు. విద్యార్థులను, యువకులను, మహిళలను వివిధ నిర్మాణాలలో ఇమిడ్చేందుకు కృషి చేసేవాడు. సర్వేల్, ముక్కునూర్, మంతన్ గౌరెల్లిలలో ప్రజలను భూపోరాటాల వైపు నడిపించి వందలాది ఎకరాలు భూస్వాముల భూములను ఆక్రమించి సాగు చేసుకునేలా, పోలీసు నిర్బంధాన్ని సమిష్టిగా ఎదుర్కునేలా కృషి చేసాడు. 1998 జిల్లా ప్లీనంలో జిల్లాకమిటీ సభ్యునిగా ఎన్నికై 2000 సంవత్సరం వరకు జిల్లా ఉద్యమాన్ని రాజకీయంగా నిలబెట్టడంలో ముఖ్య భూమిక పోషించాడు. ఇద్దరు జిల్లాకమిటీ సభ్యులు లొంగిపోయి, జిల్లాకమిటీ కార్యదర్శి అమరుడై జిల్లా బలహీనంగా వున్న స్థితిలో పార్టీని నిలబెడుతూ, క్యాడర్ తనపై వుంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అలుపెరుగక కృషి చేసాడు. నిర్దిష్టంగా కనగల్, క్రిష్ణపట్టి ఏరియాలను సృజనాత్మకంగా అభివృద్ధి చేయ ప్రయత్నించాడు.

2000 సంవత్సరంలో దెబ్బతిన్న నగర ఉద్యమానికి ఊపిరిలూదగ నగర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి కొన ఊపిరి విడి చే వరకు అదే బాధ్యతలో కొనసాగాడు. నగర ఉద్యమాన్ని ఒక మెట్టు ముందుకు తీసుకుపోతున్న క్రమంలో కొరియర్ విద్రోహం వల్ల అమరుడు కావడం పట్టణ ఉద్యమానికే గాక రాష్ట్ర ఉద్యమానికే తీరని నష్టం.

అర్బన్ మిలిటరీ క్యాంపులో ఇన్‌స్ట్రక్టర్‌గాను రాణించిన రమణ అర్బన్ వార్ ఫేర్ పట్ల స్పష్టమైన అవగాహన కలిగినవాడు.

కా॥ వీరన్నగా, మహేందర్‌గా, సలీంగా నల్లగొండ జిల్లా ప్రజల హృదయాలలో నిలిచిన కా॥రమణ శవయాత్రలో వేలాదిగా జనం పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ప్రజా నాయకుని స్మృతి చిహ్నంగా స్థూపాన్ని నిర్మించుకుని ''ప్రజావీరులు మృత్యుంజయులు, వారి ఆశయాలను కొనసాగిస్తాము''ని శపథం చేసారు.

కా॥ మహేందర్‌లోని పోరాట దీక్ష, నిర్మాణ స్ఫూహను, చొరవగా, నిర్ణయాత్మకంగా వుండటమూ, పై కమిటీ సూచనలను ఖచ్చితంగా అమలు జరుపటం, సూటిగా తన అభిప్రాయాలను చెప్పటం, పైకమిటీ సూచనలను ఖచ్చితంగా అమలు జరుపటం, సూటిగా తన అభిప్రాయాలను చెప్పడం, ఆరోగ్యకరమైన చర్చలు చేయడం వంటి సుగుణాలన్నిటినీ మనం ఆదర్శంగా తీసుకోవడమే ఆ కామ్రేడ్‌కు మనం అందించే నివాళి.

**ప్రజావీరులు మృత్యుంజయులు!**

**ప్రజల కోసం పోరాడేవారి మరణం హిమాలయాలకన్నా ఎత్తైనది, బరువైనది!!**

# ఉద్యమాకాశంలో అరుణతారై వెలిగిన గుంటూర్ జిల్లా కమిటీసభ్యురాలు
# కా॥ లత (రాధక్క, సుగుణ)కు అరుణారుణ జోహార్లు!

ఆరోగ్యం చూయించుకోడానికి బయటకు వెళ్లిన కా॥లతను కా॥కౌముదితో పాటు విశాఖ పట్టణంలో షెల్టర్‌లో పట్టుకుని, చిత్రహింసలకు గురిచేసి వినుకొండ–కారంపూడి రహదారి వెంబడి బొమ్మరాజుపల్లి కనుమ వద్ద అక్టోబర్ **23, 2003**న శవాలను పడవేసి బూటకపు ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లాడు శత్రువు.

విప్లవోద్యమంతో పెనవేసుకు పోయిన 'లత' ఎగిసిపడే ఒక పోరు సంద్రమే... ఎర్రని కాంతులీనే 'అరుణ'తారే! స్ఫూర్తిదాయకమైన విప్లవ జీవితం ఆమెది. విప్లవోద్యమానికి మహిళల భాగస్వామ్యం అవసరమని గుర్తించి ప్రయోగాత్మకంగా తన జీవితాన్ని మలుచుకున్న అద్భుత కామ్రేడ్ కా॥లత. ఆమెకు అనేక ప్రత్యేకతలు వున్నాయి. ఆంధ్ర రాష్ట్ర వుద్యమంలో దళాల్లో అడుగిడిన మొదటి మహిళా, మొట్టమొదటి మహిళా కమాండర్, ఏ.పి. రాష్ట్రకమిటీ కింద జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎదిగి వచ్చిన మొదటి మహిళా కామ్రేడ్ కూడా లతనే.

కా॥ లత **1960**లో మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల, టౌన్‌లో 'సుగుణ'గా పుట్టింది. ఆమె తల్లిదండ్రులు రామిరెడ్డి, వేదమ్మలు కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలలో వుండటంతో కా॥లత విప్లవ రాజకీయాల మధ్యనే పెరిగింది. డిగ్రీ పూర్తి చేసుకుని, రాయచూర్‌లో లాయర్ చదువు చదువుతుండగానే **1983**లో విప్లవ రాజకీయాలలో తాను కూడా భాగస్వామిని కావాలని నిర్ణయించుకున్నది. కా.లత మొదటి నుండి కూడా తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడానికి ధైర్య సాహసాలను ప్రదర్శించేది. ఆయుధం చేతపట్టి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా గత **2** దశాబ్దాలుగా పోరాటం చేస్తూనే మరొకప్క పితృస్వామ్య భావజాలంతోను మొదటి నుండి నిరంతర యుద్ధమే చేసింది. అందుకే ఒకరకంగా చెప్పాలంటే ఆమె చరిత్రంటే మహిళా ఉద్యమ చరిత్రే తప్ప వేరుకాదు.

**1984**లో కా॥ లత పార్టీలోకి పూర్తికాలం వచ్చే నాటికి ఆంధ్ర రాష్ట్రంలో మహిళా సంఘాలు దాదాపుగా లేవనే చెప్పాలి. మహిళా సంఘాల ఏర్పాటు కోసం కా॥ లత, తనతోపాటు రిక్రూట్ అయిన మరొక ముగ్గురు మహిళా కామ్రేడ్స్‌తోపాటు కలిసి పోరాడింది. మహబూబ్‌నగర్ జిల్లాలో మొట్టమొదటి సారిగా మహిళా సంఘాన్ని నెలకొల్పి లీగల్‌గా, సెమీలీగల్‌గా పని చేస్తూ విస్తృతంగా మహిళలను కదిలించి, సంఘటితపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. **1985**లో తనకు చాలా ఇష్టమైన కామ్రేడ్ సుదర్శనరెడ్డిని వివాహం చేసుకుని కొంతకాలం పార్టీ ఆదేశాల మేరకు డెన్ వర్క్‌లో వున్నది. అయితే మహిళలను పూర్తిగా డెన్‌లకే పరిమితం చేయడం సరైనది కాదనీ, మైదాన ప్రాంతాల్లోనూ, ఆర్గనైజేషన్ పనిలోనూ తాము అనర్హులము కామనీ, అక్కడ తాము పని చేయడం అవసరమనీ చర్చించిన వారిలో కా॥లత కూడా ఒకరు.

ఆనాటికి ఇంకా దళ నిర్మాణం రాలేదు, **1+2** నిర్మాణాల్లో మహిళలెవరూ లేరు. అయినప్పటికీ తాను అడవిలో, ఆర్గనైజేషన్‌లో పని చేయడానికి సాహసించింది. ధనిక మధ్యతరగతి కుటుంబంలో సున్నితంగా పెరిగినప్పటికీ కఠోరమైన అడవి జీవితంలోకి 'అరుణక్క'గా ఎంతో ఆనందం గా అడుగు పెట్టింది. ఆనాటి నుండి మళ్లీ ఎన్నడూ వెనుదిరిగి చూడలేదు. విప్లవోద్యమం తాలూకు సకల నిర్బంధ రూపాలనూ స్వయంగా అనుభవించినా – సహచరుల అమరత్వం, అరెస్టులు, ఎడబాటు ఒకటేమిటి లెక్కలేనన్ని కష్టాలను సహిస్తూనే అంచెలంచెలుగా ఎదుగుతూ సడలని దీక్షతో ముందుకు సాగిపోయింది.

దళాల్లోకి వచ్చిన కొత్తలో కొండలు గుట్టలు ఎక్కి రక్తాలు కక్కుకున్నా, మలేరియాలతో ఆరోగ్యం చెడినా ఓపికగా అన్నిటినీ సహిస్తూ తన శరీరాన్ని ఆ వాతావరణానికి అనుకూలంగా మలుచుకుంది. చివరివరకు కూడా క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజ్ చేస్తూ, సరైన ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ **45** ఏండ్ల వయసంటే ఎవరూ నమ్మలేనంత ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించడంలో ఆమెకామే సాటి. ప్రజల్లో అమరమరికలు లేకుండా కలిసిపోయేది. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆమె తరిగిన పెంటలలోని ప్రజ లంతా ఇప్పటికీ 'అరుణక్క బాగుందా' అని అడగకుండా వుండరంటే ఆమె వారి హృదయాలలో ఎంతగా నాటుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు. వారి పిల్లలను ఎత్తుకుని ముద్దాడి, వారితో ఆడి, పాడి వారికి మందులిచ్చి వైద్యం చేసి, వారి కుటుంబంలో సభ్యురాలిగా మమేకమై పోయింది. అట్లా పెంటలన్నీ (చెంచు గ్రామాలు) తిరుగుతూ పోరు మంటలు రేపింది. **1989** నుండి ఆ ప్రాంతంలో సి.ఓ.గా పనిచేస్తూ అనేక పోరాటాలు చేయించింది. మొట్టమొదట కా॥లత ఆధ్వర్యంలో జరిగిన సారా పోరాటం అక్కడ మంచి ప్రభావం వేసింది. ఆనాటికి చెంచు పెంటలలో మహిళలపై తీవ్రంగా వున్న అణచివేతను వ్యతిరేకిస్తూ అందరినీ కూర్చోబెట్టి మాట్లాడేది. ఆమె చెప్పిన రాజకీతాలతో చైతన్యవంతమై కొంతమంది మహిళలు పార్టీలోకి వచ్చారు.

చెన్నంపల్లిలో ఫారెస్ట్ వాచర్‌ను చంపిన కృష్ణారెడ్డి, రాంరెడ్డి అనే భూస్వాములను శిక్షించడంలో ముందుంది. మాజీ ఎంఎల్ఏ, భూస్వామీ అయిన రంగదాసును చంపిన యాక్షన్ టీమ్‌లోనూ తాను వున్నది. మహిళలు మిలిటరీపరంగానూ దేనిలోనూ పురుషులకు తీసిపోరని వాదించి వాటిలో సమర్థవంతంగా పాల్గొనడమే గాక ఆచరణలోనూ రుజువు చేసేది. కా॥లత **1990** చివరిదాకా కమాండర్‌గా మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగింది.

ఆ తరువాత అనారోగ్యం రీత్యా సంవత్సరంపాటు బయట వున్నది. అయితే **1989**లోనే పరస్పర అనురాగం, అన్యోన్యత, గౌరవం పంచుకున్న జీవిత భాగస్వామి తనకళ్ల ఎదుటే నీట మునిగి అమరుడైనా బాధను దిగమింగుకుని మరింత కసిగా ఆశయసాధనకై ముందుకు సాగింది. అనారోగ్యం రీత్యా మెదక్ జిల్లాలో దళసభ్యురాలిగా పంపితే ఆరు నెలల్లోనే అక్కడి పరిస్థితిని ఆకళింపు చేసుకుని **1993**లో ఇందుప్రియాళ్ దళం కమాండర్‌గా బాధ్యతలు చేపట్టింది. మెదక్ జిల్లాలో రాధక్కగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది, కమాండర్ రాధక్క గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. అనేకమంది మహిళా కామ్రేడ్స్‌కు కమాండర్ రాధక్క ఒక ఇన్స్పిరేషన్ ఆనాడు. కమాండర్‌గా వుంటూనే దళంలోని సమస్యలను నిబ్బరంగా ఎదుర్కోవడంలో, మరొపక్క జిల్లాకమిటీలోని ముఠాతత్వం, పెత్తందారీతనం వంటి చెడుధోరణులతో రాజీలేని పోరాటం చేసింది. ఆ తరువాత ఇద్దరు జిల్లా కమిటీ సభ్యులు లొంగిపోగా, **1996**లో జిల్లాకమిటీ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. **2000** సం॥లో గుంటూరు జిల్లాకు బదిలీ అయింది. మొత్తం రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థాయికి గుంటూరు జిల్లా వుద్యమాన్ని ఎదిగించడంలో తన వంతు కృషి తాను చేసింది. **1995** రీజినల్ కాన్ఫరెన్స్‌లోనూ, **2000** సం॥లో జరిగిన స్టేట్ కాన్ఫరెన్స్‌లో, **2003**లో జరిగిన స్టేట్ ప్లీనంలో రాజకీయ చర్చలలో చైతన్యవంతంగా పాల్గొని ఉద్యమాభివృద్ధికి, పితృస్వామ్య భావజాల నిర్మూలనకు కృషి చేసింది.

కా॥లతకు కళాసాహితీ రంగాలపై మక్కువ ఎక్కువే. తను మాత్రమే పాడాల్సిన పాటలుగా నిలిచిపోయే అద్భుతమైన గొంతు ఆమెది. దళాల్లో పని చేసే తొలిరోజుల్లోనే చెంచు మహిళల జీవితాన్ని అధ్యయనం చేసి ఒక వ్యాసం రాసింది. చివరి రోజుల్లో తను డీల్ చేసిన రంగం నుండి సేకరించిన రిపోర్ట్ ఆధారంగా గుంటూరు జిల్లా ఆర్‌ఎస్‌యు చరిత్రను అక్షరబద్ధం చేసింది. తన జీవితం తాలూకు అనుభవాలను తోటి మసిళా కామ్రేడ్స్‌కు గుణపాఠాలుగా అందించడం కోసం తన జీవితాన్ని అక్షరీకరించాలనే కోరిక తీరకుండానే వెళ్లిపోయింది. వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కున్న కా॥లత వాటి నుండి కొంత తెరిపినపడి మరింతగా ఎదగడానికి కేంద్రీకరిస్తున్న తరుణంలోనే ఒక గుణాత్మకమైన మార్పును సంతరించుకోబోతున్న తరుణంలోనే అమరురాలు కావడం జిల్లా వుద్యమానికి నష్టమే. ఒక సుదీర్ఘ విప్లవ జీవితం కలిగిన సీనియర్ మహిళా కామ్రేడ్‌గా ఆమె అమరత్వం మొత్తం మహిళా ఉద్యమానికి తీరని నష్టమే.

కా॥లతను పట్టుకుని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లాడు శత్రువు. అయితే వాడి నాటకాలను నమ్మని ప్రజలు మాత్రం కా॥అరుణక్క అంతిమ యాత్రలో వేలాదిగా పాల్గొని అశ్రునివాళి అర్పించారు. ~~ఈ~~ రక్కసి రాజ్యాన్ని నేలకూల్చడం ద్వారా తమ ప్రియతమ నాయకురాలి నెత్తురుబాకీ తీర్చుకుంటామని శపథం చేసారు. తనలోని పోరాట తత్వాన్ని, విప్లవ దృఢదీక్షనూ, ప్రజలతో మమేకమయ్యే 'సుగుణాల'ను అన్నిటినీ సొంతం చేసుకుని ముందుకు సాగుదాం.

# విశాఖ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సదానందం (కౌముది)కి విప్లవ జోహార్లు!

ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమ సాహిత్య ప్రపంచంలో దశాబ్దకాలంగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కా॥సదానందం 'కౌముది'గా విప్లవ ప్రజానీకానికి సుపరిచితుడు. పోరాటాల ఖిల్లా వరంగల్ జిల్లా తరాలపల్లిలో **36** ఏండ్ల క్రితం పుట్టిన సదానందం విద్యార్థిగానే విప్లవ రాజకీయాల్లోకి ప్రవేశించాడు. తల్లిపై ఎనలేని అనురాగమున్న సదానందం మమతలు, మమకారాలు వీరునికి సంకెళ్లు కావని' తెలుసుకుని తల్లి ఒడి వీడి వుద్యమ ఒడిలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. **1992**లో మెదక్ ఉద్యమంలో అడుగుమోపాడు. జోగిపేట, ఇందుస్ట్రియాల్ దళాల్లో పని చేస్తూ అంచెలంచెలుగా ఎ దిగాడు.

**1994** సెప్టెంబరులో మెదక్ కార్మికులను కూడగట్టి శ్రీనివాస్‌గా కార్మికరంగంలోకి చొచ్చుకపోయాడు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల కార్మికులను కదిలించి, నిర్మాణయుతం చేసాడు. బూర్జువా రివిజనిస్టు దొంగ ట్రేడ్ యూనియన్ నాయకులను ఎండగట్టి తగిన బుద్ధి చెప్పాడు. ముఖ్యంగా ఆర్‌టిసి రంగంలో రహస్య, బహిరంగ సంఘాలను ఏర్పాటు చేసి రాజకీయ తరగతుల ద్వారా, బహిరంగ సభల ద్వారా కార్మికులను చైతన్యపరిచి ఐక్యపోరాటాలకు సిద్ధం చేసాడు. **1996**లో ప్రజ్ఞాపూర్ డిపో కార్మికుల జీతాల పెంపు పోరాటం, ఆ డిపో మేనేజర్ అవినీతికి వ్యతిరేకంగా జరిగిన **15-20** రోజుల సమ్మె పోరాటమూ, చుట్టుపక్కల జిల్లాల్లోనూ మంచి ప్రభావం వేసాయి. ఆ సమ్మెకు సిద్ధిపేట, దుబ్బాక, మెదక్, సంఘారెడ్డి జహీరాబాద్ కార్మికులూ, రైతుల మద్దతును సైతం కూడగట్టడంలో ముఖ్యపాత్ర పోషించాడు. తీవ్ర నిర్బంధంలోనూ వారిని అంటిపెట్టుకుని వుంటూ బూటకపు ఎదురుకాల్పులకు వ్యతిరేకంగా పోరాడేలా చైతన్యపరుస్తూ, కార్మికులని పోరాటాల్లో నిలబెట్టి వారి గుండెల్లో చెదరని ముద్ర వేసుకున్నాడు.

కా॥సాగర్ శత్రువు తారసపడినప్పుడు సాహసంగా ఎదుర్కొని తప్పించుకోవడంలోనూ మంచి నేర్పరే. ఓరుగల్లు అమరులు కా॥నాగేశ్వరరావు, రామక్రిష్ణల త్యాగాలతో చలించిపోయి ''అరుణ అరుణ బాటలో... అరుణబావుట నీడలో ..... '' అని పల్లవితో మొదలైన సాగర్ కలం 'కౌముది' నదిలా ప్రవహించి అనేక పాటలను, కవితలను, ఒక నవలను వెదజల్లింది. అనేక కలాలకు పెన్నులో సిరానందించింది. తెలంగాణాలోని నిర్బంధాన్ని చిత్రించి 'తెలంగాణ పల్లె' నవల ద్వారా ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని రగిలించాడు కౌముది. అంతేకాక 'చనుబాల ధార' అనే కవితల సంపుటి కూడా వెలువడింది. మెదక్ జిల్లా ఉద్యమనేత కా॥మహేందర్ అమరత్వాన్ని ఎత్తిపట్టి జన్నారం మండలం, సూరారం బహిరంగ సభలో మృత్యుంజయుడుగా ఆవిష్కరించాడు. 'మేము యుద్ధంలోనే పుడతాం' పుస్తకం ద్వారా మెదక్ జిల్లా అమరుల త్యాగచరితను ప్రజల్లోకి తీసుకెళ్లాడు. క్యాంపుల సందర్భంగా సాహితీ వేదికలు నిర్వహించీ, అర్థరాత్రిదాకా సాహితీ తరగతులు నిర్వహించిన తీరు 'కలాన్ని పదునైన ఆయుధంగా శత్రువు మీదికి ఎక్కుపెట్టాల'నే తపనకు నిదర్శనం.

కౌముది **1995**లో జిల్లాకమిటీలో రామన్న, శంకర్‌ల అవకాశవాద, ముఠాకోరు విధానాలను ఎండగట్టి ఉద్యమంవేపు నిలిచాడు. **1998**లో జిల్లాకమిటీ బాధ్యతలు చేపట్టి అనారోగ్యాన్ని లెక్కచేయక దళాల వెంట తిరగడానికి సిద్ధపడ్డాడు. ఉద్యమ అవసరాల రీత్యా **2000** సంవత్సరంలో ఏ.ఓ.బి.కి తరలివెళ్లాడు. విశాఖ జిల్లా కార్యదర్శిగా కార్మికులనూ, మేధావులనూ విప్లవోన్ముఖులను చేసే క్రమంలోనే విశాఖ జిల్లాలో పట్టుకుని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి అక్టోబర్ **23, 2003**న కాల్చి చంపి, గుంటూరు జిల్లాలో శవాలను వేసి బూటకపు ఎదురుకాల్పుల కథను అల్లారు పోలీసులు. మరణంలోనూ శత్రువుకు లొంగని ఆ వీరుని జీవితం మనకాదర్శప్రాయం.

# ప్రజా ఉద్యమ సీనియర్ నేత కా॥నర్సింహులు(మంద ఓబులేష్)కు విప్లవ జోహార్లు!

నల్లదండు ముఠా చేతికి చిక్కి కోవర్టుగా మారిన సిరాజ్, అనారోగ్యంతో హైదరాబాదులో వైద్యం చేయించుకుంటున్న నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడు కా॥ నర్సింహులును పోలీసులకు పట్టించడంతో సెప్టెంబరు **28**న నల్లదండు ముఠా పోలీసులు సంయుక్తంగా కా॥ నర్సింహులును తీవ్రమైన చిత్రహింసలు పెట్టి హత్య చేసి శవాన్ని కృష్ణపట్టి ఏరియాలోని పెద్ద అడిశర్లపల్లి మండలం మల్లాపురం అడవిలో పడవేసి నల్లగొండ పోలీసులు ఎప్పటిలాగానే మరో ఎన్‌కౌంటర్ కథ అల్లారు.

అనంతపురం జిల్లా ముదిగుబ్బ గ్రామానికి చెందిన మంద ఓబులేషు డిగ్రీ చదువుతున్న సమయంలోనే విప్లవ రాజకీయాలకు ప్రేరేపితుడై వివిధ విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో చేరాడు. అప్పటి నుండి దాదాపు **25** సంవత్సరాలుగా విప్లవోద్యమం, పార్టీ ఎదుర్కొన్న అనేక కష్టాలు ఒడిదుడుకులు, సంక్షోభాలలో దృఢంగా నిలబడుతూ పార్టీని నిలబెట్టడంలో అంకిత భావంతో కృషి చేసాడు.

**1978**లో రాడికల్ విద్యార్థి సంఘం, 'విద్యార్థులారా గ్రామాలకు తరలండి' పిలుపుతోనే తను చదువుతున్న డిగ్రీని మధ్యలోనే వదిలి గ్రామాలకు కదిలాడు. గ్రామాలలో కష్టజీవుల కష్టాలలో పాలుపంచుకుని, వాటిని విడమరిచి ప్రజలను చైతన్య పరిచాడు. **1980** నుండి రహస్య జీవితాన్ని గడుపుతూ ప్రజల జీవితాలతో ముడివేసుకున్నాడు. కౌకుంట్లలో పయ్యావుల భూస్వాముల పీడనల నుండి ప్రజలను విముక్తి చేయడానికి రైతుకూలీ సంఘాలను నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

**1982**లోనే బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపించిన, మద్దలచెరువు నారాయణరెడ్డి కనముక్కల చెన్నారెడ్డి ఖతం కార్యక్రమాల్లో ప్రధాన భూమికను పోషించాడు. జిల్లా విప్లవోద్యమంలోని అన్ని ప్రాంతాలలో కా॥కుమార్ పేరుతో ఆర్గనైజర్‌గా పని చేసాడు. సింగిల్ ఆర్గనైజర్‌గానే వెంగళప్ప చెరువు, మాలగుండ్లపల్లి, చంద్రిచెర్ల, బద్దలాపురం, ఉరవకొండ ఏరియాలలో పని చేస్తూనే జిల్లా నాయకత్వంలోకి ఎదిగాడు. పార్టీలో వచ్చిన సంక్షోభాలను రాజకీయ చైతన్యంతో ఎదిరించి ద్రోహుల కుట్రలను బహిర్గతపరిచాడు. జిల్లాలోనే అధినాయకులుగా వెలిగిన బండయ్య, ఆర్.కెలు ద్రోహులైన తరువాత జిల్లా వుద్యమం బాధ్యత కా॥కుమార్‌పై మరింత పెరిగింది. సంక్షోభం గందరగోళం నుండి క్యాడర్‌ను బయట పడేస్తూ ఉద్యమ అభివృద్ధి పరుస్తున్న క్రమంలోనే కా॥కుమార్ అరెస్టయ్యాడు. **1993** నుండి **1996** వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ భావాలను ఏ మాత్రం సడలించకుండా జైలులో ఇబ్బందులు అధిగమిస్తూ క్యాడర్‌కు ఆదర్శప్రాయుడుగా నిలిచాడు. జైలు నుండి విడుదల అయిన తరువాత కడప-చిత్తూరు జెడిసి (ఉమ్మడి జిల్లాకమిటీ)కి కార్యదర్శిగాను దక్షిణకోస్తా రీజినల్ కమిటీ మెంబర్‌గాను పని చేసాడు.

ఆ తరువాత ఉద్యమ అవసరాల రీత్యా నల్లగొండ జిల్లా ఉద్యమంలోకి జిల్లాకమిటీ సభ్యునిగా అడుగుపెట్టాడు. అప్పటి నుండి అమరుడయ్యే వరకు జిల్లా ఉద్యమాన్ని అందులో కృష్ణపట్టి ఏరియా ఉద్యమాన్ని గైడ్ చేసాడు. అనేక ఒడిదుడుకుల మధ్య డయాబెటీస్‌తో బాధపడుతూ వయసుకున్న పరిమితులను కూడా లెక్క చేయకుండా క్యాడర్‌ను ఉత్సాహపరుస్తూ ఉద్య పురోగమనానికి కృషి చేసాడు. కృష్ణపట్టి ప్రాంతంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురి చేయబడుతున్న లంబాడి, గిరిజనులు, చెంచులు, జాలర్ల స్థితిగతులను అధ్యయనం చేసి వారిని సంఘటితం చేస్తూ వివిధ పోరాటాలలో

కదిలించాడు. స్వాతంత్ర్యం వచ్చి **50** సంవత్సరాలయిందని పాలకులు చెప్పుకుంటున్నా సాగర్ డ్యాం ముంపుకు గురై గట్లు పట్టిన గ్రామాలు, తండాలకు ఇంతవరకు కనీసం విద్యుత్ సౌకర్యం కల్పించనందుకు నిరసనగా ప్రజలను పోరాటంలోకి కదిలించాడు. ప్రజలు విద్యుత్ సౌకర్యాన్ని సాధించుకున్నారు. చేపల కాంట్రాక్టర్ల మెడలు వంచి చేపలరేటును పెంచుకోవడంతోపాటు కాంట్రాక్టర్ల అవినీతిని దెబ్బతీసి ప్రజలకు అండగా నిలిచి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నాడు. కంబాలపల్లిలో ముఠా ఘర్షణలతో గుండాయిజంతో ప్రజల జీవితాలను ఆగం చేస్తున్న టిడిపి లీడర్ మేకల మల్లయ్యను దెబ్బతీసి ప్రజలకు అండగా నిలిచాడు. చెంచుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారి భూములను అక్రమంగా కబ్జాపెట్టుకున్న పెత్తందార్లను ప్రజాపంచాయితీలకు ఈడ్చి చెంచుల భూమిని చెంచులకు ఇప్పించడం, కరువు సమస్యతో సతమతమవుతున్న ప్రజలను కరువు దాడులకు కదిలించడంతోపాటు అవినీతితో లక్షల ప్రజాధనాన్ని కాజేసిన రాజకీయ నాయకుల ప్రజలలోకి ఈడ్చి వాళ్ల తప్పు ఒప్పించడంతో పాటు ప్రజాకంటకులైన తెలుగుదేశం పార్టీ నాయకులు దేప జనార్దన్‌రెడ్డి, చేపూరి సుధాకర్‌రావులను దెబ్బతీయడంలో ప్లానులు రూపొందించాడు. ఇలా ప్రజల పక్షం నిలిచినందుకు సహించని పాలక వర్గాలు అదునుకోసం ఎదురుచూస్తూ కోవర్టు కుట్రతో హత్య చేసి కృష్ణపట్టి ప్రాంతంలో పీపుల్స్‌వార్ పని అయిపోయిందని సంబరాలు జరుకున్నరు; కానీ వీరుల త్యాగం వృధాకాదని ఈ దోపిడీ దొంగలు అర్థం చేసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు. కోవర్టు కుట్రలో భాగస్వాములైన వాళ్లను పసిగట్టిన పిజిఏ బలగాలు వాళ్లను జాడలేకుండా అంతమొందించి కా॥నర్సింహులు హత్యకు ప్రతీకారం తీర్చుకున్నారు. సుదీర్ఘ విప్లవ అనుభవం కలిగి ప్రజల, క్యాడర్ మన్ననలను చూరగొన్న ఆదర్శ గెరిల్లా విప్లవ నాయకుడు అయిన కా॥నర్సింహులు అమరత్వం విప్లవోద్యమానికి తీరని లోటే. ఆ లోటును పూడ్చుకోవడం కోసం విప్లవ శ్రేణులు మరింత అంకిత భావంతో విప్లవ పురోగమనానికి కృషిచేద్దాం. ఆ విధంగా అమరులకు నిజమైన నివాళులు అర్పిద్దాం.

---

# మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాయుద్ధ యోధుడు కా॥ గడ్డం మద్దిలేటి (సుదర్శన్)కు విప్లవ జోహార్లు!

వలసగడ్డపై మరో ఎర్ర మందారం నేలరాలింది. అది వెదజల్లె పరిమళాన్ని ఆస్వాధించేవారిని నిరాశపర్చనునుకుంది. దాన్ని నేలరాల్చిన రాబందువు. దానికి వేల మందారాలను పూయించే వృక్షాన్ని గూర్చి తెలియదు మరి!

అక్టోబర్ **16, 2003** రాత్రి కిన్నెరగుండం వద్ద బూటకపు ఎన్‌కౌంటర్ లో మహబూబ్‌నగర్ జిల్లాకమిటీ సభ్యుడు కా॥ సుదర్శన్ అమరుడైనాడు.

కిన్నెరగుండం పరిసరాల్లో జరిగిన ఎదురుకాల్పుల నుండి బయటపడి, రెండు రోజులుగా తిండి లేకుండా వున్న దళానికి తిండి తేవడం కోసం వట్వర్లపల్లికి వెళ్లిన సుదర్శన్ నమ్మినవాడే ద్రోహం చేయగా శత్రువు చేత చిక్కాడు. ఎన్ని చిత్రహింసలు పెట్టినా పార్టీ రహస్యాలను కాపాడి మృత్యువునే గేలి చేసి శత్రువుపై విజయం సాధించాడు.

**13** ఏండ్లుగా విప్లవోద్యమంలో ఆటుపోటులెన్నో సహిస్తూ, పట్టుసడలని కార్యాచరణతో క్యాడర్, ప్రజల ఆదరణ చూరగొన్న కామ్రేడ్ సుదర్శన్ అమరత్వం మొత్తం ఉద్యమానికి, ముఖ్యంగా వలసపల్లెలకు తీరని నష్టాన్నే చేకూర్చింది.

**32** ఏండ్ల సుదర్శన్ అసలు పేరు గడ్డం మద్దిలేటి. పాలమూర్ ప్రజల ముద్దుబిడ్డ, ఆకలి జిల్లాకు విప్లవ పాఠాలను అందించిన ఎర్రమల్లె మద్దిలేటి. చాలా నిరాడంబరుడు, మావోయిస్టు రాజకీయాలకు అనుగుణంగా ఎదుగుతున్నవాడు. మద్దిలేటిది వీపనగండ్ల మండలంలోని పెద్దమర్రూర్ గ్రామం. ఊరిచివర విసిరి వేయబడిన కులంలో జన్మించినవాడు. వర్గకసితో రాటు దేలాడు. ఒక్కడే కొడుకు కావడంతో అల్లారు ముద్దుగా పెరిగినా విప్లవంలో కష్టాలకు వెరువలేదు. కొల్లాపూర్‌లో హైస్కూల్ చదివి, గద్వాలలో ఇంటర్‌మీడియట్‌లో చేరగానే **1989**లో పార్టీ సంబంధాలలోకి వచ్చాడు. అప్పటికే గద్వాలలో విద్యార్థిరంగంలో అనేక పోరాటాలు జరిగి విప్లవోద్యమ ప్రభావం బాగా వుండింది. **1989** నుండి **2** సంవత్సరాలపాటు జరిగిన అనేక విద్యార్థి పోరాటాలలో సుదర్శన్ పాత్ర వుంది. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా గద్వాల రైల్వేస్టేషన్‌పై చేసిన దాడిలో గాయపడిన విద్యార్థి నాయకుడికి హాస్పటల్‌లో సహాయంగా వున్న క్రమంలో అరెస్టయ్యాడు. జైలు నుండి విడుదల కాగానే పార్టీ పిలుపు మేరకు **1990** నవంబరులో పూర్తికాలం కార్యకర్తగా దళాలలోకి వచ్చాడు. విద్యార్థి రంగంలో పని చేస్తున్నపుడు మరికొందరు ముఖ్య నాయకులున్నా, చొరవ, క్రమశిక్షణ దృఢదీక్షను కలిగి వుండటంలో తనకు తానే సాటి. వాటిని చివరిదాకా ప్రదర్శించినవాడు కా॥ సుదర్శన్.

**1990** వెసులుబాటు కాలంలో విప్లవ రాజకీయాలను జిల్లా వ్యాపితంగా ప్రచారం చేసాడు. చారిత్రాత్మకమైన వరంగల్ మహాసభలలో వాలంటీర్‌గా వెళ్లి తనకు అప్పగించిన కార్యక్రమం నిర్వహించాడు. ఆ తరువాత నల్లమల గెరిల్లా దళంలో సభ్యుడిగా ప్రారంభమైన దళ జీవితం అంచెలంచెలుగా ఎదిగింది. **1994** వరకు డిప్యూటీ కమాండర్‌గా **1995** నుండి **1998** వరకు నల్లమల, అప్పర్‌ప్లాట్ సెంట్రల్ గెరిల్లా దళ కమాండర్‌గా **1998** ప్లీనంలో జిల్లాకమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. కామ్రేడ్ మహేష్ అమరుడైన తరువాత సుదర్శన్ జిల్లా ఆర్థిక, సామాజిక స్థితిగతులను మరింత లోతుగా ఆకలింపు చేసుకున్నాడు. క్యాడర్‌కు, నాయకత్వానికీ జిల్లా అనుభవాలను నిరంతరమూ పూసగుచ్చినట్లు చెప్పేవాడు. చెంచు ప్రజల సాధక బాధకాలను పట్టించుకుని, ప్రభుత్వ దోపిడీ విధానాలను విడమర్చి బోధించేవాడు. అప్పాయిపల్లి లింగాల నుండి దళంలో చేర ప్రయత్నించిన కోవర్టును గుర్తించి పార్టీని పెద్ద ప్రమాదం నుండి తప్పించాడు.

దక్షిణ తెలంగాణ సబ్‌కమాండ్ మెంబర్‌గా అనేక ఆంబుష్‌ల పథక రచనల్లో పాలు పంచుకున్నాడు. **8, 9** ఎన్‌కౌంటర్‌లలో అనుభవాలను కలిగిన సుదర్శన్ నిర్బంధాన్ని తిప్పికొట్టేందుకు నిరంతరం సిద్ధంగా వుండాలని క్యాడర్‌కు బోధించేవాడు. మొదటి నుండి కూడా మిలిటరీపరంగా అనేక యాక్షన్లలో సాహసం ప్రదర్శించి తనవంతు పాత్ర నిర్వహించేవాడు. **1993**లో ఎస్‌పి పరదేశీనాయుడుతో సహా **9**మంది మరణించిన సోమశిల ఆంబుష్‌లోనూ, **1997**లో ఐదుగురు పోలీసులు చనిపోయిన, **5** తుపాకులు తెచ్చిన మరొక ఆంబుష్‌లోనూ సుదర్శన్ స్పాట్‌గా తెగువ ప్రదర్శించాడు. **1998**లో పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌పై రెయిడ్‌లో కీలక పాత్ర పోషించాడు.

జిల్లా ఉద్యమంలో పేరున్న సీనియర్ కామ్రేడ్ కావడంతో శత్రువు కుట్రపూరితంగా సుధర్శన్ లొంగిపోతాడనీ, పార్టీతో తనకు విభేదాలు వున్నాయనీ వగైరా దుష్ప్రచారం కొనసాగించాడు. అయినా చెక్కు చెదరక దాన్ని తిప్పికొట్టాడు. చివరిదాకా ప్రజల పక్షం నిలిచి శత్రు ప్రచారాల బూటకత్వాన్ని రుజువు చేసాడు.

సుదర్శన్ రాజకీయ, మిలిటరీ నాయకుడే కాదు, కళాకారుడూ, కవి కూడా. 'శిఖరం' పేరుతో పాటలు, కవితలు, స్పందనలు రాసాడు. నక్సల్బరీ బిడ్డల ఒగ్గు కథ చెప్పేవాడు; డప్పు, కంజర వాయించి జెఎన్‌ఎంకు సహాయపడేవాడు. 'పోదామురో ఆ జనసేనలో కలిసి' అనే పాటకు డ్యాన్స్ వేసి క్యాంపుల్లో ఉత్సాహం నింపేవాడు. తాను ఎక్కడున్నా కళతోపాటూ, క్యాడర్‌లో కలిసిపోయి జోకులు వేస్తూ కూడా ఉత్సాహకర వాతావరణాన్ని సృష్టించేవాడు. కామ్రేడ్ సుదర్శన్‌లోని ఆదర్శాలను, పట్టుదలనూ, వర్గకసినీ పునికి పుచ్చుకుని పురోగమిద్దాం.

# నల్లదండు ముఠాచే అత్యంత దారుణంగా హత్య చేయబడిన కామ్రేడ్స్‌కు విప్లవ జోహార్లు!

***కా॥ రఘు*** : (చెరుకుపల్లి మల్లేష్) నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామంలోని పేద కుటుంబంలోని తల్లిదండ్రులకు ఒక్కగానొక్క ముద్దుల కొడుకు. **10**వ తరగతి వరకు చదువుకుని కుటుంబ పోషణకు ఉపాధి వెతుక్కుంటూ వివిధ రకాల పనులు చేస్తూ లారీ డ్రైవర్‌గా స్థిరపడ్డాడు. తనకు జ్ఞానం తెలిసినప్పటి నుండి ఏరియాలో జరుగుతున్న వర్గ పోరాటానికీ ప్రభావితుడవుతూ సమాజంలో జరుగుతున్న వర్గ దోపిడీ అణచివేతను అర్థం చేసుకుని తన జీవిత కర్తవ్యాన్ని లక్ష్యాన్ని నిర్ణయించుకుని **2000** సంవత్సరంలో రాచకొండ దళం సంబంధాలలోకి వచ్చాడు. అప్పటి నుండి పార్టీ ఇచ్చిన వివిధ టెక్నికల్ పనులు చాకచక్యంగా అమలు చేస్తూ **2001** ఏప్రిల్‌లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. కొంతకాలం ఎస్‌జిఎస్‌లో దళ సభ్యుడిగా పని చేసాడు. గొడుకొండ ఎన్‌కౌంటర్‌లో రాచకొండ దళం దెబ్బతినడంతో పునర్ నిర్మాణంలో దళ సభ్యునిగా ట్రాన్స్‌ఫర్ అయిఅనేక ఇబ్బందులకు కష్టాలకు వెరువక పట్టుదలకు మారు పేరుగా చైతన్యవంతంగా ఏరియాపై పట్టు సాధించడానికి ప్రయత్నించాడు. రివిజనిస్టు ఆలోచనలతో అనేకమంది క్రింది స్థాయి నాయకులు శత్రువు ముందు మోకరిల్లినా గొడగొండ్ల, పసునూరు, అమరుల అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాచకొండ ఉద్యమానికి అండగా నిలిచాడు. తీవ్రమైన పని ఒత్తిడి వున్నా అలుపెరుగక శ్రమిస్తూనే దొరికిన తక్కువ సమయాన్ని అయినా వదలకుండా అధ్యయనం చేస్తూ రాజకీయంగా ఎదగడానికి కృషి చేసాడు. చౌటుప్పల్ సి.ఓ.గా పనిచేస్తున్న కా॥శ్రీను (చుక్క శంకర్) బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడు కాగా ఆ సెంటర్‌ను తిరిగి నడప డానికి కా॥రఘు సి.ఓగా ప్రమోట్ అయి బాధ్యతలు స్వీకరించాడు. అనుభవం తక్కువగా వున్నా పట్టుదలతో దాన్ని అధిగమిస్తూ మైదాన ప్రాంత ఉద్యమాన్ని బలంగా నిర్మించడానికి, కృషి చేస్తున్న క్రమంలో ఒక కాలువ దాటుతుండగా తన దగ్గర వున్న స్టెన్‌గన్ ప్రమాదశవాత్తు ఫైర్ అయ్యి తూటా కాలి నుండి దూసుకుపోయి గాయపడ్డాడు. విషయం నల్లదండు ముఠాకు అర్థమయ్యి శత్రువుకు ఎక్స్‌పోజ్ చేసి అలర్ట్ చేస్తూ వెంటనే నిఘాను పెంచాడు. రామన్నపేట మండలం శోభనాద్రి పురంలో తనకు తెలిసిన ఒక ఆర్‌ఎంపి డాక్టరు ఇంట్లో ట్రీట్‌మెంట్ తీసు కుంటూ మందుల కోసం కా॥ గోపాలకృష్ణను చిట్యాల టౌన్‌కు పంపాడు. అక్కడ గోపాలక్రిష్ణ గ్రామానికి చెందిన మాజీ నక్సలైటు నల్లదండు ముఠా సభ్యుడు అతన్ని గుర్తుపట్టి తనముఠాతో కలిసి అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి కా॥రఘు వున్న అడ్రస్ తెలుసుకుని ఆ ఇంటిపై దాడి చేసారు. ఇంట్లో నిరాయుధంగా కదలలేని స్థితిలో వున్న కా॥రఘును హంతకులు **19-11-03**న కత్తులతో పొడిచి, తుపాకులతో కాల్చి అతి కిరాతకంగా హత్య చేసారు. అదే సమయంలో కా॥గోపాలక్రిష్ణను కూడా ఆ కిరాయి హంతక ముఠా కత్తులతోనే పొడిచి హత్య చేసింది. ఈ సంఘటన జరిగిన గంటన్నరకు పోలీసులు వచ్చి అక్కడి ప్రజలను నమ్మించడానికి ఇంటిపై కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ కథను సృష్టించారు. అంటే ఈ నల్లదండు ముఠాలను చంద్రబాబు ప్రభుత్వం ఎంతగా ప్రోత్సహిస్తుందో ఈ సంఘటన స్పష్టం చేస్తుంది. కా॥రఘు అమరత్వం అప్పటికే అనేక ఎన్ కౌంటర్‌లతో నష్టపోయి వున్న రాచకొండ ఏరియా ఉద్యమానికి సీరియస్ నష్టమే. అతితక్కువ సమయంలోనే ఏరియా ప్రజల ఆదరాభిమానాలు చూరగొని సిఓగా ఎదిగి ఏరియా ఉద్యమాన్ని అభివృద్ధి చేసేక్రమంలో అమరుడై ఆదర్శ నీయుడైనాడు.

***కా॥ గోపాలక్రిష్ణ (లింగస్వామి)*** : ఇదే బూటకపు ఎన్‌కౌంటర్‌లో నల్లదండు ముఠా చేతిలో హత్య గావించబడ్డాడు. కా॥గోపాలక్రిష్ణ మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన **20** సంవత్సరాల వయస్సుగల ఒక పేద కుటుంబీకుడు. **8** సంవత్సరాల క్రితం బాలల సంఘంలో చేరి బాలల నాయకుడిగా గ్రామ విప్లవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పెత్తందార్లకు వ్యతిరేకంగా నిజాయితీగా ధైర్యంగా నిలిచాడు. యుక్త వయస్సు రాగానే ఒకవైపు కుటుంబ పోషణకి జీతం వుంటూ వ్యవసాయం చేస్తూనే రైతుకూలీ సంఘాన్ని ఏర్పాటు చేసి జీతగాళ్ల, కూలీ పోరాటాలకు నాయకత్వం వహించాడు. ప్రజల మధ్య వచ్చే అనేక ప్రజా పంచా యితీలను న్యాయంగా పరిష్కరించి పీడితులను ఐక్యం చేసాడు. గ్రామ పెత్తందార్ల దౌర్జన్యాలను సాగనివ్వకుండా అడ్డుకట్ట వేసాడు. కొంతకాలం ఉద్యమంలో పని చేసి దిగజారి పోలీసు ఏజెంట్లుగా నల్లదండు ముఠా సభ్యులుగా మారిన మాజీలు కా॥గోపాలక్రిష్ణను పార్టీకి దూరం కమ్మని ఎన్ని సార్లు బెదిరించినా ధైర్యం చెడక రాజకీయ చైతన్యం ప్రదర్శించి పట్టుదలతో ప్రజల పక్షమే నిలిచాడు. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆగ్రామం నుండి అనేకమంది అమరులయ్యారు. మన పార్టీ నాయకత్వంలో పోరాడుతూ అనేక మంది వారి వారసత్వాన్ని పేద ప్రజల రాజ్యం వచ్చెంత వరకూ కొనసాగిస్తామని శపథం చేస్తూ పూర్తికాలం కార్యకర్తగా కా॥గోపాలక్రిష్ణ ఈ మధ్య వచ్చాడు. వచ్చిన అతితక్కువ సమయంలోనే నల్లదండు ముఠా చేతిలో చిక్కి అత్యంత దారుణంగా హత్య చేయబడి అమరుడయ్యాడు. తమ గ్రామం పక్క వాగు నుండి రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు పోలీసు అధికార్లు కుమ్మక్కు అయ్యి కోట్ల రూపాయలు విలువ చేసే ఇసుకను పట్టణాలకు తరలిస్తూ భూగర్భ జలం అంతరించి పోయేటట్లు చేసారు. దాంతో బోర్లు, బావుల నుండి నీరు ఎండిపోయి సాగునీరు కరువై వేలాది ఎకరాల తరిభూములు బీడు భూములుగా మారాయి. ఇసుక రవాణాకు వ్యతిరేకంగా చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలను చైతన్యపరిచి పోరాటం లో కదలించడంలో ముందు న్నాడు, అట్లా మిలీషియాను వెంటవేసుకుని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను ఇసుక ఫిల్టర్‌లను ధ్వంసం చేయడానికి నాయకత్వం వహించాడు.

***కా॥ నగేష్, రాంరెడ్డి*** : రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం తిప్పాయిగూడెం గ్రామానికి చెందిన కా॥నగేష్, రాంరెడ్డిలు **22, 23** సంవత్సరాల వయస్సుగల వీరు మధ్యతరగతి కుటుంబీకులు. **1995**లో విఆరసిఎస్‌లో చేరి, ఆ తరువాత రాచకొండ ఏరియా జిఆర్‌డిలో పని చేస్తూ పార్టీ సభ్యులుగా ఎదిగారు. గ్రామ పెత్తందార్లకు వ్యతిరేకంగా రాజీలేకుండా పోరాడుతూ పార్టీ ఇచ్చిన అనేక రహస్య కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. **2001**లో అరెస్టు అయి చిత్రహింసలకు గురిఅయి కేసులు, జైలు జీవితం అనుభవించారు. బైటికి రాగానే పోలీసు వత్తిడులు పెరిగాయి. కోవర్టులుగా మారమని పోలీసులు అనేకసార్లు ప్రోత్సహించారు. అయినా ఆ ప్రోత్సాహకాలకు లొంగిపోకుండా ఈ కోవర్టు ఎత్తులను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి తెలియజేస్తూ పార్టీ అప్రమత్తంగా వుండాలని లేకుంటే నష్టపోతామని హెచ్చరించేవారు. పోలీసు వత్తిడుల మధ్యే పెళ్లిళ్లు చేసుకుని తమకు వీలైన సమయంలో పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడానికి సిద్ధపడ్డారు. పోలీసుల ముందు కోవర్టులుగా చేస్తామని ఒప్పుకున్నా ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పార్టీకి తెలియజేస్తూ వచ్చారు. వీరు తమకు సహకరించడం లేదన్న వాస్తవాన్ని తెలుసుకున్న పోలీసు అధికార్లు కా॥నగేష్, కా॥రాంరెడ్డిలను హత్య చేయడానికి పథకం వేసారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న పోలీసులు కోవర్టు సిరాజ్‌ను మనం హతం చేయగానే దానికి సమాధానంగా నల్లదండు ముఠాచే వారిని చంపించింది. **2003** నవంబర్ **20**న నాగేష్, రాంరెడ్డిలను ఇబ్రహీంపట్నం కోర్టుకు వెళుతుండగా నల్లదండు ముఠా కిడ్నాప్ చేసి పార్టీ పేరుతో స్టేట్‌మెంట్ ఇచ్చింది.వారిని బంధించి బలవంతంగా వారి నోటితో 'పోలీసుల ప్రోద్బలంతో పార్టీ నాయకత్వాన్ని హత్య చేయడానికి సిద్ధపడ్డామని' మాట్లాడించి, వీడియో క్యాసెట్స్ తీసి టీ.వి. ఛానల్స్, ఆకశవాణిలకు పంపారు. ఆ తరువాత వారిద్దరిని నవంబరు **22**న హత్య చేసి తుమ్మలరాంరెడ్డి శవాన్ని క్రిష్ణపట్టి ఏరియాలో చందంపేట మండలం బాపన్‌మోడ్ తండా సమీపంలో పడవేసారు. సాగర్ ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పేరుతో మీడియాలకు ప్రకటన ఇచ్చారు. విప్లవ పార్టీని, ప్రజలను గందరగోళపరిచి ఏది కోవర్టో ఏది కాదో, ఏది ఎవరు చేసారో అర్థంకాని పరిస్థితి సృష్టించాలనే లక్ష్యంతో పోలీసులు ఏ.సి, డి.సి పేరుతో పత్రికా ప్రకటనలు ఇవ్వడం జరిగింది. ఆ తరువాత రాచకొండ దళం తిప్పాయి గూడెం గ్రామంలో కా॥నగేష్, రాంరెడ్డిల సంస్మరణ జరిపి ప్రజలకు అమరుల తల్లిదండ్రులకు పోలీసులు చేసిన ఈ హంతక చర్యను వివరించడం జరిగింది. దీంతో పోలీసులు ఆడిన కోవర్టు నాటకం

బహిర్గతం అయ్యింది. కామ్రేడ్స్ నగేష్, రాంరెడ్డిలకు అరుణారుణ జోహార్లు!

***కా॥ వాసు*** : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన కా॥వాసు 20 సంవత్సరాల వయస్సు, మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై ఆర్ఎస్‌యులో పని చేసాడు. ఇంటర్ పూర్తయిన తరువాత గ్రామంలో వుంటూ సంఘ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ జిఆర్‌డి సభ్యునిగా పని చేస్తున్న సమయంలో ఇదే గ్రామంలోని నల్లదండు ముఠాలో పని చేస్తున్న మంజుల దౌర్జన్యాలను ఎదురించినందుకు ఆ నల్లదండు ముఠా అతికిరాతకంగా నరికి చంపింది. చర్మాన్ని వలిచి, అందులో వెంట్రుకలను దూర్చి కుట్లు వేసి తమ పైశాచికత్వాన్ని చాటుకున్నారు. కా॥వాసుకు ఎర్రెర్రని విప్లవ జోహార్లు!

## గుంటూరు జిల్లా అమరులు

***కామ్రేడ్స్ సాగర్, క్రిష్ణ*** : ఇద్దరూ గుంటూరు జిల్లా, దుర్గి మండలం, అడిగొప్పుల గ్రామానికి చెందిన వారు. వీరిద్దరూ బస్సులో పోతుండగా ఒక ద్రోహి ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో దుర్గి పోలీస్‌స్టేషన్ ముందుకు బస్సు రాగానే, ఆపి ఇద్దరినీ కొట్టుకుంటూ, ఈడ్చుకుంటూ తీసుకుపోయి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి .... 2003న బూటకపు ఎదురుకాల్పుల్లో హత్య చేసి, వెల్దుర్తి మండలం, దావుపల్లి దగ్గర అడవుల్లో పడవేసి తమ క్రూరత్వాన్ని చాటుకున్నారు పోలీసులు.

***కా॥ సాగర్*** : సాగర్‌కు తల్లిదండ్రులు పెట్టిన పేరు కోటయ్య (మామిడి). వయస్సు 17 సంవత్సరాలు. అడిగొప్పుల గ్రామ మాదిగపల్లెకు చెందిన నిరక్షరాస్య యువకుడు. చిన్నతనం నుండీ పాలేరుగా పని చేస్తూ అత్యంత పేదరికంలో గడిపాడు. ఆ గ్రామంలో మన పోరాటాలు చూసి మనవైపు ఆకర్షితుడై సంఘానికి పరిచయం అయ్యి పార్టీలోకి వస్తానని వెంటపడి మరీ వచ్చాడు. ప్రపంచ రాజకీయాలు తెలియకపోయినా తనలాంటి పేదవాళ్ల పరిస్థితి మారుతుంది – మన సమాజం వస్తే అనే తపనతో వచ్చాడు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో స్కూలుకు పోయే వయసులో 5, 6 సంవత్సరాల వయసులో పాలేరుగా జీవితం కొనసాగించాడు. వేడి అన్నం తిని ఎరుగుడు. తన జీవితంలో మొత్తం మీద కొత్తబట్టలు వేసుకుని ఎరుగడు. దళం దగ్గరే మొట్టమొదటిగా కొత్తబట్టలు వేసుకున్నాడు. ఆరోజు తను అనుభవించిన ఆనందం చెప్పనలవికాదు. దళంలో అందరికీ తలలో నాలుకలా వుంటూ, అన్ని పనుల్లో ముందుండేవాడు. చదువు నేర్చుకోవడానికి చాలా ఆసక్తి చూపించేవాడు. వాళ్ల వూరివాళ్లు ఎవరైనా కలిసి 'ఏం పిలగా, అన్నల్లోకి ఎందుకు పోయినవు?' అని అడిగితే 'పెజల కోసం' అని టక్కున సమాధానం ఇచ్చేవాడు.

వేరే గ్రామంలో వున్న మోటరోలా వాకీటాకీలు, ఇ.డి.లు తెమ్మని పంపిస్తే అవి తెచ్చే క్రమంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో బస్సులో పోతుండగా దుర్గి పోలీస్‌స్టేషన్ ముందుకు బస్సు రాగానే ఆపి, పోలీస్‌స్టేషన్‌లోకి ఈడ్చుకుపోయారు కామ్రేడ్స్ సాగర్, క్రిష్ణలను. ఆ రాత్రంతా ఎన్ని చిత్రహింసలు పెట్టినా, దళం వున్న మకాం అతనికి ఖచ్చితంగా తెలిసినా ఏ మాత్రం పెదవి విప్పకుండా దళాన్ని కాపాడాడు. ఏ.పి.టి.కి పంపే ముందు ఒక కామ్రేడ్, 'పోలీసులకు దొరికితే ఏం చేస్తవు?' అని అడిగితే, 'నా పాణం పోయినా సరే నా నోట్ల నుంచి ఒక్క ముక్క చెప్పను' అన్నాడు. ఆ మాటను నిలబెట్టుకుని తన రాజకీయ నిబద్ధతను, కమ్యూనిస్టు చైతన్యాన్ని ప్రదర్శించాడు. కా॥సాగర్ మనకందరికీ ఆదర్శప్రాయుడు.

***కా॥ క్రిష్ణ*** : ఇతని సొంత పేరు బత్తుల రామారావు. వయస్సు 17 సంవత్సరాలు. అడిగొప్పుల గ్రామానికే చెందిన నిరుపేద, వడ్డెర కులానికి సంబంధించిన వ్యక్తి. లంపెన్‌గ్యాంగ్ పెట్టిన హోటల్‌లో పనిమనిషిగా చేసేవాడు.

పార్టీకి పరిచయం అయిన తరువాత అన్ని పోరాటాల్లోనూ చురుకుగా కదిలి సంఘ సభ్యుడైనాడు. గ్రామంలో జరిగిన భూ పోరాటాల్లో చాలా మంచి పాత్ర వహించాడు. గ్రామంలో తనపై ఎంత నిర్బంధం వచ్చినా, పోలీసులు నిరంతరం తన ఇంటి చుట్టూ తిరుగుతున్నా గ్రామంలోనే వుంటూ సంఘం పనులు చేస్తుండేవాడు. గ్రామంలోకి పోలీసులు వస్తే బాంబులు వేసి పరుగులు పెట్టించాడు. అంటరానితనానికి, మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా కొట్లాడినాడు. దళంలో పూర్తి కాలం కార్యకర్తగా 3నెలలు పని చేసి బయటకు వెళ్లి గ్రామంలో పని చేస్తున్నాడు.

సాగర్‌తోపాటు ప్రయాణిస్తూ పోలీసులకు చిక్కి ఆ రోజంతా ఎన్ని చిత్రహింసలు పెట్టినా తనకు తెలిసిన ఒక్క రహస్యం చెప్పకుండా దాచిపెట్టి తన రాజకీయ చైతన్యాన్ని చాటుకున్నాడు.

కామ్రేడ్స్ సాగర్, క్రిష్ణల మరణవార్త విన్న అడిగొప్పుల గ్రామ ప్రజలు, తమ కళ్లముందు తిరిగే చిన్న చిన్న కుర్రవాళ్లు నక్సలైట్లా అని ఆశ్చర్యపోయారు! పోలీసులతో తీవ్రంగా హింసించి చంపబడేంత పాపం వాళ్లేం చేసారు? అని ఆవేదన వెలిబుచ్చారు. వీరిద్దరి అంత్యక్రియలు ప్రత్యేకమైన రీతిలో వేలాదిమంది ప్రజల కన్నీటి వీడ్కోలు మధ్య, కసి నినాదాల హోరు నడుమ జరిగాయి. ట్రాక్టర్‌పై ఎర్రజెండా కప్పిన వారి శరీరాలను ఊరంతా 5, 6 గంటలసేపు ఊరేగించి అంత్యక్రియలు చేసారు. ఆరోజు భూస్వాములతోసహా ఎవ్వరూ తమ తమ పనుల్లోకి పోలేదు. డబ్బా బాంబులతో ఊరంతా దద్దరిల్లిపోయింది. పాటలతో, నినాదాలతో గ్రామ ప్రతి కూడలిలో వీరిద్దరి పార్టీ చరిత్రను ప్రజలకు తెలియచెప్తూ సాగుతున్న ఊరేగింపు మన రాజకీయాలకు ఒక వేదికే అయింది. ఆ వాతావరణం ప్రజల హృదయాల్లో గూడుకట్టుకున్న కసి చూసి పోలీసులు రావడానికి కూడా భయపడ్డారు.

ఎర్రజెండా కప్పి, గాలిలోకి ఒక రౌండ్ కాల్పులు జరిపి అమరులకు జోహార్లు చెప్పిన తరువాత వారి అంత్యక్రియలు పూర్తి చేయడం జరిగింది. చిన్న వయస్సులో మరణించినా, గొప్ప రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించిన వీరిద్దరూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజల మాటల్లో చూస్తే, ఒక ముసలతను వీరి శవ ఊరేగింపును ప్రజల స్పందనను చూసి 'చిన్న వయసు వారైనా ఎంత చక్కని సావు వచ్చింది. మేవు వున్నాం మమ్ముల ఎవరు గుర్తు పెట్టుకుంటరు' అని మాట్లాడాడు.

***కా॥ రాజు (చిన్నగురవయ్య)*** : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఇంటివద్ద నుండి పట్టుకుపోయి, తీవ్ర చిత్రహింసలు పెట్టి జులై 2003న కాల్చి చంపి, ఎదురుకాల్పుల కట్టుకథ అల్లారు పోలీసులు.

గుంటూరు జిల్లా, కారంపూడి మండలం, మిర్యాల గ్రామానికి చెందిన ఈ కామ్రేడ్ వయస్సు 30 సంవత్సరాలు. చాలా కష్టజీవి. 1998లో పార్టీకి పరిచయం అయ్యి సానుభూతిపరుడుగా వుంటూ సంఘ నాయకుడుగా ఎదిగాడు. చిన్న పిల్లాడిలా అందరినీ నవ్వుతూ, నవ్విస్తూ అందిరతో కలిసిపోయేవాడు. ఆ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సారా, భూ పోరాటాల్లో ముందుండినాడు.

***కా॥ లక్ష్మీనారాయణ (రమేష్)*** : ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో గుంటూరులో అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలు పెట్టి 2003, ఏప్రిల్‌లో బూటకపు ఎదురుకాల్పుల్లో పోలీసులు హత్య చేసారు.

దుర్గి మండలం, కంచరగుంట గ్రామానికి చెందిన రమేష్ వయస్సు 26 సంవత్సరాలు. కా॥రమేష్ 10 సంవత్సరాల నుండి పార్టీ పరిచయాల్లో వుంటూ ఆ గ్రామంలో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లోను, ఇన్ఫార్మర్‌ను చంపే విషయంలోనూ, ముటుకూరు ఎక్స్ఛేంజ్ తగులబెట్టడంలోనూ, గ్రామాలకు వస్తున్న పోలీసులను జన్మభూమి అధికారులపై బాంబులు వేయడంలోను ముందు వుండి కీలక పాత్ర పోషించాడు పోలీసులు ఎన్ని చిత్రహింసల పాల్జేసినప్పటికీ ఒక్క రహస్యాన్ని కూడ చెప్పక ప్రజల కొరకు తన అమూల్యమైన ప్రాణాన్ని ధారపోసాడు.

**బోడిపాలెం ప్రజా అమరులు :** 2003, జనవరిలో గుంటూరు జిల్లాలో రావులాపురం–రేమిడిచర్ల మధ్యన జన్మభూమి అధికారులకు రక్షణగా వచ్చిన పోలీసులపై పిజిఏ బలగాలు మందుపాతర పేల్చగా ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు.

దీనికి ప్రతీకారంగా పోలీసుల మానసిక స్థైర్యాన్ని నిలబెట్టడానికి దగ్గరలో వున్న బోడిపాలెం తండా నుండి ముగ్గురు అమాయక ప్రజలను కాల్చి చంపి, మందుపాతర పేల్చి పారిపోతున్న నక్సలైట్లను హోరాహోరీ ఎదురుకాల్పుల్లో హతమార్చామని అబద్ధపు విషప్రచారాన్ని అందంగా చేయ యత్నించారు.

దీనికి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. అభం శుభం తెలియని అమాయకులైన ఆదివాసీలు చిన్నానాయక్, బాబునాయక్, బాలూనాయక్‌లను పోలీసులు కాల్చిచంపారు. వారిని ప్రజా అమరులుగా గుర్తిస్తూ వారికి అరుణారుణ జోహార్లర్పిద్దాం!

*(33వ పేజీ తరువాయి భాగం)*

చంద్రబాబు దుష్టపాలన ఫలితాలు ఆపార్టీ ప్రభుత్వాలకి సహజంగానే బెడిసికొడతాయి, బెడిసికొట్టాయి కూడా! సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే సామ్రాజ్యవాద ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలకి రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చేసిన బాబు 'హైటెక్ పాలన' 'అభివృద్ధి' నమూనాల గాలిబుడగ పేలిపోయింది. ఎన్నికలు దగ్గరపడేప్పటికి తిరుపతి జాతరలో అతడు కురిపించిన కోటివరాల దగాకోరు ప్రకటనే ఇందుకు నిలువెత్తు నిదర్శనం! ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వుంటూ కూడా అడ్డూ ఆపూలేని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ హడావుడిగా చేస్తున్న రేషన్ కార్డుల పంపిణీ, పేదలాక్రమించుకున్నభూముల క్రమబద్ధీకరణ లాంటి చిట్కాలన్నీ ఓటమి భయంతో ఓటరు ప్రజలకి వేస్తున్న ఎరలు మాత్రమే!

ఎన్నికల జపంతో ఒక పక్క ఇలా ప్రజావంచనకి దిగుతూనే ఇంకోపక్క తన ఘోర నేరాల్ని, ప్రజా ద్రోహాల్నీ, ఘోర వైఫల్యాలని తెరమరుగు చేస్తూ రాష్ట్ర ప్రజల తాజా తీర్పు అవసరం అంటూ అలిపిరి ఘటనని ఆసరా చేసుకుని ముందస్తు ఎన్నికల ముగ్గులోకి దిగాడు చంద్రబాబు!

పోతే ఈ దగాకోరు, దంబాకోరు నినాదాన్ని ముందుకు నెట్టడంతో చంద్రబాబు అసలు ఆంతర్యం అర్థం కానిదేమీ కాదు. తాను తిరిగి అధికారంలోకి రావడం అంటూ జరిగితే మరింత నగ్నంగా ప్రజలపై ఫాసిజాన్ని రుద్దగలనని, తద్వారా ప్రజల రక్తమాంసాల్ని పీల్చి పిప్పి చేయడానికి దోపిడీ పాలకవరగ మూకలకి మరింతగా అడ్డూఆపూలేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిస్తానని హామీ పడటమే ఈ నినాదం అసలు ఆంతర్యం! మరింత మరింత ప్రజా ద్రోహకరంగా వుండబోయే తన బుల్‌డోజర్ దుష్టపాలనని 'ప్రజాస్వామ్యం' స్ఫూర్తితో ఏ పక్కనుంచి ఏ ఒక్కరూ కూడా నామమాత్రంగానైనా వ్యతిరేకించడం ఎదిరించడ జరగరాదని చంద్రబాబు ఆశిస్తున్నాడు. అలా అందరి నోరూ మూయించాలని అతడు ఉబలాడ పడుతున్నాడు, అలామూయించ గలనని అహంకరిస్తున్నాడు. రాష్ట్రంలోని ప్రజాస్వామిక శక్తుల వత్తిడికి తలొగ్గి మా పార్టీతో ప్రారంభించిన చర్చల ప్రక్రియను విచ్ఛిన్నం చేసి చర్చల నుండి తప్పించుకోడానికి తాను తన ప్రభుత్వం ఎంత అప్రతిష్టపాలు కావలసి వచ్చిందో చంద్రబాబుకు తెలుసు. ఆ అనుభవం అతడికి పీడ కలలా వెంటాడుతూనే వుంది. అలాంటి చేదు అనుభవం మరోసారి తలెత్తరాదని అతడు కోరుకుంటున్నాడు. సైద్ధాంతిక, రాజకీయ కోణాల నుండి మా ఉద్యమం పట్ల సానుకూలంగా వుండే ప్రజాశక్తులు సంస్థల నోరు నొక్కడమే గాక ప్రజాస్వామ్య నైతిక కోణాల నుండి మా ఉద్యమంపై సాగే అణచివేతని ప్రశ్నించే ప్రజాస్వామ్య గొంతుల్ని సైతం నులిమేయాలని చంద్రబాబు కోరుకుంటున్నాడు.

నిజం చెప్పాలంటే గడచిన ఎనిమిది సంవత్సరాల తన ఏలుబడిలో చంద్రబాబు విపరీత ప్రచారంతో ఊదరగొడుతూ ప్రజల నెత్తిన రుద్దిన 'సంస్కరణలు' 'అభివృద్ధి' నమూనా పాలనని ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. ఎన్నికలు దగ్గరపడే టప్పటికి సంస్కరణల్ని పక్కకు నెట్టి ప్రజా సంక్షేమ పథకాలను అతడు అటకమీంచి దింపడమే అందుకు నిదర్శనం. ప్రజా సంక్షేమ పథకాల జపంతో ఓట్లు గుంజుకుని తిరిగి ప్రజలపైసంస్కరణల కొరడాని ఝుళిపిస్తాడు. ఇది ప్రజల అనుభవం. కనుక మరోసారి ప్రజలు చంద్రబాబు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రయోగించే సంక్షేమ పథకాల ఎరలకి గురికారనే ఆశించాలి. చంద్రబాబు బూటకపు సంస్కరణలు, బూటకపు అభివృద్ధి ప్రజలు ఎంత స్పష్టంగా తిరస్కరించారో అంతే స్పష్టంగా మా ఉద్యమంపై అతడి ప్రభుత్వ అణచివేతని కూడా నిరసించారు. రాష్ట్రంలో శాంతి ప్రజాస్వామ్యాలు పునరుద్ధరించ బడాలని బలంగా కోరుకున్నారు. అందుకోసం మా పార్టీతో చంద్రబాబు ప్రభుత్వం చర్చలు జరపాలని పట్టుదలగా డిమాండ్ చేసారు. ఈ రెండు విషయాలలో ప్రజలు చాలా స్పష్టంగాను, ఎంతో బలంగానూ ఇప్పటికే తమ తీర్పుని ప్రకటించారు. చంద్రబాబులా కావాలని కళ్లు చెవులూ మూసుకున్న కబోదులు బధిరులకి తప్ప అందరికీ ప్రజల ఈ తీర్పు స్పష్టంగానే కనబడుతుంది, ప్రజా గొంతు స్పష్టంగానే వినబడుతుంది.

అత్యంత ప్రజాస్వామిక పద్ధతుల్లో అతి స్పష్టంగా వ్యక్తం అయిన ఈ ప్రజాభిప్రాయాన్ని కాదంటూ తగుదునమ్మా అని ప్రజాస్వామ్యానికి ఏకైక కొండగుర్తుగా చిత్రించబడుతున్న బూటకపు ఎన్నికలలో రేపిక తాను తిరిగి అధికారంలోకి రావడమంటూ జరిగితే అదే ప్రజా తీర్పు అని దబాయిస్తూ తన తీరులో దారిలో నిరాటంకంగా చెలాయించుకు పోగలనని చంద్రబాబు కలలు కంటున్నాడు.

కాని, రేపు చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావడం అంటూ జరిగితే అతడికి జ్ఞానోదయం కలిగించే తీరులో చరిత్ర అతడి భ్రమల్ని బద్దలుకొడుతుందని; అతడి దుర్మార్గ కలల్ని కల్లలుగా రుజువు చేస్తుందని చెప్పదలచాం. మా పార్టీ ఆధ్వర్యంలో ప్రజాయుద్ధం మరింత పదునెక్కుతుందని, మరింత బలపడుతుందని స్పష్టం చేస్తున్నాం. అంతేకాదు, మా ఉద్యమానికి అండగా ముందు ముందు రాష్ట్రంలో ప్రజాతంత్ర వుద్యమం కూడా మరింత బలపడుతుందని చెప్పగలం! ఎందుకంటే ఈనాడు ప్రజలెదుర్కుంటున్న సమస్య లన్నింటికీ సరైన శాస్త్రీయమైన పరిష్కారం మా ఉద్యమం మాత్రమే! మా ఉద్యమం ప్రజలకి ఏనాడూ సమస్య కానేకాదు. ఇది చంద్రబాబు లాంటి అభివృద్ధి నిరోధక పాలకుల విషప్రచారం మాత్రమే! మా ఉద్యమం నిస్సందేహంగా చంద్రబాబు లాంటి వారికి వారి వెనుకుండి చక్రాలు తిప్పే దోపిడీ పాలకవర్గాలకి సమస్యే, కాదనం! దోపిడీ పాలకవర్గాలకి వారి ప్రభుత్వాలకి మేము ఎల్లవేళలా పెను సమస్యగా, పెను సవాల్‌గానే వుంటాం. అలా వుండకుండా మేము ప్రజల ప్రయోజనాలను పరిరక్షించలేము కదా! అందుకని మేము ఏమి చెప్పదలచా మంటే పెద్ద బండని పైకెత్తి మరీ కాళ్లమీద పడవేసుకున్న మూర్ఖుడిలా చంద్రబాబు ప్రవర్తిస్తున్నాడు.

చరిత్ర ద్వేషి చంద్రబాబుకి గడచిన చరిత్రా తెలియదు, దాని భవిష్యత్ గమనమూ తెలీదు. ఈ తెలీకపోవడం అనేదే అతడి పాలిట వరంలా పని చేస్తోందని చెప్పాలి. అందుకే ఆశ్చర్యం కలిగించేంతటి అజ్ఞానాన్ని, అవధుల్లేని అహంకారాన్ని హాయిగా మోసేయ గలుగుతున్నాడు ఈ జ్ఞాన సమాజ నిర్మాత! చంద్రబాబు పుట్టిన రోజు హిట్లర్ పుట్టిన రోజు ఒక్కటే కావడం యాదృచ్ఛికమే అయినా హిట్లర్ ఆలోచనలను మనస్తత్వాన్ని పుణికి పుచ్చుకుని మరీ చంద్రబాబు ఆలోచనలు మనస్తత్వం మలచబడటం అనేవి నిజంగా ఈ రాష్ట్ర ప్రజల పాలిట శాపమనే చెప్పాలి. హిట్లర్ మనస్తత్వాన్నేకాదు, గోబెల్స్ విష ప్రచార సరళిని సైతం చంద్రబాబు చాలా నేర్పుగానే స్వంతం చేసుకున్నాడు. హిట్లర్ గోబెల్స్‌ల భయంకర మిశ్రమంగా మలచబడ్డాడు చంద్రబాబు.

మానవ చరిత్ర పరిణామ క్రమంలో ప్రపంచంలో అశేష ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న, అపార గౌరవ ప్రతిష్టల్ని సంపాదించుకున్న 'ప్రజాస్వామ్యం', 'సోషలిజం' అనేవి ఆ పేర్ల మీదే పీక నులబడటం వెన్నుపోట్లకి గురికావడం చరిత్రలో కొత్తకాదు. ప్రజల పేరు మీదే ప్రజల్ని వంచించడం కొత్తకాదు. తనది 'జాతీయ సోషలిజం' అంటూ ప్రపంచంపై ఫాసిజం కత్తి ఝుళిపించిన హిట్లర్ హీనాతిహీన చరితుడుగా మిగిలాడు. ప్రజాస్వామ్యం పేరుమీద ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకో ప్రయత్నిస్తున్న బుష్‌ని ప్రపంచ ప్రజలే కాదు, అమెరికా దేశప్రజలు సైతం దుమ్మెత్తి పోస్తు న్నారు. ప్రజల పేరుమీద, ప్రజాస్వామ్యం పేరుమీద ప్రజలపైన కత్తికట్టిన చంద్రబాబు చరిత్ర సైతం ఇలానే మిగులుతుంది. సోషలిజం హంతకులు, ప్రజాస్వామ్య హంతకులు, ప్రజావంచకులు చరిత్ర పెంటకుప్పపై తేలారు. కానీ ప్రజాస్వామ్యం, సోషలిజం, ప్రజలు అజేయంగా నిలుస్తూనే వున్నాయి.

కనుక హిట్లర్ అంశతో పుట్టిన చంద్రబాబు మా పార్టీపై వుద్యమంపై సవాళ్లు విసరం వింత కాదు కానీ అతడు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమంట – అడాల్ఫ్ హిట్లర్‌ని అతడి ఫాసిజాన్ని మట్టికరిపించి ప్రపంచ ప్రజల చేతనే కాదు, చంద్రబాబు రాజకీయ గురువులైన చర్చిల్, చాంబర్లేన్, ట్రూమన్, రూజ్‌వెల్ట్‌ల చేత సైతం 'ప్రపంచ రక్షకుడు' 'చరిత్ర రక్షకుడు' 'మహానేత' అని జేజేలు పలికించుకున్న జోసెఫ్ స్టాలిన్ వారసులం మేము.

పత్రికా ప్రకటన

# చంద్రబాబు బూటకపు అభివృద్ధి పాలనను ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు !

## చంద్రబాబు పాలనలో కరువై పోయిన శాంతి, ప్రజాస్వామ్యాల కోసం ప్రజలు పరితపిస్తున్నారు !!

## తన ప్రజా ద్రోహాన్ని, ఘోర వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునే విఫల యత్నమే ముందస్తు కసరత్తు!!!

## ప్రజా సమస్యలకు మా ఉద్యమం పరిష్కారమేతప్ప ప్రజలకి అది ఏనాడూ సమస్య కాదు!

## చంద్రబాబు లాంటి ఫాసిస్టు పాలకులకి పెనుసవాల్‌గా నిలవడం మా చారిత్రక విధి!!

నక్సలైట్ల అణచివేతే ప్రధాన ఎజెండాగా, అదే ప్రధాన ఎన్నికల నినాదంగా చంద్రబాబు నాయకత్వంలోని అధికార టిడిపి, అసెంబ్లీ ముందస్తు ఎన్నికల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపింది. ఇది చాలా మోసపూరితం కుట్రపూరితం అయిన నినాదం.

తన ఎనిమిది సంవత్సరాల ఏలుబడిలో రాష్ట్రంలోని అన్ని రంగాలకి చెందిన సామాన్య ప్రజల ఆకాంక్షలు హక్కులపై దెబ్బమీద దెబ్బతీస్తూనే వచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. వందలాది పరిశ్రమలు మూతపడి వేలాది కార్మికులు రోడ్డున పడ్డారు; రాష్ట్రంలోని చేనేతరంగం దుస్థితి దేశంలో ఇంకెక్కడా చూడం; ఉన్న ఊరుని, కన్నతల్లిలాంటి కాస్త భూమిని వదులుకుని వందల వేల రైతు కుటుంబాలు వలసలు పట్టిపోయాయి; విద్య, వైద్యం అనేవి క్రూర మార్కెట్ శక్తుల చేతుల్లో వ్యాపార సరుకులై పోయాయి; బలహీనవర్గాల సంగతలా వుంచి మధ్యతరగతి ప్రజలకి సైతం అవి అందని ద్రాక్షపండ్లయి పోయాయి; మెడికల్, ఇంజనీరింగ్ లాంటి ఉపాధి హామీతో వుండే వృత్తి విద్యాకోర్సుల సంగతలా వుంచి సాధారణ డిగ్రీ చదువులు సైతం మధ్యతరగతి విద్యార్థులకు అందని చందమామలై పోయాయి; ఉపాధి, ఉద్యోగం అనేవి చంద్రబాబు ఏలుబడిలో నిషేధాంశాలై పోయాయి; ప్రాణత్యాగాలకి సైతం వెనుకాడక రాష్ట్రంలోని మహిళలు పోరాడి మరీ సాధించుకున్న 'మద్యనిషేదం'ని ఎత్తేసి పేద మధ్యతరగతి కుటుంబాల జీవితాల్లో, మరీ ముఖ్యంగా ఆ కుటుంబాల మహిళల బతుకుల్లో మంటలు రేపింది చంద్రబాబు ప్రభుత్వం. చేస్తున్న పనిని కోల్పోయిన వందలాది కార్మికులు, ఉపాధి అవకాశాలే మాయం అయిపోయినందున వందలాది నిరుద్యోగ యువత, వందలాదిగా రైతులు, చేనేత పనివారు ఆకలి చావులకి ఆత్మహత్యలకి బలయ్యారు. పేదల ఆకలి చావులకి, ఆత్మహత్యలకి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలుచుంది. చంద్రబాబు ప్రభుత్వం సాధించిన రికార్డ్ అంటూ వుంటే ఇది మాత్రమే ! 'పేదరిక నిర్మూలన అంటే పేదల నిర్మూలనే' అని చాటిచెబుతూ సాగింది చంద్రబాబు పాలన !

రాష్ట్ర సామాన్య ప్రజల జీవితాల్లో చంద్రబాబు పాలన సృష్టించిన ఈ క్రూర విధ్వంసం, చెప్పనలవికాని ఈ విలయం, విధ్వంసం ఇదంతా దేని కోసం? పిడికెడు మంది స్వార్థపర బడా భూస్వామ్య దళారీ పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసం ! ప్రపంచ సామ్రాజ్యవాద మార్కెట్‌లో రాష్ట్రాన్ని ఒక లాభసాటి సరకుగా పెట్టి అమ్మేయడం కోసం! ఈ క్రూర వ్యాపార రాజకీయ క్రీడలో ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ లాంటి నిరంకుశాధికార వర్గాలలో కొంతమంది; డాక్టర్లు ఇంజనీర్లు లాంటి లాభసాటి వృత్తివిద్యా వేత్తలలో కొంతమంది; 'పోర్త్‌ఎస్టేట్'గా చెప్పబడే పత్రికారంగానికి చెందిన కొంతమంది పత్రికాధిపతులు (ఉదా: 'ఈనాడు' రామోజీరావు); కళ, వినోదాల పేరు మీద చెలాయించుకు పోతున్న సినీ వ్యాపార రంగానికి చెందిన కొంతమంది; మరీ ముఖ్యంగా చంద్రబాబు మాయదారి 'సంస్కరణలు' హైటెక్కుల పుణ్యమా అని రాత్రికి రాత్రే కోటీశ్వరులై పోయే 'కృషి' 'చార్మినార్' బ్యాంకుల యాజమాన్యాలు లాంటి ఘరానా ఆర్థిక నేరస్థులు; పనికి ఆహార బియ్యంగా మళ్లింపు, నకిలీ స్టాంపులు, స్టేషనరీ కలప, చెక్‌పోస్టులు ఇలా అంతులేని జాబితాగా వుండే రకరకాల కుంభకోణాలకి పాల్పడుతూ కుభేరులైపోతున్న ఘరానా మోసగాళ్లు. పసిపిల్లల ముఖ్యంగా ఆడపిల్లల విక్రయ మాఫియా ముఠాలు, నైట్‌క్లబ్బులు, డిస్కోడెక్‌లు, బ్యూటీపార్లర్లు, మెసేజ్ పార్లర్ల ముసుగులో సెక్స్ వ్యాపారాలు చేసే ఘరానా ముఠాలు – జనాభాలో నూటికి ఒక్కరుగా కూడా లేని ఇలాంటిలాంటి వారంతా చంద్రబాబు పాలన 'భూతల స్వర్గం' అని కీర్తించవచ్చు గానీ అశేష సామాన్య ప్రజల పాలిట చంద్రబాబు పాలన ప్రత్యక్ష నరకమే ననేది సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడనేంతటి నిజం!

ఒక్కమాటలో మాటలో చెప్పాలటే చంద్రబాబు ఏలుబడిలో రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక పాలనా వ్యవస్థలన్నీ సర్వ భ్రష్టుత్వానికి గురైపోయాయి. 'ఆగస్టు కుట్ర' అతడి మాయ, మాజీ ముఖ్యమంత్రి అయిన ఎన్.టి.రామారావుకి వెన్నుపోటు పొడిచి, ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు రాజ్యాధికారం కోసం రక్తం పంచుకుపుట్టిన అన్నదమ్ములను కన్నతలిదండ్రులను హతమార్చిన చరిత్ర లోని కొందరు క్రూరపాలకుల వారసుడనే చెప్పాలి! అలా అధికారాన్ని హైజాక్ చేసిననాడు మొదలుకుని చంద్రబాబు అడుగడుగునా అనుక్షణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువల్నీ ధ్వంసిస్తూనే వచ్చాడు. పౌర ప్రజాస్వామ్య హక్కులపై, సంస్థలపై శక్తులపై ఎడతెరిపిలేని దాడులు చేస్తూనే వచ్చింది చంద్రబాబు ప్రభుత్వం.

(కొరవ 32వ పేజీలో)